శనివారం
10•3•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 272
• పేజీలు : 18 + (20/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

దేశాభివృద్ధికి ఎజెండా

నిపుణులు, సీనియర్ అధికారులు మార్గనిర్దేశం చేయాలి: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు



శుక్రవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు, ఎంపీ కవిత, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీ వెంకట్రావ్, మిరియాల రాజిరెడ్డి

టీబీజీకేఎస్ రాష్ట్ర కమిటీ నియామకం

అధ్యక్షుడిగా వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా రాజిరెడ్డి

ఏరియా, రీజియన్, 11మెన్ కమిటీలను కూడా ప్రకటించిన గౌరవాధ్యక్షురాలు, ఎంపీ కవిత 2

- రాష్ట్రాలకు, కేంద్రానికి ఆదర్శంగా తెలంగాణ పథకాలు
- వీటిని దేశవ్యాప్తంగా అమలుచేయాలి
- స్వాతంత్ర్యం వచ్చి 70 ఏండ్లయినా పురోగతి లేదు
- రాష్ట్రాల మధ్య జలవివాదాలు పరిష్కారం కావటంలేదు
- రిజర్వేషన్లలో రాష్ట్రాలకు స్వేచ్ఛ, అధికారం కావాలి
- ప్రగతిభవన్‌లో రిటైర్డ్ అధికారులు, వివిధ రంగాల ప్రముఖులతో సీఎం కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

అనేక రాష్ట్రాలు, విభిన్న వర్గాలు కలిగివున్న భారతదేశానికి అవసరమైన అభివృద్ధి ఎజెండా రూపొందాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్నారు. ఇప్పుడున్న విధానాలు, పద్ధతులు, చట్టాలను సంపూర్ణంగా అధ్యయనంచేసి, అవసరమైన మార్పులు, సంస్కరణలు తెచ్చే విషయంపై వివిధ రంగాలకు చెందిన నిపుణులు, సీనియర్ అధికారులు మార్గనిర్దేశం చేయాలని కోరారు. ఈ ప్రయత్నంలో దేశంలోని అన్ని ప్రాంతాలకు చెందిన అన్నివర్గాలవారు పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధికి కావాల్సిన ఎజెండా రూపొందించడంతోపాటు, ఇప్పుడున్న విధానాల మంచి చెడులపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు శుక్రవారం ప్రగతిభవన్‌లో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, సీనియర్ అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, క్రియ స్వచ్ఛంద సంస్థ సీఈవో డాక్టర్ బాలాజీ ఊట్ల, పలువురు రిటైర్డ్ అధికారులు, సీఎంవో అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ 'దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏండ్లవుతున్నా అనుకున్న పురోగతి రావటంలేదు. ప్రపంచవ్యాప్తంగా అనేకదేశాలు ప్రగతిపథంలో దూసుకుపోతున్నా, మనదేశంలో ప్రజలు ఇంకా ప్రాథమిక అవసరాలు తీరకుండా ఉన్నారు. చాలా సమస్యలు పరిష్కారం కావటంలేదు. దేశ ప్రజలందరికీ మంచినీరు, విద్యుత్

మిగతా 2వ పేజీలో



- ప్రాణాంతక వ్యాధులతో బాధపడే రోగులకు గౌరవంగా మరణించే హక్కు ఉంది
- సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు
- సజీవ వీలునామాను గుర్తించేందుకు సమ్మతి
- చట్టం రూపొందేవరకు మార్గదర్శకాలు అమలు

కారుణ్య మరణానికి సుప్రీం ఆమోదం

వైద్య చికిత్సకు లొంగని ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడుతున్న రోగి రాసిన 'సజీవ వీలునామా (లివింగ్ విల్)'ను పరిగణనలోకి తీసుకొని అతనికి/ఆమెకు పరోక్ష కారుణ్య మరణాన్ని ప్రసాదించవచ్చని సుప్రీంకోర్టు పేర్కొన్నది. జీవించే హక్కులోనే గౌరవంగా, అనాయాసంగా మరణించే హక్కు కూడా దాగి ఉందని ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం శుక్రవారం చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న రోగికి దీర్ఘకాలిక శారీరక బాధను తప్పించుకొనేందుకు వైద్య చికిత్సను తిరస్కరించే హక్కు కూడా ఉంటుందని స్పష్టం చేసింది. 'సజీవ వీలునామా'ను పరిగణనలోకి తీసుకొని కారుణ్య మరణాన్ని ప్రసాదించాలని కోరుతూ 'కామన్ కాజ్' అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. సజీవ వీలునామా అమలు, పరోక్ష కారుణ్య మరణాన్ని ప్రసాదించడంపై కొన్ని మార్గదర్శకాలను జారీచేసింది. ప్రభుత్వం ఓ చట్టం చేసే వరకు ఈ మార్గదర్శకాలు అమలులో ఉంటాయని తెలిపింది.

వివరాలు 5వ పేజీలో



రిజర్వేషన్లు పెంచాలంటూ శుక్రవారం పార్లమెంట్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న టీఆర్ఎస్ ఎంపీలు వినోద్‌కుమార్, సీతారాంనాయక్, బీబీ పాటిల్, పసునూరి దయాకర్, నగేశ్

కోటాపై అధికారం రాష్ట్రాలకివ్వాల్సిందే

ఐదోరోజూ కొనసాగిన టీఆర్ఎస్ ఎంపీల పోరు 2

స్పష్టత వచ్చేవరకు ఆందోళన ఆపేదిలేదు: ఎంపీ వినోద్

పార్లమెంట్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన

నా పుట్టుక, చావు.. టీఆర్ఎస్‌లోనే

- ముఖ్యమంత్రి కేసీఆర్ మాటే నా బాట
- నాకు త్యాగాలు తప్ప ద్రోహాలు తెలియవు
- దుష్ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు
- మీడియాతో మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తన పుట్టుక, చావు టీఆర్ఎస్‌లోనేనని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విస్పష్టంగా చెప్పారు. తాను పార్టీ మారబోతున్నట్టు సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతున్నది కట్టుకథేనని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మాటే తన బాటని తెలిపారు. శుక్రవారం టీఆర్ఎస్ఎల్పీలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను బీజేపీలో చేరుతున్నట్టు సోషల్ మీడియాలో ఒక ప్రముఖ టీవీ లోగోతో ప్రచారమవుతున్న పోస్టింగ్‌పై తీవ్రస్థాయిలో స్పందించారు. ఈ విషయంపై డీజీపీ మహేందర్‌రెడ్డితో మాట్లాడానని, తక్షణమే విచారణ జరిపి, అందుకు కారణమైనవాళ్లను జైలులో పెట్టాలని కోరానని

మిగతా 2వ పేజీలో

కాంగ్రెస్‌ను నమ్మేదెవరు?

- కాంగ్రెస్ నేతల బస్సు యాత్రకు కొరవడిన జన స్పందన
- అందుకే అసహనంతో ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారు
- కాంగ్రెస్ నేతలు మోకాళ్లపై యాత్ర చేసినా అధికారంలోకి రాలేరు
- మ్యానిఫెస్టోలో చెప్పినవన్నీ మా ప్రభుత్వం అమలుచేస్తున్నది
- బడ్జెట్ సమావేశాలు అర్థవంతంగా నిర్వహిస్తాం
- మీడియా సమావేశంలో మంత్రి హరీశ్‌రావు
- మంత్రులు కేటీఆర్, ఈటలపై కాంగ్రెస్ నేత వ్యాఖ్యలకు ఖండన
- పిక్నిక్‌లా కాంగ్రెస్ నేతల బస్సు యాత్ర: మంత్రి తలసాని

2009 మ్యానిఫెస్టోలో ఒక్క హామీనైనా అమలుచేశారా?

ఇప్పుడు ఏదేదో చేస్తామంటే జనం విశ్వసించరు

వారి హయాంలో ప్రాజెక్టులన్నీ పెండింగ్.. ఇప్పుడు అన్నీ రన్నింగ్



టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మంత్రి తలసాని కూడా ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కాంగ్రెస్ నాయకులపట్ల ప్రజలకు విశ్వాసంలేదని, వారి బస్సుయాత్రకు కొరవడిన ప్రజాస్పందనే ఇందుకు నిదర్శనమని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చెప్పారు. 2009 ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ నేతలు వారి మ్యానిఫెస్టోలో ఒక్క అంశాన్ని కూడా అమలు చేయలేదని, ఇప్పుడు మళ్లీ గెలిపిస్తే ఏదేదో చేస్తామని చెప్పడాన్ని ప్రజలు నమ్మడంలేదని అన్నారు. ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయినందువల్లే కాంగ్రెస్ నేతలు అసహనంతో ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ నేతలు బస్సు యాత్రలు కాదుకదా.. మోకాళ్ల యాత్రలు చేసినా అధికారంలోకి రావడం కల్ల అని తేల్చిచెప్పారు. శుక్రవారం పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, శాసనమండలిలో ప్రభుత్వ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లుతో కలిసి మంత్రి హరీశ్‌రావు

మిగతా 2వ పేజీలో

చేనేతకు పూర్వవైభవం



రాట్నంపై కండెలు చుడుతున్న వృద్ధ చేనేత కార్మికురాలు బోడ రుక్కుంబాయితో ముచ్చటిస్తున్న మంత్రి కేటీఆర్

- బైబ్యాక్ ద్వారా చేనేత వస్త్రాల కొనుగోళ్లు: మంత్రి కేటీఆర్ 2
- దుబ్బాక చేనేత కార్మికుల రూ.కోటి 56 లక్షల రుణాల మాఫీకి హామీ

తెలంగాణ ప్రభుత్వ పథకాలు

అమోఘం

మిషన్ కాకతీయ భేషంటూ ఇథియోపియా మంత్రి ఇయాసు అబ్రాహ్ అలీ ప్రశంస 8

కోటాపై అధికారం రాష్ట్రాలకివ్వాల్సిందే

- ఐదోరోజూ కొనసాగిన టీఆర్ఎస్ ఎంపీల పోరు
- అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన
- స్పష్టత వచ్చేవరకు పోరాటం ఆపేదిలేదు
- ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించుకునే అధికారం రాష్ట్రాలకే కల్పించాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్‌లో టీఆర్ఎస్ ఎంపీల పోరు ఉధృతంగా సాగుతున్నది. వరుసగా ఐదోరోజు కూడా టీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో ఆందోళన కొనసాగించారు. శుక్రవారం పార్లమెంట్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనకు దిగారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలుచేశారు. రిజర్వేషన్ల అంశంపై స్పష్టత వచ్చేవరకు పోరాటం ఆపేదిలేదని ఎంపీలు స్పష్టంచేశారు. అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపినా ఎటూ తేల్చకపోవడంపై టీఆర్ఎస్ ఎంపీలు ఆగ్రహం వ్యక్తంచేశారు. అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడిచేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శించారు. రిజర్వేషన్లు కల్పించే హక్కు రాష్ట్రాలకు ఇచ్చేవరకు పోరు కొనసాగిస్తామని లోక్‌సభలో టీఆర్ఎస్ పక్ష ఉపనేత బోయినపల్లి వినోద్‌కుమార్ స్పష్టంచేశారు. రిజర్వేషన్ల పెంపుపై రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసి పంపించినా ఇంతవరకు ఎలాంటి స్పందన లేదన్నారు. ప్రజా అవసరాలు, డిమాండ్‌లపై నిర్లక్ష్యవైఖరితో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఇద్దరు మాజీ ఐఏఎస్ అధికారులు సుధీర్, చెల్లప్పలతో కమిటీలువేసి, వాటి నివేదికల ప్రకారమే ప్రభుత్వం రిజర్వేషన్ల పెంపుదలకు ప్రతిపాదించిందని తెలిపారు. ఈ మేరకు ప్రస్తుతమున్న 50% రిజర్వేషన్లను 62 శాతానికి పెంచాలని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని చెప్పారు. రిజర్వేషన్ల ద్వారా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎంపీలు సీతారాంనాయక్, బీబీ పాటిల్, జీ నగేశ్, పసునూరి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇక చివరి రోజే రాజ్యసభ నామినేషన్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాజ్యసభ ఎన్నికల నామినేషన్లు దాఖలు గడువు ముగిసే ఈనెల 12వ తేదీనే దాఖలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. నామినేషన్ల దాఖలుకు ఇంకా మూడురోజుల సమయం ఉన్నా 10వ తేదీన రెండో శనివారం, 11న ఆదివారం కావడంతో నామినేషన్లు స్వీకరించడానికి అవకాశం ఉండదు. 12న 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలలోపే నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. నోటిఫికేషన్ వెలువడి ఐదురోజులు కావస్తున్నా ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. రాష్ట్రం నుంచి మూడు రాజ్యసభ స్థానాలనూ అధికార టీఆర్ఎస్ పార్టీ దక్కించుకునే అవకాశాలు ఉన్నా ప్రతిపక్ష కాంగ్రెస్ విపక్షాల సాయంతో అభ్యర్థిని నిలబెట్టేందుకు తర్జనభర్జన పడుతున్నట్టు తెలుస్తున్నది. ఈనెల 12న బడ్జెట్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతుండడం, ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం, తర్వాత శాసనసభ, మండలి బీఏసీ సమావేశాలు, రాజ్యసభ నామినేషన్ల దాఖలు నేపథ్యంలో బందోబస్తు తీసుకుంటున్నారు.

రాజ్యసభ ఎన్నికల్లో 'నోటా'

పార్టీ ఆదేశాలను ధిక్కరించి వేరొక అభ్యర్థికి ఓటు వేసినా, 'నోటా'ను ఉపయోగించుకున్నా ఆ ఓటు చెల్లకపోవడం ఉండదని ఎన్నికల కమిషన్ నిబంధనలు పేర్కొంటున్నాయి. రాజ్యసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు బ్యాలెట్ పేపర్‌ను బాక్సులో వేసే ముందు తమ పార్టీ ఏజెంట్‌కు చూపించాలి. ఎవరైనా ఓటరు (ఎమ్మెల్యే) పార్టీ ఆదేశాలను ధిక్కరించి వేరే అభ్యర్థికి ఓటువేసినా, లేదా 'నోటా'ను ఉపయోగించుకున్నా అతడిని శాసనసభ్యుడిగా అనర్హుడిగా ప్రకటించరు. సభ్యుడిపై క్రమశిక్షణాచర్యలు తీసుకునే, లేదా పార్టీ నుంచి బహిష్కరించే అవకాశం పార్టీకి ఉంటుంది. ఆయన ఎమ్మెల్యేగా కొనసాగవచ్చు. పార్టీ ఆదేశాలు ధిక్కరించినంత మాత్రాన అతని ఓటు చెల్లకపోవడం ఉండదు.

రేపు పల్స్‌పోలియో

- 36,55,204 మంది పిల్లలకు చుక్కల పంపిణీ
- ఏర్పాట్లు పూర్తిచేసిన వైద్య, ఆరోగ్యశాఖ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఆదివారం రెండోవిడుత పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించేందుకు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఏర్పాట్లు పూర్తిచేసింది. రాష్ట్రవ్యాప్తంగా 36,55,204 మంది 0-5 ఏండ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నారు. మహిళా శిశు సంక్షేమశాఖ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పాఠశాల విద్యాశాఖ, పంచాయతీరాజ్, ఐకేపీ, డిఫెన్స్, నేవీ, ఆర్టీసీ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. 11న పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులకు ఆ తర్వాత రెండురోజుల పాటు సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వేసేందుకు వైద్యశాఖ అంతా సిద్ధంచేసింది.

క్యాటగిరీ	సంఖ్య
పల్స్ పోలియో కేంద్రాలు	22,768
చుక్కలు వేసే సిబ్బంది	95,500
ట్రాన్సిట్ కేంద్రాలు	737
మొబైల్ బృందం	787
రూట్ సూపర్‌వైజర్లు	2,280
ఏఎన్ఎంలు	8,711
ఆశవర్కర్లు	27,045
అంగన్‌వాడీ వర్కర్లు	32,082

రాష్ట్ర రుణ విముక్తి కమిషన్ ఏర్పాటు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతు ఆదాయాన్ని పెంచడం, వివిధ ప్రతికూల పరిస్థితుల కారణంగా అప్పులపాలైన చిన్న, సన్నకారు రైతులను ఆదుకోవడం కోసం రాష్ట్ర రుణ విముక్తి కమిషన్‌ను సీఎం కేసీఆర్ ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించిన ఫైలు పై సీఎం శుక్రవారం సంతకం చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ కమిషన్‌లో చైర్మన్‌తోపాటు ఐదుగురు సభ్యులు ఉండే అవకాశం ఉన్నట్టు సమాచారం.

దేశాభివృద్ధికి ఎజెండా

మొదటిపేజీ తరువాయి...

అందటంలేదు. సాగునీటి సౌకర్యంలేదు. ఇంకా చాలా అవసరాలు తీరటంలేదు. మౌలిక సదుపాయాల కల్పన జరుగటంలేదు. చాలా రాష్ట్రాల మధ్య జల వివాదాలున్నా, అవి పరిష్కారం కావటంలేదు. కేంద్ర-రాష్ట్ర సంబంధాల విషయంలో కూడా అనేక కమిషన్లు, నిపుణులు సూచించిన సంస్కరణలు అమలుకావటం లేదు. ఫెడరల్ వ్యవస్థ స్ఫూర్తి పూర్తిస్థాయిలో ప్రతిబింబించటంలేదు' అని చెప్పారు. ఈ పరిస్థితుల్లో దేశాభివృద్ధికి కావాల్సిన ఎజెండాను రూపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాల్లో తెలంగాణ రాష్ట్రం అనేక మైలురాళ్లను అధిగమించిందని సీఎం కేసీఆర్ చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు ఇతర రాష్ట్రాలకు, కేంద్రానికి కూడా ఆదర్శంగా నిలిచాయన్నారు. ఈ పథకాలను దేశవ్యాప్తంగా అమలుచేయడంతోపాటు ఇంకా ఆయా రాష్ట్రాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కావాల్సిన కార్యక్రమాల రూపకల్పన జరుగాలని సీఎం కేసీఆర్ చెప్పారు. 'దేశంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలున్నాయి. ఏ శాఖ ఎవరి వద్ద ఉండాలనేది నిర్ణయం జరుగాలి. ఉమ్మడి జాబితా అమలులో ఉండటంవల్ల ఒకే శాఖకు సంబంధించి వేర్వేరు పథకాలు, కార్యక్రమాలు అమలవుతున్నాయి. దీనివల్ల క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీన్ని పరిష్కరించాల్సిన అవసరం ఉంది' అని సీఎం అభిప్రాయపడ్డారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వేర్వేరు సామాజిక పరిస్థితులున్నాయని, వాటికి అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించుకోవాల్సి ఉందని చెప్పారు. 'ఈ విషయంలో రాష్ట్రాలకు స్వేచ్ఛ, అధికారం కావాలి. న్యాయవ్యవస్థలోనూ, పాలనావ్యవస్థలోనూ, శాసన వ్యవస్థలోనూ మార్పులు రావాల్సిన అవసరం ఉంది. దేశంలో తీసుకురావాల్సిన మార్పులు, సంస్కరణలు, చట్ట సవరణలు, రాజ్యాంగ సవరణలు తదితర అన్ని విషయాల్లో కూడా స్పష్టమైన ఎజెండా రూపొందాలి. ఈ విషయంలో దేశంలోని అధికారులు, రాజకీయ నాయకులు, రిటైర్డ్ అధికారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు తమ సూచనలు ఇవ్వాలి. ఈ ప్రయత్నంలో భాగస్వాములు కావాలి' అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.32 గంటలకు

సూర్యాస్తమయం: 6.21 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, కృష్ణపక్షం అష్టమి ఉదయం 6.03 వరకు, తదుపరి నవమి (ఆదివారం ఉదయం 8.38 వరకు), నక్షత్రం: జ్యేష్ఠ రా.తె. 3.28 వరకు తదుపరి మూల (ఆదివారం ఉదయం 6.29 వరకు), అమృతఘడియలు: రాత్రి 11.17 నుంచి 12.53 వరకు, రాహుకాలం: ఉదయం 9.29 నుంచి 10.58 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.32 నుంచి 8.06 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 12.28 నుంచి 2.04 వరకు.

టీబీజీకేఎస్ రాష్ట్ర కమిటీ నియామకం

- అధ్యక్షుడిగా వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా రాజిరెడ్డి
- ఏరియా, రీజియన్, 11మెన్ కమిటీలను కూడా ప్రకటించిన గౌరవాధ్యక్షురాలు, ఎంపీ కవిత
- సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన కార్యవర్గం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం, టీఆర్ఎస్ పార్టీ అనుబంధ తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) రాష్ట్ర కమిటీని శుక్రవారం ప్రకటించారు. రాష్ట్ర కమిటీ, ఏరియా, రీజియన్, 11మెన్ కమిటీలతో సహా అన్ని రీజియన్లు, ఏరియాల పిట్ కమిటీలను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆమోదంతో టీబీజీకేఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. నూతన కార్యవర్గం వివరాలను శుక్రవారం ఆమె మీడియాకు వెల్లడించారు. టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీఎమ్మెల్సీ బీ వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా మిరియాల రాజిరెడ్డిని నియమించారు. అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శితోపాటు ఇద్దరు ఉపాధ్యక్షులు, కోశాధికారి, ఏరియా ఉపాధ్యక్షులు (ఏరియాకి ఒక్కొక్కరు చొప్పున), నలుగురు రీజినల్ కార్యదర్శులు (రీజియన్‌కు ఒకరుచొప్పున), 11 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. టీబీజీకేఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన బీ వెంకట్రావు, రాజిరెడ్డి శుక్రవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, ఎంపీ కవితను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

టీబీజీకేఎస్ రాష్ట్ర కమిటీ

అధ్యక్షుడు: బీ వెంకట్రావు (ఓసీ), **ప్రధాన కార్యదర్శి:** ఎం రాజిరెడ్డి (ఓసీ), **ఉపాధ్యక్షులు:** బడికల సంపత్‌కుమార్ (ఎస్సీ), అప్పాని శ్రీనివాస్ (బీసీ), **కోశాధికారి:** లావుడ్య వెంకటేశ్ (ఆర్జీ-1, బీసీ)

ప్రాంతాల వారీగా ఉపాధ్యక్షులు

శ్రీరాంపూర్: కే సురేందర్‌రెడ్డి (ఓసీ), **బెల్లంపల్లి:** ఎం శ్రీనివాసరావు (ఓసీ), **మందమర్రి:** ఎం సంపత్ (బీసీ), **ఆర్జీ-1** జీ దామోదర్‌రావు (ఓసీ), **ఆర్జీ-2:** ఐలి శ్రీనివాస్ (బీసీ), **ఆర్జీ-3:** ఎన్ సాంబయ్య (బీసీ), **భూపాలపల్లి:** కే తిరుపతి (బీసీ), **మణుగూరు :** ప్రభాకర్‌రావు (ఓసీ), **కొత్తగూడెం:** ఎండీ రజాక్ (మైనారిటీ), **కార్పొరేట్:** సోమిరెడ్డి (ఓసీ), **ఇల్లెందు:** గడ్డం వెంకటేశ్వర్లు (బీసీ)

11మెన్ కమిటీ..: దేవ వెంకటేశం (ఆర్జీ-1-ఎస్సీ), కే సత్యనారాయణరెడ్డి (ఆర్జీ-2 -ఓసీ), శ్రీనివాస్‌రెడ్డి (మణుగూరు-ఓసీ), కాపు కృష్ణ (ఖమ్మం-బీసీ), వీరభద్రయ్య (ఎస్సార్పీ-బీసీ), ఏనుగు రవీందర్ (ఎస్సార్పీ-బీసీ), పెద్దపల్లి సత్యనారాయణ (ఆర్జీ-1-బీసీ), మంగీలాల్ (బీపీఎల్-ఎస్టీ)

నలుగురు ఐఏఎస్‌ల బదిలీ

- భారతి లక్పతినాయక్, వర్షిణి, శృతిఓజా, హైమావతికి స్థానచలనం
- ఐదుగురు నాన్ క్యాడర్ అధికారులకు కూడా.. ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నలుగురు ఐఏఎస్‌లు, ఐదుగురు నాన్ క్యాడర్ అధికారులను బదిలీచేసి పోస్టింగులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ డిపార్ట్‌మెంట్ జాయింట్ సెక్రటరీగా బీ భారతిలక్పతినాయక్, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్‌గా వీఎస్ అలుగు వర్షిణి, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా శృతి ఓజా, సీసీఎల్ఏ కార్యదర్శిగా కే హైమావతిని ప్రభుత్వం నియమించింది. మరో ఉత్తర్వులో ఐదుగురు నాన్ క్యాడర్ అధికారుల బదిలీల గురించి పేర్కొన్నది. ఇంధనశాఖ మంత్రి పీఎస్‌గా విధులు నిర్వహిస్తున్న డీ శ్రీనివాస్‌రెడ్డిని మేడ్చల్- మల్కాజిగిరి జాయింట్ కలెక్టర్‌గా, సీసీఎల్ఏ అసిస్టెంట్ సెక్రటరీగా ఉన్న ఎస్ హరీశ్‌ను రంగారెడ్డి జాయింట్ కలెక్టర్‌గా, సికింద్రాబాద్ ఎస్టేట్ ఆఫీసర్‌గా ఉన్న కే నిఖిలను సంగారెడ్డి జాయింట్ కలెక్టర్‌గా, యాదాద్రి- భువనగిరి డీఆర్డీవోగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్ వెంకటరావును మహబూబ్‌నగర్ జాయింట్ కలెక్టర్‌గా, జనగామ అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎం వనజాదేవిని పెద్దపల్లి జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

చేనేతకు పూర్వవైభవం

- బడ్జెట్‌లో చేనేతకు రూ.1200 కోట్లు కేటాయించాం
- పరిశ్రమను ఆధునీకరించి నేతన్నను ఆదుకున్నాం
- చేనేతకు, మరమగ్గాలకు వేర్వేరుగా ప్రత్యేక కార్పొరేషన్లు
- బైబ్యాక్ ద్వారా చేనేత వస్త్రాల కొనుగోళ్లు: మంత్రి కేటీఆర్
- దుబ్బాక చేనేత కార్మికుల రూ.కోటి 56 లక్షల రుణాల మాఫీకి హామీ

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ: గతంలో ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత పరిశ్రమపై చిన్నచూపు చూడటంతో వృత్తిపై ఆధారపడ్డ కార్మికుల పరిస్థితి కడు దయనీయంగా మారిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, చేనేత, జౌళిశాఖల మంత్రి కే తారకరామారావు చెప్పారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత పరిశ్రమను ఆధునీకరించి, వృత్తిపై ఆధారపడిన నేతన్నలకు చేతినిండా పనికల్పించి, కడుపునిండా తిండిపెట్టిందని అన్నారు. చేనేతకు పూర్వవైభవం తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని మంత్రి తెలిపారు. బడ్జెట్‌లో చేనేతకు రూ.1200 కోట్లు కేటాయించిన ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందని చెప్పారు. శుక్రవారం సిద్దిపేట జిల్లాలోని దుబ్బాకలో చేనేత సహకార సంఘాన్ని స్థానిక శాసనసభ్యుడు సోలిపేట రామలింగారెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ సందర్శించి కార్మికులతో ముచ్చటించారు. కూలీ ఎంత పడుతున్నది? పని ఎలా ఉందమ్మా? అంటూ వారిని ఆప్యాయంగా పలుకరించారు. చేనేత మగ్గాలపై తయారైన వస్త్రాలను పరిశీలించిన అనంతరం మీడియా సమావేశంలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత పరిశ్రమను అన్ని విధాల ఆదుకొని పూర్వ వైభవం తెచ్చేందుకు టీఆర్ఎస్ సర్కార్ తీవ్రంగా కృషి చేస్తున్నదన్నారు. ప్రతి చేనేత కార్మికునికి ఉపాధి కల్పించేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. నూలుపై 50%, రంగులు అద్దే రసాయనాలపై 50% సబ్సిడీని ప్రభుత్వమే అందజేస్తుందన్నారు. నేతన్నకు చేయూత (త్రిఫ్ట్) అనే స్కీమ్ ప్రవేశపెట్టి కార్మికులకు రుణసౌకర్యం కల్పించబోతున్నామన్నారు. కార్మికులు తయారుచేస్తున్న వస్త్రాలను బైబ్యాక్ అగ్రిమెంట్‌ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోబోతున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో మొత్తం 17 వేల మగ్గాలుండగా పవర్ లూమ్స్ 60 వేల వరకు ఉన్నాయన్నారు. చేనేతకు, మరమగ్గాలకు వేర్వేరుగా ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటుచేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని, దీంతో ఆ ప్రక్రియ ఆరంభమైందని మంత్రి తెలిపారు. చేనేత కార్మికులకు 50 ఏండ్లు నిండగానే పెన్షన్‌ను అందిస్తామని చెప్పారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల కేటాయింపు తదితర చర్యలతో కార్మికులను ఆదుకుంటామని అన్నారు. నేతన్నల సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. చేనేత అంబాసిడర్‌గా ఉన్న సినీ నటి సమంతను దుబ్బాక, సిరిసిల్ల, సిద్దిపేట ప్రాంతాలకు పంపించి చేనేత పరిశ్రమకు మంచి ప్రచారం జరిగేలా చూశామని తెలిపారు. సిరిసిల్లలోని అపారెల్ పార్కు, వరంగల్‌లో ఏర్పాటుచేయబోతున్న టెక్స్‌టైల్ పార్కుల్లో చేనేత రంగంలో మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కాగా దుబ్బాక చేనేత కార్మికులు తమ వ్యక్తిగత రుణాలు రూ.కోటీ 56 లక్షలను మాఫీ చేయాలని మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం ఇచ్చారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు.



సిద్దిపేట జిల్లాలోని దుబ్బాకలో మంత్రి కే తారకరామారావును సన్మానిస్తున్న చేనేత సహకార సంఘం బాధ్యులు. చిత్రంలో ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి కూడా ఉన్నారు



దుబ్బాక చేనేత సహకార సంఘంలో మగ్గాలపై తయారైన వస్త్రాలను పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్

మాది మీ ఊరే బిడ్డా..

- మీ నాయనతో కలిసి బాయికాడ మోట కొట్టిన
- దుబ్బాకలో మంత్రి కేటీఆర్‌ను పలుకరించిన వజ్రవ్వ

దుబ్బాక టౌన్: దుబ్బాక పర్యటనలో మంత్రి కేటీఆర్‌కు ఓ ఆప్యాయపూరిత పలుకరింపు లభించింది. సీఎం కేసీఆర్ స్వగ్రామమైన చింతమడకలో కొన్ని ఏండ్ల క్రితం నివసించిన వజ్రవ్వ అనే మహిళ కేటీఆర్‌ను కలుసుకుని, తనను తాను పరిచయం చేసుకున్నారు. 'మా తల్లిగారిది చింతమడకనే బిడ్డా. చిన్నప్పుడు చింతమడకలో మీ నాయన చంద్రశేఖర్‌రావుతో కలిసి మీ బాయికాడ మోట కొట్టిన. మీ వ్యవసాయపు పనులు మా నాయన కూస వెంకట రాజయ్య చేసేవాడు. పెండ్లి చేసుకొని దుబ్బాకలో ఉంటున్నా' అంటూ ఆమె కేటీఆర్‌ను పలుకరించారు. వజ్రమ్మ మాటలకు ముగ్ధుడైన మంత్రి కేటీఆర్ 'అమ్మా.. ఆరోగ్యం ఎలా ఉంది? ఏం చేస్తున్నావు?' అంటూ వాకబు చేశారు. 'మా నాయనను కలిపిస్తా' అని వజ్రవ్వకు కేటీఆర్ చెప్పడంతో ఆమె తబ్బిబ్బయ్యారు. వజ్రమ్మ, ఆమె భర్త ఆరోగ్య పరిస్థితులను ఈ సందర్భంగా కేటీఆర్ తెలుసుకున్నారు.



వజ్రవ్వను ఆప్యాయంగా పలుకరిస్తున్న మంత్రి కేటీఆర్

కాంగ్రెస్‌ను నమ్మేదెవరు?

మొదటిపేజీ తరువాయి...

టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అధికారంలోకి వస్తే అది చేస్తాం, ఇది చేస్తాం.. అంటూ కాంగ్రెస్ నేతలు వాగ్దానాలు కుమ్మరిస్తున్నారని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేదీలేదు.. చేసేదీ ఏమీలేదని అన్నారు. తెలంగాణ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత లేదని స్పష్టంచేశారు. మ్యానిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను వందకు వంద శాతం అమలుచేస్తున్న చరిత్ర తమ ప్రభుత్వానిదని మంత్రి అన్నారు.

దశాబ్దాలుగా తెలంగాణను పట్టించుకోలేదు

దశాబ్దాల తరబడి అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజలను పట్టించుకోలేదని మంత్రి హరీశ్ విమర్శించారు. 2009 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో పేర్కొన్న ఏ ఒక్క హామీనైనా అమలుచేసిందా? అని ప్రశ్నించారు. అప్పుడు మంత్రిగా ఉన్న ఇప్పటి పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏ హామీని అమలుచేశారో చెప్పాలని నిలదీశారు. కాంగ్రెస్ హయాంలో ప్రజలు నిత్యం సమస్యలతో బాధపడితే, టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు సౌకర్యాలు కల్పించిందని తెలిపారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయానికి తొమ్మిది గంటల కరంటు ఇస్తామని చెప్పి, ఏడు గంటలుకూడా ఇవ్వలేదని చెప్పారు. ఆరుకిలోల బియ్యం హామీని కూడా విస్మరించారన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పుడు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నదని చెప్పారు. పేదలకు కడుపునిండా అన్నంపెట్టేందుకు ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికీ ఒక్కొక్కరికి ఆరుకిలోల చొప్పున రేషన్ బియ్యం ఇస్తున్నామని తెలిపారు.

రాజీనామా చేద్దామంటే పారిపోయిన చరిత్ర కాంగ్రెస్‌ది

తెలంగాణ రాష్ట్ర సాధనకోసం నాడు రాజీనామాలు చేద్దాం రమ్మంటే జేఏసీని వదిలి పారిపోయిన ఘనులు కాంగ్రెస్ నాయకులని మంత్రి హరీశ్ ఎద్దేవాచేశారు. బస్సుయాత్ర సందర్భంగా ప్రజల సమస్యల గురించి మాట్లాడకుండా ప్రభుత్వాన్ని అసభ్య పదజాలంతో దూషించడానికే కాంగ్రెస్ నేతలు పరిమితమయ్యారని అన్నారు. బస్సు యాత్రలో మాట్లాడటానికి ఏ ఒక్క అంశం కూడా వారికి లేనందువల్లే దూషణలకు దిగుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని అన్నారు.

ప్రజల బతుకులు నాశనం చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది

సుదీర్ఘకాలం అధికారంలో ఉండి, ప్రజల బతుకులను నాశనంచేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో స్వచ్ఛమైన తాగునీళ్లు లేక గిరిజన, గోండు పల్లెల్లో అతిసార వ్యాధి సోకి వేలమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. ఫ్లోరైడ్ శాతం పెరిగి ప్రాణాలు కోల్పోయేలా, ప్రజల బతుకులు నాశనమయ్యేలా కాంగ్రెస్ చేసిందని, ఇది చరిత్ర అని చెప్పారు. అయితే మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లాల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని హరీశ్ స్పష్టంచేశారు. రాజులు కట్టించిన చెరువులను కాంగ్రెస్ నాశనం చేస్తే, మిషన్ కాకతీయ ద్వారా పునరుద్ధరిస్తున్నామని గుర్తుచేశారు. 'కాంగ్రెస్ హయాంలో సాగునీటి ప్రాజెక్టులన్నీ పెండింగ్. మా హయాంలో రన్నింగ్' అని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ హయాంలో సమస్యలు- మా హయాంలో సౌకర్యాలు

కాంగ్రెస్ హయాంలో హాస్టళ్లలో దొడ్డు బియ్యంతో అన్నంపెడితే తమ ప్రభుత్వం సన్నబియ్యంతో అన్నంతోపాటు ప్రతి రోజు గుడ్డు, వారంలో రెండుసార్లు చికెన్‌తో భోజనం పెడుతున్నదని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. 520 ఇంగ్లిష్‌మీడియం రెసిడెన్షియల్ స్కూళ్లు ప్రారంభించి, కార్పొరేట్‌కు దీటుగా విద్యనందిస్తున్నామన్నారు. కాంగ్రెస్ హయాంలో ఆడపిల్ల పుడితే అమ్ముకునే దుస్థితి ఏర్పడిందని, అదే టీఆర్ఎస్ హయాంలో ఆడపిల్ల మహాలక్ష్మిగా మారిందని చెప్పారు. ప్రతి పేదింటి ఆడపిల్ల పెండ్లికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా రూ.75,116 చొప్పున ఇస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ పెంచి పోషించిన గుడుంబాను అరికట్టించామని, పేకాట క్లబ్బులను మూయించామని, కల్తీ విత్తనాలు, నకిలీ ఎరువుల భరతం పట్టామని వివరించారు. ప్రజాపాలన అంటే ఇదేనని హరీశ్ చెప్పారు. తాము ప్రజల కోసమే పనిచేస్తున్నామని, అందుకే ప్రజలంతా కేసీఆర్ వెంట ఉన్నారని అన్నారు. సీఎం కేసీఆర్‌పై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉందని తెలిపారు.

మోకాళ్ల యాత్ర చేసినా కాంగ్రెస్ అధికారంలోకి రాదు

కాంగ్రెస్ నాయకులు గుప్పిస్తున్న హామీలపై విశ్వాసం లేకనే బస్సుయాత్రకు ప్రజల స్పందన కరువైందని హరీశ్ అన్నారు. ప్రజలు కేసీఆర్‌పై నమ్మకంతో ఉన్నారనే తీవ్ర అసహనంతో కాంగ్రెస్ నేతలు నోరు పారేసుకుంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు తమ ఉనికి చాటుకోవడానికే బస్సుయాత్ర పేరుతో బయల్దేరారని హరీశ్ విమర్శించారు. సిరిసిల్లకు వెళ్లి మంత్రి కేటీఆర్‌ను, హుజూరాబాద్‌కు పోయి మంత్రి ఈటల రాజేందర్‌ను ఇష్టంవచ్చినట్లు దూషించారన్నారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు దోచుకు తిని, సీబీఐ కేసులు ఎదుర్కొన్న చరిత్ర కాంగ్రెస్ నాయకులదని, ఇప్పటికీ వారు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ నేతలు బస్సుయాత్ర, పాదయాత్ర కాదుకదా.. ఆఖరుకు మోకాళ్ల యాత్ర చేసినా అధికారం దక్కదని తేల్చిచెప్పారు. ప్రతిపక్ష హోదా కాదు కదా.. కనీసం ఇప్పుడున్న సీట్లు కూడా రావని అన్నారు. మళ్లీ టీఆర్ఎస్‌కే అధికారం వస్తుందని ధీమా వ్యక్తంచేశారు.

పిక్నిక్‌లా కాంగ్రెస్ బస్సు యాత్ర: మంత్రి తలసాని

కాంగ్రెస్ నేతలు బస్సు యాత్రను పిక్నిక్ యాత్రగా మార్చుకున్నారని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ ఎద్దేవాచేశారు. అడ్డగోలుగా అందరినీ ఏకవచనంతో తిడుతున్న కాంగ్రెస్ నేతలు ముందుగా ఇప్పుడున్న సీట్లలో సగమైనా గెలుస్తారో లేదో చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడో ప్రజల విశ్వాసం కోల్పోయిందని చెప్పారు. అధికారంలో ఉండగా ప్రజలను పట్టించుకోని కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ఇచ్చే పెద్ద పెద్ద హామీలను ప్రజలు నమ్మరని వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏండ్లలో ఏ ప్రభుత్వం చేయనివిధంగా టీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదని తలసాని తెలిపారు. బీసీల సంక్షేమం గురించి కాంగ్రెస్‌కు మాట్లాడే హక్కు ఉందా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాలనగానే పారిపోయే కాంగ్రెస్ నాయకులు బస్సు యాత్ర పేరుతో నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. బస్సు యాత్రకు స్పందన లేదని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అడ్రస్ లేకుండా పోతుందని తలసాని స్పష్టంచేశారు.

బడ్జెట్ సమావేశాలు అర్థవంతంగా నిర్వహిస్తాం

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు అర్థవంతంగా నిర్వహిస్తామని అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి కూడా అయిన హరీశ్‌రావు తెలిపారు. గతంలో ప్రతిపక్షాలు అసెంబ్లీ సమావేశాలు ఎక్కువ రోజులు జరుపాలని డిమాండ్ చేస్తే ప్రభుత్వాలు సమావేశాలు నిర్వహించలేక పారిపోయేవని, ఇప్పుడు తమ ప్రభుత్వం ఎక్కువ రోజులు సభ నిర్వహిస్తామంటుంటే ప్రతిపక్షాలు పారిపోతున్నాయని చెప్పారు. అసెంబ్లీలో ప్రజాసమస్యలపై అర్థవంతమైన, లోతైన చర్చ జరుగాలని, దీనికోసం ఎన్ని గంటలైనా, ఎన్ని రోజులైనా సమావేశాలు నిర్వహించాలన్నదే ప్రభుత్వ విధానమని అన్నారు. గతంలో పద్దులపై ఏనాడూ చర్చించింది లేదని గుర్తుచేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాతనే పద్దులపై అర్ధరాత్రి దాటిన తరువాత కూడా ఓపికగా చర్చిస్తున్నామన్నారు. గతంలో బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్నాయంటే లాంతర్లు, ఎండిన పైర్లు, ఖాళీ కుండలతో సభకు వచ్చేవారని, ఇప్పుడు ఆ దృశ్యాలే లేవని చెప్పారు. సభ చర్చకోసమే కానీ వాయిదాలకోసం కాదన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి అసెంబ్లీ మంచి వేదికని తెలిపారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, ఏయే అంశాలపై చర్చించాలన్నదానిపై ఆదివారం టీఆర్ఎస్ ఎల్పీ సమావేశంలో చర్చిస్తామన్నారు. సభలో సభ్యులందరికీ సమాన హక్కులు ఉంటాయని, టీఆర్ఎస్ సభ్యులు కూడా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తారని మంత్రి అన్నారు. సభలో ప్రతిపక్షాలు నిర్మాణాత్మకంగా కాకుండా అల్లరి చేస్తే సహించేది లేదని, కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి స్పష్టంచేశారు.

నా పుట్టుక, చావు.. టీఆర్ఎస్‌లోనే

మొదటిపేజీ తరువాయి...

హరీశ్‌రావు తెలిపారు. సదరు చానల్ కూడా పోలీసులకు ఫిర్యాదుచేయాలన్నారు. అయితే సదరు చానల్ ప్రతినిధి అది తమది కాదని చెప్పడంతో 'పోలీసులకు ఫిర్యాదు చేశారా?' అని మంత్రి ప్రశ్నించారు. ఫిర్యాదు చేయలేదని సదరు ప్రతినిధి జవాబివ్వడంతో ఎందుకు ఫిర్యాదు చేయలేదని అడిగారు. దీంతో సదరు చానల్ ప్రతినిధి ఈ విషయంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. 'నేను టీఆర్ఎస్‌లో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను. పార్టీ ఏది ఆదేశిస్తే ఆ పని చేస్తాను. కేసీఆర్ మాటే నా బాట. నా పుట్టుక టీఆర్ఎస్‌లోనే.. నా చావు టీఆర్ఎస్‌లోనే' అని హరీశ్‌రావు చెప్పారు. తనకు త్యాగాలు తప్ప ద్రోహాలు తెలియవని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఆ పార్టీలో చేరుతున్నానని, ఈ పార్టీలో చేరుతున్నానని తనపై అదే పనిగా దుష్ప్రచారంచేస్తే సహించేది లేదని మంత్రి అన్నారు. మీడియా ప్రతినిధులు ఇలాంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వవద్దని సూచించారు.

కువైట్ క్షమాభిక్ష బాధితులను ఆదుకుంటున్నాం

■ మంత్రి కేటీఆర్‌కు లేఖద్వారా సమాచారమిచ్చిన విదేశాంగశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కువైట్‌లోని గల్ఫ్ కార్మికులకు సహాయం చేసే విషయంలో ఉదారంగా వ్యవహరించాలన్న రాష్ట్ర ఎన్నారై వ్యవహారాలశాఖ మంత్రి కే తారకరామారావు లేఖకు విదేశాంగశాఖ స్పందించింది. కువైట్ కల్పిస్తున్న క్షమాభిక్షతో అక్కడి నుంచి స్వదేశానికి వస్తున్న వారిని ఆదుకుంటున్నామని వెల్లడించింది. ఈ మేరకు మంత్రి కేటీఆర్‌కు లేఖ ద్వారా సమాచారం ఇచ్చింది. కువైట్‌లో సరైన పత్రాలులేకుండా అక్రమంగా నివసిస్తున్న వారికి.. అక్కడి సర్కారు క్షమాభిక్ష కల్పించింది. దీంతో పలువురు స్వదేశానికి వచ్చేందుకు సిద్ధమయ్యారు. బాధితులు ఆర్థికపరమైన, ఇతర సమస్యలు ఎదుర్కొంటున్న విషయం తన దృష్టికి రావడంతో కేటీఆర్ స్పందించారు. గతనెల ఫిబ్రవరి 6వ తేదీన విదేశాంగశాఖకు లేఖరాశారు. కార్మికులకు సహాయకారిగా ఉండేందుకు తగినచర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై విదేశాంగశాఖ సంయుక్త కార్యదర్శి మనీశ్‌గుప్తా స్పందించారు. క్షమాభిక్షను ఉపయోగించుకునేవారికి ఇండియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ ఫండ్ ద్వారా సాయం చేస్తున్నామని పేర్కొన్నారు. టికెట్లు పొందేందుకు కావాల్సిన ఆర్థికసాయం సహా ఇతర అవసరాలన్నింటిలోనూ సాయం చేస్తున్నామని వివరించారు.

నిజామాబాద్, జగిత్యాల రైల్వేస్టేషన్లలో సోలార్ ప్లాంట్లు

■ ఎంపీ కవిత లేఖకు స్పందించిన రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్
■ త్వరలో టెండర్లు పిలువాలని దక్షిణమధ్య రైల్వే అధికారులకు ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నిజామాబాద్, జగిత్యాల రైల్వేస్టేషన్లలో సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటుచేయాలని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత రాసిన లేఖకు రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పందించారు. ఆ రెండు రైల్వేస్టేషన్లలో త్వరలో విద్యుత్ సోలార్‌ప్లాంట్లు ఏర్పాటుచేస్తామని ఆయన ఎంపీ కవితకు తిరిగి లేఖ రాశారు. గత ఏడాది మార్చిలో కవిత రాసిన లేఖపై.. అధ్యయనం చేసిన రైల్వేమంత్రి సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటుచేయడానికి త్వరలో టెండర్లు పిలువాలని దక్షిణమధ్య రైల్వే అధికారులను ఆదేశించారు. ఈ మేరకు త్వరలోనే నిజామాబాద్, జగిత్యాల రైల్వేస్టేషన్లలో సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి. నిజామాబాద్‌లో 85 కేడబ్ల్యూపీ సామర్థ్యం గల ప్లాంటు, జగిత్యాలలో మూడు కేడబ్ల్యూపీ సామర్థ్యం గల సోలార్ ప్లాంటు ఏర్పాటు కానుంది. ఈ రెండు రైల్వేస్టేషన్లలో సోలార్ విద్యుత్ ప్లాంట్లు పెట్టాలని ఎంతోకాలంగా ప్రతిపాదించినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. ఎంపీ కవిత కృషితో సోలార్‌ప్లాంట్లు ఏర్పాటు కాబోతున్నాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

'అంబేద్కర్ ఓవర్సీస్'కు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: విదేశీ చదువుల కోసం ఆశగా ఎదురుచూస్తున్న గిరిజన యువతకు అంబేద్కర్ ఓవర్సీస్ పథకం అండగా నిలువనున్నది. అమెరికా, ఆస్ట్రేలియా, యూకే, కెనడా, సింగపూర్ తదితర దేశాల్లో ఉన్నతవిద్య అభ్యసించేందుకు గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు గిరిజన సంక్షేమశాఖ అధికారి హన్మంత్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, స్వచ్ఛ సైన్స్, వ్యవసాయ సైన్స్, మెడిసిన్, నర్సింగ్, సోషల్ సైన్స్, హ్యూమానిటీస్ కోర్సుల్లో 60 శాతం మార్కులు సాధించినవారు http://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 13వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. రాష్ట్రస్థాయి స్క్రీనింగ్ కమిటీ సమావేశాన్ని ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్నట్టు తెలిపారు.

టీ హబ్‌తో కలిసి పనిచేస్తాం

■ 2020 నాటికి ఎయిర్‌ట్రాఫిక్‌లో మూడోస్థానానికి భారత్
■ ఎయిర్‌బస్ ప్రతినిధి డిర్‌హెజ్లిన్
■ దేశంలో విమానాల సంఖ్య పెరుగాలన్న క్లబ్‌వన్ ఎయిర్ సీఈవో

హైదదరాబాద్, నమస్తే తెలంగాణ: భవిష్యత్‌లో రాష్ట్రంలోని టీ హబ్‌తో కలిసి స్టార్టప్‌లపై కలసి పనిచేస్తామని ఎయిస్‌బస్ ఏషియా, ఉత్తర అమెరికా మార్కెటింగ్ ఉపాధ్యక్షుడు జూస్ట్‌వాన్ డిర్‌హెజ్లిన్ ప్రకటించారు. ఏరోస్పేస్‌లో నూతన ఆవిష్కరణల్లో కలిసి పనిచేస్తామన్నారు. శుక్రవారం వింగ్స్ ఇండియా సదస్సులో భాగంగా బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో ఎయిర్‌బస్ భవిష్యత్ కార్యాచరణను ఆయన ప్రకటించారు. 2020 నాటికి ప్రపంచ ఎయిర్‌ట్రాఫిక్‌లో భారత్ మూడోస్థానంలో నిలుస్తుందని వెల్లడించారు. దేశీయ ప్రయాణికుల్లో సగటున 8.9% వృద్ధి నమోదవుతుందన్నారు. 2036 నాటికి 1750 ఎయిర్‌క్రాఫ్ట్‌లు అవసరమవుతాయని, ఇందులో 1320 ఎయిర్‌క్రాఫ్ట్‌లు 20 సీట్లలోపు విమానాలే ఉంటాయని తెలిపారు. 30, 50, 80 సీట్ల సామర్థ్యం ఉన్నవి మరో 430 ఉంటాయని అన్నారు. ఎయిర్‌బస్ ఇండియా డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసన్ ద్వారకానాథ్ మాట్లాడుతూ త్వరలో ఢిల్లీలో శిక్షణ కేంద్రానికి కార్యాలయం నిర్మించనున్నట్టు చెప్పారు. దీనిద్వారా పూర్తిస్థాయి సొంత శిక్షణ కేంద్రం ఏర్పాటుచేసిన సంస్థగా ఎయిర్‌బస్ నిలుస్తుందన్నారు. సంస్థలో ప్రస్తుతం 6వేలమంది పనిచేస్తున్నారని, ఇందులో 1500 మంది ఇంజినీర్లు ఉన్నారని వెల్లడించారు. దేశీయ ప్రయాణికుల సంఖ్య 20 ఏండ్లలో ఐదున్నర రెట్లు పెరుగుతుందని తెలిపారు.

ఎయిర్‌క్రాఫ్ట్‌లు పెరుగాలి: క్లబ్ వన్ ఎయిర్

దేశంలో ప్రస్తుతమున్న ఎయిర్‌క్రాఫ్ట్‌ల సంఖ్య పెరుగాల్సిన అవసరం ఉందని క్లబ్ వన్ ఎయిర్ సీఈవో రాజన్‌మోహ్రా అన్నారు. దేశంలో ప్రస్తుతం 250 ఎయిర్‌క్రాఫ్ట్‌లు మాత్రమే ఉన్నాయని, కానీ బ్రెజిల్‌లో 750 ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఉన్నాయని వెల్లడించారు. దేశంలోని జనాభాలో కేవలం 1.5% మాత్రమే విమానాల్లో ప్రయాణిస్తున్నారని చెప్పారు. వైద్యరవాణాకు ఎయిర్‌క్రాఫ్ట్‌లను విస్తృతంగా వినియోగించాల్సిన అవసరం ఉందని చెప్పారు. తమ కంపెనీ రాబోయే రోజుల్లో మరో నాలుగు ఫాల్కన్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను వినియోగించుకుంటుందన్నారు.



వింగ్స్ ఇండియా సదస్సులో ఎయిర్‌బస్సు నమూనాను ఆవిష్కరిస్తున్న ఎయిర్‌బస్ ప్రతినిధి జూస్ట్‌వాన్ డిర్‌హెజ్లిన్



వింగ్స్ఇండియా సదస్సులో భాగం ఏర్పాటుచేసిన ఏవియేషన్ షోలో విమాన నమూనాను పరిశీలిస్తున్న పౌరవిమానయానశాఖ సహాయమంత్రి జయంత్‌సిన్హా

టీహబ్, బోయింగ్ స్టార్టప్ పోటీలకు విశేష స్పందన

■ వచ్చే నెల విజేతల ఎంపిక

విమానయానరంగంలో ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రపంచ ప్రఖ్యాత బోయింగ్ సంస్థ, టీహబ్ సంయుక్తంగా నిర్వహించిన పోటీకి విశేష స్పందన వచ్చింది. 80కి పైగా స్టార్టప్‌లు దరఖాస్తుచేసుకోగా మూడింటిని ఫైనల్స్‌కు ఎంపికచేశారు. వచ్చే నెలలో నిర్వహించనున్న పోటీల్లో విజేతలను ఎంపిక చేయనున్నారు. ఆవిష్కరణల్లో అత్యుత్తమ కేంద్రంగా ఉన్న టీ హబ్‌తో గత ఏడాది బోయింగ్ జట్టుకట్టి హరిజాన్‌ఎక్స్ పేరుతో ఇండియా ఇన్నోవేషన్ చాలెంజ్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే.

కార్గో పరిశ్రమ విస్తృతికి అన్ని రకాల చర్యలు

■ పౌరవిమానయానశాఖ సహాయమంత్రి జయంత్‌సిన్హా

రాబోయే రోజుల్లో ఎయిర్‌కార్గో భారీ పరిశ్రమగా విస్తృతమవుతుందని కేంద్ర పౌరవిమానయానశాఖ సహాయమంత్రి జయంత్‌సిన్హా చెప్పారు. వింగ్స్ ఇండియా అంతర్జాతీయ సదస్సులో భాగంగా శుక్రవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ రంగాన్ని ప్రోత్సహించడానికి కేంద్రం అన్నివిధాలుగా సహకరిస్తుందన్నారు. దీనిపై ప్రభుత్వం, ప్రైవేటురంగాన్ని సమన్వయం చేసుకోవడానికి సమగ్ర విధానాన్ని రూపొందిస్తామని తెలిపారు. సరుకు రవాణారంగం ఆర్థికవృద్ధిలోనూ కీలకంగా మారుతుందని చెప్పారు. కార్గో పరిశ్రమ వ్యవసాయ, ఆహార ఉత్పత్తులు, ఫార్మాసూటికల్స్, లెదర్, టెక్స్‌టైల్స్ తదితర ఉత్పత్తులను 3.7లక్షల మెట్రిక్ టన్నుల మేరకు రవాణా చేసిందని తెలిపారు. ఎయిర్‌కార్గో సర్వీసులను మరింత సులువుచేయడానికి ఈ-పోర్టల్స్‌ను ఆవిష్కరించామన్నారు. ఈ సమావేశంలో డీకే సింగ్, ఫార్మాక్సెల్ డీజీ రవిఉదయ్‌భాస్కర్, ఈఐసీఐ సీవోవో విజయ్‌కుమార్, వైమానికశాఖ ఆర్థిక సలహాదారు వందనఅగర్వాల్, పీయూశ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్ర పేరుతో సర్కస్ ఫీట్లు

■ మంత్రి ఈటల నిప్పులాంటి మనిషి: కర్నె
■ రేవంత్‌రెడ్డి ఉద్యమ దొంగ: రసమయి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్ నాయకులది గాంధీభవన్ సర్కస్ కంపెనీ అని, వారంరోజులుగా బస్సుయాత్ర పేరుతో ఫీట్లుచేసి తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్నదని టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ విమర్శించారు. కాంగ్రెస్‌లో ఉన్నవాళ్లంతా తుపాకీ రాముళ్లు, బఫూన్లు, పిట్టల దొరలేనన్నారు. రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి శుక్రవారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి తీసుకెళ్లిన భజనపరులతో చప్పట్లు కొట్టించుకొని సంతోషపడుతున్నారని ఎద్దేవాచేశారు. ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డి జైలుకు వెళ్లినప్పుడు కూడా నాలుగుకోట్ల మంది ప్రజలు చప్పట్లు కొట్టిన విషయాన్ని మర్చిపోవద్దని అన్నారు. మంత్రి ఈటల రాజేందర్‌పై రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలన్నీ పచ్చి అబద్ధాలని కొట్టిపారేశారు. నీతినియమం పాటించే నిప్పులాంటి మనిషి రాజేందర్ అని కితాబిచ్చారు.నిప్పును పట్టుకుంటే కాలిపోతావని రేవంత్‌ను హెచ్చరించారు. పదేండ్లు అధికారంలో ఉండి పౌరసరఫరాలశాఖలో రూ.18వేల కోట్లను దిగమింగిన పందికొక్కులు కాంగ్రెస్ నాయకులేనని విమర్శించారు. ఈటల మంత్రి కాగానే పౌరసరఫరాలశాఖలో ప్రక్షాళన చేపట్టి అక్రమార్కుల ఆట కట్టించడానికి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారని, పీడీ యాక్ట్ కింద కేసులు పెట్టారని తెలిపారు. గిరిజనులకు, మైనార్టీలకు రిజర్వేషన్లు పెంచడానికి టీఆర్‌ఎస్ చిత్తశుద్ధితో కృషి చేస్తుంటే, వారికి రిజర్వేషన్లు వద్దనడం దుర్మార్గ రాజకీయాలకు పరాకాష్ఠ అని విమర్శించారు. బీసీలకు మేలు చేసే అనేక కార్యక్రమాలను ప్రకటించిన సీఎం కేసీఆర్‌కు బీసీలంతా రుణపడి ఉంటారని చెప్పారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 2014లోనే సచ్చిపోయిన కళేబరమని ధ్వజమెత్తారు. ఆ కళేబరాన్ని ఇప్పటి వరకు గాంధీభవన్ ఫ్రిజ్‌లో భద్రపర్చి.. బస్సుయాత్ర ద్వారా గురువారం హుజూరాబాద్‌కు చేర్చి తగులబెట్టి తిరిగి గాంధీభవన్‌కు చేరుకున్నారని ఎద్దేవాచేశారు. మంత్రి ఈటల రాజేందర్ వ్యక్తిత్వమేమిటో తెలంగాణ ప్రజలందరికీ తెలుసునన్నారు. రేవంత్ ఉద్యమ దొంగ అని, టీడీపీలో ఉన్నప్పుడు ఓటుకు నోటు దొంగ అని విమర్శించారు.



టీఆర్‌ఎస్‌ఎల్పీలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ఉనికి కోసమే కాంగ్రెస్ యాత్ర

ఆ పార్టీని ప్రజలు నమ్మేస్థితిలో లేరు: ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్ నాయకులు ఉనికి కోసమే బస్సుయాత్ర చేపట్టారని రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు విమర్శించారు. ఆ యాత్రకు అర్థమే లేదని, ఇంకా తమ పార్టీ పోటీలో ఉందని చెప్పుకునేందుకే యాత్ర నిర్వహిస్తున్నారన్నారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీలేదని, అందుకే టీఆర్‌ఎస్‌కు ప్రజలు అధికారం కట్టబెట్టారని చెప్పారు. 2019లోనూ రాష్ట్రంలో టీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని, కేంద్రంలో కేసీఆర్ నేతృత్వంలో మూడో కూటమి ఏర్పడటం ఖాయమని కెప్టెన్ విశ్వాసం వ్యక్తం చేశారు. రైతులకు భరోసానిచ్చేలా కేసీఆర్ పాలన ఉందని అన్నారు. ఓటుకు నోటు కేసులో రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన దొంగ రేవంత్‌రెడ్డికి సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లను విమర్శించే అర్హత లేదన్నారు.

వ్యవసాయ వర్సిటీ 'రైతు కోటా'లో స్వల్ప మార్పు

■ మూడు ఎకరాల నిబంధనను ఎకరాకు కుదిస్తూ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సుల్లో రైతు కోటాలో ప్రవేశాలు పొందే విద్యార్థుల నిబంధనల్లో స్వల్ప మార్పుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గతంలో రైతు కోటాలో (40 శాతం సీట్లను రైతు కోటాలో నింపుతారు) సీటు పొందాలంటే సదరు విద్యార్థి పేరుమీద లేదా వారి తల్లిదండ్రుల పేరుపై కనీసం 3 ఎకరాలకు తగ్గకుండా వ్యవసాయభూమితోపాటు గ్రామీణ ప్రాంతాల్లో కనీసం నాలుగేండ్లు పాఠశాల విద్య చదివి ఉండాలి. మూడెకరాల భూమిని అర ఎకరాకు తగ్గించాలని వర్సిటీ అకాడమీ కౌన్సిల్ పంపిన ప్రతిపాదనను పరిశీలించిన ప్రభుత్వం దానికి ఎకరాగా మార్చింది. ఈ మేరకు వ్యవసాయశాఖ కార్యదర్శి సీ పార్థసారథి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

విదేశీభవన్‌కు రెండెకరాల స్థలం కేటాయింపు

■ ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లో విదేశీభవన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు ఎకరాల భూమిని కేటాయించింది. హైటెక్‌సిటీకి దగ్గరలోని మాదాపూర్‌లో ఈ భూమిని విదేశీవ్యవహారాల మంత్రిత్వ శాఖకు అప్పగించనున్నది. గజానికి రూ.30 వేల చొప్పున ధర నిర్ణయిస్తూ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.



ఒక రాష్ట్రానికి ప్రత్యేకంగా జెండా ఉండకూడదని రాజ్యాంగంలో ఎక్కడా లేదు. దక్షిణాది రాష్ట్రాల్లో కన్నడిగుల కీర్తి ప్రతిష్ఠలు చాటేవిధంగా ఓ ప్రత్యేక జెండాను రూపొందించుకున్నందుకు గర్వంగా ఉన్నది. పసుపు, తెలుపు, ఎరుపు రంగులతో రూపుదిద్దుకున్న జెండాలో చారిత్రక 'గండబేరుండ' చిహ్నంగా ఉంటుంది.

సిద్ధరామయ్య, కర్ణాటక ముఖ్యమంత్రి

మహారాష్ట్రలో ఫడ్నవీస్ ప్రభుత్వం ప్రజలను కులాలవారీగా విభజించి వైరం పెంచాలని చూస్తున్నది. భీమా-కోరేగాంలో ఆరేడువందల మంది రాళ్లతో దాడి చేస్తున్నా పోలీసులు చూస్తూ ఊరుకోవటం స్టేట్ టెర్రరిజమే. లెనిన్, పెరియార్ విగ్రహాల విధ్వంసం కూడా దళిత వర్గాలపై దాడికి సంకేతమే.

శరద్ రాన్పిసె, కాంగ్రెస్ ఎమ్మెల్సీ, మహారాష్ట్ర




చరిత్రలో నేడు



1801

బ్రిటన్‌లో మొదటిసారి అధికారికంగా జనాభా గణన. సుమారుగా పది మిలియన్ల జనాభా.

1945



జపాన్ టోక్యో నగరంపై బి-29 బాంబుల దాడి. లక్షమందికి పైగా మృతి.



1959

చైనా దురాక్రమణకు వ్యతిరేకంగా టిబెట్ లాసాలో నిరసనోద్యమం.

గత కొంతకాలంగా ఉత్తరకొరియా-అమెరికా మధ్య తలెత్తిన ఉద్రిక్తతలు సడలిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఉద్రిక్తతలు తగ్గించి శాంతి చర్చల కోసం దక్షిణకొరియా ప్రతినిధి బృందం ఉత్తర కొరియాకు చేరుకోవడం ఆహ్వానించదగిన పరిణామం. ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా అధికారం చేపట్టిన నాటినుంచి ఇరు దేశాల మధ్య ఆధిపత్య పోరు నడుస్తున్నది. దక్షిణ కొరియా అధ్యక్షుడిగా మున్ జో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి స్నేహహస్తం చాస్తున్నారు. కిమ్ జోన్ ఉన్, మున్ జోల మధ్య శాంతి చర్చలు జరిగి క్షిపణి పరీక్షలు నిలిచిపోతే ఆ ప్రాంతంలో శాంతి నెలకొంటుంది.

ది హిందూ

ఆర్కిటెక్చర్‌లో అత్యున్నత పురస్కారం ప్రిట్జ్‌కర్ ప్రైజ్ బాలకృష్ణ విఠల్ దాస్ దోషికి రావటం భారతీ నిర్మాణ సంస్కృతికి గొప్పగౌరవం దక్కినట్లయింది. 1947లో ఆర్కిటెక్చర్ చదివిన దోషి ఆధునిక నిర్మాణ రంగానికి ఆద్యులుగా ఖ్యాతిగాంచారు. అనేక దశాబ్దాలుగా నిర్మాణరంగానికి ఆధునికతను జోడించి స్థానిక, సంస్కృతుల మేళవింపులను అద్దటంలో సిద్ధహస్తులు. తక్కువ ఖర్చుతో పర్యావరణ అనుకూల పదార్థాలతో వస్తువులతో నిర్మాణరంగానికి దోషి చేసిన సేవలు ప్రధానమైనవి. స్వాతంత్ర్య పూర్వకాలం నుంచి నేటిదాకా నిర్మాణరంగంలో ఆమె చేసిన కృషి అద్వితీయం.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

వ్యక్తి స్వేచ్ఛకు పట్టం

వ్యక్తిగత అంశాలలోకి చట్టం చొరబడకూడదనేది హదియా కేసులో సుప్రీంకోర్టు తీర్పుతో మరోసారి స్పష్టమైంది. ఇద్దరు యుక్త వయస్కులు ఇష్టపడి వివాహం చేసుకుంటే, అడ్డుకునే అధికారం ఎవరికీ ఉండదని హదియా కేసులో సుప్రీంకోర్టు గురువారం చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. హదియా వివాహం చెల్లదంటూ కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు రద్దు చేసింది. హదియా భవిష్యత్తులో చట్టం ప్రకారం తనకు నచ్చిన రీతిలో నడుచుకోవచ్చునని ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, ఇతర న్యాయమూర్తులు ఎ.ఎం.ఖన్విల్కర్, డి.వై.చంద్రచూడ్‌తో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. హైకోర్టు హదియా వివాహాన్ని రద్దు చేయకపోవలసిందని కూడా వ్యాఖ్యానించింది. వివాహం, బహుళత్వం అనేవి మన సంస్కృతికి ప్రాథమిక మూలమనీ, దేశంలోని బహుళత్వాన్ని దీక్షతో కాపాడాలని జస్టిస్ చంద్రచూడ్ తీర్పులో పేర్కొన్నారు. వివాహ విషయంలోకి చట్టం చొరబడితే, పౌరుడి వ్యక్తిగత ఇష్టాలలో రాజ్యం జోక్యం చేసుకున్నట్టవుతుందని ఆయన వివరించారు. యుక్తవయసు వచ్చిన వారు తమకు నచ్చినవారిని వివాహమాడితే రాజ్యమే కాదు, తల్లిదండ్రులు కూడా పెత్తనం చేయకూడదని ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా స్పష్టం చేశారు. అయితే ఈ వివాహం వెనుక ఒక ముఠా పనిచేస్తున్నదనే ఆరోపణలపై జాతీయ దర్యాప్తు బృందం(ఎన్ఐఏ) తన దర్యాప్తును కొనసాగించవచ్చునని న్యాయస్థానం అనుమతించింది. 'యుక్తవయసు యువతి రాజ్యాంగ హక్కులకు భంగం కలిగించడానికి మీరు (ఎన్ఐఏ) , నేను లేము. మీ దర్యాప్తు సాగించుకోవచ్చు. కానీ వివాహం జోలికి వెళ్ళవద్దు. ఏదైనా దర్యాప్తు చేయండి కానీ వివాహ విషయంపై కాదు' అని ప్రధాన న్యాయమూర్తి స్పష్టం చేశారు.

> **కుమార్తె ఇల్లు విడిచివెళ్లి వివాహం చేసుకుంటే తల్లిదండ్రులు యువకుడిపై అపహరణ కేసు పెడుతుంటారు. తల్లిదండ్రులు ప్రాబల్యం గలవారైతే, బెదిరింపులకు దిగడం సాధారణం. ఇటువంటి సందర్భాలలో యువతీ యువకులకు భద్రత కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. తల్లిదండ్రులు లేదా ప్రభుత్వం వెంటాడవచ్చుననే భయం దంపతులకు ఉండకూడదు. యుక్తవయసు వచ్చిన యువతీయువకులకు తాము ఎవరిని వివాహమాడాలనే స్వేచ్ఛ ఉంటుందనే స్పృహ సమాజానికి, తల్లిదండ్రులకు కల్పించాలె.**

ఒక యువతి తల్లిదండ్రుల అభిమతానికి విరుద్ధంగా మతం మార్చుకుని తనకు నచ్చిన వ్యక్తిని వివాహమాడటం ఈ మొత్తం వివాదానికి కారణం. కేరళకు చెందిన అఖిల అనే యువతి ఇల్లు విడిచివెళ్ళి ఇస్లాంలోకి మారి, హదియాగా పేరు మార్చుకుని ముస్లిం వ్యక్తిని వివాహమాడింది. ఆమె ఇల్లు విడిచిపోయిన నేపథ్యంలో, కుమార్తె కనిపించడం లేదంటూ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన కుమార్తె మనసు మార్చి, బలవంతంగా వివాహం చేశారని ఆయన ఆరోపించారు. కానీ హదియా మాత్రం బుద్ధిపూర్వకంగానే ఈ నిర్ణయాలు తీసుకున్నానని వెల్లడించింది. కేరళ హైకోర్టు ఈ వివాహాన్ని రద్దు చేయడమే కాకుండా, యువతి స్వేచ్ఛకు భంగం కలిగే విధంగా వివాదాస్పద వ్యాఖ్యలు చేసింది. 24 ఏండ్ల అమ్మాయి బలహీనంగా సున్నితంగా ఉంటుందనీ, ఎన్నో విధాలుగా ఆమెను లోబరుచుకోవచ్చునని, ఆమె పెండ్లికి జీవితంలో ఎంతో ప్రాధాన్యం ఉన్నది కనుక, తల్లిదండ్రుల ప్రమేయంతో జరుగాలని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఈ విధంగా హైకోర్టు వివాహాన్ని రద్దుచేయడం సరికాదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. యుక్తవయసు యువతిగా, తన భర్త ఎవరనేది నిర్ణయించుకునే హక్కు ఆమెకు ఉన్నదని పేర్కొన్నది. యువతి భర్త కానీ, ఆయనకు సంబంధించి న వారు కానీ నేరస్థులైతే, వారిపై ఆయా చట్టాల ప్రకారం దర్యాప్తు జరపవచ్చు. కానీ వివాహం అనేది వారి వ్యక్తిగత అంశం. వివాహం ఇరువురి ఇష్టం మీద ఆధారపడి ఉంటుంది. యువతి ని వివాహం చేసుకున్న వ్యక్తి మంచి వాడా చెడ్డవాడా? ఆమె నిర్ణయం సరైనదేనా? అనేది చట్టానికి సంబంధించిన అంశం కాదు.కాని హైకోర్టు హదియా వివాహాన్ని రద్దు చేయడమే కాకుండా ఆమెను తల్లిదండ్రులకు అప్పగించింది. దీంతో బలవంతంగా తల్లిదండ్రుల ఇంట గడుపవలసి వచ్చింది. మనసు మార్చుకోవాలంటూ తల్లిదండ్రుల తెస్తున్న ఒత్తిడిని భరిస్తూ గడిపింది. సుప్రీంకోర్టు ముందుకు ఈ కేసు రాగానే మొదట ఆమెను తల్లిదండ్రుల ఇంటినుంచి ఆమె చదువుతున్న కళాశాల హాస్టల్‌కు మకాం మార్పించింది. ఇప్పుడు ఆమె ఇష్టానుసారం బతకవచ్చునని తేల్చడంతో హదియాకు భర్త దగ్గరికి వెళ్ళే అవకాశం కలిగింది.

భారతీయ సమాజం వైవిధ్యభరితమైంది. వ్యక్తులకు కులమతాలతో నిమిత్తం లేకుండా ఇష్టం వచ్చిన వారిని వివాహమాడే హక్కు ఉన్నది. కానీ కుటుంబం నుంచి ఆధిపత్యవర్గాల నుంచి వారి వివాహానికి అవరోధాలు ఎదురుకావడం సాధారణం. ఈ నేపథ్యంలో యువతీయువకుల ఇష్టాన్ని గౌరవించే రీతిలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రాధాన్యం సంతరించుకున్నది. ఒక్కోసారి ఒకే సామాజికవర్గం వారయినప్పటికీ వారి వివాహానికి తల్లిదండ్రుల నుంచి అవరోధాలు ఎదురవుతుంటాయి. పిల్లలు తమ ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా పెద్దలు చెప్పిన పెండ్లి చేసుకోవలసి వస్తుంది. ప్రత్యేకించి కుమార్తెలకు తమ వివాహంపై నిర్ణయాధికారం ఇవ్వరు. కుమార్తె ఇల్లు విడిచివెళ్లి వివాహం చేసుకుంటే తల్లిదండ్రులు యువకుడిపై అపహరణ కేసు పెడుతుంటారు. తల్లిదండ్రులు ప్రాబల్యం గలవారైతే, బెదిరింపులకు దిగడం సాధారణం. ఇటువంటి సందర్భాలలో యువతీయువకులకు భద్రత కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. తల్లిదండ్రులు లేదా ప్రభుత్వం వెంటాడవచ్చుననే భయం దంపతులకు ఉండకూడదు. యుక్తవయసు వచ్చిన యువతీయువకులకు తాము ఎవరిని వివాహమాడాలనే స్వేచ్ఛ ఉంటుందనే స్పృహ సమాజానికి, తల్లిదండ్రులకు కల్పించాలె.

జనగళం

అసహన రాజకీయాలు!

దేశంలో పలు ప్రాంతాల్లో లెనిన్, మావో, అంబేద్కర్ విగ్రహాలను ధ్వంసం చేయడం హేయనీయం. ఇది బీజేపీ, ఆరెస్సెస్ కార్యకర్తల పనే అనటంలో సందేహం లేదు. ఎందుకంటే ఒక కేంద్ర మంత్రి విదేశీయుల విగ్రహాలు మన దేశంలో ఎందుకంటూ ప్రశ్నించటమే ఉదాహరణ. త్రిపురలో బీజేపీ అధికారం చేజిక్కించుకున్నదో లేదో విగ్రహాల కూల్చివేత పని దేశవ్యాప్తంగా చేపట్టింది. ఇదిలా ఉంటే అమిత్ షా విగ్రహాల కూల్చివేతతో తమకు సంబంధం లేదని చేతులు దులుపుకోవడం శోచనీయం. ఇకనైనా బీజేపీ నేతలు అసహన రాజకీయాలను వీడనాడాలి. మతవర్గ వైషమ్యాలను పెంచరాదు.

- తోట సుమన్, మల్లాపూర్, జన్నారం

చలివేంద్రాలను ఏర్పాటు చేయాలె

ఈ సంవత్సరం మార్చిలోనే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నీటి కొరత పొంచి ఉన్నది. గ్రామాల్లో, పట్టణాల్లోనూ బాటసారులు దాహార్తితో తల్లడిల్లుతున్నారు. దీంతో వడదెబ్బ తాకే అవకాశం ఉన్నది. కాబట్టి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అన్ని ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటుచేసి ప్రజలకు చల్లని నీరును అందించాలి. తద్వారా వారిని ఎండవేడిమి, వడదెబ్బ నుంచి రక్షించినవారవుతారు.

- ఎస్.శ్రీనివాసరాజు, వనస్థలిపురం, హైదరాబాద్

ఆరోగ్యశ్రీ అన్నింటికి వర్తించాలి

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఆరోగ్యశ్రీ పథకం అమలు చేస్తున్నప్పటికీ అన్నిరకాల వ్యాధులు ఈ పథకం కిందికి రావటంలేదు. దీంతో ఎంతో మంది పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి ప్రభుత్వం చొరవ తీసుకొని అన్నిరకాల వ్యాధులకు ఆరోగ్యశ్రీ వర్తించేలా చర్యలు తీసుకోవాలి.

- పి.సంపత్ కుమార్, రాములపల్లె, జగిత్యాల జిల్లా

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

ముక్తసరి



దేవులపల్లి ప్రభాకరరావు

యధా యధాహి ధర్మస్య...

'యధా యధాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత, అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్, పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతామ్, ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే!..' అధర్మాన్ని అంతం చేసి ఈ అవని పై ధర్మ సంస్థాపన చేయడానికి అవసరమైనప్పుడు అవతరిస్తానని శ్రీకృష్ణ భగవానుడు అభయహస్తమిచ్చింది, సంశయం, సంకోచం, బం ధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం లేకుండా విధి నిర్వహించాలని స్ఫూర్తినిచ్చింది, ప్రేరణ కల్గించింది, దివ్య ప్రబోధం చేసింది, దిశానిర్దేశం కావించింది ఒక యుద్ధరంగంలో, అక్షౌహిణుల ఇరుపక్షాల సైన్యాలు ఎదురెదురుగా నిలిచి రక్తపాతానికి సిద్ధమైన రణక్షేత్రంలో-మునులు ముక్కులు మూసుకుని నిర్విరామ తపస్సులో మునకలయ్యే నైమిశారణ్యంలో కాదు.

అరాజకత్వం, అసహనం, అన్యాయాలు, అక్రమాలు, అధికార దుర్వినియోగం హద్దులుదాటి, అధర్మం వికటాట్టహాసం చేస్తున్నప్పుడు గీతాచార్యుని ఈ ప్రబోధం ఆవశ్యకమవుతుంది. ధర్మ సంస్థాపనార్థం పురుషోత్తముడు ఎక్కడ, ఏవేళ, ఎవరి రూపంలో అవతరిస్తాడో ఊహించలేం. ఆయన ఎవరిని ఆవహించి ధర్మరక్షణ కోసం విధి నిర్వహణ చేయిస్తాడో చెప్పలేం. అరువై ఏండ్ల అన్యుల దుష్టపాలనలో అన్యాయాలు, అక్రమాలు, అవమానాలు విపరీతంగా విజృంభించి, ధర్మాన్ని అధర్మం తనదే పైచేయి అని వెక్కిరిస్తున్నప్పుడు, తెలంగాణ ప్రజలు ఇక తమకు దిక్కెవరని దీనాలాపన చేస్తున్నప్పుడు ధర్మ రక్షణకు నేనున్నానని శంఖం పూరించింది కేసీఆర్; సమయజ్ఞత, విజ్ఞత, సమరశీలత ఆయన ప్రత్యేకతలు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, త్యాగఫలంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం బహుముఖ అభ్యుదయ పథంలో అపూర్వ ప్రగతియాత్ర ప్రారంభించిన తర్వాత నాలుగేండ్లకు డెబ్బై ఏండ్ల స్వతంత్ర భారతదేశం సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా, పరిపాలనాపరంగా, సాంస్కృతికంగా అత్యంత క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటూ, దేశం ముక్కచెక్కలయ్యే ఘోర ప్రమాదం భయంకరంగా కనిపిస్తున్నప్పుడు గుణాత్మకమైన పరివర్తనకోసం, అధర్మాన్ని ఖండించి ధర్మాన్ని రక్షించడానికోసం ప్రత్యామ్నాయశక్తిగా నేనున్నానని శంఖారావం వినిపించి దేశ ప్రజలకు ధైర్యం కలిగించింది, భవిష్యత్తు అంధకార బంధురం కాదన్న ఆత్మవిశ్వాసం కల్గించింది కేసీఆరే. అప్పుడు అది (తెలంగాణ రాష్ట్ర సాధన) సాధ్యమా అని శంకించిన, ఇప్పుడు ఇది సాధ్యమా అని నివ్వెరపోతున్న సందేహ జీవులున్నారు. సందేహ జీవులు నిబిడాశ్చర్యంతో విస్మయం చెందకతప్పదు. ఈశాన్య భారతంలో, మూడు రాష్ట్రాల్లో (త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్) కేంద్రంలోని పాలక కూటమి ప్రధాన పక్షం బీజేపీ అండదండలతో, బీజేపీ భాగస్వామ్యంతో అక్కడి ప్రాంతీయ కూటములు శాసనసభల ఎన్నికల్లో విజయం సాధిస్తున్న వార్తలు మీడియాను ముంచేస్తున్న సమయంలో హైదరాబాద్‌లో కేసీఆర్ శంఖారావం వినిపించింది. మరోవంక లండన్‌లో, బ్రిటిష్ పార్లమెంట్‌లో పాలకపక్షానికి చెందిన ఒక ప్రముఖ సభ్యుడు భారతదేశంలో అల్పసంఖ్యాక వర్గాలకు రక్షణలేదని, అసహనం తీవ్రస్వరూపం ధరిస్తున్నదని విమర్శించారు. వరుసగా 25 ఏండ్ల నుంచి, అంతకుముందు ఓ పదేండ్లు త్రిపుర సీపీఐ (ఎం) పాలనలో ఉన్నది. మొన్నటి ఎన్నికల్లో ప్రధాని మోదీజీ వేలాది ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తలను, బీజేపీ నాయకులను, ముఖ్యమంత్రులందరినీ రంగంలోనికి తెచ్చి ఊరూరా ఉధృత ప్రచారం జరిపినా, స్థానిక ఆదివాసీ తెగలను విపరీతంగా రెచ్చగొట్టినా ఫలితం శూన్యమనే చెప్పాలె. కానీ, శూన్యంలో నుంచి శిఖరం ఎక్కామని మోదీజీ అమితానందం వ్యక్తపరిచారు-ఎప్పుడూ సున్న మార్కులొచ్చే విద్యార్థి పది మార్కులొస్తే సంతోషపడినట్లు. త్రిపురలో మొన్నటి పోలైన మొత్తం ఓట్లలో బీజేపీ + స్థానిక ట్రైబల్ కూటమికి వచ్చిన ఓట్లు కేవలం సగమే- ఇది అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ గెలుపు మాదిరి గెలుపు. సీట్లు రాకపోయినా సీపీఐ (ఎం)కు సగంమంది ఓటర్ల మద్దతు లభించింది. ప్రపోర్షనల్ రిప్రజెంటేషన్ సిస్టం ఉంటే ఈ రోజు త్రిపురలో బీజేపీ కూటమి గద్దె ఎక్కేది కాదు, నాలుగేండ్ల కిందట మోదీ జీ 31 శాతం ఓట్లతో గద్దె ఎక్కలేకపోయేవాడు!

త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ మూడు రాష్ట్రాల్లోని మొత్తం జనాభా 88 లక్షలు. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ జనాభా ఈ మూడు రాష్ట్రాల మొత్తం జనాభా కంటే ఎక్కువ. త్రిపుర జనాభా 36 లక్షలే. త్రిపురలో తమది సైద్ధాంతిక విజయమని ప్రధాని మోదీజీ తమ పార్లమెంట్ సభ్యుల చప్పట్ల మధ్య ప్రకటించారు. ఈ మూడు రాష్ట్రాల ఎన్నికల సభల్లో, అంతకుముందు మోదీజీ, బీజేపీ నాయకులు, సంఘ్ చాలకులు తమ సిద్ధాంతాల గురించి చెప్పారా? ఈ దేశం హిందువులదని, ఈ దేశంలో ఉంటున్నవారందరూ హిందువులనీ, నాలుగేండ్ల కిందట ఈ దేశంలో హిందు రాజ్యం వచ్చిందని (మోహన్ భగవత్‌జీ పదేపదే అంటున్న మాటలను), గో మాతను పూజించాలని, గో మాంసం (బీఫ్) తిన్నా, ఇండ్లలో పెట్టుకున్నా చంపేస్తామని (యూపీ, తదితర బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వలె), 'ఘర్ వాపసి' తమ నినాదమని, ముస్లిం, క్రిస్టియన్ మతాల్లోకి వెళ్లినవాళ్లు తిరిగి హిందువులుగా మారాలని, మతం మార్పిడుల, మతాంతర వివాహాల, జనవరి 1, వాలంటైన్ డే ఉత్సవాల వంటివి తమకు అసలే గిట్టవని, భారత్ సెక్యులర్ రాజ్యాంగాన్ని మార్చడానికే తాము అధికారంలోకి వచ్చామని, మదర్ థెరెసా వంటివారు కేవలం క్రిస్టియన్ ప్రచారకులని, విదేశీ ఏజెంట్లను, ఈ దేశంలో విదేశీయుల విగ్రహాలను పెట్టరాదని మోదీజీ, భగవత్‌జీ తదితర బీజేపీ, సంఘ్‌నేతలు త్రిపురలో, మేఘాలయలో, నాగాలాండ్‌లో (ఈ రాష్ట్రంలో ఎనభై శాతం మంది క్రిస్టియన్‌లు, ఈశాన్య ఎనిమిది రాష్ట్రాల్లో క్రిస్టియన్‌లు, ముస్లింలు, ముఖ్యంగా క్రిస్టియన్‌లు ప్రాబల్యం వహిస్తున్నారు) ఎన్నికల ప్రచారంలో, అంతకుముందు చెప్పలేదు. చెప్పితే ఈ ఫలితాలు, ఈ అయ్యల పరిస్థితి భిన్నంగా ఉండేవి. తమ సిద్ధాంతాల సంగతి చెప్పనిదే ఇది తమ సిద్ధాంతాల విజయమని ప్రధాని మోదీ జీ అనడం అసత్యానికి పరాకాష్ఠ. నాగాలాండ్‌లో ఎన్నికలముందు బీజేపీ రెండు ట్రైబల్ కూటములతో చేయి కలిపింది, ఏ కూటమికి ఎక్కువ సీట్లు వస్తే ఆ కూటమితో చేయి కలుపవచ్చని. బీజేపీ అదే పనిచేసింది. ఎక్కువ సీట్లు వచ్చిన కూటమితో చేయికలిపి అందలమెక్కింది. రెండో కూటమిని తుంగలోతొక్కింది. అన్నింటికంటే ఎక్కువ స్థానాలు గెలిచిన పార్టీ నాయకుడిని ప్రభుత్వం ఏర్పాటుకు ముందు పిలువాలన్న సంప్రదాయానికి మేఘాలయ గవర్నర్ (పూర్వాశ్రమంలో బీజేపీ నేత) కండ్లు మూసుకొని తిలోదకాలిచ్చారు. ఈ మూడు రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడటానికి ముగ్గురు గవర్నర్లు తమ వంతు పాత్రను బిడియం లేకుండా నిర్వర్తించి అధిష్ఠానం పట్ల తమ అచంచల విధేయతను చాటుకున్నారు. త్రిపుర గవర్నర్ మూడడుగులు ముందుకువెళ్లి భవదీయుణ్ణి, పరమ విధేయుడినని నిరూపించుకున్నాడు. నిన్నటి ప్రభుత్వం విగ్రహాలను పెట్టింది గనుక ఇప్పుడొచ్చిన ప్రభుత్వం ఆ విగ్రహాలను కూల్చేయడంలో తప్పులేదన్నారు. కొత్త ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోకముందే త్రిపురలో లెనిన్ విగ్రహాన్ని ధ్వంసంచేశారు. 1931లో గాంధీజీ ఫ్రాన్స్‌లో ప్రపంచ ప్రఖ్యాత తత్త్వవేత్త, మేధావి రోమరోలా వద్ద ఐదు రోజులు ఉన్నప్పుడు ఆయన (రోమరోలా) గాంధీజీతో అన్న మాటలు... 'Lenin, like you, never compromised with truth.' భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ అన్నారు.. 'The greatest modern exponent of Marxism has been Lenin. Not only did he expound it and explain it, but he lived up to it. And yet he has warned us not to consider Marxism as a do -gma...' మోదీ ప్రభుత్వ దేశ వ్యవహార శాఖలో ఒక సహాయ మంత్రి ఈ దేశంలో విదేశీయుల విగ్రహాలు ఉండరాదంటాడు. లండన్‌లో ఉన్న గాంధీజీ విగ్రహం, షికాగో (యూఎస్ఏ)లో ఉన్న స్వామి వివేకానంద విగ్రహం సంగతేమిటి? ఆఫ్ఘనిస్థాన్‌లో మతోన్మాద తాలిబన్లు బౌద్ధ శిల్పాలను ధ్వంసం చేసినప్పుడు ముక్కుమీద వేలు వేసుకొని మూర్ఛిల్లిన వాళ్లు ఇక్కడి మతోన్మాదులు, మూర్ఖుల గురించి ఏమంటారు? ఈ దేశం నుంచి విడిపోయి విశాల నాగాలాండ్ ఏర్పాటుచేయాలని కోరే ముఠాలు -ఫిజోబాటలో నడిచేవి-ఈశాన్య భారతంలో, ముఖ్యంగా ఇప్పటి నాగాలాండ్‌లో ఇంకా ఉన్నాయి. ఈ ముఠాల్లో ఒక దానితో 2015లో మోదీ జీ ప్రధానిగా ఒక ఒప్పందం చేసుకున్నారని వెల్లడైంది. ఆ ఒప్పందం వివరాలు ఇప్పటివరకు బహిర్గతం కాలేదు. నాలుగేండ్ల కిందట జమ్ముకశ్మీరులో ఆరెస్సెస్-బీజేపీ అడుగుపెట్టి, ముఫ్తీల పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీతో కలిసి ప్రభుత్వాలు ఏర్పాటుచేసిన తర్వాత పరిస్థితి విషమించింది. భారత సైనికులకు, స్థానిక ప్రజలకు మధ్య ఘర్షణలు జరుగని రోజు లేదు. జమ్ముకశ్మీరు కల్లోల పరిస్థితి నాగాలాండ్‌లో, ఇతర ఈశాన్య రాష్ట్రాల్లో ఉత్పన్నమైతే ఆశ్చర్యం లేదు.

గత నాలుగేండ్లలో కేంద్ర పాలకులు విజ్ఞతారహితంగా అమలు జరిపిన, ఇంకా అమలు జరుపుతున్న విధానాల వల్ల దేశంలో ఆర్థికవ్యవస్థ దెబ్బతిన్నది. ఆర్థికాభివృద్ధి సన్నగిల్లి నిరుద్యోగం తీవ్రస్వరూపం ధరించింది. నోట్ల రద్దుతో నల్లడబ్బు, అవినీతి, టెర్రరిజం అంతంకాలేదు గానీ కోట్లాది సామాన్య ప్రజలు ఇక్కట్ల పాలయ్యారు. బ్యాంకులకు బ్యాంకులనే కొందరు వర్తక ప్రముఖులు, పాలకులకు సన్నిహితులు విదేశాలకు ఎత్తుకుపోతున్నారు. సహకార ఫెడరలిజం కేవలం మాటల మూటగా మిగిలి రాష్ట్రాల ప్రతిపత్తి దెబ్బతింటున్నది. మతోన్మాదం జాతీయ సమైక్యతకు, దేశ భౌగోళిక సమగ్రతకు, ప్రజాస్వామ్యవ్యవస్థకు గొడ్డలి పెట్టుగా పరిణమిస్తున్నది. భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు అనతి కాలంలో సంభవించనున్న ప్రమాదం ఎటువంటిదో మొన్నటి మూడు రాష్ట్రాల ఎన్నికల్లో మచ్చుకు కనిపించింది. ఈ మధ్య సుప్రీంకోర్టులో, ప్రధాన న్యాయమూర్తి బెంచి ముందు వాదిస్తూ ఒక ప్రసిద్ధ న్యాయవాది 'One man is controlling the entire jud -iciary' అని అన్నాడు. ఉన్నత న్యాయవ్యవస్థనే ఒక వ్యక్తి శాసిస్తున్నాడంటే దేశం పరిస్థితి ఎంత దిగజారిందో, ఈ దుస్థితి నుంచి విముక్తి పొందడానికి కేసీఆర్ నాయకత్వాన గుణాత్మక పరివర్తన తెచ్చే ప్రత్యామ్నాయం ఎంత అవసరమో అర్థం చేసుకోవచ్చు.

> **గత నాలుగేండ్లలో కేంద్ర పాలకులు విజ్ఞతారహితంగా అమలు జరిపిన, ఇంకా అమలు జరుపుతున్న విధానాల వల్ల దేశంలో ఆర్థికవ్యవస్థ దెబ్బతిన్నది. ఆర్థికాభివృద్ధి సన్నగిల్లి నిరుద్యోగం తీవ్రస్వరూపం ధరించింది. నోట్ల రద్దుతో నల్లడబ్బు, అవినీతి, టెర్రరిజం అంతంకాలేదు గానీ కోట్లాది సామాన్య ప్రజలు ఇక్కట్ల పాలయ్యారు.**

రోగమొకటి.. మందొకటి!

వైద్య రంగం



డాక్టర్ వి.రవిశంకర్ ప్రజాపతి

ప్రభుత్వాలు చేసే ప్రజాకర్షక విధాన వాగ్దానాల హోరు, ప్రచార పటాటోపాలూ, రాజకీయ పార్టీల రణగొణధ్వనుల మధ్య ఎన్నో అతిముఖ్యమైన విషయాలు ఏవిధమైన చర్చకూ నోచుకోవటంలేదు. వాటి మంచిచెడులూ తెలిసిరావటం లేదు. రాత్రికిరాత్రి పిడుగులా వచ్చి జనంనెత్తిన పడిన పెద్దనోట్ల రద్దు లాంటివాటిని అటుంచితే, ప్రజాజీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) బిల్లుపై కూడా పెద్దగా చర్చ జరుగలే దు. దాని మంచిచెడుల గురించి సంబంధిత వర్గాల్లోకూడా చర్చ జరుగలే దు. దశాబ్దాలుగా అమల్లో ఉన్న ఎంసీఐ (మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండి యా) ఎందుకు పనికిరాకుండా పోయిందో, కాలం చెల్లినదిగా అయ్యిందో చెప్పలేదు. కేవలం ఎంసీఐ అవినీతిమయం అయిపోయిందన్న సాకుతో మొత్తంగా దాన్ని రద్దుచేస్తే, అవినీతి ఆరోపణలున్న వ్యవస్థలు, సంస్థలన్నింటినీ రద్దుచేస్తారా? ఏలికలే చెప్పాలి. చట్టసభల్లో అటు పార్లమెంటులోనూ, అసెంబ్లీల్లోనూ 35 శాతానికి పైగా ప్రజాప్రతినిధులపై తీవ్రమైన నేరారోపణలు, అవినీతి అక్రమాల కేసులున్నట్లు అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. పోటీచేసేవారు స్వయంగా ఎన్నికల సందర్భంలో ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్లలో తెలిపిన విషయాలపైన ఆధారపడి కూడా ప్రజాప్రతినిధులు ఎంతగా అవినీతిమయం అయిపోయారో తెలుస్తున్నది. కాబట్టి చట్టసభలను రద్దుచేస్తారా? నిజానికి ఎంసీఐని రద్దు చేయటానికి ప్రభుత్వం చెబుతున్న కారణం- చెట్టెందుకు ఎక్కినవంటే దూడ గడ్డికి అన్నచందంగా ఉన్నది.

దేశవ్యాప్తంగా వైద్యవృత్తి అవలంబిస్తున్నవారి ప్రాతినిధ్యంతో ఎంసీఐ ఉండేది. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రాతినిధ్యంతో ఆయా ప్రాంతాల వైద్యం, విద్యా అవసరాలు సమస్యలు ప్రస్తావనకు వచ్చేవి. ఎంసీఐ సభ్యుల్లో కొందరు అవినీతిపరులు ఉన్నారని మొత్తం వ్యవస్థనే రద్దుచేస్తామనే కేంద్ర ప్రభుత్వ ఆలోచన ఎలుకలున్నాయని ఇల్లు తుగలబె ట్టుకున్నట్లు ఉన్నది. మొత్తం మీద కేంద్ర ప్రభుత్వం ఎంసీఐని రద్దుచేసి దానిస్థానే నేషనల్ మెడికల్ కౌన్సిల్‌ను తేదల్చుకున్నది. క్యాబినెట్ సెక్రటరీ నేతృత్వంలోని సెర్చ్‌కమిటీ ఎన్ఎంసీ కౌన్సిల్ సభ్యులను ఎంపిక చేస్తుం ది. 25 మంది సభ్యులున్న కౌన్సిల్‌లో ఐదుగురు మాత్రమే వైద్యవృత్తికి సంబంధించిన వారుంటారు. మిగతావారంతా వైద్యం, వైద్య విద్యతో సంబంధం లేనివారే. దీనికితోడుగా ముగ్గురు సభ్యులుండే నాలుగు స్వయంప్రతిపత్తిగల బోర్డులు ఎన్ఎంసీకి సహాయంగా పనిచేస్తాయి. మొత్తంగాచూస్తే ఎన్ఎంసీ నిర్మాణం, రూపంలో ప్రజాస్వామ్య భాగస్వామ్యం లోపించి, కేంద్రప్రభుత్వ ఆధిపత్యం, అజమాయిషీ పెరుగుతున్నద ని తెలుస్తూనే ఉన్నది.

మెడికల్ కాలేజీల గుర్తింపు, సీట్ల అనుమతి, కొత్త కోర్సుల అనుమతి లాంటివాటిలో ప్రైవేటు యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తూ ఎంసీఐ అవినీతిమయమై పోయిందని కేంద్రం చెప్పుకొచ్చింది. కానీ ఎంసీఐని ప్రక్షాళనం చేసే పేరిట, కొత్తగా తీసుకొస్తున్న ఎన్ఎంసీలో ప్రైవేటుకు పెద్దపీట వేశారు. గతంలో కేవలం 15 శాతం సీట్లనే కాలేజీ యాజమాన్యాలు ఇష్టానుసారం అమ్ముకునే వీలుండేది. అదిప్పుడు 60 శాతానికి పెంచేశారు. అలాగే ఒకసారి అనుమతి పొందితే తిరిగి ఏటా రెన్యువల్ చేయించుకునే అవసరం లేదని, కొత్త కోర్సులు, సీట్ల సంఖ్యను పెంచుకోవటం కూడా ఎన్ఎంసీకి విశ్వాసం కలిగిస్తే చాలుననే విధంగా విధాన రూపకల్పన చేశారు. మరో ముఖ్యమైన సమస్య ఏమంటే.. వైద్య విద్య అయిపోయిన తర్వాత వృత్తి చేపట్టేందుకుగాను లైసెన్సియేట్ పరీక్ష అనేదాన్ని పెట్టి, దాంట్లో ఉత్తీర్ణులైన వారే వైద్య వృత్తి చేపట్టాలంటున్నారు. వైద్య విద్యలో భాగంగానే థియరీ, ప్రాక్టికల్స్ అన్నీ అవసరమైనంతగాచేసి, క్లినికల్ ప్రాక్టీస్‌కూడా అయిపోయి ఉత్తీర్ణులైన వారికి నీట్ తరహాలో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నాపత్రంతో వైద్య విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షిస్తామనటం అర్థరహితం.

ఎన్ఎంసీ ఏర్పాటులో ఇలాంటి మౌలిక సమస్యలు అనేకం ఉన్నాయి. ఎన్ఎంసీ ఏర్పాటుకు ప్రభుత్వం చెబుతున్నదానికి అనేక వైరు ధ్యాలున్నాయి. వీటన్నింటికితోడు అలోపతి వైద్యుల, ఆయుష్ వైద్యుల (ఆయుర్వేదిక్, హోమియోపతిక్) మధ్య వైరుధ్యం పెం చే పనికి కేంద్రం పూనుకున్నట్లు కనిపిస్తున్నది. ఆయుష్ కోర్సులు చేసిన వారు ఆరునెలలు బ్రిడ్జి కోర్స్ చేసి, అలోపతి వైద్యవిధానం ప్రాక్టీస్ చేయ వచ్చని కేంద్రం అంటున్నది. దీనికి గ్రామీణ ప్రాంతాలకు కూడా సరైన వైద్యం అందించేందుకు వైద్యుల లోటును భర్తీ చేస్తామని చెబుతున్నది. దీంతో అలోపతి డాక్టర్లు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శనలు చేశారు. దీనికిపోటీగా ఆయుష్ డాక్టర్లు కూడా ప్రభుత్వ నిర్ణయాన్ని ఆహ్వాని స్తూ ప్రదర్శనలు చేశారు. విభజించి పాలించు అంటే ఇదేనేమో. నిజానికి వైద్య విధానాల విషయానికి వస్తే ఏదీ గొప్పది కాదు, ఏదీ తక్కువదీ కాదు. శస్త్రచికిత్సలు, అత్యవసర సేవల్లో అల్లోపతి గొప్పదైతే, దీర్ఘకాల వ్యాధులకు అతి తక్కువ ఖర్చుతో సూక్ష్మరూప మందుతోనే నయంచేస్తున్న తీరు అద్భుతమైనది. వైద్యవిధానాల విషయంలో ప్రాచుర్యాలు, ప్రాధాన్యాలే కానీ, శాస్త్రీయ-అశాస్త్రీయ సమస్య కూడా కాదు. వైద్య విధానం అంతిమ లక్ష్యం అతితక్కువ ఖర్చుతో అతి మేలైన వైద్యం ఎలా అందజేయాలనేదిగా ఉండాలి.

ప్రపంచీకరణ విధానాలతో విద్య, వైద్యరంగాలు కూడా ప్రైవేటుపరం అయిపోయి వ్యాపారమయం అయ్యాయి. నాణ్యమైన వైద్యం సామాన్యునికి అందకుండాపోయింది. ప్రతి వ్యక్తీ తన సంపాదనలో సింహభాగం వైద్య ఖర్చులకే కేటాయిస్తున్న దుస్థితి ఉన్నది. ఎనభై శాతం వైద్యఖర్చులు వ్యక్తిగతంగా భరిస్తున్న స్థితి ఉన్నది. యూకే, కెనడాలాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో వందశాతం వైద్యఖర్చులు ప్రభుత్వాలే భరిస్తున్నాయి. నాణ్యమైన వైద్యాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చాయి. మన దేశంలో కూడా అందరికీ నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉన్నది. ఏటా వైద్యవిద్యను పూర్తిచేసి బయటికి వస్తున్న 60వేల మందిని నిరుద్యోగులుగా మిగల్చకుండా వైద్యరంగంలో నియామకాలు చేపట్టాలి. ఎప్పటికప్పుడు నియామకాలు చేపట్టకుండా ప్రజలకు వైద్యం అందాలన్న లక్ష్యం నెరవేరదు. అలాగే ప్రైమరీ హెల్త్ సెంటర్ల నుంచి ఏరియా దవాఖానలదాకా మౌలిక సదుపాయాల కల్పన చేయాలి. అలాగే ఆధునిక శాస్త్ర, సాంకేతికరంగాల అభివృద్ధిని ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులోకి తేవాలి. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం ఆశాజనకంగా వ్యవహరిస్తున్నది. వైద్యరంగంలో నియామకాలు చేపట్టి, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయటం ముదావహం.


(వ్యాసకర్త: ఐఎంఏ కార్యదర్శి, హైదరాబాద్)

> **ఎనభై శాతం వైద్యఖర్చులు వ్యక్తిగతంగా భరిస్తున్న స్థితి ఉన్నది. యూకే, కెనడాలాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో వందశాతం వైద్యఖర్చులు ప్రభుత్వాలే భరిస్తున్నాయి. నాణ్యమైన వైద్యాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చాయి. మన దేశంలో కూడా అందరికీ నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉన్నది. ఏటా వైద్యవిద్యను పూర్తిచేసి బయటికి వస్తున్న 60వేల మందిని నిరుద్యోగులుగా మిగల్చకుండా వైద్యరంగంలో నియామకాలు చేపట్టాలి.**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

తండ్రి పేరుతో సైనిక శిబిరం

ఆశ్చర్యపోయిన మహిళా లెఫ్టినెంట్ జనరల్



అరుణాచల్‌లో ఆశీష్ టాప్ సైనిక శిబిరం ఇదే

కోల్‌కతా: భారత సైన్యంలో లెఫ్టినెంట్ జనరల్‌గా ఎంపికైన ఓ యువతి తన తండ్రి పేరుతో ఓ సైనిక శిబిరం ఉన్నదన్న విషయం తెలుసుకుని తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఈ ఘటన అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగింది. ఆమెకు అరుణాచల్‌లోని టెంగాలో పోస్టింగ్ ఇచ్చారు. ప్రారంభ పర్యటనలో తవాంగ్ సెక్టార్‌లోని కైఫో సైనిక శిబిరానికి అధికారులు ఆమెను తీసుకెళ్లారు. ఆ సైనిక పోస్ట్ పేరు ఆశిష్ టాప్ అని ఉండటంతో ఆ పేరెలా వచ్చిందని ఆమె అధికారులను అడిగారు. ఆశిష్ ఎవరో తెలుసుకున్న ఆమె నోట మాట రాలేదు. ఆశిష్ ఆమె తండ్రి ఆశిష్ దాస్. అసోం రెజిమెంట్ నుంచి కర్నల్‌గా రిటైరయ్యారు. దీంతో సదరు యువతి తీవ్ర భావోద్వేగంతో కన్నీటి పర్యంతమయ్యారు. 'నా కుమార్తె ఈ విషయం తెలుసుకున్న వెంటనే ఆశిష్ టాప్ సైనిక పోస్ట్ నుంచి మా ఇంటికి ఫోన్ వచ్చింది. నా పేరుపై సైనిక శిబిరం ఉన్నదని తెలుసుకున్న మా అమ్మాయి ఎలా భావోద్వేగానికి గురై ఏడ్చిందో సైనికాధికారి నాకు వివరించారు. 1986లో మా యూనిట్‌ను ఆక్రమించిన చైనా దళాలను తరిమికొట్టి.. 14 వేల అడుగుల ఎత్తులో ఉన్న ఆ సైనిక శిబిరాన్ని మా ఆధీనంలోకి తెచ్చుకున్నాం. అప్పటికి నా కుమార్తె ఇంకా జన్మించలేదు. ఆ సైనిక శిబిరానికి నా పేరు పెట్టారని నాకు 2003లో తెలిసింది. కానీ ఆ విషయాన్ని నా కుమార్తెకు చెప్పే సందర్భమే రాలేదు' అని దాస్ తెలిపారు.

సూఫీ గాయకుడు ప్యారేలాల్ వడాలి కన్నుమూత



అమృత్‌సర్: ప్రముఖ సూఫీ గాయకుడు, దివంగత పూరణ్‌చంద్ వడాలి చిన్నతమ్ముడు ఉస్తాద్ ప్యారేలాల్ వడాలి(75) శుక్రవారం ఉదయం అమృత్‌సర్‌లో ఫోర్టిస్ ఎస్కార్ట్ దవాఖానలో గుండెపోటుతో మరణించారు. కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్యారేలాల్‌ను కుటుంబసభ్యులు గురువారం దవాఖానలో చేర్చారు. ప్యారేలాల్ స్వస్థలం గురుకి వాదలిలో శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు అంత్యక్రియలు నిర్వహించారు. పంజాబీ సూఫీ సంగీతంతో ప్యారేలాల్ సోదరులు ప్రఖ్యాతి గాంచారు. జలంధర్‌లోని హర్‌బల్లా ఆలయంలో మొదట వారు పాటలు పాడారు. గుర్బానీ, కాఫి, గజల్, భజన్ రీతుల్లో వారు పాడిన పాటలకు మంచి గుర్తింపు వచ్చింది.

మహారాష్ట్ర సర్కార్‌పై రైతుల కన్నెర్ర

- నాసిక్ నుంచి ముంబై వరకు 25 వేల మంది రైతుల పాదయాత్ర
- ఆలిండియా కిసాన్ సభ నేతృత్వంలో కొనసాగుతున్న 180 కి.మీ యాత్ర
- 12న మహారాష్ట్ర అసెంబ్లీ ఘెరావ్



నాసిక్‌లో ప్రారంభమైన రైతుల మహా పాదయాత్ర

నాసిక్: ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మహారాష్ట్రలో మహోద్యమం మొదలైంది. నాసిక్ నుంచి ముంబై వరకు 25 వేల మంది రైతులు మహాపాదయాత్ర చేపట్టారు. ఈనెల 12న వారు ముంబైకి చేరుకొని మహారాష్ట్ర అసెంబ్లీని ఘెరావ్ చేయనున్నారు. రైతు రుణాలు, విద్యుత్ బిల్లులు మాఫీచేయడం, స్వామినాథన్ సిఫారసులను అమలుచేయడం ఆలిండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) ఆధ్వర్యంలో చేపట్టిన మహాపాదయాత్ర ప్రధాన లక్ష్యం. 180 కిమీ మహా పాదయాత్ర నాసిక్‌లోని సీబీఎస్ చౌక్‌లో మంగళవారం మొదలైంది. ముంబై – ఆగ్రా జాతీయ రహదారి మీదుగా పాదయాత్ర కొనసాగుతున్నది. బుల్లెట్ రైళ్లు, సూపర్‌హైవేలు వంటి అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో పంట భూముల బలవంతపు స్వాధీనం రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయాలని ఏఐకేఎస్ కార్యదర్శి రాజు దేశ్‌లే డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. గతేడాది రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో రైతులతో రూ.34 వేల కోట్ల రైతు రుణాలను మాఫీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందిగానీ.. అమలుచేయలేదని విమర్శించారు.

ఇక మరణించేందుకూ హక్కు!

- పరోక్ష కారుణ్య మరణాన్ని అనుమతించవచ్చు
- ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న రోగికి వైద్య చికిత్సను తిరస్కరించే హక్కు
- సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు
- చట్టం రూపొందేవరకూ కోర్టు మార్గదర్శకాలను అమలు చేయాలని ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి 9:



ప్రాణాంతక రోగాలతో బాధపడుతున్న రోగి రాసిన 'సజీవ వీలునామా (లివింగ్ విల్)'ను పరిగణనలోకి తీసుకొని అతనికి/ఆమెకు పరోక్ష కారుణ్య మరణాన్ని ప్రసాదించవచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది. జీవించే హక్కులోనే గౌరవంగా, అనాయాసంగా మరణించే హక్కు కూడా దాగి ఉందని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం శుక్రవారం చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న రోగికి దీర్ఘకాలిక శారీర బాధను తప్పించుకొనేందుకు వైద్య చికిత్సను తిరస్కరించే హక్కు కూడా ఉంటుందని స్పష్టం చేసింది. ముందస్తుగా రాసిన వీలునామా, పరోక్ష కారుణ్య మరణం అనుమతించదగినవని తెలిపింది. ఆ వీలునామాను ఎవరు అమలు చేయాలి, పరోక్ష కారుణ్య మరణాన్ని మెడికల్ బోర్డు ఏ పరిస్థితుల్లో మంజూరు చేయాలి అన్న దానిపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ అంశంపై ఒక చట్టం రూపొందేవరకు కోర్టు జారీ చేసిన మార్గదర్శకాలు అమలులో ఉంటాయని స్పష్టం చేసింది. 'సజీవ వీలునామా'ను గుర్తించాలని కోరుతూ 'కామన్ కాజ్' అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. రోగి పరిస్థితి తీవ్ర విషమంగా ఉన్నప్పుడు, ప్రాణం నిలబెడుతున్న వ్యవస్థను తొలిగించే విషయంలో మెడికల్ బోర్డులు నిర్ణయం తీసుకునే ముందు కొన్ని మార్గదర్శకాలు ఉండాలని పేర్కొంది. పరోక్ష కారుణ్య మరణం అంశంపై ధర్మాసనంలోని నలుగురు జడ్జీలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారని, కానీ సజీవ వీలునామాను అనుమతించే విషయంలో మాత్రం ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశారని చీఫ్ జస్టిస్ దీపక్‌మిశ్రా చెప్పారు. ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడే రోగి పరోక్ష కారుణ్య మరణంపై వారి స్నేహితులు లేదా బంధువులు ముందస్తు సూచనలు ఇవ్వవచ్చని, వాటిని సంబంధిత మెడికల్ బోర్డు పరిశీలిస్తుందని ధర్మాసనం వివరించింది. ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి చికిత్సను తిరస్కరించే హక్కు ఉంటుందని కోర్టు అంగీకరించింది. 21వ శతాబ్దంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో రోగి మరణాన్ని కొన్ని నెలలు లేదా సంవత్సరాలు కూడా వాయిదా వేయవచ్చని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అటువంటి పరిస్థితుల్లో పూర్తి విచక్షణ జ్ఞానం ఉన్న రోగి దీర్ఘకాలం శారీరకంగా బాధపడకుండా విముక్తి పొందేందుకు శస్త్ర చికిత్స, ఔషధాలు లేదా మరే ఇతర చికిత్సనైనా తిరస్కరించవచ్చని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు.

వీనామాలో ఏ అంశాలు.. ఎలా అమలు..

సజీవ వీలునామాలో ఏ అంశాలుండాలి, దానిని ఎవరు (బంధువులు/స్నేహితులు), ఎలా అమలు చేయాలి, ఎవరు నమోదు చేయాలి, ఎక్కడ ఉంచాలి అన్న అంశాలపై సుప్రీం కోర్టు మార్గదర్శకాలు జారీచేసింది. అలాగే కారుణ్య మరణాన్ని ప్రసాదించేందుకు మెడికల్ బోర్డు నిరాకరించిన పక్షంలో ఏం చేయాలి? సజీవ వీలునామా రద్దయిన పరిస్థితుల్లో లేక అది చెల్లుబాటు కానప్పుడు ఏం చేయాలి అన్న దానిపై కూడా వివరణ ఇచ్చింది. అలాగే సజీవ వీలునామా లేని కేసుల్లో అనుసరించాల్సిన మార్గదర్శకాలను కూడా ఖరారు చేసింది.

> 'జీవితం అనే రంగుల హరివిల్లు వర్ణహీనమైనప్పుడు.. జీవితం స్తబ్ధంగా మారిపోయి ఘనీభవిస్తుంది. మానవ జీవిత పవిత్రత ధ్వంసమవుతుంది. అటువంటి వారికి సగౌరవంగా కన్నుమూసే అవకాశం ఇవ్వకూడదా? కొందరికి తమ చావు కూడా ఆ కొద్దిసేపు సంబురం కావచ్చు'
>
> -సుప్రీంకోర్టు ధర్మాసనం

చర్చను లేవనెత్తిన అరుణా శాన్‌బాగ్ కేసు



న్యూఢిల్లీ: పరోక్ష కారుణ్య మరణంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మూడేండ్ల క్రితం మృతిచెందిన అరుణాశాన్ బాగ్ కేసును గుర్తు చేసింది. ముంబైలోని కింగ్ ఎడ్వర్డ్ స్మారక దవాఖానలో నర్సుగా పనిచేస్తున్న 25 ఏండ్ల అరుణపై అక్కడే పనిచేస్తున్న ఓ వార్డు బాయ్ 1973లో లైంగిక దాడికి పాల్పడ్డాడు. కుక్కలను కట్టి ఉంచే గొలుసును ఆమె మెడకు చుట్టడంతో మెదడుకు ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయి ఆమె కోమాలోకి వెళ్లిపోయారు. 42 సంవత్సరాల పాటు అదే దవాఖానలోని ఒక వార్డులో ఉన్న అరుణ 2015, మే నెలలో మరణించారు. సుదీర్ఘకాలంగా కోమాలో ఉన్న అరుణా శాన్‌బాగ్‌కు కారుణ్య మరణాన్ని ప్రసాదించాలని కోరుతూ 2009లో పింకీ విరానీ అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రెండేండ్ల అనంతరం కోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. అయితే అరుణకు పరోక్ష కారుణ్య మరణాన్ని ప్రసాదించేందుకు అనుమతించిన కోర్టు, దానిని అమలు చేసే విషయాన్ని సదరు దవాఖాననే పరిశీలించాలని సూచించింది. ఈ సూచనను తిరస్కరించిన దవాఖాన సిబ్బంది, అరుణకు సహజ మరణం సంభవించే వరకూ సేవలందించారు. తమంతట తాముగా ఒక నిర్ణయం తీసుకోలేని స్థితిలో ఉన్న రోగులకు ప్రాణాధార వ్యవస్థను ఉపసంహరించేందుకు సుప్రీంకోర్టు నాడు అంగీకరించింది.

కారుణ్య మరణం.. కేసు క్రమం

11 మే 2005: పరోక్ష కారుణ్య మరణానికి అనుమతించాలన్న కామన్ కాజ్ (ఎన్జీవో) పిల్ స్వీకరణ

16 జనవరి 2006: కారుణ్య మరణంపై డాక్యుమెంట్లు సమర్పించేందుకు ఢిల్లీ మెడికల్ కౌన్సిల్‌కు ఆదేశం

28 ఏప్రిల్ 2006: కారుణ్య మరణంపై డ్రాఫ్ట్ బిల్లు తయారు చేయాలని లా కమిషన్‌కు సుప్రీం సూచన

7 మార్చి 2011: అరుణ శాన్‌బాగ్ కేసులో పరోక్ష కారుణ్య మరణానికి సుప్రీంకోర్టు అనుమతి

23 జనవరి 2014: చీఫ్ జస్టిస్ పీ సదాశివన్ ఆధ్వర్యంలో ముగ్గురు న్యాయమూర్తుల బెంచ్ విచారణ

25 ఫిబ్రవరి 2014: కారుణ్య మరణంపై దాఖలైన అన్ని పిటిషన్లను రాజ్యాంగ ధర్మాసనానికి సిఫారసు

15 జులై 2014: సుప్రీంకోర్టులో వాదనలు ప్రారంభం. సీనియర్ న్యాయవాదులను నియమించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు

15 ఫిబ్రవరి 2016: కారుణ్య మరణంపై చర్చిస్తున్నామని సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

11 అక్టోబర్ 2017: తీర్పును రిజర్వ్‌లో పెట్టిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం

9 మార్చి 2018: పరోక్ష కారుణ్య మరణాన్ని అనుమతించాలని చారిత్రాత్మక తీర్పునిచ్చిన సుప్రీంకోర్టు

సజీవ విల్లు.. కారుణ్య మరణం..

న్యూఢిల్లీ, మార్చి 9: పరోక్ష కారుణ్య మరణాలకు అనుమతించే విషయంలో సుప్రీంకోర్టు సదరు రోగుల 'సజీవ విల్లు'ను పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది.



సజీవ విల్లు

ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తి లిఖితపూర్వకంగా తనకు అందించే వైద్య చికిత్స విషయమై ముందుగానే సూచనలు చేసే పత్రం. రోగి అశక్తుడైన స్థితిలో డాక్టర్లకు తన మనసులోని మాటను వ్యక్తం చేసే చట్టబద్ధమైన పత్రం. ప్రాణాంతకమైన వ్యాధి లేదా గాయంతో బాధపడుతున్న సమయంలో కృత్రిమంగా నీ ప్రాణాన్ని నిలబెట్టవచ్చో లేదో అనే విషయాన్ని ఆ సజీవ వీలునామాలో స్పష్టం చేయవచ్చు.

పరోక్ష కారుణ్య మరణం ఏమిటి?

వైద్యానికి నయం కాని వ్యాధితో బాధపడుతున్న రోగికి ప్రాణాన్ని నిలబెట్టే వ్యవస్థను ఉద్దేశపూర్వకంగా ఉపసంహరించడం. తద్వారా సునాయాస మరణాన్ని ప్రసాదించడం.

తీర్పుకు మూలం



ప్రశాంత్ భూషణ్

అరుణా శాన్‌బాగ్ కేసులో, కొన్ని తప్పనిసరి పరిస్థితుల నేపథ్యంలో సుప్రీంకోర్టు 2014, మార్చి 7న పరోక్ష కారుణ్య మరణాన్ని ప్రసాదించేందుకు అనుమతించింది. ఆ కేసులో అంతకు ముందే సంబంధిత హైకోర్టు కూడా కారుణ్య మరణం అమలుకు అంగీకరించింది. ఈ కేసులో పిటిషనర్లు 'తన శరీరంపై జరిగే హింసను నివారించే హక్కు లేదని ఒక వ్యక్తికి ఎలా చెప్తారు? జీవించే హక్కులోనే గౌరవంగా మరణించే హక్కు కూడా ఇమిడి ఉంది. ఓ వ్యక్తిని బలవంతంగా వెంటిలేటర్ సాయంతో జీవింపజేయడం సరైంది కాదు. ఓ వ్యక్తిని తన ఇష్టానికి వ్యతిరేకంగా కృత్రిమ పద్ధతుల్లో జీవింపజేయడం అతడు/ఆమె శరీరంపై దాడి చేయడమే' అని వాదించారు. 'ఓ వ్యక్తి ఇక తన జీవితకాలం మొత్తం బాధ, వేదనతోనే జీవించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైనప్పుడు అతడు/ఆమెకు గౌరవంగా తమ జీవితాన్ని ముగించే హక్కు ఉండాలి' అని కోర్టు మధ్యవర్తిగా హాజరైన ప్రశాంత్ భూషణ్ సూచించారు.

మెడికల్ బోర్డు పాత్ర ఏమిటి?

రోగి రాసిన 'సజీవ వీలునామా'ను తీసుకొని వారి బంధువులు లేదా స్నేహితులు హైకోర్టుకు వెళితే.. పరోక్ష కారుణ్య మరణం అవసరమో లేదో నిర్ణయించేందుకు ఒక మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. సదరు బోర్డు ఆ రోగి ఆరోగ్య పరిస్థితి ఇక మెరుగుపడదని, అది వైద్యానికి లొంగదని ధ్రువీకరించినప్పుడు కారుణ్య మరణాన్ని అమలు చేస్తారు.



ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షాలతో త్రిపుర సీఎం బిప్లబ్ దేవ్‌కుమార్

త్రిపురలో కొలువుదీరిన బీజేపీ ప్రభుత్వం

- సీఎంగా బిప్లబ్ దేవ్ ప్రమాణం
- హాజరైన ప్రధాని మోదీ, అమిత్ షా

అగర్తలా: త్రిపురలో తొలి బీజేపీ ప్రభుత్వం కొలువుదీరింది. ఆ రాష్ట్ర సీఎంగా బిప్లబ్ దేవ్ కుమార్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ తథాగథ రాయ్ ఆయనచేత ప్రమాణం చేయించారు. అసోం రైఫిల్ గ్రౌండ్‌లో జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా హాజరయ్యారు. డిప్యూటీ సీఎంగా జిష్ను దేవ్ బుర్మన్, మరో ఏడుగురు మంత్రులు కూడా ప్రమాణం చేశారు. కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పార్టీ సీనియర్ నేతలు ఎల్‌కే అద్వానీ, ఎంఎం జోషి, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు విజయ్ రూపానీ, శివ్‌రాజ్ సింగ్ చౌహాన్, శర్బానంద సోనోవాల్, రఘుబర్ దాస్, త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్ తదితరులు పాల్గొన్నారు.

సింగపూర్ ప్రధానితో రాహుల్ భేటీ



లీ సియన్‌లూంగ్‌తో రాహుల్

సింగపూర్: సింగపూర్ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆ దేశ ప్రధాని లీ సియన్ లూంగ్‌తో శుక్రవారం భేటీ అయ్యారు. పలువురు మంత్రులు, ఎంపీలతోనూ సమావేశమయ్యారు. సింగపూర్‌లోని ప్రతిష్ఠాత్మక ఐఎన్ఏ మెమోరియల్‌ను సందర్శించారు. అక్కడ ఉన్న స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పించారు. సింగపూర్ పర్యటన తర్వాత రాహుల్ మలేషియాలోనూ పర్యటించనున్నారు. ఆ దేశ ప్రధాని నజీబ్ రజాక్‌తో భేటీకానున్నారు. అలాగే ఆ దేశంలోని ఎన్నారైలతోనూ సమావేశమవుతారు.

గౌరీలంకేశ్ హత్యకేసులో తొలి అరెస్ట్

నవీన్‌కుమార్‌ను ఏ-1 నిందితుడిగా పేర్కొన్న సిట్ ■ హిందూ అతివాద సంస్థలతో సంబంధాలున్నట్టు అనుమానం



గౌరీ లంకేశ్, నిందితుడు నవీన్‌కుమార్

బెంగళూరు: సంచలనం రేపిన జర్నలిస్టు గౌరీలంకేశ్ హత్యకేసులో అక్రమ ఆయుధాల సరఫరాదారు కేటీ నవీన్‌కుమార్ అలియాస్ హొట్టె మాంజ (30)ను ప్రథమ నిందితుడిగా కర్ణాటక పోలీసులు గుర్తించారు. దక్షిణ కర్ణాటకలోని చిక్కమంగళూరు జిల్లా బిరూర్ పట్టణ వాసి కుమార్‌కు హిందూ అతివాద సంస్థలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని అనుమానిస్తున్నారు. ఈ మేరకు దర్యాప్తును ముమ్మరం చేశారు. గౌరీలంకేశ్ హత్యకేసులో ఇదే తొలి అరెస్టు. కేసుతో సంబంధం ఉన్న నవీన్‌కుమార్‌ను ఈ నెల 2 నుంచి విచారణ కోసం పోలీసు కస్టడీలోకి తీసుకున్నామని ఈ కేసును దర్యాప్తుచేస్తున్న 'ప్రత్యేక దర్యాప్తు బృందం' (సిట్) తెలిపింది. 'నవీన్‌కుమార్‌ను అరెస్టు చేశాం. గౌరీలంకేశ్ కేసులో అతడు నిందితుడు' అని డీసీపీ ఎంఎన్ అనుచెత్ తెలిపారు. అక్రమంగా బుల్లెట్లను కలిగి ఉన్నాడని గతనెల 19న నవీన్‌ను అరెస్టుచేసి, రిమాండ్‌కు తరలించారు. విచారణలో భాగంగా ఎనిమిది రోజులు కస్టడీలోకి తీసుకున్న సిట్.. అతనికి గౌరీలంకేశ్ హత్యకేసుతో సంబంధాలు ఉన్నాయని అనుమానించింది. పోలీసులు నవీన్‌కుమార్‌ను మరింత విచారించాల్సిన అవసరం ఉన్నదని, బెయిల్ కోసం అతడు పెట్టుకున్న విజ్ఞప్తిని తిరస్కరించాలని ప్రభుత్వం తరఫు న్యాయవాది శుక్రవారం కోర్టును కోరారు. విచారణ వివరాలను సీల్డ్ కవర్‌లో పెట్టి న్యాయస్థానానికి సమర్పించారు. నిందితుడికి లై డిటెక్టర్, నార్కో పరీక్ష, మెదడు పనితీరుపై పరీక్షలు నిర్వహించేందుకు పోలీసులు అనుమతి కోరారు. దీనికి అనుమతించాలా? వద్దా? అనే విషయంపై న్యాయస్థానం ఈ నెల 12న తేల్చనుంది. నవీన్ సిట్ కస్టడీ శుక్రవారంతో ముగియగా, ప్రశ్నించేందుకు మరింత సమయం కావాలని పోలీసుల విజ్ఞప్తితో.. ఈ నెల 15వరకు కస్టడీని పొడిగించింది. లంకేశ్ హిందూ దేవుళ్లను కించపరిచేలా వ్యవహరించినందుకు ఆమెపై నవీన్ ఆగ్రహంతో ఉన్నాడని, అతడు అభి, అని అనే మరో ఇద్దరికి తుపాకీని కాల్చడంలో శిక్షణ ఇచ్చాడని, తుపాకీలను సేకరించి, విక్రయించేందుకు పలుమార్లు పుణె, ముంబైకి వెళ్లాడని పోలీసువర్గాలు తెలిపాయి. హిందూ సంఘాలతో సంబంధం ఉన్నందునే నవీన్‌కుమార్‌ను ఈ కేసులో ఇరికించేందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని బీజేపీ ఆరోపించింది.

త్వరలో ట్రంప్-కిమ్ సమావేశం

భేటీకి అంగీకరించిన అమెరికా అధ్యక్షుడు ■ మేలో ముఖాముఖి చర్చలు



వాషింగ్టన్/ సియోల్: ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో సమావేశమయ్యేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంగీకరించారు. వచ్చే మే నెలలో ఇద్దరు నేతల మధ్య చర్చలు జరుగనున్నాయని వైట్‌హౌస్ శుక్రవారం ప్రకటించింది. వారిద్దరి సమావేశ స్థలం, తేదీ ఇంకా ఖరారు కాలేదని తెలిపింది. ఉత్తరకొరియాలో అణ్వస్త్రాల నిరాయుధీకరణే కిమ్ జోన్ ఉన్, డొనాల్డ్ ట్రంప్ మధ్య చర్చల్లో ప్రధాన ఎజెండా కానున్నది. వీరిద్దరి మధ్య సమావేశం జరిగితే ఈ రెండు దేశాల అధినేతల మధ్య ఇదే తొలి భేటీ కానున్నది. ట్రంప్ కూడా కిమ్‌తో సమావేశం కానున్న సంగతిని ధ్రువీకరించారు. నిరాయుధీకరణపై పూర్తి లక్ష్యాలను చేరుకునే వరకు ఉత్తరకొరియాపై ఆంక్షలు యథాతథంగా కొనసాగుతాయన్నారు. అమెరికాలో దక్షిణ కొరియా అధికారులు పర్యటిస్తున్నప్పుడు ఈ ప్రకటన రావడం ఆసక్తికర పరిణామం. ఇటీవల ఉత్తరకొరియాలో జరిపిన తమ పర్యటన వివరాలను దక్షిణ కొరియా జాతీయ భద్రత సలహాదారు చంగ్ ఈయి యాంగ్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు వివరించారు. 'ట్రంప్‌తో సాధ్యమైనంత త్వరగా సమావేశం కావాలని కిమ్ భావిస్తున్నారు' అని తెలిపారు. 'ఉత్తరకొరియా ఇక అణ్వస్త్రాలు, క్షిపణులను పరీక్షించదని కిమ్ చెప్పారు. దక్షిణ కొరియా, అమెరికా సంయుక్త సైనిక విన్యాసాలను తప్పక నిర్వహించాల్సిందే' అని అన్నారు. ట్రంప్, కిమ్ చర్చల ప్రతిపాదనను చైనా స్వాగతించింది. ట్రంప్, కిమ్ చర్చలను స్వాగతించినా, దానిపై సందేహాలున్నా యని దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే యిన్ అన్నారు.

కార్తీకి మరో మూడురోజుల కస్టడీ

ఈడీ అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ మంజూరు

న్యూఢిల్లీ: అవినీతి కేసులో అరెస్టయిన కార్తీ చిదంబరానికి ఢిల్లీ హైకోర్టులో మరోసారి నిరాశే ఎదురైంది. అతడి కస్టడీని హైకోర్టు మరో మూడు రోజులు పొడిగించింది. బెయిల్ పిటిషన్‌పై తదుపరి వాదనలను ఈ నెల 15కు వాయిదా వేసింది. మరోవైపు ఐఎన్‌ఎక్స్ మీడియా ముడుపుల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తనను అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలన్న కార్తీ అభ్యర్థనకు ఢిల్లీ హైకోర్టు ఆమోదం తెలిపింది.

మంటల్లో వాణిజ్యనౌక.. ఒకరి మృతి

అరేబియా సముద్రంలోని లక్షద్వీప్ తీరంలో ఘటన

ముంబై: అరేబియా సముద్రంలోని లక్షద్వీప్ తీరంలో మేర్స్క్ కంపెనీకి చెందిన వాణిజ్య నౌక మంటల్లో చిక్కుకుంది. వరుసగా రెండోరోజు కూడా మంటలు అదుపులోకి రాలేదు. ఈ ప్రమాదంలో థాయ్‌లాండ్‌కు చెందిన ఓ వ్యక్తి మృతిచెందగా, 23 మంది నావికులను సురక్షితంగా కాపాడామని అధికారులు తెలిపారు. ఓ భారతీయుడితోపాటు గల్లంతయిన మొత్తం నలుగురి ఆచూకీ లభించలేదని మేర్స్క్ అధికారి సోరెన్ టోఫ్ట్ తెలిపారు.

నాకంటే మన్మోహన్ బెస్ట్

- అందుకే 2004లో ప్రధానిని చేశాం
- తిరోగమన బాటలో మోదీ సర్కార్
- ఇతరులు కూడా కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్‌లో సారథ్యం వహించే అవకాశం
- ఇండియా టుడే సదస్సులో సోనియాగాంధీ



ముంబై: తనకంటే మెరుగైన ప్రధాని మన్మోహన్ సింగ్ అవుతారని తనకు తెలుసునని కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ అన్నారు. అందుకే 2004లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు ప్రధానిగా మన్మోహన్‌ను ఎన్నుకున్నట్లు చెప్పారు. 19 ఏండ్ల పాటు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా పని చేసిన సోనియాగాంధీ.. ఇటీవలే అధ్యక్ష పగ్గాలను రాహుల్‌గాంధీకి అప్పగించిన విషయం తెలిసిందే.ముంబైలో శుక్రవారం జరిగిన ఇండియా టుడే సదస్సులో సోనియా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో అసమ్మతికి, చర్చకు చోటు ఉంటుందని, కానీ ఏకపాత్రాభినయానికి కాదని ప్రధాని మోదీ తీరు ను సోనియా ఎద్దేవా చేశారు. మోదీ సర్కార్ తిరోగమన బాటలో పయనిస్తున్నదన్నారు. వాజ్‌పేయి హయాంలో రాజకీయ ప్రత్యర్థులైనా పార్లమెంటరీ సంప్రదాయాలను పాటించే వారని గుర్తు చేశారు. రాజ్యాంగం మార్చివేస్తామన్న ప్రకటనతో భారతదేశ గొప్పతనాన్ని నాశనం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది ప్రమాదకర సంకేతాలనిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. గత ఎన్నికలకు ముందు '2జీ' కేటాయింపులపై కాగ్ అతిగా అంచనా వేసిం దన్నారు. ఇప్పుడు వాస్తవాలేమిటో తెలుసునన్నారు. ఎన్నికల్లో గెలుపొందేందుకు సమాజాన్ని విభజించే నీచరాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. '2014 మే నెలకు ముందు భారత్ పూర్తిగా అంధకారంలో ఉన్నదా ? బీజేపీ అధికారంలోకి వచ్చాకే అభివృద్ధి మొదలైందా ? ఇది భారత మేధోసంపత్తిని అవమానించడం కాదా?' అని అన్నారు. ప్రభుత్వ విధానాలపై ఎన్డీయే మిత్రపక్షాలే నిరసన వ్యక్తం చేస్తున్నాయన్నారు. 'అచ్చేదిన్'కు 'ఇండియా షైనింగ్' గతే పడుతుందన్నారు. 2004లో బీజేపీ ప్రభుత్వం ఇండియా షైనింగ్ అనే నినాదాన్నిచ్చినా యూపీఏ విజయం సాధించింది. ఇప్పుడు మోదీ అచ్చేదిన్‌కు అదే పరిస్థితి వస్తుందని ఆమె పరోక్షంగా ఎద్దేవా చేశారు. యువతరం, అనుభవజ్ఞుల మధ్య సమతుల్యత సాధించేందుకు పార్టీ అధ్యక్షుడు రాహుల్ ప్రయత్నిస్తున్నారని, కానీ అది తేలిక కాదన్నారు. తన కూతురు ప్రియాంక వాద్రా ఆమె పిల్లల పెంపకంపైనే దృష్టి సారించారన్నారు. భవిష్యత్‌లో ఇతరులు కాంగ్రెస్ పార్టీకి సారథ్యం వహించే అవకాశాలు లేకపోలేదన్నారు.

అత్యంత సంపన్న ప్రాంతీయ పార్టీ సమాజ్‌వాదీ

- రెండు, మూడో స్థానాల్లో డీఎంకే, అన్నాడీఎంకే
- అప్పుల్లో టాప్ టీఆర్ఎస్, టీడీపీ
- ప్రజాస్వామిక సంస్కరణల సంఘం వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలోనే సంపన్న ప్రాంతీయ పార్టీగా అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్ వాదీ పార్టీ (ఎస్పీ) నిలిచింది. రెండు, మూడు స్థానాల్లో తమిళనాడుకు చెందిన డీఎంకే, అన్నాడీఎంకేలున్నా యి. అప్పుల్లో టీఆర్ఎస్, టీడీపీ మొద టి, రెండో స్థానాల్లో ఉన్నాయి. 2015-16లో దేశంలోనే అత్యంత సంపన్న 20 ప్రాంతీయ పార్టీల జాబితాను ప్రజాస్వామిక సంస్కరణల సంఘం (ఏడీఆర్) విడుదల చేసింది. రూ.634.96 కోట్ల ఆస్తులతో ఎస్పీ అగ్రస్థానంలో నిలిచింది. రూ.257.18 కోట్లతో డీఎంకే, రూ.224.84 కోట్లతో అన్నాడీఎంకే రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి.2011 మార్చిలో నమోదైన వైసీపీ, 2012 నవంబర్‌లో వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ.. 2012-13లో తమ ఆస్తులను సగటుగా రూ.1.1 కోట్లుకాగా, 2015-16లో అది రూ.3.7 కోట్లకు చేరుకున్నది.. అప్పుల్లో తొలి, మలి స్థానాల్లో టీఆర్ఎస్, టీడీపీ టీఆర్ఎస్, టీడీపీలు.. అప్పుల్లో మాత్రం టాప్ ఆర్డర్‌లో నిలిచాయి. 2011-12లో ఎలాంటి అప్పులు చూపని టీఆర్ఎస్, 2015-16లో రూ.15.97 కోట్లు అప్పులు చూపింది. రెండో స్థానంలో నిలిచిన టీడీపీ... రూ.8.1 కోట్ల అప్పులున్నాయన్నది. శివసేన 2013-14, 2014-15లో అప్పులను 99.78 శాతానికి (రూ.22.21 కోట్లు) తగ్గించుకున్నట్లు శివసేన తెలిపింది. 2015-16లో తాము ఎలాంటి రుణాలు తీసుకోలేదని తొమ్మిది ప్రాంతీయ పార్టీలు తెలిపాయి.

వరాలిచ్చే దేవుడు సీఎం కేసీఆర్

- ఎంబీసీలకు ఆర్థిక సహకారం దేశంలోనే రికార్డు
- ఎంబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కేసీ కాలప్ప
- రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకాలు



శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ లో మాట్లాడుతున్న ఎంబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కేసీ కాలప్ప

హైదరాబాద్/ఖైరతాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఎంబీసీలకు రూ.వెయ్యికోట్లు ప్రకటించడంతోపాటు ఉపాధి రుణాలకు సబ్సిడీ శాతం పెంపు ఫైలుపై సీఎం కేసీఆర్ సంతకం చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యంత వెనుకబడిన కులాలకు దేవుడితో సమానమని ఎంబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కేసీ కాలప్ప పేర్కొన్నారు. ఎంబీసీలు ఆర్థికంగా పురోభివృద్ధి సాధించేందుకు బ్యాంకుతో సంబంధంలేకుండా నేరుగా రుణాలు అందించాలని కేసీఆర్ తీసుకున్న నిర్ణయంపై ఆయన హర్షం వ్యక్తంచేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎంబీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు, దానికి రూ.1000 కోట్ల నిధులు రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే ఘట్టాలని పేర్కొన్నారు. గతంలో రుణాలు ఇవ్వాలంటే బ్యాంకర్లు అనేక కొర్రీలు పెట్టేవారని, కానీ ప్రభుత్వం ఎంబీసీల కోసం బ్యాంకుతో సంబంధంలేకుండా నేరుగా రుణాలు ఇస్తూ ఊహించని సబ్సిడీలను అందజేస్తూఆదర్శంగా నిలిచిందని చెప్పారు. భవిష్యత్తులో ఎంబీసీల అభ్యున్నతికి మరిన్ని పథకాలను ప్రవేశపెడుతారన్ని ఆశాభావం వ్యక్తంచేశారు. సమావేశంలో సంఘం జాతీయ ఉపాధ్యక్షులు ప్రేమ్‌లాల్ నేతికార్, పెండ్యాల చంద్రమోహన్, రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున్ అడికి, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు పాండు వంశీరాజ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు జీ శ్రీనివాస్, ఎంబీసీ సంచారజాతుల సంఘం ఇంచార్జి మల్లూరి అని ల్‌కుమార్, అబ్బులింగం, న్యాయవాది గోపాల్ తదితరులు పాల్గొన్నారు. సబ్సిడీ శాతం పెంపుపై హర్షం వ్యక్తంచేస్తూ.. హైదరాబాద్, మహేశ్వరం, సూర్యాపేట, నల్లగొండ, మంచిర్యాల, వికారాబాద్, కోదాడ యాదాద్రి భువనగిరి, చౌటుప్పల్‌లతోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర ఎంబీసీ సంక్షే మ సంఘం కన్వీనర్ గడ్డంసాయి కిరణ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌తోపాటు పలుచోట్ల సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగా ఎంబీసీలకు అధిక మొత్తంలో సబ్సిడీతో రుణాలు అందించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించడం హర్షణీయమని తెలంగాణ రజక సంఘాల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ కొండూరు సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

సీఎం కేసీఆర్ ప్రధాని కావాలి

- అజ్మీర్ ఖాజా గరీబ్ నవాజ్ దర్గాలో డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు
- తెలంగాణ రుబాత్ నిర్మాణానికి స్థలాల పరిశీలన



అజ్మీర్ ఖాజా గరీబ్ నవాజ్ దర్గాలో చాదర్‌ను సమర్పించేందుకు వెళుతున్న డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, హజ్ కమిటీ చైర్మన్ మసీఉల్లాఖాన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అక్బర్‌హుస్సేన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'సార్వత్రిక ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలతో కలిపి జాతీయస్థాయిలో మూడో ఫ్రంట్ రావాలనే ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆకాంక్ష నెరవేరాలి. కేసీఆర్ ప్రధానిగా దేశానికి కూడా సేవలు అందించాలి' అంటూ డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ బృందం శుక్రవారం రాజస్థాన్ అజ్మీర్‌లోని సుప్రసిద్ధ హజ్రత్ ఖాజా గరీబ్ నవాజ్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసింది. అజ్మీర్‌లో తెలంగాణ ప్రభుత్వం నిర్మించనున్న రుబాత్ (గెస్ట్‌హౌస్) కోసం స్థలాన్ని పరిశీలించేందుకు బృందం అజ్మీర్ పట్టణంలో పర్యటించింది. మహమూద్‌అలీతోపాటు తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ మసీఉల్లాఖాన్, తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్, తెలంగాణ మైనారిటీ కమిషన్ సభ్యుడు అర్షద్ అలీ, టీఆర్‌ఎస్ మైనారిటీ నేత షరీఫ్‌తో కూడిన బృందం గురువారం రాజస్థాన్‌కు వెళ్లిన విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం వీరు జైపూర్ నుంచి అజ్మీర్‌కు చేరుకొని, ఖాజా గరీబ్ నవాజ్ దర్గాలో ప్రార్థనలు చేశారు. రాష్ట్రంలో మళ్లీ టీఆర్‌ఎస్ ప్రభుత్వమే ఏర్పాటుకావాలని ప్రార్థిస్తూ చాదర్లను సమర్పించారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వం నిర్మించనున్న గెస్ట్‌హౌస్ కోసం అజ్మీర్ పట్టణ, పరిసరాల్లో స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మహమూద్ అలీ 'నమస్తే తెలంగాణ ప్రతినిధి'తో ఫోన్లో మాట్లాడుతూ.. ప్రస్తుతం పరిశీలించిన స్థలాలు భక్తులకు అనువుగాలేవని, సౌకర్యంగా ఉండే ప్రైవేట్ స్థలాలను పరిశీలిస్తామని పేర్కొన్నారు.



సచివాలయంలో మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్న రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

- బాధ్యత అప్పగించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు
- రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గుత్తా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయివరకు అసంఘటితంగా ఉన్న రైతులను సంఘటితపర్చేందుకు కృషిచేస్తానని రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం సచివాలయంలో వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డితో గుత్తా మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి తనపై పెట్టిన గురుతర బాధ్యతను విజయవంతంగా నిర్వహిస్తానన్నారు. మంత్రుల సహకారంతో సీఎం కలలను నిజం చేస్తానన్నారు. తనను రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా నియమించిన సీఎం కేసీఆర్‌కు, సహకరించిన మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డితోపాటు మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డిని మంత్రి పోచారం అభినందించారు. గుత్తా వెంట హైదరాబాద్-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సహకార సంస్థ చైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి, తిప్పర్తి ఎంపీపీ పాశం రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీగా మనోహర్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ బోయినపల్లి మనోహర్‌రావును రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ సింది. రాష్ట్ర పర్యాటకశాఖలో అసిస్టెంట్ మేనేజర్ హోదాలో ఉద్యోగంలో చేరిన మనోహర్‌రావు అంచెలంచెలుగా ఎగిది.. పర్యాటకశాఖలో వివిధ హోదాల్లో పనిచేశారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కూడా సేవలందించారు. సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టనున్నట్టు మనోహర్‌రావు నమస్తే తెలంగాణ తెలిపారు. శుక్రవారం మేయర్ బొంతు రామ్మోహన్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి ఆయనకు వీడ్కోలు పలికారు.

బీసీలను కించపరిస్తే రేవంత్‌రెడ్డి తాటతీస్తాం

- బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

కవాడిగూడ: రాష్ట్రంలోని బలహీనవర్గాలు, పేదలను కించపరిస్తే బీసీలే రేవంత్‌రెడ్డి తాట తీస్తారని తెలంగాణ బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. కాంగ్రెస్ బస్సుయాత్రలో భాగంగా హుజూరాబాద్‌లో జరిగిన సభలో రేవంత్‌రెడ్డి బీసీల మనోభావాలను దెబ్బతిసేలా మాట్లాడారని ఆరోపించారు. శుక్రవారం దోమలగూడ బీసీభవన్‌లో జాజుల శ్రీనివాస్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ మంత్రి ఈటల రాజేందర్‌ను దూషించడం బీసీలను కించపరచడమేనని, బేషరతుగా ఆయనకు క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జాజుల లింగంగౌడ్, నాయకులు నాగేశ్, శ్రీనివాస్ గౌడ్, శేఖర్, సతీశ్‌కుమార్, శ్యామ్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

పంట ఆధారిత ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు

- వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో పంటలు, సాగు ప్రాంతాల ఆధారంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేయనున్నట్టు వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి చెప్పారు. రైతులకు అనుకూలంగా యూనిట్లు నెలకొల్పేవిధంగా ప్రభుత్వం చూడనున్నట్టు తెలిపారు. నియోజకవర్గాలవారీగా పంటలకు అవసరమైన ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ కోసం డ్రాఫ్టును సిద్ధం చేసిందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో రాష్ట్రంలోని వివిధ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల యాజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాసెసింగ్ పరిశ్రమల విధాన రూపకల్పనకు తుదిరూపం ఇచ్చేందుకు ఇతరుల సలహాలు, సూచనల కోసం ఈ సమావేశం ఏర్పాటుచేసినట్టు తెలిపారు. సమావేశంలో తెలంగాణ స్టేట్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జీఎం నాగేందర్, డైరెక్టర్ అఖిల్, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో బీసీలకు రూ.20 వేలకోట్లు కేటాయించాలి

- స్పీకర్‌కు చేనేతవర్గాల ప్రతినిధుల వినతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం 2018-19 బడ్జెట్‌లో బీసీలకు రూ.20 వేలకోట్లు కేటాయించాలని చేనేతవర్గాల ప్రతినిధులు జెల్ల మార్కండేయ, దాసు సురేశ్ కోరారు. శుక్రవారం అసెంబ్లీ చాంబర్‌లో స్పీకర్ మధుసూదనాచారికి వినతిపత్రం సమర్పించారు. చేనేతవర్గాలతోపాటు దారిద్ర్యరేఖకు దిగువనున్న బీసీలందరికీ లబ్ధి చేకూరేలా పలు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. స్పీకర్‌ను కలిసినవారిలో వీవర్స్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి తాటి ఎల్లయ్య, శంకర్, అశోక్ తదితరులు ఉన్నారు.

ఐఎన్‌టీఎస్‌వోలో శ్రీచైతన్య విజయభేరి

హైదరాబాద్: దేశవ్యాప్తంగా మూడు నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ (ఐఎన్‌టీఎస్‌వో) పరీక్ష ఫలితాల్లో తమ విద్యాసంస్థల విద్యార్థులు 12,902 పతకాలు సాధించారని శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ బీఎస్ రావు, డైరెక్టర్ సీమ తెలిపారు. జాతీయస్థాయిలో 75 మంది లాప్‌ట్యాప్‌లు, 82 మంది ట్యాబ్‌లు, 114 మంది ప్రత్యేక, 2,664 మంది ప్రోత్సాహక బహుమతులు గెలుపొందారని తెలిపారు. మొదటి ర్యాంకును 27 మంది, రెండో ర్యాంకును 25 మంది, మూడోర్యాంకును 30 మంది సాధించారని శుక్రవారం వివరించారు.

మార్పును అందిపుచ్చుకుంటేనే మనుగడ

హైదరాబాద్: సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకు అన్నిరంగాలకు విస్తరిస్తున్నదని, ఆధునిక మార్పును అందిపుచ్చుకుంటేనే మనుగడ సాధ్యమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ముఖ్యమంత్రి ఐటీ సలహాదారు జేఏ చౌదరి చెప్పారు. గీతం హైదరాబాద్ బిజినెస్ స్కూల్ (జీహెచ్‌బీఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం 'ఐడియాస్ అండ్ నరేటివ్స్ ఫర్ మేనేజ్‌మెంట్ అండ్ లీడర్‌షిప్' అనే అంశంపై నిర్వహిస్తున్న రెండురోజుల అంతర్జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్బీ) డీన్ ఎమిరెట్స్ ప్రొఫెసర్ ఎంఆర్ రావు, ప్రొఫెసర్లు ఎంజే గ్జేవియర్, కరుణేశ్ సక్సెనా, కే శివరామకృష్ణ, గీతం హైదరాబాద్ ప్రో వీసీ ప్రొఫెసర్ ఎన్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెలువరించిన ప్రత్యేక సంచికను అతిథులు ఆవిష్కరించారు.

సామాజిక స్పృహతో పనిచేయాలి

- ప్రధానోపాధ్యాయులకు కడియం పిలుపు
- విద్యాసదస్సును ప్రారంభించిన డిప్యూటీ సీఎం
- స్కూళ్లకు ఉచిత కరెంటు.. విద్యార్థులకు వారానికి ఐదు గుడ్లు ఇస్తామని హామీ
- పాల్గొన్న ఆర్థికమంత్రి ఈటల, చీఫ్‌విప్ పాతూరి



శుక్రవారం రవీంద్రభారతిలో డిప్యూటీసీఎం కడియం శ్రీహరిని సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయులు. చిత్రంలో మంత్రి ఈటల, ఎమ్మెల్సీలు శ్రీనివాస్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, పూల రవీదందర్, గెజిటెడ్ హెడ్‌మాస్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సామాజిక స్పృహతో పనిచేయాలని, గ్రామీణ, పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరిచే బాధ్యతలను చేపట్టాలని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి స్కూల్‌కు నల్లా కనెక్షన్ తెచ్చుకోవాలని చెప్పారు. శుక్రవారం రవీంద్రభారతిలో 'ప్రభుత్వ పాఠశాలలు-నాణ్యమైన విద్య-ప్రధానోపాధ్యాయుల పాత్ర' అనే అంశంపై ఏర్పాటుచేసిన విద్యాసదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో టీఆర్టీ ఫలితాలు విడుదల కాబోతున్నాయని, వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి కొత్తగా 8,792 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరనున్నారని చెప్పారు. ప్రధానోపాధ్యాయులకు సరైన గౌరవం దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. వచ్చే సెప్టెంబర్ 5న రాష్ట్రంలోని 31 జిల్లాలవారీగా ఉత్తమ ప్రధానోపాధ్యాయులను సన్మానిస్తామని తెలిపారు. ప్రధానోపాధ్యాయుల వేషభాషలు, ప్రవర్తన, మొబైల్ వినియోగం వంటి చర్యలను విద్యార్థులు నిత్యం గమనిస్తూ ఉంటారని గుర్తుచేశారు. వారి నడవడిక, ప్రవర్తన విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వారానికి మూడు గుడ్లు ఇస్తున్నామని, ఇక నుంచి వారానికి ఐదు గుడ్లను ఇచ్చే ప్రయత్నాలు కూడా కొనసాగుతున్నాయని చెప్పారు. త్వరలో ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా కరెంటు ఇవ్వాలన్న అంశంపై సీఎం కేసీఆర్‌ను సంప్రదిస్తామని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అర్హులైన ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, అయినప్పటికీ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ఎందుకు తగ్గుతున్నదని ప్రధానోపాధ్యాయులను డిప్యూటీ సీఎం కడియం ప్రశ్నించారు. ఆశించిన ఫలితాలు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ గ్రాంట్స్‌ను 12 నెలలకు పెంచుతామన్నారు.

విద్యతోనే తెలంగాణ అభివృద్ధి

తెలంగాణ అభివృద్ధి విద్యతోనే సాధ్యం అవుతుందని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. గత ప్రభుత్వాలలో పనిచేసిన మంత్రులు తీసుకున్న చర్యల వల్ల ప్రభుత్వ స్కూళ్ల అభివృద్ధి నిలిచిపోయిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యతోపాటుగా వ్యవసాయం, వైద్యం, సంక్షేమాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నదని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు చదువు చెప్పడం కోసం తెలంగాణ ప్రభుత్వం సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం పథకం అమలుచేస్తున్నదని గుర్తుచేశారు. విద్యపై పెట్టే ప్రతిపైసా ఖర్చు కింద భావించవద్దని, అది పెట్టుబడిగానే భావించాలని సీఎం కేసీఆర్ పదేపదే చెప్పారని గుర్తుచేశారు. శాసనమండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పెరుగుతున్న డిజిటల్ తరగతుల నేపథ్యంలో కంప్యూటర్ ఆపరేటర్లను కూడా నియమించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, పూల రవీందర్, గెజిటెడ్ హెడ్‌మాస్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సింగిడి లక్ష్మారెడ్డి, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కేజీ టు పీజీ విద్యాసంస్థలు పరీక్షలకు సహకరించాలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేజీ టు పీజీ విద్యాసంస్థల జేఏసీ డిమాండ్లను పరిష్కరిస్తామని డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. సీఎం కేసీఆర్ వద్దకు విషయాన్ని తీసుకెళ్లి పరిష్కారం అయ్యేందుకు తనవంతుగా కృషి చేస్తానని చెప్పారు. విద్యాసంస్థల యాజమాన్యాలు సామాజిక బాధ్యతతో విద్యార్థులను ఆందోళనకు గురి చేయకుండా పరీక్షలకు పూర్తిగా సహకరించాలని కోరారు. కేటీ టు పీజీ విద్యాసంస్థల జేఏసీ శుక్రవారం డిప్యూటీ సీఎంను సచివాలయంలో కలిసి సమస్యపై చర్చించారు. విద్యాసంస్థలకు సంబంధించి ఆస్తిపన్ను, కరంటు బిల్లు, ఫీజుల పెంపు వంటి ఆర్థిక అంశాలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని కడియం హామీ ఇచ్చారు.

ఇంటర్‌వరకు తెలుగు సాధ్యమే

తమిళనాడు పర్యటన విశ్వాసం పెంచింది ■ పకడ్బందీగా తమిళనాడు భాషా చట్టం ■ పర్యటన అంశాలపై ప్రభుత్వానికి నివేదిస్తాం

తమిళనాడు పర్యటన ముగించుకున్న సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి బృందం



శుక్రవారం తమిళనాడులో సాంస్కృతికశాఖ మంత్రి పాండ్యరాజన్‌తో సమావేశమైన సాహిత్య అకాడమీచైర్మన్ నందిని సిధారెడ్డి, కార్యదర్శి ఏనుగు నర్సింహారెడ్డి, తెలుగు వర్సిటీ వీసీ ఎస్వీ సత్యనారాయణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణలో ఇంటర్ వరకు తెలుగు అమలుచేయడం సుసాధ్యమేనని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎస్వీ సత్యనారాయణ, సాహిత్య అకాడమీ కార్యదర్శి ఏనుగు నరసింహారెడ్డి స్పష్టంచేశారు. తమిళనాడులో తమిళ భాషను తప్పనిసరిగా అమలుచేస్తున్న విద్యాసంస్థలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలను మూడ్రోజుల పర్యటన సందర్భంగా వీరు పరిశీలించారు. మంత్రులతో, అధికారులతో సమావేశాలు జరిపారు. తమిళం తప్పనిసరి చేయడంలో వచ్చిన అడ్డంకులకు, చట్టపరంగా వాటిని అధిగమించిన తీరును అధ్యయనంచేశారు. పర్యటనలో మూడో రోజైన శుక్రవారం తమిళనాడు సాంస్కృతిక, కళలశాఖ మంత్రి పాండ్యరాజన్, యూనివర్సిటీ ఆఫ్ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ప్రమీలాగురుమూర్తితో సమావేశమయ్యారు. శుక్రవారంతో వీరి పర్యటన ముగిసింది. ఈ విశేషాలను వారు నమస్తే తెలంగాణతో పంచుకున్నారు. ఈ పర్యటన తమకు గొప్ప అనుభవాన్ని ఇచ్చిందని సిధారెడ్డి తెలిపారు. తమిళ భాష అభివృద్ధికోసం తీసుకుంటున్న పటిష్టమైన చర్యలను పరిశీలించే అవకాశం లభించిందన్నారు. ప్రతి అధికారి, ప్రతి మంత్రి తమిళభాష పట్ల చాలా అభిమానంతో ఉన్నారని చెప్పారు. ప్రమీలాగురుమూర్తి వంటి ఆచార్యులు, పెద్దలతో మంత్రి సమావేశాలు ఏర్పాటు చేయించారని పేర్కొన్నారు. వారి ఆదరణ అపూర్వమని, వారి ఆతిథ్యం సమున్నతమని చెప్తూ.. తమిళనాడు ప్రభుత్వ పెద్దలలకు, అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు. తమిళనాడు పర్యటన తెలుగు తప్పనిసరి విషయంలో తమలో విశ్వాసం పెంచిందని తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎస్వీ సత్యనారాయణ చెప్పారు. తమిళనాడు రూపొందించిన తమిళనాడు భాషా చట్టం - 2006 చాలా పకడ్బందీగా ఉన్నదని సాహిత్య అకాడమీ కార్యదర్శి ఏనుగు నర్సింహారెడ్డి చెప్పారు.

గుడిపల్లిగుట్టకు చేరిన భగీరథ నీళ్లు

ట్రయల్ రన్‌ను ప్రారంభించిన ఈఎన్సీ సురేందర్‌రెడ్డి ■ క్లిష్టమైన నిర్మాణాన్ని పూర్తిచేసిన సిబ్బందికి ప్రశంసలు



నాగర్‌కర్నూల్ జిల్లా ఎల్లూరులో స్విచ్ ఆన్‌చేసి ఇన్‌టేక్‌వెల్ నుంచి మిషన్ భగీరథ నీళ్ల ట్రయల్ రన్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్సీ సురేందర్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలలోని జనావాసాలకు తాగునీటిని అందించడంలో కీలకమైన గుడిపల్లిగుట్ట మీదకు భగరథ నీళ్లు చేరాయి. ఈ గుట్ట మీద నిర్మించిన గ్రౌండ్‌లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 33 కిలోమీటర్ల దూరంలోని నాగర్‌కర్నూల్ జిల్లా ఎల్లూరు ఇన్‌టేక్‌వెల్ నుంచి శుద్ధి చేయని నీరు చేరింది. మహబూబ్‌నగర్ సెగ్మెంట్‌లో రెండోరోజు పర్యటించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్సీ బీ సురేందర్‌రెడ్డి శుక్రవారం మిషన్‌భగీరథ నీళ్ల ట్రయల్‌రన్ ప్రారంభించారు. మిషన్ భగీరథలోనే ఎంతో క్లిష్టమైన గుడిపల్లిగుట్ట నిర్మాణ పనులను భగీరథ ఇంజినీర్లు, వర్క్‌ఏజెన్సీ అధికారులు యజ్ఞంలా పూర్తి చేశారని ఈఎన్సీ ప్రశంసించారు. ఉదయం వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం పానగల్‌లో 5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నిర్మించిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో మోటార్ల ట్రయల్‌రన్‌ను ఈఎన్సీ ప్రారంభించారు. అక్కడినుంచి వీపనగండ్ల వెళ్లి అక్కడ నిర్మిస్తున్న వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటను పరిశీలించారు. ఆ తర్వాత నాగాపూర్ ప్రాజెక్టు మహబూబ్‌నగర్ సెగ్మెంట్‌పై సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. గౌరిదేవిపల్లిలో నిర్మిస్తున్న హెడ్‌వర్క్‌ను ఈఎన్సీ పరిశీలించారు. స్విచ్చాన్ చేసి మోటర్ల ట్రయల్‌రన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ కృపాకర్‌రెడ్డి, ఎస్‌ఈ చెన్నారెడ్డి, జగన్, ఈఈలు జయబాయి, సీతారాంరెడ్డి, వెంకటరమణ, శ్రీధర్, పద్మలతతోపాటు ఇతర అధికారులు, వర్క్‌ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాన్సువాడకు గంగమ్మ పరుగులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మార్గదర్శనం, వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి కృషి, నిరంతర పర్యవేక్షణతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మొదటిసారిగా బాన్సువాడ పట్టణానికి మిషన్ భగీరథ పథకం నీళ్లు అందాయి. ఫిబ్రవరి 2న సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూర్ ప్రాజెక్టు వద్ద నిర్మించిన ఇన్‌టేక్‌వెల్, నీటిశుద్ధి కేంద్రం, పంపింగ్ పనులను మం త్రి పోచారం ప్రారంభించారు. సాంకేతిక సమస్యలు, పలు అడ్డంకులను అధిగమిస్తూ ఇంజినీరింగ్ అధికారులు శుక్రవారం బాన్సువాడకు తాగునీటిని చేర్చారు. బాన్సువాడ పట్టణానికి చేరిన మిషన్‌భగీరథ నీళ్లకు దేశాయిపేట పీఏసీఎస్ అధ్యక్షుడు పోచారం భాస్కర్‌రెడ్డి, ఆర్‌డీవో, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. నిరంతరం పర్యవేక్షిస్తూ పనులను అత్యంత వేగంగా పూర్తిచేయించిన మంత్రి పోచారంశీనివాసరెడ్డికి బాన్సువాడ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. రూ.1300 కోట్లతో నిర్మిస్తున్న సింగూర్ సెగ్మెంట్ ద్వారా జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి, బోధన్ నియోజకవర్గంలోని మొత్తం 780 గ్రామాలకు త్రాగునీరు అందుతుంది. రక్షిత మంజీర నీరు తమకు తాగునీరుగా అందుతుందని ఆయా ఆవాసాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



బాన్సువాడకు చేరిన మిషన్‌భగీరథ నీళ్లకు పూజలు చేస్తున్న దేశాయిపేట పీఏసీఎస్ అధ్యక్షుడు పోచారం భాస్కర్‌రెడ్డి తదితరులు

ఆబ్కారీ కానిస్టేబుళ్లకు 12 నుంచి ఫిజికల్ టెస్టులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆబ్కారీశాఖలో కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో భాగంగా ఈ నెల 12 నుంచి 16 వరకు ఫిజికల్ టెస్ట్‌లను నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్ చెప్పారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖాన మెడికల్ రికార్డ్స్ విభాగంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి ఈ పరీక్షలు ఉంటాయన్నారు. అభ్యర్థులు రూ.300 ఫీజు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఏదైనా గుర్తింపు పత్రం వెంట తీసుకురావాలని సూచించారు.

13న టీజీటీ అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్

టీజీటీ అభ్యర్థులకు రెండోవిడుత సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యే అవకాశం కల్పిస్తున్నట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. టీజీటీ గణితం, ఫిజికల్ సైన్సెస్, సోషల్ స్టడీస్, బయోలాజికల్ సైన్సెస్, సైన్స్ అభ్యర్థులకు ఈ నెల 13న వారికి మరోమారు వెరిఫికేషన్‌కు అవకాశం ఇస్తున్నట్లు కమిషన్ కార్యదర్శి తెలిపారు. పలు కారణాల వల్ల తగు అభ్యర్థులు దొరకని కారణంగా టీజీటీ భాషా పండితులకు మరోమారు సర్టిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ భాషలకు చెందిన అభ్యర్థులకు ఈ నెల 14 నుంచి 16 వరకు నాంపల్లిలోని టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తామని వెల్లడించారు. పూర్తి వివరాలను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో చూడవచ్చని కోరారు.

గ్రామీణ యువతకు బ్యాంకర్ల సంస్థ ఉచిత శిక్షణ

- నేటినుంచి దరఖాస్తుల ప్రారంభం.. వచ్చేనెల 4 నుంచి శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామీణ యువత నుంచి బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ (బైరెడ్) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నది. శిక్షణ పొందడానికి ఆసక్తి గల 19 నుంచి 30 ఏండ్ల వయసున్న అభ్యర్థులు www.bired.org వెబ్‌సైట్‌లో శనివారం నుంచి ఈ నెల 20 లోగా దరఖాస్తు చేసుకోవాలని బైరెడ్ సంస్థ శుక్రవారం ప్రకటనలో కోరింది. మొబైల్ సర్వీసింగ్, ఎంఎస్ ఆఫీస్, పీసీ హార్డ్‌వేర్ ల్యాప్‌టాప్ సర్వీసింగ్ చిప్ లెవల్, వ్యవసాయ పంపుసెట్ రిపేర్, అకౌంటింగ్ ప్యాకేజీ వంటి కోర్సుల్లో ఏప్రిల్ 4 నుంచి మే 18 వరకు శిక్షణ ఇవ్వనున్నారు.

కోటా కొట్లాటకు మద్దతిస్తాం

- సీఎం కేసీఆర్ ఢిల్లీలో ధర్నాచేస్తే తరలివస్తామన్న టీఎస్‌ఎమ్మార్పీఎస్
- అండగా ఉంటామన్న బీసీ సంక్షేమ సంఘం



మీడియాతో మాట్లాడుతున్న టీఎస్‌ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు యాతాకుల భాస్కర్. చిత్రంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

హైదరాబాద్/ ముషీరాబాద్, నమస్తే తెలంగాణ: కోటా కోసం కొట్లాటకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు పలు సంఘాలు మద్దతుగా నిలుస్తున్నాయి. ముస్లిం రిజర్వేషన్ల సాధన, ఎస్సీ వర్గీకరణ కోసం సీఎం కేసీఆర్ ఢిల్లీలో ధర్నా చేయాలని నిర్ణయిస్తే టీఎస్ ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాతాకుల భాస్కర్ మాదిగ, సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్, జాతీయ ప్రధాన కార్యదర్శి మేడి పాపయ్య చెప్పారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లి మద్దతుగా నిలుస్తామని పేర్కొన్నారు. శుక్రవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంనుంచి ఎంపికకానున్న రాజ్యసభస్థానాల్లో ఒక సీటును తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన టీఎస్‌ఎమ్మార్పీఎస్ నేతల్లో ఒకరికి ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. సమావేశంలో సంఘం నాయకులు మైసయ్య, అలెగ్జాండర్, శ్యామ్‌రావు పాల్గొన్నారు.

తోడుగా ఉంటామన్న బీసీ సంఘాలు

జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రిజర్వేషన్ల అమలుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తామని ముఖ్యమంత్రి నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. కేంద్రంతో కొట్లాడి ఢిల్లీలో ధర్నా నిర్వహించైనా రిజర్వేషన్లు సాధించాలన్న సీఎం నిర్ణయానికి బీసీ సంఘాలు తోడుగా ఉంటాయని తెలిపారు.

గాంధీలో గవర్నర్‌కు వైద్య పరీక్షలు



గాంధీ దవాఖానలో పర్యటిస్తున్న గవర్నర్ నరసింహన్

గాంధీ దవాఖాన: గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ శుక్రవారం గాంధీ దవాఖానలో వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఆయన చెవిలో సమస్య ఉండటంతో ఈఎన్టీ వైద్యులు పరీక్షించి, చికిత్స అందించారు. అనంతరం గవర్నర్ నరసింహన్ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్‌తో కలిసి పలు వార్డులను సందర్శించారు. వైద్యసేవలపై స్వయంగా రోగులతో మాట్లాడారు. చాలా బాగా వైద్యం అందుతున్నదని రోగులు సమాధానం ఇవ్వడంతో గవర్నర్ సంతోషం వ్యక్తం చేశారు. గవర్నర్ దవాఖాన సూపరింటెండెంట్‌ను అభినందిస్తూ.. వైద్యసేవలు, పారిశుద్ధ్య నిర్వహణ బాగున్నాయని, ఇలాగే కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహారావు, ఆర్ఎంవోలు డాక్టర్ జయకృష్ణ, డాక్టర్ సాల్మన్, డాక్టర్ కిరణ్ పాల్గొన్నారు.

బేగంపేట విమానాశ్రయంలో జరుగుతున్న వింగ్స్ ఇండియా ఏయిర్‌షో శుక్రవారం కొనసాగింది. రెండోరోజు పలు వైమానిక సంస్థలు సమావేశాలు నిర్వహించి భవిష్యత్తు వ్యూహాలు, వ్యాపార అవకాశాలపై ప్రచారం చేసుకున్నాయి. వ్యాపార, వాణిజ్య సంస్థల ప్రతినిధులు ఏవియేషన్ రంగంలో గల వ్యాపార అవకాశాలపై చర్చించుకున్నారు. వైమానిక ఉత్పత్తుల ప్రదర్శనను వీక్షించేందుకు సందర్శకులు భారీగా తరలివచ్చారు. సందర్శకులు, ట్రైనీ పైలట్లు విమానాల ముందు ఫొటోలు దిగుతూ సందడి చేశారు. శని, ఆదివారాల్లో రూ.400 టికెట్‌పై ప్రజలను ఏయిర్‌షోలోకి అనుమతించనున్నారు.



23 తులాల బంగారం పట్టివేత



శంషాబాద్: హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టులో శుక్రవారం కస్టమ్స్ అధికారులు ఓ ప్రయాణికుడి నుంచి 23 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. రియాద్ నుంచి హైదరాబాద్‌కు సౌదీ ఎయిర్‌లైన్స్ విమానంలో వచ్చిన ఓ ప్రయాణికుడు అనుమానాస్పదంగా కనిపించడంతో అధికారులు తనిఖీ చేశారు. ప్యాంటులోని ప్రత్యేక జేబులో 2 బంగారు కడియాలను తీసుకొచ్చినట్టు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. బంగారు కడియాలు 233 గ్రాములు ఉన్నాయని, విలువ రూ.7.34 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. స్మగ్లర్‌ను విచారిస్తున్నామన్నారు.

శభాష్.. తెలంగాణ పోలీస్

- డీజీపీని కలిసి అభినందించిన రష్యా అధికారులు
- ఢిల్లీలోని రష్యన్ ఎంబసీని బురిడి కొట్టించిన గుంటూరువాసి
- 42,500 డాలర్లు తీసుకొని అజ్ఞాతంలోకి..
- రాష్ట్ర పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు
- నిందితుడి అరెస్ట్.. పూర్తి సొత్తు రికవరీ

హైదరాబాద్ సిటీబ్యూరో/శేరిలింగంపల్లి, నమస్తే తెలంగాణ: రాష్ట్ర పోలీసులు సాంకేతికతను ఉపయోగిస్తూ.. కేసుల దర్యాప్తును పారదర్శకంగా, వేగవంతంగా పూర్తిచేస్తున్నారని రష్యా అధికారులు అభినందించారు. ఢిల్లీలోని రష్యన్ ఎంబసీ అధికారులను మోసం చేసి రూ.27.6 లక్షలు (42,500 డాలర్లు) కాజేసిన వ్యక్తిని రాచకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి 42,500 డాలర్లను రికవరీ చేసి ఎంబసీకి అప్పజెప్పారు. మోసగాడిని అరెస్ట్ చేయడంతో పాటు సొత్తును రికవరీ చేసిన తెలంగాణ పోలీసుల సేవలను కొనియాడుతూ రష్యన్ ఎంబసీ అధికారులు డీజీపీకి లేఖ రాశారు. శుక్రవారం వైస్ కౌన్సిల్ సెకండ్ సెక్రటరీ ఇగోర్ బోల్దిరేవ్‌తో కలిసి రాచకొండ కమిషనరేట్‌లో నిర్వహించిన సమావేశంలో సీపీ మహేశ్‌భగవత్ ఈ కేసు వివరాలు వెల్లడించారు.

ఆన్‌లైన్ టెండర్ పేరుతో మోసం

ఢిల్లీలోని శాంతిపథ్ చాణక్యపురిలో ఉన్న రష్యన్ ఎంబసీ(ఎంబసీ ఆఫ్ రష్యన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) భవన సముదాయంలో వివిధ ఎలక్ట్రానిక్ పరికరాలను అమర్చేందుకు 2016 మే నెలలో ఆన్‌లైన్ టెండర్లు పిలిచారు. హైదరాబాద్ సరూర్‌నగర్‌లోని హుడా కాలనీలో కేఆర్‌బీ జియోస్ సర్వీసెస్ సంస్థ నిర్వహిస్తున్న ఏపీలోని గుంటూరు జిల్లాకు చెందిన కోర్ రంగబాబు టెండర్లలో పాల్గొని పనులను దక్కించుకున్నాడు. ఈ మేరకు రష్యన్ ఎంబసీతో ఒప్పందం కుదుర్చుకున్నాడు ఒప్పందం ప్రకారం రష్యా అధికారులు 42,500 డాలర్లను (దాదాపు రూ.27.6 లక్షలు) కేఆర్‌బీ సంస్థ బ్యాంకు ఖాతాకు బదిలీ చేశారు. రంగబాబు ఆ డబ్బులు తీసుకున్న తర్వాత పనులు ప్రారంభించకుండా కాలయాపన చేస్తూ, తప్పించుకు తిరుగుతున్నాడు. అతడి వ్యవహారంపై అనుమానం వచ్చిన రష్యన్ ఎంబసీ వైస్ కౌన్సిల్ సెకండ్ సెక్రటరీ ఇగోర్ బోల్దిరేవ్ తెలంగాణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భారత్, రష్యా ద్వైపాక్షిక సంబంధాలకు సంబంధించిన వ్యవహారం కావడంతో రాచకొండ పోలీసులు ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. నిందితుడు రంగబాబు గురించి సీపీ మహేశ్‌భగవత్ పూర్తి వివరాలు సేకరించారు. ఆయన సూచన మేరకు సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో రంగబాబు అజ్ఞాతంలోకి వెళ్లాడు. అతడి కోసం ఎల్బీనగర్ డీసీపీ వెంకటేశ్వరరావు నేతృత్వంలో ప్రత్యేక బృందం గాలింపు చేపట్టింది. నిందితుడు గుంటూరుకు వచ్చిన విషయాన్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నది. అతడు రష్యన్ ఎంబసీ నుంచి తీసుకున్న 42,500 డాలర్లను పోలీసులు రికవరీ చేసి, తిరిగి ఎంబసీ ఖాతాలోకి జమచేయించారు. దీంతో రష్యన్ ఎంబసీ అధికారులు రాచకొండ పోలీసులను ప్రశంసించారు. ఈ కేసు దర్యాప్తులో పాల్గొన్న రాచకొండ సీపీ మహేశ్‌భగవత్, డీసీపీ వెంకటేశ్వర్‌రావు, ఏసీపీలు వేణుగోపాల్‌రావు, పృథ్వీందర్‌రావు, ఇన్‌స్పెక్టర్లు భిక్షమ్ రెడ్డి, రంగస్వామి, ఎస్‌ఐ జయరాం. కానిస్టేబుల్ హెచ్ కుమార్‌ను అభినందిస్తూ రష్యన్ ఎంబసీ అధికారులు లేఖ రాశారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీపీ మహేశ్‌భగవత్. చిత్రంలో రష్యన్ ఎంబసీ అధికారి బోల్దిరేవ్



రష్యన్ అంబాసీడర్ రాసిన లేఖను డీజీపీ మహేందర్‌రెడ్డికి అందిస్తున్న రష్యన్ ఎంబసీ వైస్ కౌన్సిల్ సెకండ్ సెక్రటరీ బోల్దిరేవ్

అంకితభావంతో పనిచేస్తున్నారు

నిందితుడి అరెస్ట్, రికవరీపై రష్యన్ అంబాసిడర్ నికోలే రిషటోవిచ్ కుదషెవ్ స్పందిస్తూ డీజీపీ మహేందర్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ లేఖను ఎంబసీ వైస్ కౌన్సిల్ సెకండ్ సెక్రటరీ ఇగోర్ బోల్దిరేవ్ స్వయంగా శుక్రవారం డీజీపీకి అందజేశారు. ఈ లేఖలో 'రాష్ట్ర పోలీసులు మీ సారథ్యంలో పనిచేస్తూ, నేర పరిశోధనల్లో మీ సూచనలు, సలహాలు తీసుకుంటూ తమ నైపుణ్యతకు పదును పెడుతున్నారు. రష్యన్ ఎంబీసీ కేసులో వేగంగా స్పందించి, నిందితుడి అరెస్ట్‌తోపాటు అతడు కాజేసిన రష్యా దేశపు సొత్తును పూర్తిగా రికవరీ చేసి, తిరిగి ఎంబసీకి ఇప్పించడం మీ పోలీసుల పనితీరు, పారదర్శకత, అంకితభావానికి అద్దం పడుతున్నది' అని పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో పాలుపంచుకున్న రాచకొండ సీపీ మహేశ్‌భగవత్‌తోపాటు ఇతర సిబ్బందిని అభినందిస్తూ, వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.




మాజీ సైనిక కుటుంబానికి చెక్కు అందజేస్తున్న రిటైర్డ్ హెచ్ఎం భూషణ్‌రావు

మాజీ సైనిక కుటుంబాలకు బాసట

పది మందికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించిన రిటైర్డ్ హెచ్ఎం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: దేశ రక్షణ కోసం పాటుపడిన మాజీ సైనికుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు ఓ రిటైర్డ్ హెచ్ఎం ముందుకొచ్చారు. వితంతువులు, దివ్యాంగులైన మాజీ సైనికుల పిల్లలు పది మందికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించి ఔదార్యం చాటుకున్నారు. హైదరాబాద్ మలక్‌పేటలోని సలీంనగర్‌కు చెందిన డీ భూషణ్‌రావు ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ పొందారు. చనిపోయిన సైనికుల కుటుంబాలకు, దివ్యాంగ పిల్లలున్న సైనిక కుటుంబాలకు శక్తిమేర సహాయపడాలని నిర్ణయించుకొని జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారులను సంప్రదించారు. తన రిటైర్మెంట్ డబ్బుల్లోంచి రూ.లక్ష విరాళంగా అందజేస్తానని తెలిపారు. దీంతో జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారులు పది మంది లబ్ధిదారులను ఎంపికచేసి వారిని శుక్రవారం సోమాజిగూడలోని సైనిక ఆరాంఘర్‌కు పిలిపించారు. భూషణ్‌రావు ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చెక్కు, దారి ఖర్చుల కోసం తలా రూ.200 అందజేశారు. అనంతరం భూషణ్‌రావు మాట్లాడుతూ.. దేశం కోసం పనిచేసిన మాజీ సైనికుల కుటుంబాలకు సహాయం చేయడం సంతృప్తిగా ఉన్నదన్నారు. ప్రాణాలను ఫణంగా పెట్టి దేశరక్షణ కోసం పనిచేసి, ప్రస్తుతం ఇబ్బందుల్లో ఉన్న మాజీ సైనిక కుటుంబాలను ఆదుకోవడం సైతం దేశసేవ కిందికే వస్తుందని భావించి ఈ సహాయం చేశానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సైనిక సంక్షేమశాఖ సంచాలకులు కల్నల్ పీ రమేశ్‌కుమార్, రంగారెడ్డి రీజియన్ ప్రాంతీయ సైనిక సంక్షేమాధికారి ఎన్ శ్రీనేశ్‌కుమార్, హైదరాబాద్ ప్రాంతీయ సైనిక సంక్షేమాధికారి కల్నల్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రాంబాబుయాదవ్‌ను అభినందిస్తున్న అసోసియేట్ అధ్యక్షుడు రాజిరెడ్డి

వాటర్‌వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడిగా రాంబాబుయాదవ్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: టీఆర్‌ఎస్‌కేవీ అనుబంధ వాటర్‌వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా టీఆర్‌ఎస్‌కేవీ రాష్ట్ర అధ్యక్షుడు జీ రాంబాబుయాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్ ఎస్సార్‌నగర్‌లోని యూనియన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో రాంబాబును రాష్ట్ర అధ్యక్షుడిగా, కే రాజిరెడ్డిని అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. రాంబాబు మాట్లాడుతూ జలమండలిలోని కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ జహంగీర్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌కుమార్, నాయకులు శేఖర్, శ్రీనివాస్, హాషీం, షకీల్ యామిన్, లక్ష్మీనారాయణ,అశోక్, నర్సింగ్‌రావు, శ్రీను, సాయికిరణ్ పాల్గొన్నారు.

ఏప్రిల్ నుంచి మెట్రో మంత్లీపాస్‌లు

మొదటివారంలో అందుబాటులోకి వచ్చే అవకాశం

స్మార్ట్‌కార్డులపై రాయితీ కొనసాగింపు!

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: మెట్రోరైలులో ప్రయాణించడానికి మంత్లీపాస్‌లు రానున్నాయి. ఈ పాస్‌లు ఏప్రిల్ నుంచి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నది. దీనికి సంబంధించిన కసరత్తు తుదిదశకు చేరుకున్నది. కామన్ టికెట్, కామన్ మంత్లీపాస్‌ను అందుబాటులోకి తేవాలని మెట్రోరైలు, ఎల్ అండ్‌టీ అధికారులు భావించినా ఇతర ప్రయాణ సంస్థలతో ఒప్పందాలు ఇప్పటివరకు అమల్లోకి రాలేదు. దీంతో ముందుగా నెలవారీ పాస్‌లను అందుబాటులోకి తేవాలని ఎల్ అండ్ టీ నిర్ణయించింది. ఈ పాస్‌లు అందుబాటులోకి వస్తే ఉద్యోగులు, విద్యార్థులకు, పనులపై నిత్యం వెళ్లేవారికి ఉపయుక్తంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. అదేవిధంగా మెట్రోరైలులో ప్రయాణికుల సంఖ్య కూడా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. మరోవైపు మంత్లీపాస్‌లతో టికెట్ కౌంటర్ దగ్గరకు వెళ్లే అవసరం కూడా ఉండదని, దీంతో ప్రయాణం మరింత సులభతరం అవుతుందని చెప్తున్నారు. ఈ నిర్ణయం మెట్రోరైలులో నిత్యం ప్రయాణించేవారిని మరింత ఆకర్షిస్తుందని, సాధ్యమైనంత త్వరగా పాస్‌లు తీసుకురావాలని ఎల్ అండ్ టీ భావిస్తున్నది. ఆ తర్వాత డెయిలీ పాస్‌లు కూడా అందుబాటులోకి తెచ్చే అవకాశమున్నది. ఈ పాస్‌లను దశలవారీగా అందించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. అయితే మంత్లీపాస్ ధర ఎంత ఉంటుందనే విషయంలో ఇప్పటికీ స్పష్టత రాలేదని ఎల్ అండ్ టీ వర్గాలు తెలిపాయి. అదేవిధంగా ప్రస్తుతం మెట్రోస్మార్ట్‌కార్డులపై ప్రయాణచార్జీలో 10 శాతం రాయితీ కల్పిస్తున్నారు. రాయితీ గడువు మార్చి 31వ తేదీతో ముగుస్తున్నది. ఈ గడువును మళ్లీ పెంచి రాయితీని కొనసాగించనున్నారు. ఈ రెండు నిర్ణయాలను 2018-19 ఆర్థిక సంవత్సరంలో అమలు చేయాలని ఎల్ అండ్ టీ నిర్ణయించింది.



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మేడ్చల్ కలెక్టరేట్ ఆవరణలో మహిళలు, విద్యార్థినులు కలిసి తెలంగాణ రాష్ట్రం, మధ్యలో మేడ్చల్ జిల్లా ఆకారం వచ్చేలా మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ మల్లారెడ్డి, కలెక్టర్ ఎంవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- మేడ్చల్ జిల్లా, నమస్తే తెలంగాణ ప్రతినిధి

రసాయన పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం

రూ.కోట్లల్లో ఆస్తినష్టం

గుమ్మడిదల: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని ఓ రసాయనిక పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగింది. రసాయన డ్రమ్ములు పేలడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ప్రమాదంలో రూ.కోట్లలో ఆస్తినష్టం జరిగినట్టు తెలుస్తున్నది. గుమ్మడిదల పారిశ్రామికవాడలోని మహాసాయి ల్యాబరేటరీ పరిశ్రమలో శుక్రవారం సాయంత్రం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించింది. ఆ సమయంలో పరిశ్రమలో ఉన్న సాల్వెంట్ ట్యాంకర్లకు మంటలు అంటుకున్నాయి. దీంతో డ్రమ్ములు ఆకాశంలోకి ఎగురుతూ పేలిపోయాయి. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. జీడిమెట్ల, నర్సాపూర్ నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. జరిగిన ఆస్తి నష్టాన్ని అంచనా వేస్తున్నామని పరిశ్రమ వర్గాలు చెప్పాయి.



సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల పారిశ్రామికవాడలోని మహాసాయి ల్యాబరేటరీ నుంచి ఎగిసి పడుతున్న మంటలు

సోమవారం నుంచి అసెంబ్లీ పరిసరాల్లో ఆంక్షలు

18వ తేదీ వరకు అమలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: శాసన సభ సమావేశాలు సోమవారం నుంచి జరుగనున్న నేపథ్యంలో అసెంబ్లీ, కౌన్సిల్ హాల్ చుట్టూ నాలుగు కిలోమీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు విధిస్తూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీవీ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 12వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచి 18వ తేదీ ఉదయం ఆరు గంటల వరకు అమలులో ఉంటాయని కమిషనర్ పేర్కొన్నారు. నిషేధాజ్ఞలు ఉన్నందున ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించరాదని స్పష్టంచేశారు. శాంతిభద్రతల పరిరక్షణ నేపథ్యంలో నిషేధాజ్ఞలు విధిస్తున్నట్టు వివరించారు.

సోలార్ ప్లాంట్ల నిర్మాణం వేగవంతం

• సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సింగరేణికి సంబంధించిన అన్ని ప్రాంతాల్లో సోలార్ ప్లాంట్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఆ సంస్థ సీఎండీ ఎన్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సింగరేణి విద్యుత్ విభాగం, థర్మల్ విద్యుత్ కేంద్రం, సివిల్‌శాఖ ఉన్నతాధికారులతో శుక్రవారం సింగరేణి భవన్‌లో సమావేశమైన ఆయన.. 500 మెగావాట్ల సోలార్ ప్లాంటు నిర్మాణ లక్ష్యంలో భాగంగా ఏడాదిలోపు 300 మెగావాట్ల మేర ప్లాంటు నిర్మాణం పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్లాంటుకు కావాల్సిన భూములను గుర్తించాలని ఆదేశించారు.

నేరుగా అధికారులను సంప్రదించండి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జైళ్లశాఖకు సంబంధించిన ఫిర్యాదులు చేయాల్సి ఉంటే పనివేళల్లో నేరుగా అధికారులను సంప్రదించాలని జైళ్లశాఖ డీజీ వీకే సింగ్ తెలిపారు. చంచల్‌గూడ కేంద్ర కారాగారం ఆవరణలో ఉన్న ప్రధాన అధికారుల కార్యాలయాలను నల్లగొండ చౌరస్తాలో ఉన్న జైళ్లశాఖ భవనంలోకి మార్చామని తెలిపారు. సంస్కరణలతో ముందుకెళ్తున్న జైళ్లశాఖ దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలిచిందన్నారు.




సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో మీడియాతో మాట్లాడుతున్న ఇథియోపియా వ్యవసాయ శాఖ మంత్రి ఈయాసు అబ్రాహా అలీ. నర్సాపూర్ చెరువును పరిశీలిస్తున్న ఇథియోపియా ప్రతినిధులు. చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ రాజమణి

తెలంగాణ ప్రభుత్వ పథకాలు అమోఘం

• మెదక్ జిల్లాలో చెరువులను సందర్శించిన ఇథియోపియా మంత్రి బృందం
• మిషన్ కాకతీయ భేషంటూ ప్రశంసలు

నర్సాపూర్, నమస్తే తెలంగాణ/పటాన్‌చెరు టౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు బాగున్నాయని ఇథియోపియా దేశ వ్యవసాయ, సహజవనరులశాఖ మంత్రి డాక్టర్ ఈయాసు అబ్రాహాఅలీ అన్నారు. ముఖ్యంగా మిషన్ కాకతీయ పథకాలను ప్రత్యేకించి ప్రశంసించారు. ఆయన నేతృత్వంలోని ఉన్నతస్థాయి ఇథియోపియా ప్రతినిధి బృందం శుక్రవారం మెదక్ జిల్లా నర్సాపూర్ రాయారావు చెరువు, రుస్తుంపేట చెరువులను సందర్శించింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని ఇక్రిశాట్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకించింది. సహాయమంత్రి టెస్ఫాయి మెంజిస్టే దోరితోసహా పలువురు సీనియర్ అధికారులతో కూడిన ఇథియోపియా బృందానికి జెడ్పీ చైర్‌పర్సన్ రాజమణి, టీఆర్‌ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మురళీయాదవ్, ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ సురేశ్‌కుమార్, ఎస్‌ఈ పద్మారావు ఘనంగా స్వాగతం పలికారు. రాయారావు చెరువు వద్ద ఇథియోపియా మంత్రి ఫొటోలు దిగారు.మిషన్ కాకతీయ ద్వారా చేపడుతున్న పనులు, రైతులకు జరుగుతున్న మేలు, ప్రభుత్వం చేపట్టిన వ్యవసాయ విధానం తదితర విషయాలను వాకబు చేశారు. ఇక్కడ చేపడుతున్న పనులు, ఇస్తున్న సబ్సిడీపై అధ్యయనం చేసి తమ దేశంలో అమలు చేయడానికి కృషి చేస్తామని చెప్పారు. తమ దేశంలో రైతులకు ప్రస్తుతం ఎలాంటి సబ్సిడీలు లేవన్నారు. ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులు ఆర్థికంగా ఎదుగడం కోసం ఉచిత కరంటుతోపాటు వ్యవసాయ యాంత్రిక పరికరాలు, విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై ఇస్తున్నదని, రైతులకు కొనుగోలు కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధర కల్పిస్తున్నదని వివరించారు.

తెలంగాణది ముందుచూపు

తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా నడుస్తున్న మిషన్ కాకతీయ పథకానికి సంబంధించిన 9 నిమిషాల పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను పటాన్‌చెరులోని ఇక్రిశాట్‌లో ఇథియోపియా బృందం తిలకించింది. తెలంగాణలో అమలవుతున్న మిషన్‌కాకతీయ అద్భుతమైన పథకమని మంత్రి ఈయాసు అబ్రాహా అలీ ప్రశంసించారు. ప్రపంచవ్యాప్తంగా వేగంగా మారుతున్న వాతావరణ మార్పులు, పర్యావరణ అసమతౌల్యం వల్ల క్రమపద్ధతిలో వర్షాలు పడటంలేదన్నారు. ఇలాంటి పరిస్థితిలో వర్షపునీటిని నిలువ చేసుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరిస్తూ మిషన్ కాకతీయ వంటి అద్భుత పథకాన్ని అమలుచేస్తున్న తీరు అమోఘమని అన్నారు. రాష్ట్రంలో ఉన్న 45 వేల చెరువుల ఆధునీకరణ సాధారణ విషయం కాదని, ఇది వివేకంతో కూడుకున్న గొప్ప కార్యక్రమమని అన్నారు. కార్యక్రమంలో ఇథియోపియా దేశానికి చెందిన వ్యవసాయశాఖ సహాయమంత్రి టెస్ఫాయి మెంజిస్టే దోరి, ఇక్రిశాట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ పీటర్ కాన్‌బెర్రీ, రాష్ట్ర నీటిపారుదల విభాగానికి చెందిన కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ జీ మల్సూర్, రాష్ట్ర నీటిపారుదలశాఖ చీఫ్ ఇంజినీర్లు సురేశ్‌కుమార్, శ్యాంసుందర్, ఇథియోఫియా వ్యవసాయ పరిశోధనా సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ దిరిబా జెలెటే చలి, వ్యవసాయ ఉన్నతాధికారులు ఈసాయేస్ లెమ్మా హాయి, డాక్టర్ తిలహున్ అమేడే వోన్డిఫ్రా, కెబెరు బలయాన్ ఒల్డ్‌కిడాన్ పాల్గొన్నారు.

ఇద్దరు కేంద్రమంత్రుల రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం


హైదరాబాద్, నమస్తే తెలంగాణ : కేంద్రప్రభుత్వం నుంచి వైదొలిగిన టీడీపీకి చెందిన మంత్రులు అశోక్ గజపతిరాజు, సుజనాచౌదరి రాజీనామాలను శుక్రవారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదించారు. ప్రధాని నరేంద్రమోదీ సూచన మేరకు వారి రాజీనామాలను ఆమోదించినట్టు రాష్ట్రపతిభవన్ వర్గాలు తెలిపాయి. పౌరవిమానాయానశాఖమంత్రి అశోకగజపతిరాజు, శాస్త్ర సాంకేతికశాఖమంత్రి సుజనాచౌదరి గురువారం సాయంత్రం ప్రధాని నరేంద్రమోదీని కలిసి తమ రాజీనామాలను సమర్పించారు. పౌరవిమానయానశాఖను ప్రధాని చూస్తారని రాష్ట్రపతిభవన్ వర్గాలు ప్రకటించాయి.

ఏపీ మంత్రుల రాజీనామాకు గవర్నర్ ఆమోదం

ఆంధ్రప్రదేశ్ మంత్రులు కామినేని శ్రీనివాసరావు, పైడికొండ మాణిక్యాలరావు రాజీనామాలను ఉమ్మడి రాష్ర్టాల గవర్నర్ నరసింహన్ ఆమోదించారు. ఏపీ సీఎం చంద్రబాబు సూచించిన ప్రకారం వారి రాజీనామాను ఆమోదించినట్టు గవర్నర్ ముఖ్యకార్యదర్శి హర్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. ఏపీ ప్రత్యేక హోదా, నిధుల విడుదలలో నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తున్నదని ఆరోపిస్తూ టీడీపీ కేంద్రప్రభుత్వం నుంచి వైదొలిగిన నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం నుంచి వైదొలుగుతున్నట్టు బీజేపీ ప్రకటించింది. దీంతో తమ ఇద్దరు మంత్రులు రాజీనామా చేయగా గవర్నర్ ఆమోదించారు.

బీజేపీతో పొత్తు వల్ల ఒరిగిందేమీలేదు

• కేంద్రంతో కటీఫ్‌పై వెనక్కు తగ్గేదిలేదు
• ఏపీ సీఎం చంద్రబాబు



హైదరాబాద్ / అమరావతి, నమస్తే తెలంగాణ: గత ఎన్నికల్లో బీజేపీతో పొత్తువల్ల టీడీపీకి ప్రత్యేకంగా ఒరిగిందేమీలేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. సాధారణ ఎన్నికల కంటే ముందే జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేసిన టీడీపీ విజయం సాధించిందని గుర్తుచేశారు. బీజేపీతో పొత్తుపెట్టుకున్న తరువాత ఓట్లు పెరుగలేదన్నారు. అమరావతి నుంచి ఢిల్లీలోని టీడీపీ ఎంపీలతో శుక్రవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించడంతోపాటు, అందుబాటులోఉన్న మంత్రులతో అత్యవసర సమావేశం ఏర్పాటుచేసిన చంద్రబాబు రాజకీయ అంశాలపై చర్చించారు. తాజా రాజకీయ పరిణామాలను ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు వ్యూహకమిటీని ఏర్పాటుచేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్రానికి ఏదైనా మేలు జరుగుతుందేమోనన్న ఉద్దేశంతోనే పొత్తు పెట్టుకున్నామని, కానీ తమ ఆశలన్నీ అడియాసలయ్యాయని చంద్రబాబు చెప్పారు. ప్రధాని మోదీ పిలిచినప్పటికీ కేంద్రప్రభుత్వం నుంచి వైదొలిగిన విషయంలో వెనక్కు తగ్గేది లేదని సీఎం చంద్రబాబు మంత్రులకు స్పష్టంచేశారు. కూర్చుని మాట్లాడుకుంటే సమస్య పరిష్కారమయ్యేదని ప్రధాని మోదీ తనకు ఫోన్‌చేసి పేర్కొన్నారని.. నాలుగేండ్లు ఓపికతో ఉన్నామని, ఇప్పుడు తీసుకున్నది సొంతనిర్ణయం కాదని, ప్రజల సెంటిమెంట్‌ను గౌరవించి తీసుకున్న నిర్ణయమని ఆయనకు వివరించినట్టు తెలిపారు. అన్ని విషయాలు మాట్లాడుదాం ఢిల్లీకి రావాలని ప్రధాని తనను ఆహ్వానించారని తెలిపారు. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా వెనక్కి తగ్గలేం, ఆ స్థాయి దాటిపోయిందని చెప్పినట్టు వివరించారు.

ప్యాకేజీ నిధుల ఖర్చులడిగినందుకే..

చంద్రబాబు రాద్ధాంతం

• బీజేపీ నేత, కేంద్ర మాజీ మంత్రి పురందేశ్వరి



హైదరాబాద్ / అమరావతి, నమస్తే తెలంగాణ: ఏపీకి కేంద్రం ఇచ్చిన నిధుల విషయంలో సీఎం చంద్రబాబు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని బీజేపీ నాయకురాలు, కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి మండిపడ్డారు. విజయవాడలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రత్యేకహోదాతో రాష్ర్టానికి లాభం ఉండదని చంద్రబాబు స్వయంగా అంగీకరించారని, ప్యాకేజీలో భాగంగా తీసుకున్న డబ్బును ఎక్కడ ఖర్చుపెట్టారని అడిగితే లెక్కలు చెప్పకుండా ఇప్పుడు హోదా కోసం రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు.

ఎల్లుండే అవిశ్వాస తీర్మానం: బొత్స

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏపీకి ప్రత్యేక హోదా కోరుతూ లోక్‌సభలో ఈ నెల 21న కాకుండా 12వ తేదీనే అవిశ్వాసతీర్మానం పెడుతామని వైసీపీ నాయకుడు బొత్స సత్యనారాయణ ప్రకటించారు. శుక్రవారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. అవిశ్వాస తీర్మానం తరువాత తమ పార్టీ ఎంపీలు రాజీనామా చేస్తారని, అవిశ్వాస తీర్మానానికి మద్దతిస్తారో? లేదో? సీఎం చంద్రబాబు తేల్చుకోవాలని అన్నారు. కేంద్రంలో మంత్రి పదవులకు రాజీనామా చేసిన అశోక్‌గజపతిరాజు, సుజనాచౌదరి సంతృప్తికరంగా లేరని, హోదాకోసమే రాజీనామా చేశామని చెప్పుకోలేకపోతున్నారని బొత్స తెలిపారు. ఏపీలో మంత్రులు ఒక మాట మాట్లాడుతుంటే.. ఢిల్లీలో ఎంపీలు మరోమాట మాట్లాడుతున్నారని విమర్శించారు.

గుంటూరులో అతిసారంతో 10 మంది మృతి

హైదరాబాద్ / అమరావతి, నమస్తే తెలంగాణ: గుంటూరులో కలుషిత నీరు తాగడంతో అతిసారవ్యాధి బారినపడి ఐదు రోజుల్లో 10 మంది మృత్యువాతపడ్డారు. వివిధ దవాఖానల్లో వందలాదిమంది చికిత్స పొందుతున్నారు. రోగుల సంఖ్య పెరుగడంతో జీజీహెచ్‌లో అదనంగా వార్డులను కేటాయించారు. శుక్రవారం ఆరోగ్యం విషమంగా మారిన 12 మందిని కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రైవేటు వైద్యశాలలకు తరలించారు. తాగునీటి పైపుల్లోకి మురుగునీరు ఎలా వెళ్లిందనే దానిని పరిశీలించేందుకు పురపాలకశాఖ డైరెక్టర్, ప్రజారోగ్య ఇంజినీరింగ్ ఇన్ చీఫ్, పట్టణ ప్రణాళిక విభాగం సంచాలకులతో కమిటీని ఏర్పాటు చేశారు. సంఘటనకు బాధ్యులుగా భావిస్తున్న ఏడుగురు కార్పొరేషన్ ఉద్యోగులపై సస్పెండ్ వేటుపడింది. మరో ముగ్గురిని సరెండర్ చేస్తూ కమిషనర్ అనురాధ ఉత్తర్వులు జారీచేశారు.



జీజీహెచ్‌లో చికిత్సపొందుతున్న అతిసారం బాధితులు

వైద్యవిద్య ఇంచార్జి డైరెక్టర్‌గా రమేశ్‌రెడ్డి నియామకం నిలిపివేత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర వైద్య విద్య ఇంచార్జి డైరెక్టర్‌గా డాక్టర్ రమేశ్‌రెడ్డి నియామకాన్ని రద్దు చేస్తూ ఉమ్మడి హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నిబంధనల ప్రకారం సీనియారిటీ జాబితాలో చివరిస్థానంలో ఉన్న రమేశ్‌రెడ్డిని వైద్యవిద్య ఇంచార్జి డైరెక్టర్‌గా నియమించడాన్ని జస్టిస్ ఎమ్మెస్ రామచంద్రరావు నేతృత్వంలోని ధర్మాసనం తప్పుబట్టింది. రమేశ్‌రెడ్డి నియామకాన్ని సవాల్‌చేస్తూ ఉస్మానియా వర్సిటీ ప్రొఫెసర్ శ్రవణ్ పిటిషన్ దాఖలుచేశారు.

సహకార సంఘాల అధికారికి జైలుశిక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నల్లగొండ జిల్లాలోని మూసీ మత్స్యకార సంఘానికి ఎన్నికలు నిర్వహించాలంటూ కోర్టు జారీచేసిన ఆదేశాలను పాటించని సహకార సంఘాల అదనపు కమిషనర్ (ఎన్నికల అధికారి) జీ శ్రీనివాసరావుకు రెండునెలల జైలుశిక్ష విధిస్తూ ఉమ్మడి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. కోర్టు ధిక్కారం కింద ఈ శిక్షను విధిస్తున్నట్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది.

జనజాతరకు అనుమతి నిరాకరణపై హైకోర్టులో వ్యాజ్యం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పెన్షన్ కాంట్రిబ్యూటరీ స్కీమ్ (సీపీఎస్) విధానాన్ని రద్దుచేయాలనే డిమాండ్‌తో శనివారం నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించే జనజాతరకు పోలీసులు అనుమతి నిరాకరించడంపై సీపీఎస్ ఉద్యోగుల సంఘం హైకోర్టును ఆశ్రయించింది. తమ సభకు సాంస్కృతిక శాఖ ఇప్పటికే అనుమతులు మంజూరు చేసిందని, పోలీసులు దరఖాస్తును దీర్ఘకాలం పెండింగ్‌లో పెట్టుకొని సభకు అనుమతి నిరాకరిస్తున్నట్టు గురువారం తెలియజేశారని వివరించారు.తదుపరి విచారణను న్యాయస్థానం ఈ నెల 13వ తేదీకి వాయిదావేసింది.

రుణ విమోచన కమిషన్ ఎందుకు ఏర్పాటు చేయలేదు?

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ ఏర్పాటులో హైకోర్టుకు ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడంపై స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఉమ్మడి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. నిర్ణీత గడువులో కమిషన్ ఏర్పాటు చేయకపోవడంపై బీజేపీ నేత నల్లు ఇంద్రసేనారెడ్డి దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ వ్యాజ్యంపై శుక్రవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. తదుపరి విచారణ విచారణను నాలుగువారాలకు వాయిదా వేసింది.

Life is Beautiful
నమస్తే తెలంగాణ
జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు,
సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi
హైదరాబాద్
శనివారం 10 మార్చి 2018
WWW. NTNEWS.COM



'ప్యాడ్'.. ఇది గుసగుసగా మాట్లాడుకోవడానికి చెడు మాటనా?
దాచి దాచి తీసుకెళ్లడానికి ఇదేమైనా అంటరాని వస్తువా?
ఎందుకు శానిటరీ ప్యాడ్స్ గురించి రహస్యంగా మాట్లాడుతున్నాం?
అవగాహన లేకనా? ఎవరేమనుకుంటారోననే భయంతోనా?
ఈ గుసగుసలు ఆపేయండి.
శానిటరీ నాప్‌కిన్స్‌పై అవగాహన పెంచుకోండి..
అంటున్నది నిజామాబాద్ అమ్మాయి ప్రణతి.

ప్రణతి.. ఇందూరి ప్యాడ్ ఉమన్!

ఓ వ్యక్తి యథార్థ కథ ఆధారంగా అక్షయ్‌కుమార్ తీసిన ప్యాడ్‌మన్ సినిమా మార్పు తీసుకొస్తున్నది. సోషల్‌మీడియాలో కూడా పాజిటివ్ అభిప్రాయాలు వస్తుండడంతో చాలామంది అమ్మాయిలు.. మహిళలు ప్యాడ్స్ గురించి బాహాటంగానే మాట్లాడుతున్నారు. ఒకప్పుడు ఇంట్లో కూడా చర్చించలేని విషయాలను చర్చా వేదికల సాక్షిగా వ్యక్తపరుస్తున్నారు. కానీ ప్యాడ్‌మన్ సినిమా రాక ముందే ప్యాడ్స్ పట్ల అవగాహన కల్పిస్తూ వాటిని పంచుతున్నది వైద్య విద్యార్థిని మైసరి ప్రణతి. ప్యాడ్.. గుసగుసగా మాట్లాడే వస్తువు కాదనీ.. మహిళల వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణలో విలువైన వస్తువని బహిరంగంగా మాట్లాడుతున్నది.



'అక్కా..నాకు నాప్‌కిన్ ఇవ్వవా'..ఓ అనాథ బాలిక దీనంగా అడిగిన మాట ప్రణతి ప్యాడ్ ఉమన్ కావడానికి అంకురార్పణ చేసింది. నిజామాబాద్‌లోని ఇందూరుకు చెందిన ప్రణతి మహబూబ్‌నగర్ జిల్లాలో మెడిసిన్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. ఫస్టియర్లో ఉన్నప్పుడు మహబూబ్‌నగర్ జిల్లాలోని పర్యాటక ప్రదేశమైన పిల్లలమర్రి సందర్శనకు స్నేహితులతో వెళ్ళింది. తిరుగు ప్రయాణంలో పిల్లలమర్రి సమీపంలోని ఓ అనాథాశ్రమానికి వెళ్ళాలని నిర్ణయించుకున్నారు. అక్కడ పిల్లలకు ఇవ్వడానికి చాక్లెట్లు.. బిస్కెట్లు.. పండ్లు తీసుకొని వెళ్ళారు. ఆశ్రమంలో పిల్లలకు వాటిని పంపిణీ చేస్తున్నారు. ఇంతలో ఓ అమ్మాయి 'ఇవి నాకు వద్దు' అన్నది. చూస్తే ఆ అమ్మాయి దీనంగా కనిపిస్తున్నది. ఆమెకు ఇంకా ఏదో అవసరం ఉందని ఆమె కళ్లను చూస్తేనే తెలిసిపోతున్నది. 'ఏం కావాలమ్మా?' అని ప్రణతి ఆ అమ్మాయిని అడిగింది. అప్పుడు ఆ అమ్మాయి ప్రణతి చేయి పట్టుకొని తన దగ్గరకు తీసుకొని 'అక్కా నాకు ప్యాడ్ (శానిటరీ నాప్‌కిన్) కావాలి' అని దీనంగా అడిగిందట.

ప్యాడ్ ఉమన్ అవతారం: ఆ అమ్మాయి అన్న ఆ మాట వినగానే ప్రణతి కళ్లలో నీళ్లు తిరిగాయి. ఎంతో అవసరమైన ఆ వస్తువు లేక ఇంత బాధ పడడమా? అనే ఆవేదన ప్రణతిని కమ్మేసింది. అమ్మాయిని గట్టిగా కౌగిలించుకుంది. 'ప్యాడ్ లేక నీ బాధ ఎంతటిదో అర్థం చేసుకోగలనమ్మా' అన్న భావన.. ఊరట ఆ కౌగిలింతతో కలిగింది అమ్మాయికి. వెంటనే తన పాకెట్ మనీతో అమ్మాయికి నాప్‌కిన్‌లు కొని తెచ్చి ఇచ్చింది ప్రణతి. అప్పుడా అమ్మాయిలో కొండంత సౌకర్యం కలిగిన ఆనందం చూసింది. ఆ సంఘటనతో ప్రణతి ప్యాడ్ ఉమన్‌గా మారిపోయింది. అప్పటి నుంచి ప్యాడ్‌ల పంపణీ ప్రారంభించింది.

స్ఫూర్తి నింపిన ఆశయం : ప్రణతిలో మొలకెత్తిన ఆ ఆశయం కార్యరూపం దాల్చింది. నిజామాబాద్‌లోని షిప్ బిల్డింగ్ హాస్టల్లో ప్యాడ్‌ల పంపిణీతో తన ఆశయ సాధన ప్రారంభించింది.అనాథాశ్రమాల్లో, హాస్టళ్లలో తన సొంత ఖర్చులతో ప్యాడ్‌లు పంపిణీ చేస్తూ వస్తున్నది. పంపిణీ చేయడంలో అందరికీ ప్యాడ్‌లు అందుబాటులో ఉండాలి, మహిళల వ్యక్తిగత పారిశుధ్యంలో, ఆరోగ్యపరంగా ప్యాడ్‌ల ఆవశ్యకత ఎంతో ఉందన్న సందేశం ఉండేలా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నది.

ఇన్నర్‌వీల్ స్పందన : ప్రణతి చేస్తున్న కార్యక్రమాలను చూసి ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు స్పందించారు. ప్రణతిని అభినందించి ఆమె స్ఫూర్తిగా వారు కూడా ప్యాడ్‌ల పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తాను చదువుకున్న ఎన్‌జీఎస్ స్కూల్లో పంపిణీ చేసింది. సెలవులు రాగానే నిజామాబాద్ కలెక్టర్‌గా పని చేసినప్పుడు డాక్టర్ యోగితా రాణా ప్రారంభించిన మానవతా సదన్‌లోని పిల్లలకు, స్నేహ సొసైటీ పిల్లలకు పంపిణీ చేయడానికి సిద్ధమవుతున్నట్లు ఆమె తెలిపారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహం : ప్రణతి తండ్రి లక్ష్మీనారాయణ, తల్లి రాణి. తండ్రి లక్ష్మి నారాయణ నిజామాబాద్ పట్టణంలో మెడికల్ షాపు నడిపిస్తుంటాడు. శానిటరీ నాప్‌కిన్స్ అంటేనే తల్లి, కూతుళ్ళైనా కలిసి మాట్లాడుకోలేని విషయంగా ఉందనడం ఎంత మాత్రం అతిశయోక్తి కాదు. అలాంటిది తమ కూతురు ఈ విధమైన కార్యక్రమాలు చేస్తుండడం చూసి ప్రణతి తల్లిదండ్రులు తనను ప్రోత్సహించారు. 'శానిటరీ నాప్‌కిన్ అనే మాట రహస్యంగా మాట్లాడాల్సింది కాదు.. నాప్‌కిన్ గురించి దాని ఆవశ్యకత గూర్చి ఓపెన్ డిబేట్ కావాలి' అని తమ కూతురు చెబుతుంటే వారు గర్వంగా ఫీలయ్యారు. తండ్రి తన షాపులో విక్రయానికి ఉంచే నాప్‌కిన్‌లు కూడా కూతురు ఉచితంగా పంపిణీ చేయడానికి ఇచ్చేవాడు. అమ్మానాన్న ఈ విషయంలో అందించిన ప్రోత్సాహం తనలో మరింత ఉత్సాహం నింపిందని అంటున్నది ప్రణతి.

అవగాహన అందరి బాధ్యత: పాఠశాలల్లోనే నాప్‌కిన్ పై బాలికలకు అవగాహన కల్పించాలి. దీనిని వాడకపోవడం వల్ల కలిగే అనారోగ్యాలు అంతా ఇంతా కావు. నార్త్ ఇండియాతో పోలిస్తే సౌత్ ఇండియాలో ప్యాడ్‌లపై అవగాహన చాలా తక్కువగా ఉంది. ఈ అవగాహన పెంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులది.. గురువులది. ప్యాడ్‌లెస్ మేనేజ్ ద్వారా ఇన్‌ఫెక్షన్ల బారిన పడుతారు. ఇది సర్వైకల్ క్యాన్సర్‌కు దారి తీస్తుంది. సంతాన లేమికి కారణమవుతుంది. ప్రాణాల మీదకు వస్తుంది. ఇది కుటుంబ సమస్యకు దారి తీస్తుందంటున్నది ప్రణతి.

పాఠశాల స్థాయిలో అవగాహన:

బాలికకు పరిపక్వత రాకముందే ఇలాంటి విషయాలపై అవగాహన కల్పించాలి. సమస్య వచ్చాక వైద్యంకంటే అవగాహనతో సమస్య రాకుండా నివారించడమే ఎక్కువ అవసరం. ప్యాడ్‌ల ధరలు కూడా మార్కెట్‌లో అధికంగా ఉన్నాయి. వీటిని చౌకగా అందించేలా ప్రభుత్వాలు కృషి చేయాల్సిన అవసరం ఉందంటున్నది ప్రణతి. ఆమె నిజామాబాద్‌లోని ప్రెసిడెన్సీ స్కూల్‌లో నర్సరీ చదివింది. 6వ తరగతి నుంచి 10+2 వరకు నిజామాబాద్‌లోని దాస్‌నగర్‌లోగల ఎన్‌జీఎస్‌లో చదివింది. ప్రస్తుతం మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ మెడికల్ కళాశాలలో మెడిసిన్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది.



ఉచితంగా అందించాలి:

శానిటరీ నాప్‌కిన్స్ పట్ల గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన పెరుగాలి. దీనికి అందరూ బాధ్యత వహించాలి. ఎందుకు ప్యాడ్స్‌ను చూసి తల తిప్పుకోవాలి? ఇవేం అంటరాని వస్తువులు కావు కదా? ముందు మహిళల్లో మార్పు రావాలి. పాజిటివ్‌గా ఆలోచించాలి. ఇవి వెనుకటి రోజులు కావు. ఆరోగ్యంగా ఉండాలంటే ప్యాడ్స్‌పై అవగాహన ఏర్పరుచుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో.. కళాశాలల్లో వీటిని ఉచితంగా అందించాలి. కొన్ని చోట్ల అందిస్తున్నా దీనిని పూర్తిగా అన్ని ప్రాంతాల్లో అందించాల్సిన అవసరం ఉన్నది.

ప్రణతి మైసరి


దండుగుల శ్రీనివాస్
నమస్తే తెలంగాణ నిజామాబాద్ ప్రతినిధి

ఇంటి చిట్కా



- తడి మసాలాను తక్కువ మంట మీద వేయిస్తే రంగు కోల్పోదు. పైగా రుచిగా ఉంటుంది
- కచోరి తయారీకి ఉపయోగించే పిండిలో చెంచా వేడినూనె వేస్తే చక్కగా వస్తాయి.
- నూడుల్స్ ఉడికించిన తర్వాత వెంటనే చల్లటి నీళ్లలో వేస్తే తీసేటప్పుడు అతుక్కోవు.
- చెక్క ఫర్నీచర్‌ను పేపర్‌తో తుడిస్తే పాలిష్ చేసినట్లు మెరుస్తాయి.
- కూరలో కారం ఎక్కువైతే కాస్త కొబ్బరిపాలు కలిపి చూడండి.
- పండు టమాటాలు చిట్లిపోకుండా ఉండాలంటే ఉప్పునీళ్లలో వేసి చూడండి.
- వెండి సామాగ్రి భద్రపరిచే డబ్బాలో చిన్న సుద్దముక్క వేస్తే రంగు మారదు.
- కూరల్లో మసాలా ఎక్కువైందా? రెండు మూడు టమాటాలను ఉడికించి అందులో కలుపండి. మసాలా ఘాటు తగ్గుతుంది.
- ఇంట్లో ఈగల బెడద ఎక్కువగా ఉంటే నీళ్లలో కాసింత ఉప్పు, పసుపు కలిపి చల్లండి.
- రాత్రి పడుకునే సమయంలో వెంట్రుకలకు కొబ్బరి నూనె అప్లై చేసి, ఉదయాన్నే తలస్నానం చేస్తే వెంట్రుకలు బలంగా, నల్లగా నిగనిగలాడుతాయి.
- రోజుకో వెల్లుల్లిపాయ తినండి. శరీరంలోని చెడుకొవ్వు ఇట్టే కరిగిపోతుంది.

నాన్న బాగవుతారా?


అడుగండి చెబుతా

మా నాన్న వయసు 58 సంవత్సరాలు. గత మూడు నెలల నుంచి తలనొప్పి, మాట్లాడడంలో ఇబ్బంది, వినికిడి సరిగ్గా లేకపోవడం, అప్పుడపుడు వాంతులు అవుతుంటే డాక్టర్‌ను సంప్రదించాం. వారి సలహా మేరకు ఎంఆర్‌ఐ స్కాన్ చేయించాం. మెదడులో ట్యూమర్లు ఉన్నట్టుగా రిపోర్టులు వచ్చాయి. బ్రెయిన్ ట్యూమర్ అనగానే చాలా కంగారుగా ఉంది. ఈ సమస్యకు సంబంధించిన చికిత్స ఇతర వివరాలు తెలుపగలరు.

విజేత, వికారాబాద్

బ్రెయిన్ ట్యూమర్లు రెండు రకాలు. మాలిగ్నెంట్ ట్యూమర్లు, క్యాన్సర్ ట్యూమర్లు. క్యాన్సర్ ట్యూమర్లు రెండు రకాలుగా ఉంటాయి. కొన్ని ట్యూమర్లు మెదడులోనే ప్రారంభమవుతాయి. రెండో రకం ట్యూమర్లు శరీరంలోని ఇతర భాగాలలో క్యాన్సర్ ఏర్పడి అది మెదడుకు వ్యాపించడం వల్ల వస్తాయి. సాధారణంగా మెదడులో ట్యూమర్ ఏర్పడినపుడు ఫిట్స్ రావడం, కంటి చూపులో తేడా రావడం, వాంతులు, మానసికమైన మార్పులు, నడకలో మాటలో తేడా రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ట్యూమర్లను నిర్ధారించడానికి భౌతిక పరీక్షలతో పాటు పీటీ స్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్ వంటి పరీక్షలు కూడా అవసరమవుతాయి. వీటి చికిత్సకు సర్జరీతో పాటు కీమోథెరపీ, రేడియోథెరపీ అవసరమవుతాయి. కొన్ని రకాల ట్యూమర్లు చాలా నెమ్మదిగా పెరుగుతాయి. అలాంటి వాటికి సాధారణంగా సర్జరీ అవసరం ఉండదు. ట్యూమర్ ఏ రకమైనది, అది ఎంత త్వరగా పెరుగుతున్నది అన్న దాని మీద సర్జరీ ఫలితాలు ఆధారపడి ఉంటాయి. పరిమాణంలో పెద్దగా ఉండే ట్యూమర్లకు సర్జరీ తప్పదు. ఇలాంటి సందర్భాల్లో అవయవాలకు చెందిన నాడులు ట్యూమర్‌కు దగ్గరగా ఉన్నపుడు ట్యూమర్‌ను తొలగించడం సాధ్యపడదు. ట్యూమర్‌లో కొంత భాగం తొలగించి మిగతా ట్యూమర్‌కు స్టీరియోటాక్టిక్ రేడియో సర్జరీ చికిత్స ద్వారా నయం చెయ్యవచ్చు. ఇప్పుడు శాస్త్ర పరిజ్ఞానం చాలా అభివృద్ధి చెందింది 3 సెంటీ మీటర్ల పరిమాణానికి వచ్చిన తర్వాత ఎస్‌ఆర్‌ఎస్ ద్వారా చికిత్స అందించవచ్చు. మీ నాన్న ట్యూమర్ ఏరకమైంది, పెరుగుదల ఎలా ఉంది వంటి చాలా అంశాలను పరిగణనలోకి తీసుకొని చికిత్స అందించాల్సి ఉంటుంది. మీకు దగ్గరలో ఉన్న న్యూరోసర్జన్‌ను సంప్రదించి సరైన చికిత్స తీసుకోండి.


డాక్టర్ టీవీఆర్‌కే మూర్తి
కన్సల్టెంట్ న్యూరోసర్జన్
కేర్ హాస్పిటల్స్
హైదరాబాద్

డూడుల్స్ కావేరీ!



ప్రతీ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకొంటామన్న సంగతి అందరికీ తెలిసిందే. ఈ సందర్భంగా ప్రతీ ఏడాది గూగుల్ ఆ రోజున ప్రత్యేక డూడుల్‌తో మహిళల పట్ల గౌరవాన్ని ప్రకటిస్తుంది. ఈసారి ప్రకటించిన డూడుల్‌కి ఒక ప్రత్యేకత ఉంది.

ఈసారి అంతర్జాతీయ మహిళా దినత్సవం సందర్భంగా గూగుల్ ఒక ప్రత్యేక డూడుల్‌ని ప్రదర్శించింది. ఆ డూడుల్ స్పెషాలిటీ ఏంటో తెలుసా? పన్నెండు దేశాల నుంచి పన్నెండుమంది మహిళా ఆర్టిస్టులు కలిసి ఆ డూడుల్ క్రియేట్ చేశారు. అందులో మనదేశం తరపున కావేరీ గోపాలకృష్ణన్ కూడా పాల్గొన్నది. చిన్నప్పటి నుంచి కార్టూన్స్, బొమ్మలు అంటే ఇష్టం పెంచుకున్న కావేరీ స్కెచ్‌బుక్‌లు కొనుక్కుని బొమ్మలు వేయడం ప్రాక్టీస్ చేసేది. ఆ క్రమంలో కావేరి తండ్రి ఆమెకు అందించిన ప్రోత్సాహం మరువలేనిది. అదే ఆమెను మరింత ముందుకు వెళ్లేలా చేసింది. అహ్మదాబాద్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైనింగ్ పూర్వవిద్యార్థి. బొమ్మలు వేయడంతో పాటు.. కావేరీ బాగా రాయగలదు కూడా. ఆమె వేసిన బొమ్మలతో కలిపి ఆమె రాసే రాతలు ఆలోచింపజేసేలా ఉంటాయి. ఆమెలోని టాలెంటే ఈ సంవత్సరం మహిళా దినోత్సవం డూడుల్ కోసం గూగుల్ తనను వెతుక్కుంటూ వెళ్లేలా చేసింది. 'ఆన్ ద రూఫ్' అనే పుస్తకంలో ఆమె చెప్పిన కామిక్ కథలు అందరినీ ఆకట్టుకుంటాయి. అందులోని క్యారెక్టర్లు ఆమెకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టాయి. 'ఈ రోజుల్లో మహిళలకు రక్షణ లేకుండా పోయింది. జన సమూహం మధ్య తప్ప మహిళ ఇతర ప్రదేశాల్లో పదిలంగా ఉండలేకపోతున్నది' అంటున్నది కావేరీ గోపాలకృష్ణన్.

ముడుతలకు చెక్!



- కొన్ని చుక్కల ఆలివ్‌నూనె తీసుకొని నుదుటి భాగంలో పైకి కిందకి అంటూ పది నిమిషాల పాటు మర్దనా చేయండి. రోజుకి కనీసం రెండు సార్లయినా ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- గుడ్డులో ఉండే కొల్లాజెన్, ప్రొటీన్లు చర్మం బిగుతుగా ఉండేందుకు తోడ్పడుతాయి. కాబట్టి గుడ్డులోని తెల్లసొనను నుదిటిపై రాయండి. పదినిమిషాలు అలాగే ఉంచి ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయండి.
- కొబ్బరి నూనెలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి చర్మానికి తేమ అందిస్తాయి. ముడుతలు ఉన్న ప్రాంతాల్లో కొబ్బరి నూనె రాస్తే మంచిది.
- నిమ్మకాయ, నారింజలో విటమిన్ సి అధికం. వీటిలో ఏదైనా రసాన్ని నుదిటికి రాయాలి. ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. అయితే నారింజ రసానికి బియ్యం పిండి కలిపితే మరింత మంచి ఫలితాన్ని పొందవచ్చు.

ఉమెన్ గ్యాంగ్!



రైల్వే కోచ్, పిట్ లైన్ మెయింటెనెన్స్ చేయడానికి మొదటి సారి ఉమెన్ గ్యాంగ్‌ని నియమించింది గౌహతి రైల్వే. 20మందితో కూడిన ఈ గ్యాంగ్ ఇప్పుడు దేశంలోని మొదటి ఉమెన్ గ్యాంగ్‌గా గుర్తింపు పొందింది.

రైల్వే డిపార్ట్‌మెంటులో ఎక్కువ మగవాళ్లే కనిపిస్తారు. ఆ బండ పనులు చేయడానికి వాళ్లే సరిపోతారని అనుకుంటారు. కానీ అలాంటి పనులు మేమూ చేయగలమని నిరూపిస్తున్నదీ టీమ్. 165 సంవత్సరాల రైల్వే చరిత్రలో మొదటిసారి ఉమెన్ గ్యాంగ్ ఏర్పాటు జరిగింది. గౌహతిలోని 'నార్త్‌ఈస్ట్ ఫ్రంటైర్ రైల్వే' (ఎన్‌ఎఫ్‌ఆర్) 20 మందితో ఉమెన్స్ డే రోజున ఈ గ్యాంగ్‌ని ఏర్పాటు చేసింది. ఇందులో ఉన్నవాళ్లు వివిధ గ్యాంగ్‌ల్లో పనిచేసినవాళ్లే. అలాంటి వాళ్లందరినీ ఒక దగ్గరికి చేర్చి ఈ గ్యాంగ్‌ని తయారు చేశారు. ఇందులో ఉన్నవాళ్లు ఆరు పిట్ లైన్స్, కోచ్ మెయింటెనెన్స్ చూసుకోవాలి. అంతేకాదు.. వీళ్లు టెక్నికల్‌గా కూడా సపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఈ టీమ్‌లో ఉన్న ప్రతి ఒక్కరికీ థియెరెటికల్‌గా, ప్రాక్టికల్‌గా పిట్ లైన్స్ గురించి అర్థమయ్యేలా చెబుతున్నారట. అలాగే మూడు వారాలకోసారి సేఫ్టీ చెక్ ఎలా చేయాలో కూడా శిక్షణనిస్తున్నది రైల్వే సంస్థ. వీళ్లలాగే మరికొన్ని గ్యాంగ్‌లు ఏర్పాటు చేయాలని ఆశిస్తున్నారీ గ్యాంగ్ సభ్యులు.

నమస్తే తెలంగాణ
నిధి
[హైదరాబాద్]
శనివారం 10 మార్చి 2018

సిబిల్ స్కోరు ఉచితమా?

సిబిల్ స్కోరును ఎవరైనా చూసుకోవచ్చా? లేదా బ్యాంకులు మాత్రమే అందజేస్తాయా? చాలామందిలో కలిగే సందేహమిది. నిజానికి, ఎవరికి వారే వ్యక్తిగతంగా తమ సిబిల్ స్కోరును తెలుసుకోవచ్చు. ఇందుకు కొంత సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ ద్వారా సొమ్ము చెల్లించే మార్గం కూడా ఉంది. ఇందుకోసం మీరు చేయాల్సిందల్లా.. మీ రుణ చరిత్ర ఆధారంగా కొన్ని ప్రశ్నలకు సమాధానం చెబితే సరిపోతుంది. ఈ ప్రక్రియ పూర్తి కాగానే మీ క్రెడిట్ స్కోరు వెంటనే కనిపిస్తుంది. మీ ఈ మెయిల్‌కు కూడా సమాచారం అందుతుంది. ఒకవేళ, ధృవీకరణ కోసం మీరిచ్చే సమాధానాలు సరిగ్గా లేకపోతే.. చిరునామా, వ్యక్తిగత ధృవీకరణలకు సంబంధించి నకళ్లను కోరవచ్చు. మీకు సంబంధించిన అన్ని పత్రాలు అందిన తర్వాత వాటిని పరిశీలించి.. కొరియర్ ద్వారా మీకు రుణచరిత్రను పంపిస్తారు.



- కొన్ని ఫైనాన్స్ పోర్టళ్లు ఉచితంగా సిబిల్ స్కోరును కూడా అందజేస్తున్నాయని మర్చిపోవద్దు. తక్కువ క్రెడిట్ స్కోరు ఉన్నంత మాత్రాన ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. స్కోరును పెంచుకునే ప్రయత్నం చేయాలి. రుణచరిత్ర, క్రెడిట్ స్కోరు రుణగ్రహీతల చెల్లింపుల తీరును బట్టి ఎప్పటికప్పుడు మారిపోతుంటుంది. అప్పటివరకూ బాకీ ఉన్న వాయిదాలను చెల్లించి, వాయిదా మొత్తాన్ని క్రమం తప్పకుండా చెల్లిస్తూ వెళితే చాలు.. రుణ చెల్లింపుల చరిత్రలో క్రమం తప్పకుండా చెల్లిస్తున్నట్లుగా నమోదు అవుతుంది. దీంతో, క్రెడిట్ స్కోరు కూడా పెరుగుతుంది. తక్కువ క్రెడిట్ స్కోరు ఉన్నవారు.. తన స్కోరు పెంచుకోవడానికేం చేయాలంటే..
- ఇప్పటివరకూ ఉన్న క్రెడిట్ కార్డుల బిల్లులను వెంటనే తీర్చేయాలి.
- రుణవాయిదాలను క్రమం తప్పకుండా, గడువు తీరకముందే చెల్లించాలి
- మీ రుణచరిత్ర, సిబిల్ ట్రాన్స్‌యూనియన్ స్కోరు ఎంత ఉందనే విషయం ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలి
- క్రెడిట్ స్కోరు పెరిగే దాకా.. కొత్త రుణాలు, క్రెడిట్ కార్డుల కోసం దరఖాస్తు చేయవద్దు.

ఆరోగ్య ధీమా అందుకుందామిలా!

గుండె శస్త్రచికిత్సలకు ఖర్చు భారీగా పెరుగుతోంది. ఏదో ఒక అనారోగ్య సమస్యతో ఆస్పత్రికి వెళితే చాలు.. ఉన్నదంతా ఊడ్చి పెడితే తప్ప.. అక్కడ్నుంచి బయటికి రాని పరిస్థితి. అయితే, సొమ్మున్న వాళ్లకు పెద్దగా కష్టం కాకపోయినా, మధ్యతరగతి ప్రజానీకానికే సమస్య అంతా. కార్పొరేట్ ఆస్పత్రికి వెళితే.. తక్కువ ఖర్చుతో బయటపడితే అదో గొప్ప అద్భుతమని చెప్పొచ్చు. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎక్కువగా నగదు చెల్లించి చికిత్స చేయించుకునేవారి శాతమే ఎక్కువుంటుంది. ఇందుకు ప్రధాన కారణం.. అధిక శాతం మంది ఆరోగ్య బీమా పాలసీ తీసుకోకపోవడమే. మరెలా, ఆరోగ్యధీమాను అందుకోవాలంటే ఏం చేయాలి? ఇందుకోసం ఎలాంటి మార్గాన్ని అనుసరించాలి?



దేశంలో దాదాపు ఇరవై శాతం మందికే ఆరోగ్య బీమా రక్షణ ఉందని ఐఆర్‌డీఏ వెల్లడించింది. ఇందులోనూ సొంతంగా ఆరోగ్య పాలసీ తీసుకున్నవారు ఐదు శాతం కూడా మించరు. మిగతా వారు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల బృంద బీమాలో రక్షణ పొందుతున్నారు. గణాంకాలను బట్టి చూస్తే మన దేశంలో ఆరోగ్య బీమా రంగం వృద్ధికి అపారమైన అవకాశముంది. ఈ నేపథ్యంలో పాలసీదారుల సంఖ్యను పెంచుకునేందుకు బీమా సంస్థలూ ఎక్కడ్లేని పోటీ పడుతున్నాయి. ఇలాంటప్పుడే పాలసీదారులు తాము తీసుకునే పాలసీ గురించి అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది. బీమా పాలసీ ఏదైనా తీసుకునే వ్యక్తిపై ఆధారపడుతుంది. అయితే, చాలామంది పాలసీ పత్రాన్ని పూర్తిగా చదవరనేది వాస్తవం. బీమా సలహాదారులు, ఏజెంట్లు, పాలసీ ఇచ్చే బ్యాంకులు చెప్పిన విషయాల ఆధారంగానే పాలసీ పత్రాలపై సంతకాలు చేస్తుంటారు. ఈ పద్ధతి మారాల్సిన అవసరం ఎంతో ఉంది. బీమా తీసుకునేటప్పుడు తప్పనిసరిగా పాలసీ పత్రాలను క్షుణ్నంగా చదివి.. ఆతర్వాతే సంతకం చేయాలి.

- పాలసీ తీసుకునేటప్పుడు కొందరు అన్ని రకాల వ్యాధులకు చికిత్స లభించాలని కోరుకుంటారు. మొత్తం పదికి పది అంశాలు కరెక్టుగా ఉంటేనే పాలసీ తీసుకుంటారు. ఏ రెండు అంశాలు కవర్ కాకపోయినా.. లేక ఇవ్వకపోయినా.. పాలసీ తీసుకోవడానికి ముందుకు రారు. ప్రతి అంశం ఉన్న పాలసీనే ఎంచుకోవాలనే ఉద్దేశ్యంతో అసలు ఆరోగ్య బీమా పాలసీ తీసుకోవడాన్ని వాయిదా వేస్తున్నారు. దీని వల్ల అంతిమంగా నష్టపోయేది పాలసీదారులేనని గుర్తుంచుకోవాలి. ప్రస్తుత పరిస్థితిల్లో పదికి పది అంశాలను కవర్ చేసే పాలసీ ఏదీ లేదనే చెప్పాలి. కాబట్టి, మీకు అవసరమయ్యే ప్రధాన అంశాలను చూసి పాలసీ తీసుకోవడం ఉత్తమం.

రహస్యం ఎందుకు?

ఎలాగైనా సరే ఆరోగ్య పాలసీ తీసుకోవాలనే లక్ష్యంతో కొంతమంది తమ ఆరోగ్య చరిత్రను పూర్తిగా చెప్పేందుకు ఇష్టపడరు. దరఖాస్తు పూర్తి చేసేటప్పుడు కొన్ని విషయాలను దాచేస్తుంటారు. ముఖ్యంగా, షుగర్, బీపీలు వంటివి ఉంటే పాలసీ ఇవ్వరనో లేదా వాటి చికిత్సకు పరిహారం లభించదనో ఇలా చేస్తుంటారు. ఇక్కడ గుర్తించాల్సిన విషయం ఏమిటంటే.. ఆరోగ్య పరిస్థితి గురించి చెప్పకపోతే.. మోసపూరితంగా పాలసీ తీసుకోవడమే అవుతుంది. ఒకవేళ, ఆయా సమస్యలతో ఆస్పత్రిలో చేరితే.. కొన్ని సందర్భాల్లో పాలసీ పరిహారం ఇవ్వడానికి నిరాకరించవచ్చు. కాబట్టి, వాస్తవాలను చెప్పేందుకు ఆలోచించవద్దు. దీని వల్ల ప్రీమియం కాస్త పెరిగినా.. ఆతర్వాత ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని గుర్తుంచుకోండి. ముందస్తు వ్యాధుల చికిత్సకు పాలసీని బట్టి మూడు నుంచి నాలుగేళ్ల తర్వాత ఎలాంటి ఇబ్బంది ఉండదని మర్చిపోవద్దు.

బృంద బీమా ఉంటే చాలా?

ప్రస్తుతం చాలా సంస్థలు తమ ఉద్యోగుల ప్రయోజనం కోసం బృంద ఆరోగ్య బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి. ఇది ఉంది కదా.. ఇక ప్రత్యేకంగా మరో పాలసీ ఎందుకని ప్రశ్నించేవారు లేకపోలేరు. ఒకవేళ ఉద్యోగం మానేసిన మరుక్షణమే ఈ బీమా రక్షణ కూడా దూరం అవుతుందని మర్చిపోవద్దు. అందుకే, బృంద బీమా రక్షణలో ఉన్నా.. వ్యక్తిగతంగా మరో పాలసీ తప్పకుండా తీసుకోవాలి.

ప్రీమియం తగ్గుతుందా?

ఆరోగ్య బీమా పాలసీకి చెల్లించే ప్రీమియం ఫిక్స్‌డ్ డిపాజిట్టో లేదా మ్యుచువల్ ఫండ్ పథకమో కాదని గుర్తుంచుకోవాలి. చెల్లించిన ప్రీమియం గడువు తీరిన తర్వాత వెనక్కి ఇవ్వరు. ఈ కారణంతో చాలామంది పాలసీ తీసుకునేటప్పుడు ప్రీమియం తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తారు. ముఖ్యంగా సహచెల్లింపు నిబంధనను ఎంచుకోవడం. అంటే, చికిత్స వ్యయంలో కొంత శాతాన్ని పాలసీదారుడు భరించడం అన్నమాట. మరొకటి కొన్ని పరిమితులు. అంటే, గది అద్దె, ఐసీయూ, శస్త్ర చికిత్సలు.. ఇలా ప్రతి సందర్భంలోనూ పాలసీ మొత్తంలో ఇంత శాతం అని నిబంధన ఉండటం అన్నమాట. అనారోగ్యం వచ్చినప్పుడు మనకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవడమే బీమా పాలసీ ప్రధాన లక్ష్యం. అంతేకానీ, ఇప్పుడు కొన్ని వందల రూపాయలను తగ్గించుకోవడం కాదు. ప్రీమియం తక్కువగా ఉందని, చెల్లింపుల చరిత్ర సక్రమంగా లేని కంపెనీ పాలసీని తీసుకోవడం, ఉప పరిమితులు, సహ చెల్లింపు నిబంధనలను పట్టించుకోకపోవడం మంచిది కాదు.

చిన్నచిన్న చికిత్సలకూ..

వైద్య బీమా ఉంటే చేతిలో ఏటీఎం కార్డు ఉన్నట్లే.. ఏ చిన్న అనారోగ్యం వచ్చినా ఆసుపత్రిలో చేరి రూపాయి ఖర్చు లేకుండా చికిత్స చేయించుకోవచ్చు. కొంతమంది బీమా సలహాదారులు ఈ విషయాన్నే పదేపదే చెబుతూ ఆరోగ్య పాలసీని అంటగట్టేస్తారు. ఈ కారణంతో రెండు మూడు పాలసీలు, అధిక విలువైన వాటినీ, అదనంగా రైడర్లను జోడించుకునేవారూ ఉన్నారు. ఆరోగ్య బీమా పాలసీ మీ రోజువారీ వైద్య ఖర్చులను చెల్లించదు. తీవ్ర అనారోగ్యం వచ్చి, తప్పకుండా ఆసుపత్రిలో చేరాల్సి వచ్చినప్పుడే ఇది ఆదుకుంటుంది. చిన్నచిన్న చికిత్సలకూ పాలసీని వాడితే, పునరుద్ధరణ సమయంలో అందే నో క్లెయిమ్ బోనస్ కోల్పోతాం. కొన్నిసార్లు ఇది పాలసీ ప్రీమియంలో యాభై శాతం వరకూ ఉంటుంది. కొన్నింటిలో పాలసీ మొత్తం పెరుగుతుంది. కాబట్టి, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పాలసీని క్లెయిమ్ చేసుకోవాలి.

ఏయే వ్యాధులకు?



చాలామంది బీమా ఏజెంట్లు పాలసీదారుడికి వివరించడానికి పెద్దగా ఇష్టపడరు. ఆరోగ్య బీమా పాలసీ తీసుకునేటప్పుడు ఏయే వ్యాధులకు/చికిత్సలకు పరిహారం లభిస్తుందనే అంశాన్ని ముందుగా తెలుసుకోవాలి. అన్నింటికీ వర్తిస్తుంది అని అన్నారనే భావనలో ఉండటం సరైంది కాదు. మీరు పూర్తి చేసే దరఖాస్తు పత్రంలోనే ఈ వివరాలుంటాయని మర్చిపోవద్దు. కొన్ని వ్యాధులకు పాలసీ వ్యవధిలో ఎప్పటికీ పరిహారం ఇవ్వరని గుర్తుంచుకోండి. మరికొన్నింటికి నిర్ణీత వ్యవధి తర్వాత మాత్రమే రక్షణ ఉంటుంది. పాలసీ తీసుకున్న ముప్పయ్ రోజుల వరకూ ప్రమాదం మినహా ఇతర అనారోగ్యాలకు వర్తించదు. ఇలాంటి అనేక నిబంధనలు ఉంటాయి. అవన్నీ తెలుసుకోవాల్సిన బాధ్యత పాలసీ తీసుకునేటప్పుడే ఉంటుంది. ఏదైనా అనుమానం ఉంటే సంస్థ వెబ్‌సైటులో చూసుకుంటే ఉత్తమం. లేదా వినియోగదారుల సేవా కేంద్రాన్ని సంప్రదించాలి. అయితే, ఉదాహరణలను పరిశీలించేటప్పుడు బీమా సంస్థ అధికారికంగా ఇచ్చిన పత్రాలను మాత్రమే చూడాలి.

ఇవి కీలకం..

పాలసీ తీసుకున్నాక తర్వాత.. మీరు అనుకున్న పాలసీయే ఇచ్చారా? పాలసీ మొత్తం ఎంత? కట్టిన ప్రీమియం ఎంత? కుటుంబ సభ్యుల వివరాలు కరెక్టుగా ఉన్నాయా? కార్డులపై ఫోటోలు సరిగ్గానే ఉన్నాయా? ఇలాంటివన్నీ తప్పనిసరిగా చూసుకోవాలి. కొన్నిసార్లు పాలసీని నామినీ పేరు మీద ఇచ్చిన సందర్భాలూ ఉన్నాయి. మీకు హామీ ఇచ్చినవీ, పాలసీలో ఉన్నవీ వేరువేరుగా ఉండే ప్రమాదం లేకపోలేదు. కాబట్టి, పత్రాలన్నింటినీ పక్కాగా చూడాలి.

- మీరు ఎంత ప్రీమియం చెల్లించగలరో అంత మొత్తానికే పాలసీ తీసుకోవాలి.
- నిర్ణీత గడువులోపు ప్రీమియం చెల్లించాలి. ఇది ఎట్టిపరిస్థితుల్లో మర్చిపోవద్దు.
- చిన్న మొత్తం రాయితీ కోసం సహచెల్లింపు, ఉప పరిమితులున్న పాలసీల జోలికి వెళ్లవద్దు
- మోసపూరిత బిల్లులు సమర్పించడం కరెక్టు కాదు. ఒకవేళ, ఇలా చేస్తే గనక, అది సంస్థ గుర్తిస్తే.. తక్షణమే పాలసీని రద్దు చేస్తుంది. ఫలితంగా, భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతాయి.
- కో-పేమెంట్ ఆప్షన్‌ని ఎంచుకుంటే..ప్రీమియంలో దాదాపు ఇరవై శాతం సొమ్ము ఆదా అవుతుంది. సాధారణ జ్వరంతో ఆస్పత్రిలో చేరినా అధిక ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇలాంటప్పుడు, కో పేమెంట్ ఆప్షన్ అమితంగా ఉపయోగపడుతుంది.
- బీమా పాలసీ తీసుకునేటప్పుడు పాలసీలను ఎంత త్వరగా సెటిల్ చేస్తున్నారనేది కీలకం. కాబట్టి, ఈ అంశంపై దృష్టి పెట్టాలి.
- బీమా పాలసీ ఆధీనంలో ఉన్న నెట్‌వర్క్ ఆస్పత్రిలో చేరితే ఎలాంటి ఇబ్బందులుండవు. పైగా, చేతిలో నుంచి ఎలాంటి సొమ్ము కూడా పెట్టనక్కర్లేదు.
- మహిళలు ఆరోగ్య పాలసీ తీసుకునేటప్పుడు.. మెటర్నిటీ ఖర్చులు అందజేస్తారా? లేదా? అనే అంశాన్ని గమనించాలి.
- ఆరోగ్య బీమా పాలసీ తీసుకోవాలనే నిర్ణయానికి వచ్చినప్పుడు.. వీలైనంత వరకూ నాలుగైదు కంపెనీలు అందించే పాలసీలను క్షుణ్నంగా గమనించాలి. ఒక్కో సంస్థ ఇచ్చే అదనపు సదుపాయాలు, ప్రీమియం వంటివి గమనించాకే పాలసీని ఎంచుకోవాలి



ఏసీ కనీస ధర.. రూ.19,990

ఎండాకాలం ఆరంభమైంది. ఇక, ఏసీలను కొనుగోలు చేసేవారి శాతం పెరుగుతుంది. ఈసారి వేసవి కాలంలో ఏసీలను అందుబాటు ధరకే లభించనుంది. కనీస ధర రూ.19,990 నుంచి ఆరంభమవుతుందని క్రోమా తెలియజేసింది. కొన్ని బ్రాండ్ల ఏసీలను కొనుగోలు చేస్తే.. ఉచితంగా ఇంటికొచ్చి బిగింపజేస్తారు. పలు ఏసీలపై ఐదేండ్ల దాకా వారెంటీని కూడా అందజేస్తారు. ఈఎంఐ విధానంలోనూ ఏసీలను విక్రయిస్తున్నామని.. పన్నెండు నెలల దాకా సులభతరమైన వాయిదాల్లో అందిస్తున్నామని క్రోమా వెల్లడించింది. ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ వంటి బ్యాంకులు క్యాష్ బ్యాక్ ఆఫర్లనూ అందజేస్తున్నాయి. ఇన్వర్టర్లు గల ఏసీలు నలభై శాతం దాకా విద్యుత్తు ఆదా అవుతుంది. పాత ఏసీలను ఎక్స్ఛేంజీ చేసుకుని.. విద్యుత్తు ఖర్చును తగ్గించుకోవాలని భావించేవారికి మంచి ఆఫర్లను అందజేస్తున్నామని క్రోమా ప్రకటించింది.



బైకు ఎత్తుకెళ్లినా.. నడిపించలేరు!

బంజారాహిల్స్‌లో మహేష్ డ్యూటీ ముగించుకుని రాత్రి పదకొండు గంటలకు ద్విచక్రవాహనం మీద ఇంటికి బయల్దేరాడు. ఎప్పటిలాగే ఫిలింనగర్ నుంచి రాయదుర్గం మీదుగా తెల్లాపూర్‌కు వెళుతున్నాడు. ఇంతలో రాయదుర్గం వద్ద వేగంగా వచ్చిన ఒక కారు మహేష్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. తక్షణమే సమాచారం ఇంటి సభ్యులకు చేరింది. సమీపంలోని ఆస్పత్రికి సమాచారం అందింది. సకాలంలో మహేష్‌కు వైద్య సేవలు అందడంతో.. బతికిబయటపడ్డాడు. కర్టెసీ.. ఏరీస్!! ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సొల్యూషన్స్.

- ఒక్క 2017లోనే కోటీ ఎనభై లక్షల ద్విచక్రవాహనాలు మనదేశంలోని రహదారుల మీదికొచ్చాయి. ప్రస్తుతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నవాటిలో ఇరవై ఐదు శాతం వాటా వీటిదే కావడం గమనార్హం. ఇంత భారీ స్థాయిలో ప్రమాదాలు జరుగుతున్నందు వల్లే.. పరిష్కారాలను వెతికే పనిలో ఏరీస్ పడింది. కనెక్టడ్ బైక్ సొల్యూషన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. వాహనాలను సురక్షితంగా నడిపించడానికి సాయం చేస్తుంది. రోడ్డు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని వెంటనే గుర్తిస్తుంది. తక్షణమే అత్యవసర వైద్య సేవలను అందజేయడంలో తోడ్పడుతుంది. పైగా, ఆయా బైకు ఏయే సమయంలో ఎక్కడుందో తెలియజేస్తుంది. ఒకవేళ, ఎవరైనా బైకును అపహరించినా.. వెంటనే యజమానికి సమాచారాన్ని అందజేయడమే కాకుండా.. ఆయా వాహనం పని చేయకుండా చేయడంలో తోడ్పడుతుంది.
- ఏరిస్ డివైజ్‌ను బైకుకు అమర్చుకున్న వెంటనే అనేక రకాలుగా ఉపయోగపడుతుంది. బైకు మెయింటనెన్స్ గురించి ఎప్పటికప్పుడు సమాచారం అందజేస్తుంది. బీమా ప్రీమియంకు సంబంధించిన రాయితీలను ఎప్పటికప్పుడు పలు సంస్థలు నేరుగా బైకు యజమానికి తెలియజేస్తాయి. అపహరణకు గురైన వాహనాలను పట్టించడంలో ఈ విధానం తోడ్పడుతుంది.

అధిక ప్రీమియం రక్షణ

ప్రస్తుతం మన రాష్ట్రంలో అధిక శాతం ద్విచక్రవాహనాలకు.. ఇరవై శాతం మేరకు నాలుగు చక్రాల వాహనాలకు బీమా రక్షణ లేదని చెప్పవచ్చు. మోటరు వాహనాల చట్టం ప్రకారం థర్డ్‌పార్టీ బీమా అనేది తప్పనిసరి అయినప్పటికీ.. అధికశాతం వాహనాలు బీమా పాలసీ లేకుండానే రోడ్ల మీద పరుగులు పెడుతున్నాయి. చాలా మంది అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నాయి. ప్రధానంగా పాత నాలుగు చక్రల వాహనాల విషయాల్లో ఇది అధికంగా జరుగుతున్నది. కార్లు, లారీలు, టిప్పర్లు వంటి వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది. ఇక ద్విచక్రవాహనాల సంగతి సరేసరి. కొత్త మోజులో పాలసీ తీసుకుంటారు తప్ప...ఆ తర్వాత పట్టించుకునేవారి శాతం గణనీయంగా పడిపోతుంది. ప్రమాదాల కారణంగా తరులకు వాటిల్లే నష్టాన్ని భర్తీ చేయకుండా చేస్తున్నారు.ఫలితంగా ప్రమాద బాధితులు ఆర్థికంగా అనేక అవస్థలు పడుతున్నారు. అందుకే తప్పనిసరిగా ప్రతిఒక్కరు సరైన పాలసీని తీసుకోవాలి.

- వాహనం, యజమాని, ఇతరులకు అన్ని విధాల రక్షణ కల్పించాలంటే కాంప్రిహెన్సివ్ పాలసీ తీసుకోవాలి.
- అగ్ని ప్రమాదం, పేలుళ్లు, భూకంపం,వరదలు, కారుకు మంటలు అంటుకోవడం, పిడుగుపాటు వంటి విపత్తుల కారణంగా వాహనానికి జరిగిన నష్టాన్ని భర్తీ చేస్తుంది.
- తీవ్రవాదుల కార్యకలాపాలు, రోడ్డు, రైలు,నీటిలో, గాలిలో, లిఫ్టు, ఎలివేటర్లో వాహనాన్ని తరలించేటప్పుడు ఏదైనా నష్టం జరిగినా పరిహారం పొందవచ్చు.



థర్డ్ పార్టీ లీగల్ లయబిలిటీ...

ప్రమాదాల కారణంగా ఇతరులకు జరిగిన నష్టాన్ని మాత్రమే భర్తీ చేస్తుంది. థర్డ్ పార్టీ లీగల్ లయబిలిటీ. ప్రమాద కారణంగా ఏదైనా శాశ్వత గాయమైనా, వ్యక్తి మరణించినా నష్టాన్ని భర్తీ చేస్తుంది. వాహనానికి నష్టం జరిగినా పరిహారం అందుతుంది. వ్యక్తి ప్రమాద బీమా యజమానికి తప్పనిసరి చేసింది. డ్రైవర్, కండక్టర్, క్లీనర్లకు ఈ బీమా ఐచ్ఛికమని చెప్పాలి.

రెండు పదులకు పైగా మార్కెట్లో సేవలందిస్తున్న వేర్వేరు బీమా సంస్థల నుంచి వాహన బీమాని ఎంపిక చేసుకునే ముందు ప్రధానంగా పలు అంశాల్ని పరిశీలించాలి.

- ఏ కంపెనీ నుంచి బీమా తీసుకుంటున్నామన్నది కూడా కీలకమే. గతంలోని క్లెయింటు చరిత్ర, సొమ్ము చెల్లించాల్సిన అవసరం లేకుండా బండి మరమ్మత్తుల కోసం ఎన్ని షోరూములతో ఒప్పందం కుర్చుకున్నారు అవి స్థానికంగా అందుబాటులో ఉన్నాయా అదనంగా అందించే సేవలు ఏంటి తదితర విషయాలు చూడాల్సి ఉంటుంది. ఇందుకు బీమా కంపెనీ కాల్ సెంటర్, స్థానిక శాఖలలో అడిగి తెలుసుకోవచ్చు. ఇంటర్నెట్‌లోనూ పరిశీలించవచ్చు. వీలైతే ఇదివరకే ఆ కంపెనీలో పాలసీ చేసిన వ్యక్తిని అడిగి తెలుసుకోవచ్చు.
- వాహన బీమాలో ప్రీమియం అనేది రిస్క్ ప్రొఫైల్ ఆధారంగా నిర్ణయిస్తారు. సగటు క్లెయింతో పాటు మరికొన్ని ఇతర అంశాలు కూడా ప్రీమియాన్ని ప్రభావితం చేస్తాయి.నివాస ప్రాంతం కూడా కీలకమే. ప్రధానంగా వాహన తరగతిని బట్టి వాహన వయసును బట్టి ప్రీమియాన్ని లెక్కగడుతారు. సహజంగా ఖరీదైన కార్ల ప్రీమియం తక్కువగా ఉంటుంది.సురక్షిత డ్రైవింగ్ రికార్డు ఉంటే ''ఓన్ డ్యామేజ్'' ప్రీమియంలో కొంత తగ్గింపును కూడా ఇస్తున్నాయి బీమా కంపెనీలు. అంటే నో క్లెయిం బోనస్‌గా అందుకోవచ్చన్నమాట. ఇది యజమానికే వర్తిస్తుంది తప్ప, వాహనానికి కాదని గుర్తుంచుకోవాలి. ప్రస్తుతం ఉన్న వాహనాన్ని అమ్మి, కొత్త వాహనం కొన్నప్పుడు ఆ యజమాని పేరు మీద ఉంటుంది కాబట్టి నో క్లెయిం బోనస్ బదిలీ అవుతుంది.

షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, జీవిత బీమా, లీగల్, ఆర్థిక ప్రణాళిక, ఆదాయ పన్ను వంటి అంశాలపై మీకు ఎలాంటి సందేహాలున్నా, సమస్యలున్నా మాకు రాయండి. మా నిపుణులు మీకు సమాధానాలిస్తారు. మీరు ప్రశ్నలు పంపాల్సిన చిరునామా..



నమస్తే నిధి, నమస్తే తెలంగాణ,
తెలంగాణ పబ్లికేషన్స్ ప్రై. లిమిటెడ్,
రోడ్ నెం. 10, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34.
ఈమెయిల్: namasthenidhi@gmail.com



క్రెడాయ్ ప్రాపర్టీ షో.. గ్రాండ్ సక్సెస్!

క్రెడాయ్ హైదరాబాద్ గతవారం నిర్వహించిన ఆరో ఎడిషన్ ప్రాపర్టీ షో అతివైభవంగా జరిగింది. ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ చేతుల మీదుగా అట్టహాసంగా ఆరంభమైంది. మూడు రోజుల వేడుకలో సందర్శకులు భారీ స్థాయిలో విచ్చేశారు. అమ్మకాల పండగకు మంచి ఆదరణ లభించింది. సొంతింటి కలను సాకారం చేసుకోవాలని భావించిన సిసలైన కొనుగోలుదారులు ప్రదర్శనకు విచ్చేయడంతో స్టాళ్ల నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు. కొందరైతే వివరాలు తెలుసుకుని.. అక్కడే గృహరుణం వివరాలను కనుక్కుని.. అక్కడ్నుంచి అటే ప్రాజెక్టులను కూడా సందర్శించారు. ఇలా, నాణ్యమైన కస్టమర్లు రావడమే ఈ ప్రాపర్టీ షో ప్రత్యేకత అని పలు స్టాళ్ల నిర్వాహకులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఏస్ వెంచర్స్ ఎండీ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఈస్ట్ హైదరాబాద్‌లోని తమ ప్రాజెక్టుకు సందర్శకుల నుంచి మంచి ఆదరణ లభించిందన్నారు. ఈ మూడు రోజుల పండుగలో పాల్గొన్న పలువురు అతిథులు మాట్లాడుతూ... హైదరాబాద్‌కి బంగారు భవిష్యత్తు ఉందంటూ అభివర్ణించారు. క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షో నిర్వాహకులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడం వల్లే.. ప్రాపర్టీ షో గ్రాండ్ సక్సెస్ అయ్యిందని చెప్పొచ్చు.

స్ఫూర్తినిచ్చే నయా ఆర్కిటెక్చర్

అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఆకర్షించేలా ఆకాశహర్మ్యాలు.. బహుళ అంతస్తుల భవనాలు.. లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు.. ఆధునిక టౌన్‌షిప్పులు.. మొత్తంగా, ప్రపంచ నిర్మాణ పోకడలు ఆవిష్కృతమవుతున్న ప్రాంతం ఏదైనా హైదరాబాద్‌లో ఉందా అంటే.. ముందుగా గుర్తుకు వచ్చేది పశ్చిమ హైదరాబాద్ మాత్రమే. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా.. ముఖ్యంగా పాశ్చాత్య దేశాల్లో ప్రముఖంగా ప్రాచుర్యం పొందిన 'సబ్‌లిమినల్ ఆర్కిటెక్చర్'ను హైదరాబాద్‌కు పరిచయం చేస్తున్నారు. ఈ ఆధునిక నిర్మాణ పోకడలను.. మనకు పరిచయం చేసేది.. భాగ్యనగరానికి చెందిన ఓ నిర్మాణ సంస్థే కావడం గమనార్హం.





సబ్‌లిమినల్ ఆర్కిటెక్చర్ అంటే..

ఉన్నతమైన లక్ష్యాలు.. జీవితంలో ఎదగాలనే కోరిక.. ఆత్రుత.. ప్రజలు మెచ్చుకునేలా జీవనం.. ఇవి ప్రతి ఒక్కరి మెదళ్లలోనూ ఉండేవే. అయితే, మనలో చాలామంది వీటి గురించి ఆలోచిస్తున్నా.. కొందరు మాత్రం అలాంటి లక్ష్యాల దిశగా వడివడిగా అడుగులేస్తుంటారు. దీనికి కారణం.. వారిలో ఎప్పటికప్పుడు వారి లక్ష్యాలను చేరుకోవాలనే స్ఫూర్తి ఎల్లవేళలా రగులుతూనే ఉండటం. ఓ ఉన్నతమైన వ్యక్తుల చిత్రపటాలు చూసినా.. వారి సూక్తులు చదివినా.. సరికొత్త స్ఫూర్తిని వారు పొందుతారు. ఫలితంగా, వారికి తెలియకుండానే.. మెదడు ఆయా అంశాలన్నింటినీ నిగూఢంగా భద్రపర్చుకుంటుంది. అలాంటి అనుభవాలను అందిపుచ్చుకునేలా.. లక్ష్యాలను చేరుకునేలా ఈ స్ఫూర్తి వారిని ఎప్పుడూ.. ఉత్తేజితం చేస్తూ ఉంటుంది. అలాంటి సబ్‌లిమినల్ ఆర్కిటెక్చర్‌తో డిజైన్ చేసిన సరికొత్త ప్రాజెక్టు హైదరాబాద్‌లో ఆవిష్కృతమైంది. ఇటీవల హైటెక్స్‌లో జరిగిన క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షో సందర్భంగా.. ఆ ప్రాజెక్టును పరిచయం చేసిందో సంస్థ.

జీవితంలోకి ఎదగాలనుకునేవారిని నిత్యం తన లక్ష్యాన్ని గుర్తు చేస్తూ.. వారికి సరికొత్త ప్రోత్సాహాన్ని అందించడానికే సబ్‌లిమినల్ ఆర్కిటెక్చర్‌తో రూపొందించిన ప్రాజెక్టును డిజైన్ చేశామని సదరు సంస్థ అభిప్రాయపడింది. ''మనం రోడ్డుపై వెళుతుంటే.. ఒక రోల్స్ రాయిస్ కారును చూడగానే ఒక్కసారిగా తల తిప్పి ఠక్కున చూస్తాం. అలాంటి కార్లలో ఎప్పటికైనా ప్రయాణించాలని మెదడులో స్థిరపడుతుంది. జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకున్న రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, వారి జీవిత చరిత్ర నిత్యం స్ఫూర్తిని నింపుతాయి. అలాంటి ప్రాజెక్టుల్లో నివసించేవారిలో ఆశావహ దృక్పథం ఏర్పడుతుంది. ఏదో ఒక రోజు ఆ స్థాయికి చేరుకోవాలని ఆరాటపడతారు. ''మనసులో ఎలాంటి భావాలుంటే.. వాటి గురించే ఎక్కువగా ఆలోచిస్తారు. మాట్లాడతారు. నువ్వేం ఆలోచిస్తావో.. అది తప్పకుండా అవుతావ''ని గౌతమ బుద్ధుడు ఏనాడో అన్నారు. పూర్తిగా కష్టించి పని చేస్తూ.. పాజిటివ్ కోణంలో ముందుకెళితే.. ప్రకృతిలో ఉన్న శక్తులన్నీ సాయం చేస్తాయని అంటుంటారు. మరి, అలాంటి గృహాలను నగరవాసులకు అందించాలన్న లక్ష్యంతో.. సబ్‌లిమినల్ ఆర్కిటెక్చర్‌ను సదరు సంస్థ హైదరాబాద్ వాసులకు ప్రప్రథమంగా పరిచయం చేసింది.



మధ్యతరగతికి 100 గజాలు

మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను నెరవేర్చేందుకు దాదాపు అన్ని రాష్ట్రాలు ప్రయత్నాలు మొదలు పెట్టాయి. ఓ రాష్ట్రం అడుగు ముందుకేసి.. నూతన విధానానికి రూపకల్పన చేసింది. అందుబాటు గృహాల విధానాన్ని విడుదల చేసింది. ప్లాటు పరిమాణంలో తగ్గింపు, నిర్మాణ నిబంధనల సడలింపు వంటి నిర్ణయాలతో అందుబాటు గృహాలను ప్రోత్సహిస్తున్నది. అంతేకాదు ప్రత్యేకంగా బిల్డర్లకు కొన్ని మినహాయింపులను కల్పించింది. ఇలా మొత్తం మీద అందుబాటు గృహాలను మధ్యతరగతి, తక్కువ ఆదాయ వర్గం గల వారికి చేరువ చేయాలని నిర్ణయించింది.

దేశంలో అధిక సంఖ్యలో ఉన్న మధ్యతరగతి కుటుంబాల్లో చాలా మందికి ఇప్పటికి సొంతిండ్లు కరువయ్యాయి. స్థలా భావం, పెరుగుతున్న రియల్ ధరలు అడ్డంకులుగా నిలుస్తున్నాయి. ఈ క్రమంలోనే తక్కువ స్థలంలోనే వీలైనన్ని ఎక్కువ ఇండ్లను అందుబాటులోకి తీసుకురావాలని, మధ్యతరగతి ప్రజల సొంతింటి కల నెరవేర్చాలని ఆ రాష్ట్రం ప్రయత్నాలు మొదలు పెట్టింది. దీనికోసం ప్రత్యేకంగా కాలనీలు ఏర్పాటు చేయాలని నోటిఫికేషన్ జారీ చేసింది. ఇలా అభివృద్ధి చేసే కాలనీల్లో ఈడబ్ల్యూఎస్, ఎల్ఐజీ గృహాలకు పెద్ద పీట వేయాలని స్పష్టం చేసింది. ప్లాట్ పరిమాణం గరిష్టంగా 125 చదరపు గజాలుండాలని, వీటి సగటు పరిమాణం 100 చదరపు గజాలుండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. వీటి నిర్మాణాలకు ముందుకు వచ్చే వారి కోసం కొన్ని సడలింపులను కూడా పాలసీలో పేర్కొంది. హైయర్ డెన్సిటీ, ఫ్లోర్ ఏరియా రేషియోలను ప్రోత్సహించాలని నిర్ణయించింది. ఎకరా భూమిలో సాధ్యమైనన్ని ఎక్కువ ఫ్లాట్లు నిర్మించడం, బాహ్య అభివృద్ధి రుసుము, లైసెన్స్ ఫీజులకు సంబంధించిన రుసుములను సడలించింది. కొత్త పాలసీలో పేర్కొన్నట్లుగానే కచ్చితంగా నిర్మాణాలు జరగాలని, ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించకుండా ఉండాలని హెచ్చరికలు జారీ చేసింది.. అయితే ప్రత్యేకంగా నిర్మించే ఈ కాలనీలను గరిష్టంగా 5 ఎకరాల్లో నిర్మించాలని, సాధ్యమైంతగా వీటిని ప్రోత్సహించి సంఖ్య ఎక్కువ అయ్యేలా చూడాలని స్పష్టం చేసింది. ప్రమోటర్ల ద్వారా ప్లాట్లు, ఫ్లాట్లు ఇలా రెండింటిని అభివృద్ధి చేయాలని పేర్కొంది. సేలబుల్ ఏరియాను 50 శాతం నుంచి 65 శాతానికి పెంచడంతో పాటు ఈ అందుబాటు గృహాలకు పార్కింగ్ సౌకర్యాల కల్పనలో మినహాయింపులు ఇచ్చింది. ఈ గృహల లబ్ధిదారుల ఎంపికలోను తగు జాగ్రత్తలు తీసుకుంటున్నది. వెనకబడిన వర్గాల వారికి, మైనారిటీలకు, ఇతర మధ్యతరగతి కుటుంబాలకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నది. దేశంలోనే తొలిసారిగా ఇలాంటి వినూత్నమైన విధానానికి పంజాబ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో అక్కడి నిర్మాణ రంగ నిపుణులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మొక్కలతో కూల్ కూల్...

వేసవి వచ్చేసింది. ఎండలు మండిపోతున్నాయి. ఏసీలు, కూలర్లు వాడకం మొదలైంది. అయినా కూడా ఎండ వేడి నుంచి ఉపశమనం పొందలేని పరిస్థితి. అయితే మొక్కలు ఉన్న ఇంట్లో ఇలాంటి సమస్య దాదాపు ఉండదు. ఎందుకంటే ఇంట్లో పెంచుకునే మొక్కలు వేసవి ఉష్ణోగ్రతల నుంచి మనల్ని కాపాడతాయి. కేవలం ఔట్ డోర్ ప్లాంట్లతోనే కాదు ఇండోర్ ప్లాంట్లతోనూ ఎండాకాలం కూల్ కూల్‌గా ఉండవచ్చు. తక్కువ ఖర్చు, పర్యావరణ హిత విధానంలో ఇంటిని చల్లబరుచుకోవచ్చు. అలోవెరా, అరెకా పామ్, ఫైకస్, ఫెర్న్, స్నేక్ ప్లాంట్, గోల్డెన్ పాతోస్ వంటి మొక్కల వల్ల ఇంటికి అందంతో పాటు, చల్లదనాన్ని, ఆహ్లాదకర వాతావరణాన్ని అందిస్తాయి. మొక్కలు కిరణ జన్యసంయెగ క్రియ సమయంలో కొంత శాతం నీటిని కోల్పోతాయి. అవి వాతావరణంలో చేరి అక్కడి ప్రాంతాన్ని చల్లబరుస్తాయి. ఇంకెందుకు ఆలస్యం వెంటనే ఈ మొక్కలను మీ ఇండ్లకు తెచ్చుకోండి.



సుడోకు

డైలీ సుడోకు 147 సమాధానం

6	2	3	5	1	8	9	7	4
8	1	7	9	4	2	6	5	3
4	5	9	7	6	3	8	2	1
7	8	4	2	3	6	1	9	5
2	9	1	8	5	4	3	6	7
5	3	6	1	7	9	4	8	2
3	7	2	6	9	1	5	4	8
1	6	5	4	8	7	2	3	9
9	4	8	3	2	5	7	1	6

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు - 148

8					7			
	3			4				2
		6			1			5
1			7	8			9	
		9	2		4	8		
	8			9	5			3
4			5			2		
2				6			5	
			4					7

'అందుబాటు ధర' ఎక్కడ?



'మార్కెట్లో ప్లాట్ల లావాదేవీలు పెరగాలే తప్ప.. ధరలు మాత్రం కాదు. ఇది ఒక క్రమపద్ధతిలో జరగాలి. అంతేతప్ప, రాత్రికి రాత్రే రేట్లు పెరగడం వల్ల ప్రజలకు దీర్ఘకాలంలో తీవ్ర నష్టం వాటిల్లుతుంద'ని మారమ్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ఎండీ మారమ్ సతీష్ అభిప్రాయపడ్డారు. పదేండ్ల క్రితం మహేశ్వరంలో ఇదే జరిగిందని.. అప్పటివరకూ గజం వెయ్యి రూపాయలు కూడా పలకని ప్లాటు ధర.. బూమ్ సమయంలో ఒక్కసారిగా ఎనిమిది నుంచి పది వేలకు పెరిగిందని.. అప్పుడు కొన్నవాళ్లంతా ఆ రేటు కోసం పదేండ్ల నుంచి ఎదురు చూస్తున్నారని ఆయన వివరించారు.

భాగ్యనగరానికొస్తున్న దేశ, విదేశీ కంపెనీలు.. విస్తరణ ప్రణాళికల్ని రచిస్తున్న ప్రస్తుత ఐటీ సంస్థలు.. క్రమం తప్పకుండా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సులు.. మెరుగవుతున్న మౌలిక సదుపాయాలు.. ఇలాంటి సానుకూలాంశాల కారణంగా.. హైదరాబాద్‌లో గత రెండు నుంచి మూడు నెలల్లో ఒక్కసారిగా ప్లాట్ల ధరలు పెరిగాయి. ముఖ్యంగా పశ్చిమ హైదరాబాద్, ఈస్ట్ హైదరాబాద్‌లో ఈ ప్రభావం అధికంగా కనిపిస్తుంది. మూడు నెలల క్రితం దాకా కొండాపూర్‌లో గజం ధర రూ.30 నుంచి 35 వేలు ఉండగా.. ప్రస్తుతం నలభై వేల రూపాయలు దాటేసింది. ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదిస్తున్న బుద్వేల్ ఐటీ కారిడార్ వద్ద ప్లాట్ల రేటు ఒక్కసారిగా పెరిగింది. ఐటీ క్లస్టర్ స్థలాన్ని మంత్రి కేటీఆర్ పరిశీలించిన వెంటనే.. అక్కడి మధ్యవర్తులు ఒక్కసారిగా ప్లాట్ల ధరలను పెంచేశారు. ఇలా కృత్రిమంగా పెరిగే ధరల వల్ల హైదరాబాద్ రియల్ రంగం దీర్ఘకాలంలో ఇబ్బంది పడే ప్రమాదముందని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మధ్యవర్తులే కారణం...

హైదరాబాద్‌లోని ప్రధాన ప్రాంతాల్లో రేట్లు పెరగడం వల్ల శివారు ప్రాంతాల్లో ప్లాట్లు కొనాలని భావించే వారికి తీవ్ర నిరాశే ఎదురైంది. మౌలిక సదుపాయాలు పెద్దగా అభివృద్ధి చెందని ప్రాంతాల్లో, నగరంతో రవాణా మార్గం అనుసంధానించకున్నా.. ప్లాట్ల రేట్లు మాత్రం ఒక్కసారిగా పెరిగిపోయాయి. 2018 జనవరి మొదటి వారంలో కొల్లూరులో గజం ధర రూ.8,000 ఉండేది. ఇప్పుడక్కడ రూ.12,000 చెబుతున్నారు. భానూరు-శంకర్‌పల్లి మార్గంలో గజం రేటు రూ.4,000-5,000 ఉండేది. ఇప్పుడిక్కడి ప్రధాన ప్రాంతాల్లో రేటు రూ.7,000 దాటేసింది. అయితే, రేట్లు ఇలా అనూహ్యంగా పెరగడానికి ప్రధాన కారణం.. మధ్యవర్తులేనని రియల్ సంస్థలు సైతం అంగీకరిస్తున్నాయి. కొందరు మధ్యవర్తులు స్థలయజమానులకు మాయమాటలు చెప్పి.. ఎక్కువ రేటుకే ఫ్లాటును విక్రయిస్తామని వారితో అగ్రిమెంట్లు కుదుర్చుకుని.. ఆయా ప్లాట్లను మార్కెట్లో అమ్మకానికి పెడుతున్నారు. దీంతో పెరిగిన ధరలను చూసిన కొనుగోలుదారులు సైతం ఆశ్చర్యపోతున్నారు. కొనడానికి వెళితే ఇష్టం వచ్చిన రేట్లు చెబుతున్నారని.. ఇలాంటి పరిస్థితిని గతంలో ఎన్నడూ చూడలేదని ఇటీవల అమెరికా నుంచి హైదరాబాద్ తిరిగి వచ్చిన సరితా మూర్తి తెలిపారు. ఇలా, దాదాపు అన్ని ప్రాంతాల్లో కృత్రిమంగా ప్లాట్ల ధరలను పెంచే ప్రబుద్ధులు పెరిగిపోయారు. ఫలితంగా, నగరంలో ప్లాట్లు కొనాలని భావించేవారు వెనకడుగు వేయాల్సిన దుస్థితి నెలకొన్నది.

సామాన్యుల్ని పట్టించుకోని డెవలపర్లు..

హైదరాబాద్‌లో ఫ్లాట్ల విస్తీర్ణానికి పలువురు డెవలపర్లు సరికొత్త భాష్యం చెబుతున్నారు. నిన్నటివరకూ వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణం ఉంటే, డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్లుగా భావించేవారు. ప్రస్తుతం 1200 నుంచి 1400 చ.అడుగుల్లో నిర్మించే డెవలపర్లు పెరిగిపోయారు. ఫలితంగా, గచ్చిబౌలి వంటి ప్రాంతంలో రెండు పడక గదుల ఫ్లాట్ల కోసం రూ.70 లక్షలు పెట్టాల్సి వస్తోంది. మౌలిక అభివృద్ధికి నోచుకోని నలగండ్లలో ఇంచుమించు ఇదే రేటును పలు గేటెడ్ కమ్యూనిటీ సంస్థలు చెబుతున్నాయి. కొండాపూర్ చిరెక్ స్కూల్ చుట్టుపక్కల ప్రాంతాల్లో రెండు బెడ్‌రూం ఫ్లాటు కొనాలంటే.. రూ.60 లక్షలు అవుతోంది. మియాపూర్‌లో రెండు పడక గదుల ఫ్లాట్ల కోసం హీనపక్షం రూ.55 లక్షల దాకా ఖర్చొస్తుంది. మరి, 55 లక్షలు పెట్టి డబుల్ బెడ్‌రూం ఫ్లాట్ కొనడం ఎవరి వల్ల సాధ్యమవుతుంది? నెలకు రూ.లక్ష జీతాన్ని ఆర్జించేవారే ఇంత మొత్తం పెట్టి డబుల్ బెడ్‌రూం ఫ్లాట్లను కొంటారు. భార్యాభర్తలిద్దరూ కలిసి నెలకు లక్ష ఆర్జిస్తే తప్ప సొంతింటి కలను సాకారం చేసుకోలేని దుస్థితి. ఇప్పటికైనా డెవలపర్ల ఆలోచన విధానం మారాలని.. తాము కొనుగోలు చేసేలా ఫ్లాట్లను నిర్మించాలని అధిక శాతం మధ్యతరగతి ప్రజానీకం కోరుతున్నారు.

అందుబాటు గృహాల మాటేమిటి?

ప్రస్తుతం పశ్చిమ హైదరాబాద్‌లో అధిక శాతం సంస్థలు లక్ష రూపాయలు పైబడిన జీతాన్ని ఆర్జించే వాళ్లను దృష్టిలో పెట్టుకుని ఇండ్లను నిర్మిస్తున్నారు. అంతే తప్ప, నెలకు రూ.50 వేల లోపు ఆర్జనపరులను అసలే మాత్రం పట్టించుకోవట్లేదు. పది, పదిహేనేండ్ల క్రితం కూకట్‌పల్లి, మూసాపేట్, సనత్‌నగర్, మెహదీపట్నం, అత్తాపూర్, ఎల్బీనగర్ వంటి ప్రాంతాల్లో సింగిల్ బెడ్‌రూం ఫ్లాట్లను డెవలపర్లు నిర్మించేవారు. ప్రస్తుతం తక్కువ విస్తీర్ణంలో ఫ్లాట్లను కట్టేవారిని భూతద్దం పెట్టి వెతికినా కనిపించని దుస్థితి.

భాగ్యనగర నిర్మాణ సంస్థలు బూమ్ పీరియడ్ పరిస్థితులనే ప్రామాణికంగా తీసుకుని.. నేటికీ ఫ్లాట్లను డిజైన్ చేస్తున్నారు. అధిక విస్తీర్ణంలో ఫ్లాట్లను నిర్మిస్తే.. నిర్మాణ వ్యయం తగ్గుతుందని.. తక్కువ మందికి జవాబు చెప్పాల్సి ఉంటుందని భావించే డెవలపర్లు పెరిగారు. హైదరాబాద్‌లో 28 వేలకు పైగా ఫ్లాట్లు అమ్ముడుపోకుండా ఉన్నాయని జోన్స్ లాంగ్ లసాల్ తాజా నివేదికలో వెల్లడించింది. ఆ నివేదిక తప్పులతడకగా తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ అభివర్ణించింది. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) అందుకున్నాక.. అమ్ముడు కాని ఫ్లాట్లు ఉంటే 'అన్‌సోల్డ్ ఫ్లాట్లు'గా పరిగణించాలని సంఘం ప్రధాన కార్యదర్శి జక్కా వెంకట్‌రెడ్డి తెలిపారు. బ్యాంకు, కొనుగోలుదారుడు, డెవలపర్ మధ్య ఒప్పందం కుదుర్చుకుని ఫ్లాట్లను కొనడం ఆనవాయితీగా వస్తున్నదని.. నిర్మాణంలో ప్రగతిని బట్టి బ్యాంకులు సొమ్ము విడుదల చేస్తాయన్నారు . నిర్మాణమంతా పూర్తయ్యాక.. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ చేతికొచ్చాకే కొనుగోలుదారులు రిజిస్ట్రేషన్ చేసుకుంటారని వివరించారు. ఇలాంటప్పుడు ఫ్లాట్లను అన్‌సోల్డ్‌గా పరిగణించలేమని.. ఓసీ అందుకున్నాక అమ్ముడు కాని ఫ్లాట్లను మాత్రమే 'అన్‌సోల్డ్'గా పరిగణనలోకి తీసుకోవాలని తెలియజేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో 28 వేలకు పైగా ఫ్లాట్లు వివిధ ప్రాంతాల్లో నిర్మాణాలు జరుగుతున్నాయని క్రెడాయ్ హైదరాబాద్ సభ్యుడు మారమ్ సతీష్ అభిప్రాయపడ్డారు.


ఆలీ, బ్రహ్మానందం, సుబ్బరామిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, విజయ్‌కుమార్

మహబూబ్‌నగర్‌లో కాకతీయ కళావైభవ మహోత్సవాలు

కాకతీయ కళావైభవ మహోత్సవ వేడుకల్ని ఈ నెల 11న మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్నారు. ఈ వేడుకలో ప్రముఖ సినీ నటుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత బ్రహ్మానందాన్ని 'హాస్యనట బ్రహ్మ' బిరుదుతో సత్కరించనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో సుబ్బిరామిరెడ్డి మాట్లాడుతూ 'కాకతీయుల కళావైభవం, శిల్పసంపద అపూర్వం, అమోఘం. కవులు, సాహితీకారులు కాకతీయుల వైభవాన్ని గురించి వర్ణించిన తీరును వింటుంటే ఒళ్లు పులకరిస్తుంది. ఈనాటికి ఓరుగల్లులోని శిల్ప సంపద, వేయిస్తంభాల గుడి చెక్కుచెదరలేదు. ఆనాటి వైభవాన్ని మరోసారి తెలుగు ప్రజలకు గుర్తుచేయాలనే సంకల్పంతో రెండు నెలల క్రితం కాకతీయ కళావైభవ మహోత్సవాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించాను. దీనిని తెలంగాణలోని మహబూబ్‌గనర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, నిజామాబాద్‌లో అంచెలంచెలుగా నిర్వహిస్తాం. ఆనాటి వైభవాన్ని ప్రతిబింబించే విధంగా ఈ వేడుకల్ని జరుపుతాం. సినీ కళాకారులకు కులం, మతం, ప్రాంతీయ భేదాలతో సంబంధంలేదు. దర్శకుడు, నిర్మాతలు, నటీనటులు ఒక్కో ప్రాంతం నుంచి వచ్చి పనిచేస్తున్నారు. అలాంటి వారిని గౌరవించి సత్కరిస్తున్నాం. కళలోనే ఈశ్వర శక్తి, దైవత్వమున్నదని నేను నమ్ముతాను. కళాకారుల్ని అభిమానించి, ప్రేమించి గౌరవిస్తే ఈశ్వర శక్తి మనకు చేకూరుతుంది. తెలంగాణలో జిల్లాలకు సంబంధించి తొలిసారిగా కళలకు, సాహిత్యానికి ప్రసిద్ధి చెందిన మహబూబ్‌నగర్‌లో ఈ వేడుకల్ని నిర్వహించడం ఆనందంగా ఉంది. కాకతీయ కళావైభవ మహోత్సవ ఆహ్వానసంఘం చైర్మన్‌గా మహబూబ్‌నగర్ లోక్‌సభ సభ్యుడు జితేందర్‌రెడ్డి వ్యవహరిస్తుండగా, శాసనసభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ కో చైర్మన్‌గా పనిచేస్తున్నారు. తెలుగువారు గర్వించే గొప్ప నటుడు బ్రహ్మానందం, దాదాపు 1100 సినిమాల్లో ఎన్నో విభిన్నమైన పాత్రలతో కనిపించారు. ఆయన హాస్యనట బ్రహ్మ బిరుదుతో సత్కరించబోతుండటం సంతోషంగా ఉన్నది. ఈ మహోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి హాజరుకానున్నారు. కళలు రాజకీయాలకు అతీతంగా ఉన్నప్పుడు పరిపూర్ణత చేకూరుతుందని నమ్ముతాను. ఈ వేడుకకు పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులందరూ హాజరుకానున్నారు. ఈ వేడుకలో సినీ నటులు అలీ, జయప్రద, రాజశేఖర్, బాబుమోహన్, పరుచూరి గోపాలకృష్ణ, జీవిత, కవిత, కేథరిన్, హంసానందిని, శ్రద్ధాదాస్, పృథ్వీ, రఘుబాబు, శ్రీనివాసరెడ్డిలకు కాకతీయ పురస్కారాలను ప్రదానం చేస్తాం. అలాగే మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన సాహిత్య, సంగీత, నృత్య రంగాల్లో సేవలు చేసిన ఎల్లూరి శివారెడ్డి, కపిలవాయి లింగమూర్తి, గోరెటి వెంకన్న, చిక్కా హరీష్, జంగిరెడ్డి, పద్మాలయ ఆచార్య, వంగీశ్వర నీరజలను కాకతీయ అవార్డుతో సత్కరిస్తాం' అని తెలిపారు. శాసనసభ్యుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 'కళాకారులు, నటులకు, కళాపోషకులకు ప్రాంతీయ భేదాలతో సంబంధం ఉండదు. దానికి నిదర్శనం సుబ్బిరామిరెడ్డినే. గొప్ప భక్తుడు, నటుడు, కళాపోషకుడు. మహబూబ్‌నగర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలియగానే ఆనందమేసింది. తెలుగు ప్రజలది వీడిపోని బంధం. పాలకుల స్వార్థ ప్రయోజనాల కారణంగా అభివృద్ధికి నోచుకోకనే ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటుచేయడం జరిగింది. కుల, మత ప్రాంతీయ భేదాలతో సంబంధం లేకుండా తెలంగాణ ప్రభుత్వం కళాకారులను ఎల్లప్పుడూ ఆదరిస్తూనే ఉంటుంది. ప్రతి కళాభిమాని ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు. కళాకారులంటే నటరాజుకు ఇష్టమని, నటరాజు రూపంలో సుబ్బిరామిరెడ్డి కళాకారుల్ని గౌరవిస్తున్నారని ఆలీ చెప్పారు. గోన గన్నారెడ్డి నడయాడిన నేలపై కాకతీయ కళావైభవోత్సవాన్ని నిర్వహిస్తుండటం ఆనందంగా ఉందని విజయ్‌కుమార్ చెప్పారు. కాకతీయులు చెరువుల తవ్వకం, తెలంగాణ బిడ్డగా రుద్రమదేవి చేసిన సేవలను గురించి ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి చెప్పిన మాటలు వింటుంటే స్ఫూర్తి కలుగుతున్నదని, సుబ్బిరామిరెడ్డి మనసు ఎప్పుడూ కళాకారులు, కళలపైనే నిమగ్నమై ఉంటుందని బ్రహ్మానందం పేర్కొన్నారు. ఈ వేడుకకు నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే దిన పత్రికలు ప్రచార భాగస్వాములుగా వ్యవహరిస్తున్నాయి.


'రంగస్థలం' చిత్రంలో సమంత

వెంకటేష్ కొత్త లుక్!



వెంకటేష్ కథానాయకుడిగా తేజ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. సురేష్‌ప్రొడక్షన్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై డి.సురేష్‌బాబు, అనిల్ సుంకర ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఇటీవలే లాంఛనంగా పూజా కార్యక్రమాలు జరుపుకుంది. కానీ రెగ్యులర్ షూటింగ్ మాత్రం ప్రారంభం కాలేదు. కథానుసారం ఇందులో వెంకటేష్ ప్రొఫెసర్‌గా కనిపించనున్నారట. ఆ గెటప్‌కు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌తో కళ్లజోడు పెట్టుకుని ఒక చేతిలో బ్యాగ్, మరో చేతిలో పుస్తకాలు పట్టుకుని యాష్ కలర్ సూట్‌లో కనిపిస్తున్న వెంకటేష్ స్టిల్స్ సినిమాపై ఆసక్తిని కలిగిస్తున్నాయి. తేజ మార్కు ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'ఆట నాదే వేట నాదే' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారు. ఇందులో శ్రియ కథానాయకగా నటిస్తున్నది. వెంకటేష్‌తో పాటు శ్రియ కెరీర్‌లోనూ రూపొందుతున్న 72వ సినిమా ఇది. ఇందులో హీరో నారా రోహిత్ కీలక పాత్రలో నటించనుండగా అతనికి జోడీగా ఈషా రెబ్బా నటించనుందని తెలిసింది. కాగా ఈ చిత్రాన్ని ఈ వారంలోనే సెట్స్‌పైకి తీసుకు రానున్నట్లు సమాచారం.

కమల్‌హాసన్ నిర్మాణంలో..


నితిన్

ప్రస్తుతం 'శ్రీనివాస కళ్యాణం' చిత్రీకరణలో బిజీగా వున్నారు నితిన్. త్వరలో ఆయన ఓ భారీ చిత్రంలో నటించబోతున్నట్లు తెలుస్తున్నది. ఇందులో విక్రమ్ కీలక పాత్రలో నటిస్తారని, కమల్‌హాసన్ స్వీయ నిర్మాణ సంస్థ రాజ్‌కమల్ ఇంటర్‌నేషనల్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనుందని సమాచారం. నటనకు వీడ్కోలు పలికి ఇటీవలే కొత్త పార్టీ స్థాపించిన కమల్‌హాసన్ సొంత నిర్మాణ సంస్థపై వరుస చిత్రాల్ని ప్లాన్ చేస్తున్నాడట. అందులో భాగంగా ఓ ఫ్రెంచ్ చిత్రానికి సంబంధించిన రీమేక్ హక్కుల్ని సొంతం చేసుకున్నారని తెలిసింది. ఈ సినిమాలో నితిన్ కథానాయకుడిగా నటిస్తారని, ఓ ముఖ్యమైన పాత్రలో విక్రమ్ నటిస్తాడని చెన్నై సినీ వర్గాల్లో వినిపిస్తున్నది. ఈ చిత్రానికి 'చీకటిరాజ్యం' ఫేం రాజేష్‌సెల్వ దర్శకత్వం వహించనున్నట్లు సమాచారం.


ఆర్.కె.గౌడ్, నారాయణమూర్తి

బంద్‌తో డిమాండ్స్ నెరవేరలేదు!

'ప్రేక్షకులకు వినోదం, విజ్ఞానాన్ని అందిస్తున్న సినిమా కోసం జరుగుతున్న బంద్‌లో న్యాయం ఉందని నమ్మి ప్రజలు తమ సహకారాన్ని అందించారు. అయితే నిర్మాతలు ఏ డిమాండ్స్ అయితే సాధించామని అనుకుంటున్నారో అవి నిజంగా నెరవేరలేదు' అని ఆరోపించారు నటుడు, నిర్మాత ఆర్. నారాయణమూర్తి. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'తమిళ, మలయాళం, కన్నడ భాషల వారు థియేటర్స్ బంద్‌ను కొనసాగిస్తుంటే మన తెలుగు ఫిలింఛాంబర్ ఎందుకు ఆపాల్సి వచ్చిందో సినీ పెద్దలు తెలపాలి. తెలుగు చలన చిత్ర పరిశ్రమ ప్రకటించిన ఈ బంద్‌పై మాకు కొన్ని అపోహలు, ఆవేదనలు ఉన్నాయి. ప్రారంభంలోనే అల్లు అరవింద్, సురేష్‌బాబు, జెమిని కిరణ్ దీని గురించి మాట్లాడి ఉంటే సమస్య ఉత్పన్నమయ్యేది కాదు. బంద్ ప్రకటించి పరిశ్రమ, థియేటర్లపై ఆధారపడిన లక్షలాది మందిని ఇబ్బందుల్ని గురిచేసి సాధించిందేమిటి? ఇతర రాష్ట్రాల్లో నిర్మాతలు, పంపిణీదారులు, ఎగ్జిబిటర్లు ఒక్కో సెక్టార్‌గా విభజితమై ఉంటే మన దగ్గర ఆ పరిస్థితి లేదు. ఇక్కడ పంపిణీదారులుగా, ఎగ్జిబిటర్లుగా కూడా నిర్మాతలే వ్యవహరిస్తున్నారు. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లలో వారు భాగస్వాములుగా ఉన్నారు. అందుకే ఎన్ని పోరాటాలు చేసినా సినీ రంగంలోని సమస్యలు పరిష్కారం కావడం లేదు. కొద్దిమంది చేత సినీ పరిశ్రమ పాలించబడుతున్నది. ప్రభుత్వమే ఈ సమస్యను పరిష్కరించాలి. న్యాయం పక్షనా నిలబడాలి. తక్కువ ధరలకే సేవలను అందిస్తామని అనేక చిన్న కంపెనీలు వస్తుంటే వాటిని రాకుండా ఇండస్ట్రీలో పాతుకుపోయిన సంస్థలు అడ్డుకుంటున్నాయి. గుత్తాధిపత్యాన్ని పారద్రోలాలి. తమ డిమాండ్స్ కొరకు థియేటర్ల బంద్ చేసి చివరకు రెండు వేల తగ్గింపులకు అంగీకరించడం న్యాయం కాదు. చిన్న కంపెనీలకు అవకాశం కల్పిస్తే వారే దిగివస్తారు. ఐదేళ్ల తర్వాత ఉచితం చేస్తామని డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ ఇచ్చిన హామీలు అమలుకాకముందు బంద్ విరమించడం ఎంతవరకు సమంజసమని సినీ పెద్దలను కోరుతున్నాం' అని తెలిపారు. వీఫీఎఫ్ ఛార్జీల విషయంలో చిన్న సినిమాలకు మినహాయింపు ఇవ్వాలని, పదేళ్లుగా డిజిటల్ వ్యవస్థపై తాము పోరాటం చేస్తున్నా పెద్దల సహకారం లేకపోవడంతో విజయవంతం కాలేకపోయామని ప్రతాని రామకృష్ణగౌడ్ చెప్పారు.


ప్రముఖ నిర్మాత సి.కల్యాణ్ కుమారుడు తేజ వివాహం నాగశ్రీవిద్యతో గురువారం హైదరాబాద్ మాదాపూర్‌లోని ఇమేజ్ గార్డెన్స్‌లో జరిగింది. ఈ వివాహ వేడుకకు పలువురు సినీ ప్రముఖులు హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలందజేశారు. ప్రముఖ నటుడు చిరంజీవి, సురేఖ దంపతులు కొత్తజంటను ఆశీర్వదించారు.

తొలిప్రేమ దర్శకుడితో...


అఖిల్

'హలో' సినిమా విడుదలై దాదాపు నాలుగు నెలలు గడిచిన అక్కినేని అఖిల్ ఇప్పటి వరకు తన తాజా చిత్రాన్ని ప్రకటించలేదు. కాగా విశ్వసనీయ సమాచారం ప్రకారం అఖిల్ తన తదుపరి చిత్రాన్ని వెంకీ అట్లూరి దర్శకత్వంలో చేస్తున్నట్లుగా తెలిసింది. వరుణ్‌తేజ్‌తో తెరకెక్కించిన 'తొలిప్రేమ' చిత్రం సాధించిన విజయంతో పరిశ్రమ దృష్టిని ఆకర్షించిన వెంకీ ఇటీవల అఖిల్‌ను కలిసి ఓ వినూత్నమైన ప్రేమకథను వినిపించినట్లుగా సమాచారం. త్వరలోనే సెట్స్‌మీదకు వెళ్లనున్న ఈ చిత్రాన్ని 'తొలిప్రేమ'తో వెంకీ అట్లూరిని దర్శకుడిగా పరిచయం చేసిన బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మాణంలోనే రూపొందనుంది.

జ్ఞాపకాల వెల్లువలో..


అను ఆంటోని

'కాలేజీ జీవితం ఓ అందమైన కలల ప్రపంచం లాంటిది. ఎన్నో మధురజ్ఞాపకాలు, మరపురాని అనుభవాలకు నెలవు. కాలేజీ రోజుల్లోని జ్ఞాపకాలు ప్రతి ఒక్కరి హృదయంలో పదిలంగా వుంటాయి. అలా కాలేజీ రోజుల్లోని అనుభూతుల్ని 'ఆనందం' చిత్రం ఆవిష్కరిస్తుంది' అన్నారు నిర్మాత గురురాజ్. మలయాళంలో విజయవంతమైన 'ఆనందం' చిత్రాన్ని అదే పేరుతో ఆయన తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. గణేష్ రాజ్ దర్శకత్వం వహించారు. మలయాళ 'ప్రేమమ్' ఫేమ్ నివిన్‌పాల్ ఈ సినిమాలో కీలక పాత్రను పోషించారు. ఈ నెల 23న విడుదల చేస్తున్నారు. నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఈ నెల 17న ఆడియోను విడుదల చేయబోతున్నాం. కథానుగుణంగా సచిన్ వారియర్ చక్కటి స్వరాల్ని అందించారు. ప్రపంచంలో ఎక్కడైనా కాలేజీ అనుభవాలు ఒకేలా వుంటాయి. ఈ సినిమా చూసినవారందరికి అవన్నీ గుర్తుకొస్తాయి. ఒక ఇండస్ట్రియల్ టూర్‌కు వెళ్లిన విద్యార్థుల బృందంలోని మూడు ప్రేమజంటల కథే ఈ చిత్ర ఇతివృత్తం' అన్నారు. అరుణ్ కురియన్, థామస్ మాథ్యూ, రోషన్ మాథ్యూ, విశాక్ నాయర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి మాటలు: ఎం.రాజశేఖరరెడ్డి, కెమెరా: ఆనంద్. ఇ.చంద్రన్, సహనిర్మాతలు: వీరా వెంకటేశ్వరరావు, వి.బి.ఆర్.రాజు, రవివర్మ చిలువూరి, దర్శకత్వం: గణేష్‌రాజ్, సమర్పణ: ఆర్.సీతారామరాజు.

గ్రాఫిక్స్ వల్లే ఆలస్యం


భానుచందర్, పి.డి.రాజు

పి.డి.రాజు, భానుచందర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'తొలికిరణం'. జాన్‌బాబు స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్నారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ సందర్భంగా భానుచందర్ మాట్లాడుతూ 'తొలికిరణం' అంటే ఫస్ట్ లైట్ అని అర్థం. చనిపోయిన మూడు రోజుల తరువాత ఏసు బతికొచ్చి ఏం చేశారు? భక్తులకు ఎటువంటి బోధనలు చేశారనే విషయాలు ఈ సినిమాలో ఉంటాయి. క్రీస్తు పాత్రలో పీడీ రాజు ఒదిగిపోయారు. ఆయనను చూస్తుంటే నిజంగా ఆ ఏసుని చూసిన అనుభూతి కలుగుతుంది. త్వరలో మా అబ్బాయి హీరోగా జాన్‌బాబు దర్శకత్వంలో ఓ సినిమా ఉంటుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'చిత్రంలో 45 నిమిషాల పాటు గ్రాఫిక్స్ వుంటాయి. దాని వల్లే సినిమా ఆలస్యమైంది. వీటిని లండన్‌లో చేయించాం. ఆలస్యమైనా గ్రాఫిక్స్ అద్భుతంగా కుదిరాయి. క్రీస్తు దీవెనలు పొందాలనే లక్ష్యంతో ఈ చిత్రాన్ని రూపొందించాను. నా తదుపరి చిత్రం భానుచందర్ తనయుడితో వుంటుంది' అన్నారు.

సందేశంతో 'తారామణి'


డి.వెంకటేష్, శ్రీలేఖ

అంజలి, ఆండ్రియా, వసంత్‌రవి ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'తారామణి'. ఈ చిత్రాన్ని అదే పేరుతో డి.వి.సినీ క్రియేషన్స్ పతాకంపై డి.వెంకటేష్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ చిత్రంలోని 'చేతులు చాచి..యుగములు వేచి..నీకై ఎదురుచూస్తుంటాలే' అంటూ సాగే తొలి గీతాన్ని సంగీత దర్శకురాలు యం.యం.శ్రీలేఖ విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ 'తమిళంలో చక్కటి విజయం సాధించిన చిత్రమిది. సమకాలీన అంశాల్ని స్పృశిస్తూ మహిళా సమస్యల్ని చర్చించారు. ప్రేమ, సెంటిమెంట్, సందేశం మేళవింపుతో అందరిని ఆకట్టుకుంటుంది. యువన్‌శంకర్‌రాజా అద్భుతమైన సంగీతాన్నందించారు' అన్నారు. మహిళలందరిని ఆకట్టుకునే చిత్రమిదని నిర్మాత డి.వెంకటేష్ చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: యువన్‌శంకర్‌రాజా, దర్శకత్వం: రామ్.

జర్నలిస్టులకు చట్టసభలపై అవగాహన ఉండాలి

- రికార్డుల నుంచి తొలగించిన అంశాలను ప్రసారం చేయొద్దు
- మీడియా మిత్రులకు ఓరియంటేషన్ తరగతులు
- అసెంబ్లీ మీడియా అడ్వయిజరీ కమిటీ భేటీలో మంత్రి హరీశ్


శుక్రవారం అసెంబ్లీలో జరిగిన మీడియా అడ్వయిజరీ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మంత్రి తలసాని తదితరులు ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాలపై రిపోర్టింగ్ చేసే జర్నలిస్టులకు వాటిపై అవగాహన ఉండాలని, చట్టసభల సమావేశాలను కవరేజీ చేయడం జర్నలిస్టులకు ఒక కళ లాంటిదని రాష్ట్ర శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు తెలిపారు. చట్టసభల సమావేశాల రిపోర్టింగ్ చేసే సమయంలో ఆచితూచి వ్యవహరించాలని, నిబంధనలకు లోబడి పనిచేయాల్సి ఉంటుందని అన్నారు. సాధారణ రిపోర్టింగ్‌కు, చట్టసభల రిపోర్టింగ్‌కు చాలా తేడా ఉంటుందని చెప్పారు. ఈనెల 12 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో శుక్రవారం అసెంబ్లీ కమిటీహాల్‌లో ఏర్పాటు చేసిన అసెంబ్లీ మీడియా అడ్వయిజరీ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ చట్టసభల రిపోర్టింగ్ పై అవగాహన కల్పించేందుకు మీడియామిత్రులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. శాసనమండలి, శాసనసభలలో జరిగే అంశాలకు సంబంధించి సభాపతులు రికార్డుల నుంచి తొలగించిన కొన్ని అంశాలు మీడియాలో, ప్రత్యేకించి ఎలక్ట్రానిక్ మీడియాలో వస్తున్నాయని, రికార్డుల నుంచి తొలగించినవాటిని మీడియాలో కవరేజ్ చేయడానికి వీలులేదన్నారు. అసెంబ్లీ రిపోర్టింగ్‌పై జర్నలిస్టులకు అవగాహన, శిక్షణ తరగతులు ఏర్పాటుచేయాలని అడ్వయిజరీ కమిటీ సభ్యులు కోరగా, మంత్రి అందుకు అంగీకరించారు. గవర్నర్ ప్రసంగం కాపీలు, అసెంబ్లీలో ప్రవేశపెట్టే బడ్జెట్ పుస్తకాలు మీడియాకు సరిగా అందడం లేదని కొందరు కమిటీ సభ్యులు ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆయన ఇలాంటి సమస్య రాకుండా చూడాలని అసెంబ్లీ కార్యదర్శికి సూచించారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, అసెంబ్లీ మీడియా అడ్వయిజరీ కమిటీ చైర్మన్ సూరజ్ భరద్వాజ్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

మైనారిటీ గురుకులాల పనితీరు భేష్

- భవనాల నిర్మాణం, సౌకర్యాల పర్యవేక్షణకు జిల్లా కమిటీలు
- మైనారిటీ సంక్షేమ సమీక్షలో దానకిశోర్


సమీక్షలో మాట్లాడుతున్న కార్యదర్శి దానకిశోర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మైనారిటీ రెసిడెన్షియల్ స్కూళ్లు బాగా పనిచేస్తున్నాయని మైనారిటీ సంక్షేమశాఖ కార్యదర్శి ఎం దానకిశోర్ అన్నారు. శుక్రవారం తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టెమ్రీస్) కార్యాలయంలో మైనారిటీ సంక్షేమ డైరెక్టరేట్, గురుకులాలు, తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీఎస్ఎంఎఫ్‌సీ) అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో టెమ్రీస్ కార్యదర్శి బీ షఫీఉల్లా, టెమ్రీస్ అధికారులు, 31 జిల్లాల మైనారిటీ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు. మైనారిటీ గురుకులాల్లో విద్యార్థులు మరింత రాణించేలా బ్రిడ్జి కోర్సులను ప్రవేశపెట్టాలని కోరారు. గురుకులాల కోసం భవనాల నిర్మాణం, సౌకర్యాలు, వసతుల పర్యవేక్షణ కోసం ప్రతి జిల్లాలో జిల్లా ఇంచార్జీ అధికారి నేతృత్వంలో ఒక బృందాన్ని నియమించాలని, వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి మైనారిటీ గురుకులాల కోసం భవనాల సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. ఇప్పటికే టెమ్రీస్‌కు కేటాయించిన స్థలాల్లో ఎంఎస్‌డీపీ కార్యక్రమం కింద మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ భవనాల నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. మిగితా స్కూళ్ల కోసం జిల్లా కలెక్టర్లను సంప్రదించి స్థలాలు తీసుకోవాలని సూచించారు.

డౌన్‌లోడ్ చేసిన హాల్‌టికెట్లతో అనుమతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే ఎస్సెస్సీ పరీక్షల కోసం విద్యార్థులకు హాల్‌టికెట్ల పంపిణీ ప్రక్రియ కొనసాగుతున్నది. హాల్‌టికెట్లు అందనివారు www.bse.telangana. gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ బీ సుధాకర్ కోరారు. డౌన్‌లోడ్ చేసిన హాల్‌టికెట్లతో పరీక్షకేంద్రాలకు వచ్చిన విద్యార్థులను అనుమతించాలని చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించినట్టు స్పష్టంచేశారు.

విద్యాశాఖకు యునెస్కో అవార్డు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని పాఠశాల విద్యాశాఖకు ఈ-లెర్నింగ్‌లో యునెస్కో అవార్డు వచ్చింది. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్, యునెస్కో సం యుక్తంగా ఈ అవార్డును ప్రకటించాయి. రాష్ట్రంలోని దాదాపు 300 పాఠశాలల్లో అమలుచేస్తున్న ఈ-లెర్నింగ్‌లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. మొత్తం 12 జిల్లాల్లో 300 పాఠశాలల్లో 10,080 మంది విద్యార్థులు ఈ లెర్నింగ్‌లో పాల్గొన్నట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ శుక్రవారం తెలిపారు.

నేడు జీఎస్టీ కౌన్సిల్ సమావేశం

- ఐజీఎస్టీ బకాయిలు, యాంటీ ప్రాఫిటీరింగ్ చట్టసవరణపై చర్చ

హైదరాబాద్, నమస్తే తెలంగా: వస్తువులు, సేవల పన్ను (జీఎస్టీ) 26వ కౌన్సిల్ సమావేశం శనివారం ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో జరుగనున్నది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి రాష్ట్రం తరపున వాణిజ్యపన్నులు, ఆబ్కారీశాఖల ముఖ్యకార్యదర్శి సోమేశ్‌కుమార్, వాణిజ్యపన్నులశాఖ కమిషనర్ వీ అనిల్‌కుమార్ ప్రతినిధులుగా హాజరు కానున్నారు. సోమవారం నుంచి బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న దృష్ట్యా రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ సమావేశానికి హాజరు కాలేకపోతున్నారని అధికారులు తెలిపారు. ఈ కౌన్సిల్ సమావేశంలో యాంటీ ప్రాఫిటీరింగ్ చట్టానికి సవరణ, రాష్ట్రాలకు ఇవ్వాల్సిన ఐజీఎస్టీ బకాయిలు, వే-బిల్లుల జారీ తదితర అంశాలపై ప్రధానంగా చర్చ జరిగే అవకాశముంది.

పోలీసు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల పెంపు!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలని కార్పొరేషన్ బోర్డు నిర్ణయించింది. వేతనాలను 35 శాతం మేర పెంచాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ తెలిపారు. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో దామోదర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీజీపీ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలల్లో రొయ్యలు సిద్ధం!

లక్షల రొయ్య పిల్లల విడుదల

- 11 రిజర్వాయర్లలో ప్రయోగాత్మకంగా పెంపకం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మత్స్య సంపద అభివృద్ధిలో తెలంగాణ ముందడుగు వేస్తున్నది. గడిచిన రెండేండ్లలో రాష్ట్రంలోని వివిధ రిజర్వాయర్లు, చెరువుల్లో సుమారు 74 కోట్ల చేపపిల్లలను విడుదల చేసి వేలాది మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం జీవనోపాధిని కల్పించింది. వారి ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉన్న మంచినీటి రొయ్యల పెంపకంపై దృష్టిసారించింది. దేశంలోనే మొట్టమొదటిసారిగా రాష్ట్రంలో ఎంపిక చేసిన 11 రిజర్వాయర్లలో హేచరీలతో ఉత్పత్తి చేసిన మంచినీటి రొయ్యలు (స్కాంపీ రకం)విడుదల చేసింది. ఈ పంట మరో రెండునెలల్లో మత్స్యకారుల చేతికందుతుందని మత్స్యశాఖ వర్గాలు భావిస్తున్నాయి. 2017-18 సంవత్సరంలో రాష్ట్రంలోని 11 రిజర్వాయర్లలో 108.87 లక్షల రొయ్య పిల్లలను సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో విడుదల చేశారు. మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ సెప్టెంబర్‌లో సంగారెడ్డిలోని సింగూరు రిజర్వాయర్‌లో రొయ్యలను విడుదల చేయడం ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంచినీటి రొయ్యల ద్వారా లభించే ఫలితాలు మే నుంచి జూన్ వరకు మత్స్యకారులకు అందుతాయని అధికారులు వెల్లడించారు. ప్రభుత్వం విడుదల చేసిన రొయ్య పిల్లల ద్వారా సుమారు 217 టన్నుల ఉత్పత్తి జరుగుతుందని, దీనివల్ల 5.45 కోట్ల అదనపు ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. దాదాపు 10వేల మత్స్యకార కుటుంబాలు ప్రయోజనం పొందనున్నాయి. వచ్చే ఏడాదిలో అన్ని రిజర్వాయర్లలో పెంపకాన్ని చేపట్టాలని నిర్ణయించినట్టు మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ వెల్లడించారు.

2017-18లో విడుదల చేసిన రొయ్య పిల్లల వివరాలు

జలాశయం పేరు	జిల్లా	విడుదల చేసిన రొయ్యపిల్లల సంఖ్య (లక్షల్లో)
ఘన్‌పూర్ ములుగు	జయశంకర్ భూపాలపల్లి	3.29
కోయిల్‌సాగర్	మహబూబ్‌నగర్	4.30
పాలేరు	ఖమ్మం	6.50
వైరా	ఖమ్మం	7.10
లోయర్‌మానేర్ డ్యాం	కరీంనగర్	26.50
సింగభూపాలం చెరువు	భద్రాద్రి కొత్తగూడెం	1.80
పోచారం	మెదక్	6.20
సింగూరు	సంగారెడ్డి	26.00
కడెం	నిర్మల్	9.05
శ్రీపాద ఎల్లంపల్లి	మంచిర్యాల, పెద్దపల్లి	15.83
శనిగరం ప్రాజెక్టు	సిద్దిపేట	2.40
మొత్తం		**108.97**

వడ్రంగి వృత్తికి ఆధునిక హంగులు

- బెంగళూరులో ఉడ్ఇండియా ఎక్స్‌పోను సందర్శించిన తాడూరి, జూలూరు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో విశ్వకర్మల ఆర్థికాభివృద్ధి కోసం రూపొందిస్తున్న ఆర్థిక పథకాల అవగాహన కోసం ఉడ్ ఇండియా ఎక్స్‌పోను సందర్శించినట్లు ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ చెప్పారు. ఎంబీసీ కార్పొరేషన్ ద్వారా 80 శాతం సబ్సిడీతో విశ్వకర్మల కోసం అధునాతన యంత్రాలను త్వరలో అందజేసేలా ప్రణాళికల రూపకల్పన చేస్తామని చెప్పారు. ఎంబీసీలు ఆర్థిక పరిపుష్టి సాధించాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్ని వృత్తులవారికి అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వడ్రంగి వృత్తిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడంలో అవగాహన కోసం బెంగుళూరులో జరుగుతున్న ఉడ్ ఇండియా ఎక్స్‌పోను తెలంగాణ రాష్ట్రం తరపున తాడూరి శ్రీనివాస్, బీసీ కమిషన్ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్, ఎంబీసీ కార్పొరేషన్ సీఈవో అలోక్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. వీరితోపాటు 20 మంది యువ ఔత్సాహిక వడ్రంగి వృత్తి పనివారు సైతం ఎక్స్‌పో సందర్శనకు వెళ్లారు. జాతీయ, అంతర్జాతీయ ప్రతిష్ఠాత్మక సంస్థలు ఈ సదస్సులో పాల్గొన్నాయి.


స్మార్ట్‌సిటీలపై శుక్రవారం సచివాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న కేంద్ర అదనపు కార్యదర్శి సమీర్‌శర్మ, రాష్ట్ర ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్

సర్కార్ దవాఖానల్లో ఎస్టీపీ ప్లాంట్లు

- వరంగల్, కరీంనగర్ స్మార్ట్‌సిటీల అభివృద్ధిపై కేంద్ర అదనపు కార్యదర్శి సమీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని పది ప్రభుత్వ దవాఖానల్లో సివరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ)ను ఏర్పాటుచేయనున్నట్టు పురపాలక పరిపాలనా శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్ తెలిపారు. వరంగల్ ఎంజీఎంలో ప్రతిపాదిత 'ఎస్టీపీ'ని జూలై నెలాఖరులోగా పూర్తిగా వినియోగంలోకి తెస్తామని చెప్పారు. వరంగల్, కరీంనగర్ స్మార్ట్‌సిటీలో అభివృద్ధిపనులపై కేంద్ర అదనపు కార్యదర్శి సమీర్‌శర్మ శుక్రవారం సచివాలయంలో సమీక్షించారు. స్మార్ట్‌రోడ్ల నిర్మాణం, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు, భద్రకాళి సరస్సు, కాకతీయ మ్యూజికల్ గార్డెన్ అభివృద్ధిపై చర్చించారు. ఈ పనుల పురోగతిపై పదిహేనురోజులకోసారి సమీక్షించాలని అరవింద్‌కు సమీర్‌శర్మ సూచించారు. స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని స్మార్ట్‌సిటీ అభివృద్ధిని చేపట్టాలని, అన్నిశాఖల సమన్వయంతో ల్యాండ్ స్కేపింగ్, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను మెరుగుపరిచే కార్యక్రమాలను చేపట్టాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వరంగల్ మున్సిపల్ కమిషనర్ శ్రుతి ఓజా, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువచేయాలి: అరవింద్‌కుమార్

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందేలా విస్తృత ప్రచారం కల్పించడంలో అధికారులు ముఖ్యభూమిక పోషించాలని రాష్ట్ర సమాచారశాఖ కమిషనర్ అరవింద్‌కుమార్ సూచించారు. సమాచార పౌర సంబంధాలశాఖలో వివిధ స్థాయిలో పనిచేస్తున్న అధికారులకు శుక్రవారం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్చార్డీలో 'ప్రభుత్వ పథకాల ప్రచారంలో సోషల్ మీడియా వినియోగం' అనే అంశంపై ఐటీశాఖ డిజిటల్ మీడియా సహకారంతో ఏర్పాటుచేసిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. డిజిటల్ మీడియా డైరెక్టర్ కొణతం దిలీప్, సమాచారశాఖ అదనపు సంచాలకుడు నాగయ్య కాంబ్లే, సమాచారశాఖ చీఫ్ ఇంజినీర్ కిశోర్‌బాబు, పబ్లిసిటీ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్ సోషల్‌మీడియా గురించి వివరించారు. జాయింట్ డైరెక్టర్ సుజాత, డిప్యూటీ డైరెక్టర్లు, క్షేత్రస్థాయి అధికారులు పాల్గొన్నారు.

బీహెచ్‌ఈఎల్‌లో 918 అప్రెంటీస్‌లు

- పదోతరగతి + ఐటీఐ ఉత్తీర్ణత
- ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక
- శిక్షణ కాలంలో స్టయిఫండ్

విద్య, ఉద్యోగ సమాచారం

తిరుచిరాపల్లిలోని భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ట్రేడ్ అప్రెంటిస్‌షిప్ (ఐటీఐ హోల్డర్స్) కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

దేశంలో అతిపెద్ద విద్యుత్ పరికరాల ఉత్పత్తి సంస్థ అయిన బీహెచ్‌ఈఎల్‌ను 1964లో ఏర్పాటు చేశారు.ఈ సంస్థ మహారత్న హోదా కలిగి ఉంది.

- ట్రేడ్ అప్రెంటిస్‌షిప్ (ఐటీఐ హోల్డర్స్)
- మొత్తం ఖాళీల సంఖ్య: 918
- **విభాగాల వారీగా ఖాళీలు:** ఫిట్టర్-330, వెల్డర్ (జీ అండ్ ఈ)-240, టర్నర్-25, మెషినిస్ట్-35, ఎలక్ట్రీషియన్-75, వైర్‌మ్యాన్-20, ఎలక్ట్రానిక్ మెకానిక్-15, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్-20, ఏసీ అండ్ రిఫ్రిజిరేషన్-20, డీజిల్ మెకానిక్-15, డ్రాఫ్ట్స్‌మ్యాన్ (మెకానికల్)-15, షీట్ మెటల్ వర్కర్-15, ప్రోగ్రామ్ సిస్టమ్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ (పాసా)-50, ఫార్గర్ అండ్ హీట్ ట్రీటర్-10, కార్పెంటర్-15, ప్లంబర్-15, ఎంఎల్‌టీ పాథాలజీ-3
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదోతరగతితో పాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణత లేదా ఎన్‌సీటీవీటీ నుంచి జారీచేసిన నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ ఉండాలి. ప్లంబర్ ట్రేడ్‌కు 10+2 విధానంలో ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులై, ఏడాది ఐటీఐ పూర్తిచేసిన వారు అర్హులు.
- **వయస్సు:** 2018, ఏప్రిల్ 1 నాటికి 18 - 27 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీ అభ్యర్థులకు పదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **స్టయిఫండ్:** ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్, ఎలక్ట్రీషియన్, వైర్‌మ్యాన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, ఏసీ & రిఫ్రిజిరేషన్, డ్రాఫ్ట్స్‌మ్యాన్ (మెకానికల్) ట్రేడ్‌లకు నెలకు రూ. 11,129/- చెల్లిస్తారు.
- వెల్డర్ (జీ అండ్ ఈ), డీజిల్ మెకానిక్, షీట్ మెటల్ వర్కర్, ప్రోగ్రామ్ అండ్ సిస్టమ్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్, ఫార్గర్ అండ్ హీట్ ట్రీటర్, కార్పెంటర్, ప్లంబర్ ట్రేడ్‌లకు నెలకు రూ. 9,892/-, ఎంఎల్‌టీ పాథాలజీ ట్రేడ్ అభ్యర్థులకు నెలకు రూ. 8,656/- చెల్లిస్తారు.
- **సీట్ల కేటాయింపు:** ఎస్సీ - 19 శాతం, ఎస్టీ - 1 శాతం, ఓబీసీలకు 27శాతం, పీహెచ్‌సీలకు నాలుగు శాతం చొప్పున సీట్లను కేటాయిస్తారు.

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 20
- **షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థుల జాబితా:** మార్చి 23
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** మార్చి 26 నుంచి
- **వెబ్‌సైట్:** www.bheltry.co.in

ఎమ్మెస్సీ ఎకనామిక్స్

ఇందిరాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ రిసెర్చ్ (ఐజీఐడీఆర్)లో ఎమ్మెస్సీ, ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది.



వివరాలు:

ఐజీఐడీఆర్‌ను రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రారంభించింది. ఇది ఒక డీమ్డ్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్.

- ఎమ్మెస్సీ (ఎకనామిక్స్)
- ఇది రెండేండ్ల ప్రోగ్రామ్, 2018, జూలై 23 నుంచి కోర్సు ప్రారంభమవుతుంది.
- **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో బీఏ/బీఎస్సీలో ఎకనామిక్స్ లేదా బీకాం/బీస్టాట్ లేదా బీఎస్సీ (ఫిజిక్స్/మ్యాథ్స్) లేదా బీటెక్/బీఈ ఉత్తీర్ణత. పై కోర్సుల్లో ఎకనామిక్స్‌లో కనీసం 55 శాతం మార్కులు వచ్చి ఉండాలి. హయ్యర్ సెకండరీ లెవల్‌లో మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి.

ఎంఫిల్/పీహెచ్‌డీ (డెవలప్‌మెంట్ స్టడీస్):

- ఎంఫిల్ రెండేండ్ల ప్రోగ్రామ్.
- పీహెచ్‌డీ నాలుగేండ్ల ప్రోగ్రామ్.
- **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో కింది ఏదైనా ఒక అర్హత కలిగి ఉండాలి.
- ఎంఏ/ఎమ్మెస్సీలో ఎకనామిక్స్/ఎం.స్టాట్ లేదా ఎమ్మెస్సీ (ఫిజిక్స్/మ్యాథ్స్ లేదా ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/ఆపరేషన్ రిసెర్చ్) లేదా ఎంబీఏ లేదా ఎంటెక్ లేదా ఎంఈ/బీటెక్/బీఈలో ఎకనామిక్స్ సబ్జెక్టులో కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండాలి.
- **స్టయిఫండ్:** ఎంఫిల్/పీహెచ్‌డీ విద్యార్థులకు మొదటి రెండేండ్లు నెలకు రూ. 25,000/- ఇస్తారు. పీహెచ్‌డీ వారికి మూడో ఏడాది నుంచి నెలకు రూ. 35,000/- ఇస్తారు.
- **ఎంపిక:** ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ. ఎమ్మెస్సీ, ఎంఫిల్/పీహెచ్‌డీలకు వేర్వేరుగా పరీక్షలను నిర్వహిస్తారు.

- **ఆన్‌లైన్ టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 22
- **పరీక్ష కేంద్రాలు:** రాష్ట్రంలో హైదరాబాద్/రంగారెడ్డి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 6
- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ. 500/-, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు రూ. 100/- చెల్లించాలి.
- **వెబ్‌సైట్:** http://www.igidr.ac.in

రిసెర్చ్ ఫెలోస్



పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెట్రాలజీ (ఐఐటీఎం)లో రిసెర్చ్ అసోసియేట్‌షిప్, రిసెర్చ్ ఫెలోస్ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఐఐటీఎం అనేది ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వశాఖ పరిధిలో పనిచేసే ఒక స్వతంత్ర సంస్థ.

- రిసెర్చ్ అసోసియేట్స్ - 12 ఖాళీలు
- **అర్హతలు:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి మెట్రాలజీ/అట్మాస్ఫియరిక్ సైన్సెస్ లేదా ఓషనోగ్రఫీ/ఫిజిక్స్ లేదా అప్లయిడ్ ఫిజిక్స్ లేదా జియోఫిజిక్స్, మ్యాథ్స్, అప్లయిడ్ మ్యాథ్స్, స్టాటిస్టిక్స్‌లో మెట్రాలజీ ఒక సబ్జెక్టుగా డాక్టరేట్ డిగ్రీ ఉన్నవారు.
- **వయస్సు:** మార్చి 31 నాటికి 35 ఏండ్లు మించరాదు.
- **స్టయిఫండ్:** నెలకు 36,000/- + హెచ్‌ఆర్‌ఏ
- **కాలపరిమితి:** ఏడాది, అవసరమైతే మరో ఏడాది పొడగిస్తారు.
- రిసెర్చ్ ఫెలోస్ - 10 ఖాళీలు
- **అర్హతలు:** పీజీలో కింది ఏదైనా సబ్జెక్టులతోపాటు మెట్రాలజీ ఒక సబ్జెక్టుగా చదివినవారు.
- **సబ్జెక్టులు:** ఫిజిక్స్, అప్లయిడ్ ఫిజిక్స్, అట్మాస్ఫియరిక్ సైన్సెస్, మెట్రాలజీ, ఓషనోగ్రఫీ, క్లైమెట్ సైన్స్, జియోఫిజిక్స్ లేదా ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్ లేదా తత్సమాన సబ్జెక్టులతోపాటు నెట్/గేట్ లేదా జెస్ట్/జామ్‌ల్లో అర్హత సాధించినవారు అర్హులు. లేదా బీఈ/బీటెక్‌ల్లో ఏదైనా బ్రాంచీ ఉత్తీర్ణతోపాటు గేట్‌లో వ్యాలిడ్ స్కోర్ / ఎంటెక్ అట్మాస్ఫియరిక్/ఓషియానిక్ సైన్సెస్ చదివినవారు.

నోట్: పై అర్హత పరీక్షల్లో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి.

- **వయస్సు:** మార్చి 31 నాటికి 28 ఏండ్లు మించరాదు.
- **స్టయిఫండ్:** నెలకు రూ. 25,000 + హెచ్‌ఆర్‌ఏ
- **కాలపరిమితి:** నాలుగేండ్లు
- **దరఖాస్తు:** సీవీని ఆన్‌లైన్‌లో పంపాలి.
- **చివరితేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** http://www.tropmet.res.in

టీఎస్ సెట్-2018

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు/లెక్చరర్లుగా పనిచేయడానికి అర్హత కల్పించే పరీక్ష తెలంగాణ సెట్ (స్టేట్ ఎలిజిబిలిటి టెస్ట్). ఈ నోటిఫికేషన్‌ను ఉస్మానియా విశ్వవిద్యాలయం విడుదల చేసింది.

వివరాలు:



మొత్తం 29 సబ్జెక్టుల్లో ఈ పరీక్షను నిర్వహిస్తారు. యూజీసీ నిబంధనల ప్రకారం గతంలో ఉన్న మూడు పేపర్ల స్థానంలో రెండు పేపర్లు మాత్రమే ఉంటాయి.

- **అర్హతలు:** కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పీజీ ఉత్తీర్ణత. ప్రస్తుతం ఫైనల్ ఎగ్జామ్ రాస్తున్నవారు కూడా దరఖాస్తుచేసుకోవచ్చు.

గమనిక: ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో పీజీలో ఉత్తీర్ణత.

- **వయస్సు:** లెక్చరర్‌షిప్ కోసం పరీక్ష రాసేవారికి ఎటువంటి గరిష్ఠ వయోపరిమితి లేదు.
- **ఫీజు** : జనరల్ అభ్యర్థులకు రూ. 1,000/-, బీసీ - రూ. 800/-, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ - రూ. 500/-
- **పరీక్ష కేంద్రాలు** : కేవలం హైదరాబాద్‌లోనే టీఎస్‌సెట్‌ను నిర్వహించనున్నారు.
- **ఎంపిక:** రాతపరీక్ష ద్వారా. బహుళైచ్ఛిక ప్రశ్నలతో కూడిన పరీక్ష జూలై15న నిర్వహిస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో. నిర్ణీత నమూనాలో సర్టిఫికెట్స్, ఫొటో, సంతకాన్ని అప్‌లోడ్ చేయాలి.
- **దరఖాస్తులు ప్రారంభం:** మార్చి 14
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఏప్రిల్ 14
- రూ. 1500/-అపరాధ రుసుంతో **చివరితేదీ:** ఏప్రిల్ 24
- **టీఎస్‌సెట్ పరీక్షతేదీ:** జూలై 15
- **వెబ్‌సైట్:** www.telanganaset.org లేదా www.osmania.ac.in

ఐఐఎస్సీలో సమ్మర్ ఫెలోషిప్

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ) సమ్మర్ ఫెలోషిప్ ప్రోగ్రామ్ కోసం అర్హులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **ప్రోగ్రామ్:** సమ్మర్ ఫెలోషిప్ (సైన్స్ అండ్ ఇంజినీరింగ్)
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మాత్రమే.
- **అర్హత:** ఎమ్మెస్సీ (బయాలజికల్, ఫిజికల్, కెమికల్, మ్యాథమెటికల్ సైన్సెస్) మొదటి సంవత్సరం లేదా బీఈ/బీటెక్‌లో ఏదైనా బ్రాంచీ మూడో సంవత్సరం చదువుతున్నవారు అర్హులు.
- **కాలపరిమితి:** నెల (జూన్/జూలై)
- **ఆర్థిక సహకారం:** ఐఐఎస్సీకి రానుపోను సెకండ్‌క్లాస్ స్లీపర్ చార్జీలను ఇస్తారు. ఉచిత వసతి, భోజనం కల్పిస్తారు. నెలకు రూ. 5,000 + 1,500 బుక్ గ్రాంట్ ఇస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 25
- **వెబ్‌సైట్:** http://www.iisc.ac.in

పీహెచ్‌డీ

కోల్‌కతాలోని సాహా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ ఫిజిక్స్‌లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది.

- **ప్రోగ్రామ్:** పీహెచ్‌డీ ఈ ప్రోగ్రామ్స్ ఆగస్టు 2018 నుంచి ప్రారంభమవుతాయి.
- **విభాగాలు:** ఫిజిక్స్, బయోఫిజికల్ సైన్సెస్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 16 (ఫిజిక్స్), బయోఫిజికల్ సైన్సెస్‌కు మే 7
- **వెబ్‌సైట్:** www.saha.ac.in

తెలంగాణ ప్రభుత్వము, రెవెన్యూ (భూసేకరణ) శాఖ
కలెక్టరు, రంగారెడ్డి జిల్లా

ఫారం-సి
(సెక్షన్ 11 క్రింద 10వ నిబంధనలు ఉపనిబంధనలు)
(రూల్ 6/12 చూడుము)

ఫైల్ నెం. బి2/5993/2016 తేది: 06-03-2018
గెజిట్ ఆర్.ఆర్. నెం. 45 తేది: 06-03-2018

ప్రాథమిక ప్రకటన

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, రంగారెడ్డి వారు ప్రజల ప్రయోజనార్థం డిండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం మెయిన్ కెనాల్ కొరకు రంగారెడ్డి జిల్లా, మాడ్గుల్ మండలము, దిల్‌వార్ఖాన్‌పల్లి, ఇర్విన్ గ్రామములో సుమారు ఎ. 60-03 గుంటల భూమి అవసరమైనదని భావించుచున్నారు.

కావున ఈ డిండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం మెయిన్ కెనాల్ నిర్మాణ నిమిత్తం రంగారెడ్డి జిల్లా, మాడ్గుల్ మండలము, దిల్‌వార్ఖాన్‌పల్లి, ఇర్విన్ గ్రామములో సుమారు ఎ. 60-03 గుంటల భూమిని భూసేకరణ నిమిత్తం నోటిఫై చేయడం జరిగింది. నోటిఫై చేయబడిన భూమి వివరాలు క్రింద ప్రకటించడమైనది.

షెడ్యూలు

జిల్లా రంగారెడ్డి | మండలము మాడ్గుల్ | గ్రామము దిల్‌వార్ఖాన్‌పల్లి / ఇర్విన్

క్రమ సంఖ్య	సర్వే నెంబర్	భూమి స్వభావం: ప్రైవేట్	భూమి స్వభావం: రకం	సేకరణ విస్తీర్ణం ఎ.గు.	ఆసక్తి గల వ్యక్తుల పేర్ల చిరునామా	సరిహద్దులు సర్వే నెంబర్ ప్రకారం: ఉ	తూ	ప	ద	చెట్లు: రకం	సంఖ్య	నిర్మాణములు: రకం	విస్తీర్ణం	వివరములు
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15
1	990	ఖాతా	[illegible]	0.05	ఎం.డి. ముజ్జుద్దీన్ తండ్రి ఇమామ్ సాబ్	991	994	987	గ్రామ సరిహద్దు	-	-	-	-	-
2				0.24	ఎస్.కె. కాశిమ్ బాబా తండ్రి లాల్ మహ్మద్	991	994	987	గ్రామ సరిహద్దు	-	-	-	-	-
3				0.19	ఎస్.కె. మొహమ్మద్ షఫి తండ్రి షరీఫ్	991	994	987	గ్రామ సరిహద్దు	-	-	-	-	-
				0.19	షబ్బానా బేగం భర్త అంజద్	991	994	987	గ్రామ సరిహద్దు	-	-	-	-	-
4				1.05	ఎస్.కె. అంజద్ తండ్రి జహంగీర్	991	994	987	గ్రామ సరిహద్దు	తాటి చెట్లు	2	రేకుల షెడ్-1 గోదాం	20 చ.గ.	-
5				0.12	గౌసియా బేగం భర్త షరీఫ్	991	994	987	గ్రామ సరిహద్దు	-	-	-	-	-
6				0.13	ఎస్.కె. షరీఫ్ తండ్రి జహంగీర్	991	994	987	గ్రామ సరిహద్దు	-	-	-	-	-
7				0.20	ఎస్.కె. షాహిదా బేగం భర్త కాశిమ్ బాబా	991	994	987	గ్రామ సరిహద్దు	-	-	-	-	-
				0.32	ఎస్.కె. కాశిమ్ బాబా తండ్రి లాల్ మహ్మద్	991	994	987	గ్రామ సరిహద్దు	టేకు	1	-	-	-
				0.20	ఎస్.కె. ఫారుక్ బాబా తండ్రి లాల్ మహ్మద్	991	994	987	గ్రామ సరిహద్దు	-	-	-	-	-
				0.20	ఎస్.కె. జాకీర్ బాబా తండ్రి లాల్ మహ్మద్	991	994	987	గ్రామ సరిహద్దు	-	-	-	-	-
				0.20	ఎస్.కె. ఖాజామొయినుద్దీన్ తండ్రి లాల్ మహ్మద్	991	994	987	గ్రామ సరిహద్దు	-	-	-	-	-
8				1.20	ఎస్.కె. ముజ్జుద్దీన్ తండ్రి ఇమామ్ సాబ్	991	994	987	గ్రామ సరిహద్దు	-	-	-	-	-
9				1.14	షేక్ బుర్హాన్ తండ్రి ముస్తఫా	991	994	987	గ్రామ సరిహద్దు	బోరు బావి	1	-	-	-
10	994	ఖాతా	[illegible]	0.08	ఎస్.కె. ముజ్జుద్దీన్ తండ్రి ఇమామ్ సాబ్	993	991	995	990	-	-	-	-	-
11				0.31	షేక్ బుర్హాన్ తండ్రి ముస్తఫా	993	991	995	990	-	-	-	-	-
12				0.05	ఎస్.కె. ఫారుక్ బాబా తండ్రి లాల్ మహ్మద్	993	991	995	990	-	-	-	-	-
				0.20	వేముల శ్రీను తండ్రి జంగయ్య; అనుభవదారులు: కీ.శే.అందుగుల క్రిష్ణారావు (పట్టేదారు) 1. అందుగుల వెంకటరామ రావు తండ్రి లక్ష్మణ్ రావు 2. అందుగుల సుధాకర్ రావు తండ్రి లక్ష్మణ్ రావు 3. అందుగుల సురేష్ తండ్రి లక్ష్మణ్ రావు 4. అందుగుల ప్రమోద్ తండ్రి లక్ష్మణ్ రావు 5. అందుగుల క్రిష్ణారావు తండ్రి తిరుమల్ రావు 6. అందుగుల నరేందర్ తండ్రి వేణుగోపాల్ రావు 7. అందుగుల రఘునాధ్ రావు తండ్రి తిరుమల్‌రావు	972	992	997	993	-	-	-	-	-
13	993	ఖాతా	[illegible]	0.21	వేముల రవి తండ్రి జంగయ్య; అనుభవదారులు: కీ.శే.అందుగుల క్రిష్ణారావు (పట్టేదారు) 1.–7. (as above)	968	973	971	992	వేప	1	-	-	-
				0.21	వేముల శేఖర్ తండ్రి జంగయ్య; అనుభవదారులు: కీ.శే.అందుగుల క్రిష్ణారావు (పట్టేదారు) 1.–7. (as above)	968	973	971	992	-	-	-	-	-
14	991	ఖాతా	[illegible]	0.22	వేముల నిరంజన్ తండ్రి చంద్రయ్య; అనుభవదారులు: కీ.శే.అందుగుల క్రిష్ణారావు (పట్టేదారు) 1.–7. (as above)	968	973	971	992	-	-	-	-	-
15	996	ఖాతా	[illegible]	0.06	కావ ముసలయ్య తండ్రి మల్లయ్య	968	973	971	992	-	-	-	-	-
				0.36	అన్నెంటి లక్ష్మయ్య భర్త రాములయ్య; అనుభవదారులు: కీ.శే.అందుగుల క్రిష్ణారావు (పట్టేదారు) 1.–7. (as above)	968	973	971	992	-	-	-	-	-
				0.36	అన్నెంటి సిద్ది రాములయ్య తండ్రి వెంకటయ్య; అనుభవదారులు: కీ.శే.అందుగుల క్రిష్ణారావు (పట్టేదారు) 1.–7. (as above)									
				0.36	అన్నెంటి నారాయణమ్మ [illegible]; అనుభవదారులు: కీ.శే.అందుగుల క్రిష్ణారావు (పట్టేదారు) 1.–7. (as above)									
16	992	ఖాతా	[illegible]	0.36	అన్నెంటి వెంకటేశ్ తండ్రి జంగయ్య; అనుభవదారులు: కీ.శే.అందుగుల క్రిష్ణారావు (పట్టేదారు) 1. అందుగుల వెంకటరామ రావు తండ్రి లక్ష్మణ్ రావు 2. అందుగుల సుధాకర్ రావు తండ్రి లక్ష్మణ్ రావు 3. అందుగుల సురేష్ తండ్రి లక్ష్మణ్ రావు 4. అందుగుల ప్రమోద్ తండ్రి లక్ష్మణ్ రావు 5. అందుగుల క్రిష్ణారావు తండ్రి తిరుమల్ రావు 6. అందుగుల నరేందర్ తండ్రి వేణుగోపాల్ రావు 7. అందుగుల రఘునాధ్ రావు తండ్రి తిరుమల్‌రావు	964	967	969	972	-	-	-	-	-
				0.36	అన్నెంటి శేఖర్ తండ్రి లక్ష్మయ్య; అనుభవదారులు: (as above)	964	967	969	972	-	-	-	-	-
				0.36	అన్నెంటి బిక్షపతి తండ్రి లక్ష్మయ్య; అనుభవదారులు: (as above)	964	967	969	972	-	-	-	-	-
				0.36	అన్నెంటి కుమార్ తండ్రి నర్సయ్య; అనుభవదారులు: (as above)									
				0.36	అన్నెంటి రమేందర్ తండ్రి నర్సయ్య; అనుభవదారులు: (as above)	995	966	968	973	-	-	-	-	-
				0.36	అన్నెంటి రవి తండ్రి నారాయణ; అనుభవదారులు: (as above)	995	966	968	973	-	-	-	-	-
				0.36	అన్నెంటి భాస్కర్ తండ్రి నారాయణ; అనుభవదారులు: (as above)	995	966	968	973	-	-	-	-	-
17	974	ఖాతా	[illegible]	0.09	వేముల వెంకటయ్య తండ్రి జంగయ్య	963	965	1054	968	-	-	-	-	-
18	973	ఖాతా	[illegible]	2.03	వేముల వెంకటయ్య తండ్రి జంగయ్య	963	965	1054	968	-	-	-	-	-
				4.02	కీ.శే.అందుగుల క్రిష్ణారావు (పట్టేదారు) 1.–7. (as above); అనుభవదారులు: కొమ్మాని అంజమ్మ భర్త జంగయ్య, కొమ్మాని రాములమ్మ భర్త బీరయ్య	963	965	1054	968	-	-	-	-	-
19	972	ఖాతా	[illegible]	0.22	ఇబ్లిం ఉదయ్ కుమార్‌రెడ్డి తండ్రి మాధవ రెడ్డి	963	965	1054	968	-	-	-	-	-
				0.21	ఇబ్లిం శ్రీకాంత్ రెడ్డి తండ్రి మాధవ రెడ్డి	963	965	1054	968	-	-	-	-	-
				1.04	ఇబ్లిం జగన్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి	963	962	964	967	-	-	-	-	-
				1.03	ఇబ్లిం శ్రీనివాస్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి	963	962	964	967	-	-	-	-	-
				1.04	ఇబ్లిం హరి రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి	973	983	973	992	-	-	-	-	-
20	968	ఖాతా	[illegible]	0.03	రోడ్	1068	962	1055	964	-	-	-	-	-
21				0.38	బాసోజి జయమ్మ భర్త చిన్న పెద్దయ్య	1068	962	1055	964	-	-	-	-	-
22				1.00		1067	1069	1055	963	-	-	-	-	-
				0.20	కేతావత్ యాదమ్మ భర్త జంగయ్య	1067	1069	1055	963	తాటి చెట్లు	1	-	-	-
23				0.20	బాసోజి పెద్ద పెద్దయ్య తండ్రి మొగులయ్య	967	975	972	992	-	-	-	-	-
24	967	ఖాతా	[illegible]	0.05	రోడ్	967	975	972	992	-	-	-	-	-
25				0.20	గద్ద లింగయ్య తండ్రి రాముయ్య	996	992	995	994	-	-	-	-	-
26				1.10	కేతావత్ కొండల్ తండ్రి జంగయ్య	996	992	995	994	-	-	-	-	-
27				1.00	కేతావత్ యాదమ్మ భర్త జంగయ్య	996	992	995	994	-	-	-	-	-
28	965	ఖాతా	[illegible]	0.15	కాలె వెంకటయ్య తండ్రి దుర్గయ్య	992	986	993	990	-	-	-	-	-
				0.15	కాలె జంగయ్య తండ్రి దుర్గయ్య	973	991	993	990	-	-	-	-	-
29				0.17	కేతావత్ పరమేష్ తండ్రి పెంటయ్య	992	986	993	990	-	-	-	-	-
				0.16	కేతావత్ శ్రీనివాస్‌గౌడ్ తండ్రి పెంటయ్య	992	986	993	990	-	-	-	-	-
30	964	ఖాతా	[illegible]	1.23	కాలె పార్వతమ్మ భర్త మల్లయ్య	973	991	993	990	-	-	-	-	-
31				2.00	కాలె అంజమ్మ భర్త చిన్న బీరయ్య	973	991	993	990	-	-	బోర్‌వెల్	1	-
32				0.18	కాలె యాదమ్మ భర్త వెంకటయ్య	973	991	993	990	-	-	-	-	-
33	963	ఖాతా	[illegible]	1.26	కాలె వెంకటయ్య తండ్రి దుర్గయ్య	973	991	993	990	-	-	-	-	-
34				1.10	గుడిగంటి క్రిష్ణవేణి భర్త శ్యాం	973	991	993	990	-	-	-	-	-
35	1068	ఖాతా	[illegible]	0.20	కాలె వెంకటయ్య తండ్రి దుర్గయ్య	973	991	993	990	-	-	-	-	-
				0.19	కాలె జంగయ్య తండ్రి దుర్గయ్య	973	991	993	990	-	-	-	-	-
36	1055	ఖాతా	[illegible]	0.35	కుందవరం రఘుమ రెడ్డి, కుందవరం సీతారెడ్డి, కుందవరం మోహన్ రెడ్డి, ఇంద్రమ్మ భర్త కె. శ్రీనివాస్ రెడ్డి, సుదర్శనమ్మ భర్త కె. శ్రీనివాస్ రెడ్డి; అనుభవదారులు: నెల్లుట్ల బిక్షపతి తండ్రి క్రిష్ణయ్య, ఇంద్రమ్మ తండ్రి కె. శ్రీనివాస్ రెడ్డి, సుదర్శనమ్మ తండ్రి కె. శ్రీనివాస్ రెడ్డి	1059	1068	1056	964	-	-	-	-	-
37	1055	ఖాతా	[illegible]	0.03	కుందవరం రఘుమ రెడ్డి, కుందవరం సీతారెడ్డి, కుందవరం మోహన్ రెడ్డి, ఇంద్రమ్మ తండ్రి కె. శ్రీనివాస్ రెడ్డి, సుదర్శనమ్మ తండ్రి కె. శ్రీనివాస్ రెడ్డి; అనుభవదారులు: నెల్లుట్ల నర్సింహ తండ్రి లక్ష్మయ్య	1059	1068	1056	964	-	-	-	-	-
38	1055	ఖాతా	[illegible]	0.23	కుందవరం రఘుమ రెడ్డి, కుందవరం సీతారెడ్డి, కుందవరం మోహన్ రెడ్డి, ఇంద్రమ్మ తండ్రి కె. శ్రీనివాస్ రెడ్డి, సుదర్శనమ్మ తండ్రి కె. శ్రీనివాస్ రెడ్డి; అనుభవదారులు: నెల్లుట్ల రాజమ్మ భర్త నర్సింహ	1059	1068	1056	964	-	-	-	-	-
				0.22	కుందవరం రఘుమ రెడ్డి, కుందవరం సీతారెడ్డి, కుందవరం మోహన్ రెడ్డి, ఇంద్రమ్మ తండ్రి కె. శ్రీనివాస్ రెడ్డి, సుదర్శనమ్మ తండ్రి కె. శ్రీనివాస్ రెడ్డి; అనుభవదారులు: నెల్లుట్ల సీతమ్మ భర్త లక్ష్మయ్య	1059	1068	1056	964	-	-	-	-	-
39	1055	ఖాతా	[illegible]	2.10	కుందవరం రఘుమ రెడ్డి, కుందవరం సీతారెడ్డి, కుందవరం మోహన్ రెడ్డి, ఇంద్రమ్మ తండ్రి కె. శ్రీనివాస్ రెడ్డి, సుదర్శనమ్మ తండ్రి కె. శ్రీనివాస్ రెడ్డి; అనుభవదారులు: నెల్లుట్ల సాయమ్మ భర్త ఎల్లయ్య	1059	1068	1056	964	-	-	-	-	-
40	1055	ఖాతా	[illegible]	0.12	రోడ్	1059	1068	1056	964	-	-	-	-	-
41	1055	ఖాతా	[illegible]	0.05	కుందవరం రఘుమ రెడ్డి, కుందవరం సీతారెడ్డి, కుందవరం మోహన్ రెడ్డి, ఇంద్రమ్మ తండ్రి కె. శ్రీనివాస్ రెడ్డి, సుదర్శనమ్మ తండ్రి కె. శ్రీనివాస్ రెడ్డి; అనుభవదారులు: నెల్లుట్ల రాజమ్మ భర్త నర్సింహ	1059	1068	1056	964	-	-	-	-	-
				0.05	కుందవరం రఘుమ రెడ్డి, కుందవరం సీతారెడ్డి, కుందవరం మోహన్ రెడ్డి, ఇంద్రమ్మ తండ్రి కె. శ్రీనివాస్ రెడ్డి, సుదర్శనమ్మ తండ్రి కె. శ్రీనివాస్ రెడ్డి; అనుభవదారులు: నెల్లుట్ల సీతమ్మ భర్త లక్ష్మయ్య	1059	1068	1056	964	-	-	-	-	-
42	1055	ఖాతా	[illegible]	1.05	కుందవరం రఘుమ రెడ్డి, కుందవరం సీతారెడ్డి, కుందవరం మోహన్ రెడ్డి, ఇంద్రమ్మ తండ్రి కె. శ్రీనివాస్ రెడ్డి, సుదర్శనమ్మ తండ్రి కె. శ్రీనివాస్ రెడ్డి; అనుభవదారులు: నెల్లుట్ల జంగయ్య తండ్రి సాయిలు	1059	1068	1056	964	-	-	-	-	-
43	1059	ఖాతా	[illegible]	0.06	కుందవరం రఘుమ రెడ్డి, కుందవరం సీతారెడ్డి, కుందవరం మోహన్ రెడ్డి, కె. వెంకటేశ్వర్ రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి, కె. నర్సమ్మ భర్త ఇంద్రారెడ్డి, కె. ఆదిరెడ్డి తండ్రి [illegible] రెడ్డి, కె. పద్మాకర్ రెడ్డి తండ్రి [illegible] రెడ్డి, కె. లక్ష్మి రెడ్డి భర్త రాజేశ్వర్ రెడ్డి; అనుభవదారులు: [illegible]	గ్రామ సరిహద్దు	1060	1059	1055	-	-	-	-	-
44	1059	ఖాతా	[illegible]	0.05	రోడ్	గ్రామ సరిహద్దు	1060	1059	1055	-	-	-	-	-
45	1059	ఖాతా	[illegible]	1.12	కుందవరం రఘుమ రెడ్డి, కుందవరం సీతారెడ్డి, కుందవరం మోహన్ రెడ్డి, కె. వెంకటేశ్వర్ రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి, కె. నర్సమ్మ భర్త ఇంద్రారెడ్డి, కె. ఆదిరెడ్డి, కె. పద్మాకర్ రెడ్డి, కె. లక్ష్మి రెడ్డి భర్త రాజేశ్వర్ రెడ్డి; అనుభవదారులు: నెల్లుట్ల జంగయ్య తండ్రి సాయిలు	గ్రామ సరిహద్దు	1060	1059	1055	-	-	-	-	-
46	1059	ఖాతా	[illegible]	1.12	కుందవరం రఘుమ రెడ్డి, కుందవరం సీతారెడ్డి, కుందవరం మోహన్ రెడ్డి, కె. వెంకటేశ్వర్ రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి, కె. నర్సమ్మ భర్త ఇంద్రారెడ్డి, కె. ఆదిరెడ్డి, కె. పద్మాకర్ రెడ్డి, కె. లక్ష్మి రెడ్డి భర్త రాజేశ్వర్ రెడ్డి; అనుభవదారులు: నెల్లుట్ల జంగయ్య తండ్రి మల్లయ్య	గ్రామ సరిహద్దు	1060	1059	1055	-	-	-	-	-
47	1059	ఖాతా	[illegible]	0.26	కుందవరం రఘుమ రెడ్డి, కుందవరం సీతారెడ్డి, కుందవరం మోహన్ రెడ్డి, కె. వెంకటేశ్వర్ రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి, ...; అనుభవదారులు: [illegible]	గ్రామ సరిహద్దు	1060	1059	1055	-	-	-	-	-
				0.26	కుందవరం రఘుమ రెడ్డి, కుందవరం సీతారెడ్డి, కుందవరం మోహన్ రెడ్డి, కె. వెంకటేశ్వర్ రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి, ...; అనుభవదారులు: [illegible]	గ్రామ సరిహద్దు	1060	1059	1055	-	-	-	-	-
48	1059	ఖాతా	[illegible]	0.20	కుందవరం రఘుమ రెడ్డి, కుందవరం సీతారెడ్డి, కుందవరం మోహన్ రెడ్డి, కె. వెంకటేశ్వర్ రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి, ...; అనుభవదారులు: [illegible]	గ్రామ సరిహద్దు	1060	1059	1055	-	-	-	-	-
49	1059	ఖాతా	[illegible]	0.20	... తండ్రి లక్ష్మారెడ్డి, కె. నర్సమ్మ భర్త ఇంద్రారెడ్డి, కె. ఆదిరెడ్డి, కె. పద్మాకర్ రెడ్డి, కె. లక్ష్మి రెడ్డి భర్త రాజేశ్వర్ రెడ్డి; అనుభవదారులు: నెల్లుట్ల జంగయ్య [illegible]	గ్రామ సరిహద్దు	1060	1059	1055	-	-	-	-	-
50	1059	ఖాతా	[illegible]	1.00	కుందవరం రఘుమ రెడ్డి, కుందవరం సీతారెడ్డి, కుందవరం మోహన్ రెడ్డి, కె. వెంకటేశ్వర్ రెడ్డి, ...; అనుభవదారులు: [illegible]	గ్రామ సరిహద్దు	1060	1059	1055	-	-	-	-	-
51	1059	ఖాతా	[illegible]	0.17	కుందవరం రఘుమ రెడ్డి, కుందవరం సీతారెడ్డి, కుందవరం మోహన్ రెడ్డి, కె. వెంకటేశ్వర్ రెడ్డి, ... కె. లక్ష్మి రెడ్డి భర్త రాజేశ్వర్ రెడ్డి	గ్రామ సరిహద్దు	1060	1059	1055	-	-	-	-	-
మొత్తం 60.03														

భూసేకరణలో సారదర్శకత, న్యాయమైన నష్టపరిహారం, రిహాబిలిటేషన్ మరియు రీసెటిల్‌మెంట్ చట్టం 2013 (కేంద్రప్రభుత్వ చట్టం 30/2013)లోని సెక్షన్11(1) క్రింద మరియు సవరించిన న్యాయమైన నష్టపరిహారం మరియు భూసేకరణలో పారదర్శకత, రిహాబిలిటేషన్ మరియు రీసెటిల్‌మెంట్ (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నెం. 21/2017) ప్రకారం ఆసక్తి గల వ్యక్తులందరికీ తెలియచేయడమైనది.

సేకరణ భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు భూసేకరణ అధికారి/రెవెన్యూ డివిజనల్ అధికారి ఇబ్రహీంపట్నం డివిజన్ కార్యాలయములో అందుబాటులో ఉండును. ఆసక్తి గల వ్యక్తులెవరైనను ప్రభుత్వ పనిదినములలో మరియు పనివేళలలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ ప్రభుత్వము/కలెక్టర్, రంగారెడ్డి జిల్లాగారు చట్టంలో సెక్షన్ 12 ప్రకారం కల్పించిన మరియు సెక్షన్ [illegible] వారి పనిని నిర్వహించుటకు అవసరమైన అన్ని ఇతర పనులు అనగా భూమి సర్వే భూమి పరిశీలన కొరకు భూమి హద్దులు [illegible] మరియు సంబంధిత పనులు చేయుటకి కావలసిన అన్ని చర్యలు నిర్వహించుటకు భూసేకరణ అధికారి/రెవెన్యూ డివిజనల్ అధికారి ఇబ్రహీంపట్నం డివిజన్, రంగారెడ్డి జిల్లా గారిని నియమించినారు.

చట్టం యొక్క సెక్షన్ 11(4) క్రింద కలెక్టరు గారి ముందస్తు అనుమతి లేకుండా ఈ ప్రకటన ప్రచురణ తేది నుండి సదరు స్థలంలో ఏ వ్యక్తి కూడా భూమి యొక్క ఏదేని లావాదేవీలు అనగా అమ్మకం/కొనుగోలు/లేదా ఏదేని తాకట్టు [illegible] చేయరాదు.

భూసేకరణ సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే భూసేకరణ అధికారి/రెవెన్యూ డివిజనల్ అధికారి, ఇబ్రహీంపట్నం డివిజన్, రంగారెడ్డి జిల్లా ముందు చట్టం యొక్క సెక్షన్ 15 క్రింద సెక్షన్ [illegible] ఈ ప్రకటన ప్రచురణ తేది నుండి 60 (అరవై రోజులు)లోపు ఆసక్తిగల వ్యక్తులు దాఖలు చేసుకోవచ్చును.

తహసిల్దారు, మాడ్గుల్ మండలం, రంగారెడ్డి జిల్లా. | భూసేకరణ అధికారి/ రెవెన్యూ డివిజనల్ అధికారి ఇబ్రహీంపట్నం డివిజన్, రంగారెడ్డి | జాయింట్ కలెక్టర్ రంగారెడ్డి | జిల్లా కలెక్టర్ రంగారెడ్డి

బీజేపీ వ్యతిరేక పార్టీలను ఏకతాటిపైకి తెస్తా

- దేశంలో 'సూపర్ ఎమర్జెన్సీ' నడుస్తున్నది
- పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ



కోల్‌కతా, మార్చి 9: వచ్చే ఏడాది జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో అధికార బీజేపీని ఓడించడానికి శాయశక్తుల కృషిచేస్తానని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ చెప్పారు. ఇందులో భాగంగా బీజేపీ వ్యతిరేక పార్టీలన్నింటినీ ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. ప్రస్తుతం దేశంలో సూపర్ ఎమర్జెన్సీ నడుస్తున్నదని, కేంద్ర ప్రభుత్వ పాలనే దీనికి కారణమని విమర్శించారు. నేషనల్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) సీనియర్ నాయకుడు ప్రఫుల్ పటేల్‌తో ఆమె శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జాతీయ రాజకీయాల గురించి ఇరువురు చర్చించారు. అనంతరం ప్రఫుల్ పటేల్ మాట్లాడుతూ కేంద్రంలో మార్పు రావాలంటే మరో ప్రత్యామ్నాయ కూటమి అవసరమని, దీనిపై తామిద్దరం చర్చించామని చెప్పారు. మూడో కూటమి ఏర్పాటులో భాగంగా భవిష్యత్‌లో మరిన్ని సమావేశాలు కొనసాగుతాయని తెలిపారు. అనంతరం తృణమూల్ కోర్ కమిటీ సమావేశంలో మమతా బెనర్జీ మాట్లాడుతూ 'యుద్ధం చేయడానికి సమయం ఆసన్నమైంది. బీజేపీపై పోరాడటానికి, పిల్లి మెడలో గంట కట్టడానికి నేను సిద్ధం. దేశంలోని బీజేపీ వ్యతిరేకపార్టీలన్నింటినీ ఏకతాటిపైకి తీసుకురావడానికి కృషిచేస్తా. నాకు ఏ పదవి వద్దు. బీజేపీని ఇంటికి పంపించడమే నా లక్ష్యం' అని తెలిపారు.

రాజ్యసభ ఎన్నికల్లో అభిషేక్ సింఘ్వీకి మద్దతు

త్వరలో జరుగనున్న రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ సింఘ్వీకి తాము మద్దతు ఇవ్వనున్నట్లు మమతా బెనర్జీ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 'రాజ్యసభ ఎన్నికల్లో టీఎంసీ తరపున నలుగురు అభ్యర్థులను నిలబెట్టాలని నిర్ణయించాం. అయితే ఐదో అభ్యర్థిగా కాంగ్రెస్ నాయకుడు అభిషేక్ సింఘ్వీకి మద్దతు ఇవ్వాలని నిర్ణయించాం. సింఘ్వీకి మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు కోరిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని తెలిపారు.



రాజ్యసభలో చైర్మన్ వెల్ వద్ద ఆందోళన చేస్తున్న విపక్ష సభ్యులు

పార్లమెంట్‌లో కొనసాగిన నిరసనలు!

తుడిచిపెట్టుకుపోయిన వారంరోజుల కార్యకలాపాలు

న్యూఢిల్లీ, మార్చి 9: పార్లమెంట్ ఉభయసభలూ నిరసనలతో హోరెత్తాయి. శుక్రవారం కూడా ఇదే పరిస్థితి కొనసాగడంతో మొత్తం వారంరోజుల సమావేశాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయినట్లయింది. లోక్‌సభ ఎటువంటి కార్యక్రమాలు చేపట్టకుండానే తర్వాతి రోజుకు వాయిదా పడింది. ప్రతిపక్ష పార్టీలతోపాటు పాలక ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, ఏఐఏడీఎంకే పార్టీలు కూడా వివిధ అంశాలపై నిరసన తెలుపడంతో తొలుత మధ్యాహ్నానికి వాయిదా పడిన రాజ్యసభ.. పరిస్థితిలో మార్పు రాకపోవడంతో తర్వాతి రోజుకు వాయిదా పడింది. ప్రతిపక్ష కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంపై.. టీడీపీ, వైసీపీలు ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదాపై నిరసనలను కొనసాగించాయి. పొరుగు రాష్ర్టాలతో జలవివాదాల పరిష్కారానికి కావేరీ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐఏడీఎంకే నిరసన కొనసాగిస్తున్నది.

రిజర్వేషన్ల పెంపు కోసం టీఆర్‌ఎస్ పోరుబాట..

మరోవైపు తెలంగాణలో రిజర్వేషన్లు పెంచుకునే అవకాశం ఇవ్వాలని టీఆర్‌ఎస్ నిరసనను కొనసాగించింది. లోక్‌సభ కార్యకలాపాలు ప్రారంభమైన వెంటనే స్పీకర్ సుమిత్రా మహాజన్ దక్షిణకొరియా నుంచి వచ్చిన పార్లమెంట్ ప్రతినిధి బృందానికి స్వాగతం పలికారు. దీంతోపాటు ఇటీవల మరణించిన మాజీ సభ్యులకు ఒక నిమిషంపాటు మౌనం పాటించి నివాళులు అర్పించారు. దీని తర్వాత వెంటనే ఆయా పార్టీల సభ్యులు ప్లకార్డులు పట్టుకుని వెల్‌లోకి దూసుకొచ్చారు. దీంతో స్పీకర్ తొలుత రెండుసార్లు ఆ తరువాత సోమవారానికి సభను వాయిదావేశారు.

బాలికలపై లైంగిక దాడికి పాల్పడితే ఉరే!

చట్టం చేసిన రాజస్థాన్ ప్రభుత్వం

జైపూర్: లైంగిక దాడికి పాల్పడే వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలని రాజస్థాన్ ప్రభుత్వం నిర్ణయించింది. బాలికలపై లైంగిక దాడికి పాల్పడే వారికి ఉరిశిక్ష విధించేందుకు ఉద్దేశించిన బిల్లును ఆ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం తీసుకొచ్చింది. 12 ఏండ్లు అంతకంటే తక్కువ వయసు గల బాలికలపై లైంగిక దాడికి పాల్పడిన వారికి నేర తీవ్రతను బట్టి మరణశిక్ష విధించడం లేదా 14 ఏండ్లకు తక్కువ కాకుండా కఠిన కారాగార శిక్ష లేదా 20 ఏండ్ల యావజ్జీవ కఠిన కారాగారశిక్ష లేదా చనిపోయే వరకు జైలులో ఉంచేందుకు ఈ చట్టం అవకాశం కల్పిస్తున్నది. రాజస్థాన్ హోంమంత్రి గులాబ్ చంద్ కఠారియా ఈ బిల్లును ప్రవేశపెట్టగా మూజువాణి ఓటుతో అసెంబ్లీ ఆమోదించింది.

87.79 కోట్ల బ్యాంకు ఖాతాలకు ఆధార్

న్యూఢిల్లీ: భారత విశిష్ట గుర్తింపు సంఖ్య (ఆధార్)తో 16.75 కోట్ల పర్మినెంట్ అకౌంట్ నంబర్లు (పాన్), 87.79 కోట్ల బ్యాంకు ఖాతాలు అనుసంధానమయినట్టు కేంద్రప్రభుత్వం తెలిపింది. ఈ అంశంపై లోక్‌సభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు ఆర్థికశాఖ సహాయమంత్రి శివ్‌ప్రతాప్ శుక్లా శుక్రవారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఈ మార్చి 5 వరకు పాన్, మార్చి 2 వరకు బ్యాంకు ఖాతాలు ఆధార్‌తో అనుసంధానమైన వివరాలను వెల్లడించారు. ఈ నెల 2 నాటికి బ్యాంకుల్లో 6,811 ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటుచేసినట్టు తెలిపారు.

సెన్సెక్స్	నిఫ్టీ
33,307	10,227
↘ 44	↘ 16

ముడి చమురు (బ్రెంట్) ↘ 65.27 డాలర్లు

బంగారం ధరలు

ముంబై (రూ.లలో)	
24 క్యారెట్లు	30,545
22 క్యారెట్లు	30,395
వెండి (కిలో)	38,385

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	59.22	68.67
బహ్రెయిన్ దినార్	160.39	183.80
కువైట్ దినార్	179.27	223.24
సౌదీ రియాల్	15.75	18.66
యూఏఈ దిర్హామ్	16.12	18.84

చికెన్ ధరలు

	(రూ.లలో)
ఫారం ధర	68.00
రిటైల్ లైవ్	90.00
డ్రెస్డ్	131.00
స్కిన్‌లెస్	149.00

నెక్ (వంద గుడ్లకు)

	(రూ.లలో)
హైదరాబాద్	330-00
రంగారెడ్డి	330-00
మెదక్	330-00
కరీంనగర్	332-00
వరంగల్	332-00
రిటైల్ ప్రైస్	3-90

పెద్దన్న పన్నుపోటు

ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై అమెరికా భారీ సుంకాలు

25, 10 శాతం చొప్పున విధించిన ట్రంప్

స్వదేశీ పరిశ్రమ బతకడానికి తప్పదని వ్యాఖ్య

అన్ని దేశాల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత



వాషింగ్టన్‌లోని వైట్‌హౌజ్‌లో సుంకాల ప్రకటనను చూపిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్, మార్చి 9: ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెద్దన్నగా భావించే అమెరికా.. ఇప్పుడు తోటి కుటుంబ సభ్యులపైనే కత్తులు దూస్తున్నది. అగ్రరాజ్యానికి అధ్యక్షుడిగా ఎన్నికైన దగ్గర్నుంచి వింత పోకడలు పోతున్న డొనాల్డ్ ట్రంప్.. విపరీతమైన రక్షణాత్మక ధోరణులను అవలంభిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మరో వివాదాస్పద నిర్ణయాన్ని తీసుకున్నారు. విశ్వ వాణిజ్య యుద్ధానికి తెరతీస్తూ.. తమ దేశంలోకి విదేశాల నుంచి వచ్చే ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై శుక్రవారం భారీగా సుంకాల్ని విధించారు. ఉక్కుపై 25 శాతం, అల్యూమినియంపై 10 శాతం చొప్పున లెవీ వేశారు. కెనడా, మెక్సికో మినహా మిగతా అన్ని దేశాల నుంచి అమెరికాకు ఎగుమతయ్యే ఉక్కు, అల్యూమినియంలపై ఈ సుంకాలు వర్తిస్తాయి. ఈ తరహా మినహాయింపులు కోరుకుంటే అమెరికా వాణిజ్య ప్రతినిధుల (యూఎస్‌టీఆర్)తో ఇతర దేశాలూ సంప్రదింపులు జరుపుకోవచ్చని ట్రంప్ అవకాశమిచ్చారు. కాగా, 15 రోజుల్లో ట్రంప్ నిర్ణయం అమల్లోకి రానుండగా, అన్ని దేశాల నుంచి ఈ వివాదాస్పద టారీఫ్‌లపై ఇప్పుడు పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. అయితే అమెరికా పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడానికి, అక్రమ వ్యాపార విధానాల నుంచి స్వదేశీ పరిశ్రమలను కాపాడుకోవడానికి సుంకాలు పెంచక తప్పడం లేదంటూ తన నిర్ణయాన్ని ట్రంప్ సమర్థించుకున్నారు. 'మా దేశంలోని ఉక్కు, అల్యూమినియంతోనే మేము మా నౌకల్ని, విమానాలను, సైనిక సంపత్తిని తయారు చేసుకోవాలనుకుంటున్నాం' అని రెండు టారీఫ్ నిర్ణయాలకు సంబంధించి సంతకాలు చేస్తూ ట్రంప్ అన్నారు. దశాబ్దాలుగా కొనసాగిన అన్యాయ, అక్రమ విదేశీ వాణిజ్య విధానాలు.. ఆర్థిక విపత్తుకే గాక, భద్రతాపరమైన విపత్తుకూ దారితీశాయన్నారు. వరదలా పోటెత్తుతున్న విదేశీ దిగుమతుల నేపథ్యంలో చచ్చిపోతున్న స్వదేశీ ఉక్కు, అల్యూమినియం పరిశ్రమలను బతికించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలోనే 'మేము మా కార్మికులను రక్షించుకోవాలని భావిస్తున్నాం. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే మా పరిశ్రమలకు అండగా నిలబడాలనుకుంటున్నాం' అని స్పష్టం చేశారు. అందుకే అక్రమంగా కాకుండా, సక్రమంగా దిగుమతులు జరుగాలని కోరుకుంటున్నట్లు చెప్పిన ట్రంప్.. తాజా నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇకపోతే అమెరికాలో తయారయ్యే ఉత్పత్తులపై ఎలాంటి పన్నులను విధించదల్చుకోలేదన్న ట్రంప్.. పన్నుల భారాన్ని తప్పించుకోవాలంటే అమెరికాలో ప్లాంట్లు నెలకొల్పుకోవచ్చని, అప్పుడు పన్నులుండవని ప్రపంచ దేశాలకు ఈ సందర్భంగా ఓ ఉచిత సలహా కూడా ఇచ్చారు. ఇన్నాళ్లూ అమెరికాకు ఉక్కు, అల్యూమినియం ఎగుమతుల్ని చేసిన దేశాలు.. తమతమ పౌరులకు పెద్దగా ఉద్యోగావకాశాల్ని సృష్టించుకోగలిగాయన్న ట్రంప్.. దీని వల్ల అమెరికాకు నిరుద్యోగ సమస్యలు వచ్చిపడ్డాయన్నారు. అమెరికా ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తిలో నెలకొన్న సంక్షోభ పరిస్థితుల నివారణపై అక్కడి వాణిజ్య శాఖ తొమ్మిది నెలల పాటు నిర్వహించిన సమీక్షల అనంతరం ట్రంప్ తాజా నిర్ణయానికొచ్చారు. మరోవైపు ఈ నిర్ణయం వల్ల అమెరికా.. యూరోపియన్ యూనియన్, చైనా వంటి తమ వాణిజ్య భాగస్వాముల నుంచి ప్రతీకార చర్యల్ని ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.



'అమెరికా జాతీయ భద్రతకు బలమైన ఉక్కు, అల్యూమినియం పరిశ్రమలే కీలకం. ఉక్కు అంటే ఉక్కే. ఉక్కు లేకపోతే దేశమే లేదు. అలాంటిది మా పరిశ్రమలు ఏండ్ల తరబడి దోపిడీకి గురయ్యాయి. దశాబ్దాల కాలం నుంచి అక్రమ విదేశీ వాణిజ్య విధానాలకు భారీ ఎత్తున స్టీల్ ప్లాంట్లు, మిల్లులు మూతబడ్డాయి. లక్షలాది కార్మికులు ఉద్యోగాల్ని కోల్పోయారు. దుందుడుకు విదేశీ వాణిజ్య కార్యకలాపాలతో మా దేశంపై దాడికి పాల్పడ్డారు. మొత్తం మా దేశ ఆర్థిక వ్యవస్థనే హతమార్చే ఈ అన్యాయపు విధానాలకు ఇక కాలం చెల్లిపోయింది'

- డొనాల్డ్ ట్రంప్

ఇంజినీరింగ్ ఉత్పత్తులపై ప్రభావం: ఈఈపీసీ

అమెరికా తీసుకున్న తాజా నిర్ణయం.. భారతీయ ఇంజినీరింగ్ ఉత్పత్తులను ప్రభావితం చేస్తుందని ఇంజినీరింగ్ ఎగుమతుల ప్రోత్సాహక మండలి (ఈఈపీసీ) ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికాను ప్రతిఘటించేందుకు ఐరోపా, చైనా వంటి ఇతర దేశాలూ ఇదే తరహా విధానాల్ని అమలుపరిస్తే ప్రపంచ వాణిజ్య వ్యవస్థే కుప్పకూలిపోతుందని ఈఈపీసీ చైర్మన్ రవి సెహగల్ ఒకింత భయాందోళనను వెలిబుచ్చారు. యేటా అమెరికాకు 500 మిలియన్ డాలర్ల ఉక్కు ఉత్పత్తులు భారత్ నుంచి ఎగుమతి అవుతాయన్నది అంచనా.

భారత్, చైనాలపై పరస్పర పన్నులే

అమెరికా పన్నులకు తగినట్లుగా లేకుంటే భారత్,చైనాలపై పరస్పర పన్నులు తప్పవని ట్రంప్ హెచ్చరించారు. భారత్ నుంచి అమెరికాకు దిగుమతి అవుతున్న మోటార్‌సైకిళ్లపై ఎలాంటి పన్ను వేయడం లేదని, కానీ అమెరికా సంస్థల నుంచి భారత్‌కు దిగుమతి అవుతున్న బైకులపై భారీగా పన్నులు పడుతున్నాయని మరోసారి ఆక్షేపించారు. ఈ క్రమంలోనే 'భారత్ 25 శాతం పన్ను వేస్తే.. మేమూ అంతే పన్ను వేస్తాం. చైనా 75 శాతం పన్ను విధిస్తే.. మేమూ అలాగే వసూలు చేస్తాం. అక్కడ ఎంత పన్నుంటే.. ఇక్కడా అంతే పన్నుంటుందని భారత్, చైనాలనుద్దేశిస్తూ ట్రంప్ వ్యాఖ్యానించడం గమనార్హం.

ఎవరేమన్నారు?

అమెరికా నిర్ణయం ప్రపంచ వాణిజ్య విపణిలో ఉద్రిక్తతలకు దారి తీస్తున్నది. భారతీయ ఎగుమతులు కొంతమేర ప్రభావితం అవుతాయి
– కేంద్ర వాణిజ్య కార్యదర్శి రీటా టియోటియా

ప్రపంచ వాణిజ్య వ్యవస్థపై వివాదాస్పద సుంకాలతో అమెరికా తీవ్రమైన దాడికి పాల్పడింది. దీన్ని మేము గట్టిగా వ్యతిరేకిస్తున్నాం
– చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ

ట్రంప్ టారీఫ్‌లకు వ్యతిరేకంగా మేమూ ప్రతికార చర్యలకు దిగుతాం. మా ప్రయోజనాలను మేమూ కాపాడుకుంటాం
– యూరోపియన్ కమిషన్ ఉపాధ్యక్షుడు కటైనెన్

ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై అమెరికా విధించిన భారీ సుంకాల వల్ల మా పరిశ్రమల్లో వేలాది మంది ఉద్యోగాల్ని కోల్పోయే ప్రమాదం ఏర్పడుతున్నది
– ఐరోపా ఉక్కు సంఘం చీఫ్ ఆక్సెల్ ఎగ్గర్ట్

ట్రంప్ ఇలాంటి నిర్ణయాన్ని తీసుకోవడం దురదృష్టకరం. దీనివల్ల వాటిల్లే నష్టాన్ని అంచనా వేసి తగు చర్యల్ని తీసుకుంటాం
– ఫ్రాన్స్ ఆర్థిక మంత్రిత్వ శాఖ

వాణిజ్యపరమైన సమస్యల్ని పరిష్కరించడానికి ఇది మార్గం కాదు. మా ఉక్కు ఉత్పత్తిని ఎలా వినియోగంలోకి తెచ్చుకోవాలో మాకు తెలుసు
– బ్రిటన్ వాణిజ్య మంత్రి లియాం ఫాక్స్

ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై వివాదాస్పద సుంకాలతో ప్రపంచ వాణిజ్య యుద్ధానికి ట్రంప్ కారకులయ్యారు. స్వేచ్ఛా వాణిజ్య భాగస్వామ్య దేశాలకు ద్రోహం తలపెట్టారు. ఇది నేరపూరిత చర్యే
– జర్మనీ ఆర్థిక మంత్రి బ్రిగిట్టే జైప్రీస్

అమెరికా నిర్ణయం విచారకరం. ఈ విధానం దేశాల మధ్య ఆర్థిక సంబంధాలను దెబ్బతీస్తుంది. అమెరికా వంటి పెద్ద దేశం ఈ రకమైన రక్షణాత్మక ధోరణులకు దిగడం సరికాదు
– జపాన్ విదేశాంగ మంత్రి టరో కొనో

మా ప్రయోజనాల్ని కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యల్ని తీసుకుంటాం. ట్రంప్ నిర్ణయం ద్వైపాక్షిక సంబంధాల్ని దెబ్బతీసే చర్యే
– బ్రెజిల్ విదేశీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ

ట్రంప్ నిర్ణయంలో మాకు మినహాయింపులున్నా.. ఇది సరైన చర్య కాదు. దీన్ని మేము వ్యతిరేకిస్తున్నాం. సుంకాలను ఎత్తివేసేదాకా ఇతర దేశాలతో కలిసి పోరాడుతాం
– కెనడా విదేశీ వ్యవహారాల మంత్రి క్రిస్టియా

నేను ఎక్కడికి పారిపోలేదు

■ వాట్సప్‌లో మేసేజ్ పంపిన వీడియోకాన్ సీఎండీ వేణుగోపాల్



న్యూఢిల్లీ, మార్చి 9: నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీల మోసం కేసు మరువకముందే బ్యాంకులకు మరో షాక్ తగులబోతున్నాదా? ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఇదే నిజమేననిపిస్తున్నది. వివిధ బ్యాంకులకు రూ.25 వేల కోట్లకు పైగా బకాయిపడిన వీడియోకాన్ అధినేత వేణుగోపాల్ ధూత్ కూడా విదేశాలకు పారిపోయాడని సోషల్ మీడియా వార్త అల్‌చల్ చేస్తున్నది. ఈ వ్యవహారంపై దృష్టి సారించిన ప్రభుత్వ వర్గాలు వెంటనే కంపెనీ వర్గాలకు ఫోన్‌చేసి ధూత్ ఎక్కడ ఉన్నాడని ప్రశ్నించగా.. గతంలో ఆయన ఇక్కడ ఉన్నాడని సమాధానమిచ్చారు. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై ధూత్ ఎట్టకేలకు స్పందించారు. దాదాపు మూడేండ్లుగా విదేశాలకు వెళ్లలేదు..ప్రస్తుతం ఎటువెళ్లే ఆలోచన కూడాలేదు అని వాట్సప్ ద్వారా ధూత్ సమాచారం ఇవ్వడంతో ప్రభుత్వ వర్గాలు, ముఖ్యంగా బ్యాంకింగ్ సంస్థలు ఊపిరి పీల్చుకున్నాయి. రిజర్వు బ్యాంక్ రూపొందించిన దివాల తీసిన సంస్థల జాబితాలో వీడియోకాన్ రెండో స్థానంలో ఉన్నది.

వారానికో విమానం

■ పదేండ్లపాటు భారత్‌కు సరఫరా చేయనున్న ఎయిర్‌బస్

హైదరాబాద్, మార్చి 9: భారత్‌లో విమానయాన రంగం శరవేగంగా పుంజుకుంటున్న నేపథ్యంలో యూరప్‌కు చెందిన విమానాల తయారీ సంస్థ ఎయిర్‌బస్ ప్రత్యేక దృష్టి సారించింది. వారానికి ఒక్కో విమానం చొప్పున వచ్చే పదేండ్లపాటు భారత్‌కు సరఫరా చేయాల్సి ఉంటుందని ఎయిర్‌బస్ ఇండియా ప్రెసిడెంట్ శ్రీనివాసన్ ద్వారకానాథ్ తెలిపారు. హైదరాబాద్‌లో జరుగుతున్న 'వింగ్స్ ఇండియా 2018' సదస్సులో ఆయన మాట్లాడుతూ..వచ్చే రెండు దశాబ్దకాలం(2017-36)లో భారత్‌కు 1,750 విమానాలు అవసరమవుతాయని చెప్పారు. వీటిలో 1,320 చిన్న స్థాయి విమానాలు కాగా, 430 పెద్దవి అని ఆయన పేర్కొన్నారు. వీటి విలువ 255 బిలియన్ డాలర్లు.

చెన్నైలో పల్సస్ కేంద్రం ప్రారంభం

■ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించిన కేంద్రమంత్రి సురేశ్ ప్రభు



కేంద్రమంత్రి సురేశ్ ప్రభును సత్కరిస్తున్న పల్సస్ సీఈవో శ్రీనుబాబు

న్యూఢిల్లీ, మార్చి 9: రాష్ర్టానికి చెందిన ప్రముఖ పరిశోధనల సంస్థ పల్సస్ వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. ఇప్పటికే గుర్‌గావ్‌లో సెంటర్‌ను ప్రారంభించిన సంస్థ.. తాజాగా శుక్రవారం చెన్నై సెజ్‌లో ఏర్పాటు చేసిన సెంటర్‌ను కేంద్ర వాణిజ్య మంత్రి సురేశ్ ప్రభు న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..పల్సస్ తనదైన వ్యాపారంలో దూసుకుపోతున్నదన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సెంటర్‌లో 5 వేల మంది సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా, నూతనంగా ఏర్పాటు చేసిన ఈ రెండు సెంటర్లలో మరో 2 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈవో శ్రీనుబాబు గేదెల ఈ సందర్భంగా తెలిపారు.



హైదరాబాద్‌లో తెలంగాణ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన ప్రింట్ ఫెయిర్ 2018ను ప్రారంభిస్తున్న దృశ్యం. చిత్రంలో భారతీయ ప్రింటింగ్, ప్యాకేజింగ్, అనుబంధ మిషినరీ తయారీదారుల సంఘం అధ్యక్షుడు ఎస్ దయాకర్‌రెడ్డి తదితరులు

8.41 లక్షల కోట్లకు ఎన్‌పీఏలు

డిసెంబర్ 31 నాటికి బ్యాంకుల్లో పరిస్థితిపై నివేదిక విడుదల చేసిన కేంద్రం



న్యూఢిల్లీ, మార్చి 9: బ్యాంకింగ్ రంగంలో మొండి బకాయిలు మరింత పెరిగాయి. డిసెంబర్ 31తో ముగిసేనాటికి ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల మొండి బకాయిలు రూ.8.41 లక్షల కోట్లకు చేరుకున్నాయని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం వెల్లడించింది. ముఖ్యంగా పారిశ్రామికం, సేవలు, వ్యవసాయ రంగంలో వీటి వాటా మరి ఎక్కువగా ఉన్నదని పేర్కొంది. వీటిలో ఇండస్ట్రీకి ఇచ్చిన రుణాల్లో రూ.6,09,222 కోట్లు ఎన్‌పీఏలుగా మారయన్న కేంద్రం.. మొత్తం ఎన్‌పీఏల్లో వీటి వాటా 20.41 శాతంగా ఉంది. అలాగే సేవల రంగం రూ.1,10,520 కోట్లు(5.77 శాతం), వ్యవసాయం రూ.69,600 కోట్లు(6.53 శాతం), ఆహారేతర రంగం రూ.14,986 కోట్లు, రిటైల్ లోన్ల వాటా రూ.36,630 కోట్లు(2.01 శాతం)గా ఉన్నాయని లోక్‌సభకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన తొమ్మిది నెలలకాలంలో ఉద్దేశపూర్వకంగా రుణాలు ఎగ్గొట్టే వారి సంఖ్య 1.66 శాతం పెరిగి 9,063కి చేరుకున్నట్లు శుక్లా వెల్లడించారు. వీటి విలువ రూ.1,10,050 కోట్లని ఆయన చెప్పారు. ఈ రుణాలు ఎగ్గొట్టేవారిపై ఉక్కుపాదం మోపడానికి ఇప్పటికే కేంద్రం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నదని, 2,108 మందిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేసినట్లు తెలిపారు.

పీఎన్‌బీకి రూ.2,800 కోట్ల నష్టం

భారీ కుంభకోణంతో సతమతమవుతున్న ప్రభుత్వ రంగ బ్యాంకు పంజాబ్ నేషనల్ బ్యాంకు గడిచిన ఆర్థిక సంవత్సరంలో కూడా భారీగా నష్టపోయింది. వివిధ మోసాల ద్వారా 431 మిలియన్ డాలర్లు నష్టపోయినట్లు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం వెల్లడించింది. మన కరెన్సీలో వీటి విలువ రూ.2,800 కోట్లకు పైమాటే.

ఎగవేతదారులను వదలొద్దు: యూఎఫ్‌బీయూ కన్వీనర్ శర్మ



బ్యాంకులకు చెల్లించాల్సిన లక్షలాది కోట్ల రూపాయలను ఎగ్గొట్టిన ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలపై కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) కన్వీనర్ వీవీఎస్ఆర్ శర్మ కోరారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి ప్రజలు ఇంటి కోసం రుణాలు తీసుకుంటే ముక్కు పిండి వసూలు చేస్తారని, బడా కంపెనీల వద్ద బ్యాంకులకు సంబంధించిన నిరర్థక ఆస్తులు రూ.10 లక్షల కోట్లుగా ఉన్నాయని, ముందుగా వీటిని వసూలు చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని, అందుకోసం కఠినమైన చట్టాలను రూపొందించాలన్నారు. పీఎన్‌బీలో జరిగిన మోసాన్ని సాకుగా చూపుతూ ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేట్ పరం చేయాలన్న ఆలోచనను విరమించుకోవాలన్నారు. ప్రైవేట్ బ్యాంకులు సమర్థవంతంగా పని చేస్తున్నాయని చెబుతున్న వారు గ్లోబల్ ట్రస్ట్ బ్యాంకు ఎందుకు మూతపడిందో సమాధానం చెప్పాలన్నారు. కొన్ని కార్పొరేట్ శక్తులు ప్రభుత్వ బ్యాంకులను దివాలా చేయించే కుట్ర చేస్తున్నాయని, పాలక ప్రభుత్వాలు ఈ విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఈ నెల 21న ప్రభుత్వ రంగ బ్యాంకులను రక్షించాలని కోరుతూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తున్నామని, లక్షలాది సంతకాలను సేకరించి లోక్‌సభ స్పీకర్‌కు నివేదిస్తామని ఆయన తెలిపారు.

బ్యాంక్	మొండి బకాయిలు (రూ.కోట్లలో)
ఎస్‌బీఐ	2,01,560
పీఎన్‌బీ	55,200
ఐడీబీఐ	44,542
బ్యాంక్ ఆఫ్ ఇండియా	43,474
బీవోబీ	41,649
యూనియన్ బ్యాంక్	38,047
కెనరా	37,794
ఐసీఐసీఐ	33,849
ఇండియన్ ఓవర్‌సీస్	31,724
సెంట్రల్ బ్యాంక్	32,491
యూకో	24,308
అలహాబాద్ బ్యాంక్	23,120
ఆంధ్రాబ్యాంక్	21,599
కార్పొరేషన్ బ్యాంక్	21,818

ఓబీసీ వడ్డీరేట్ల పెంపు

న్యూఢిల్లీ, మార్చి 9: ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్(ఓబీసీ) వడ్డీరేట్లను 0.15 శాతం పెంచింది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో వచ్చే సోమవారం నుంచి అమలులోకి వచ్చేలా ఏడాది కాలపరిమితి కలిగిన ఎంసీఎల్ఆర్ రేటు 8.35 శాతం నుంచి 8.50 శాతానికి చేరుకున్నది. అలాగే ఆరు నెలల ఎంసీఎల్ఆర్ రేటు కూడా 15 బేసిస్ పాయింట్లు పెంచడంతో 8.45 శాతానికి, మూడు నెలల కాలపరిమితి కలిగిన రుణరేటుపై 10 బేసిస్ పాయింట్లు పెంచడంతో 8.30 శాతానికి చేరుకున్నది.

రెడ్డీస్ మెదక్ ప్లాంట్‌పై 5 అభ్యంతరాలు

న్యూఢిల్లీ, మార్చి 9: ప్రముఖ ఔషధాల తయారీ సంస్థ డాక్టర్ రెడ్డీస్‌కు మెదక్ జిల్లాల్లో ఉన్న ఏపీఐ ప్లాంట్‌పై అమెరికా రెగ్యులేటరీ ఐదు అభ్యంతరాలను వ్యక్తంచేసింది. ఈ విషయాన్ని సంస్థ శుక్రవారం బీఎస్ఈకి సమాచారం అందించింది. ఇందుకు సంబంధించి ఐదు అభ్యంతరాలతో కూడిన ఫామ్ 483 జారీ చేసినట్లు కంపెనీ వెల్లడించింది. ప్లాంట్ నిర్వహణ, ఉత్పత్తి గురించి అభ్యంతరాలను వ్యక్తంచేసినట్లు తెలిపింది.

వోల్వో కార్లు మరింత ప్రియం!

న్యూఢిల్లీ, మార్చి 9: వోల్వో తమ వాహన ధరలను పెంచబోతున్నట్లు ప్రకటించింది. బడ్జెట్‌లో దిగుమతి సుంకాన్ని పెంపుతో సంస్థపై పడుతున్న భారాన్ని వినియోగదారులకు మళ్లించడంలో భాగంగా కార్ల ధరను ఐదు శాతం వరకు పెంచాలనుకుంటున్నట్లు కంపెనీ ఎండీ చార్లెస్ ఫ్రంప్ తెలిపారు. ఈ ధరల పెంపు నూతన స్టాక్స్ మాత్రమే వర్తించనున్నదని, ప్రస్తుతం సంస్థ వద్ద ఉన్న పాత స్టాకుకు వర్తించదని ఆయన వెల్లడించారు.

అప్పుల్ని ఇట్టే తీర్చేస్తాం!

■ మాకు రూ.12,400 కోట్ల ఆస్తులున్నాయి

■ కర్నాటక హైకోర్టుకు తెలిపిన యునైటెడ్ బ్రూవరీస్

బెంగళూరు, మార్చి 9: అప్పులన్నీ చాలా తేలిగ్గా తీర్చేస్తాం.. మాకు రూ.12,400 కోట్ల ఆస్తులున్నాయి.. కర్నాటక హైకోర్టులో విజయ్ మాల్యా కంపెనీ మాటలివి. దేశీయ బ్యాంకులకు రూ.9,000 కోట్లకుపైగా రుణాలను ఎగవేసి రెండేండ్ల క్రితం మాల్యా లండన్‌కు పారిపోయిన విషయం తెలిసిందే. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ కోసమే మాల్యా ఈ అప్పుల్ని తీసుకోగా, పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయిన సదరు ఎయిర్‌లైన్స్ మూతబడిన సంగతీ విదితమే. ఈ అప్పులకు యునైటెడ్ బ్రూవరీస్ హోల్డింగ్స్ లిమిటెడ్ (యూబీహెచ్ఎల్).. కార్పొరేట్ పూచీకత్తునిచ్చింది. ఈ నేపథ్యంలో తాజాగా యూబీహెచ్ఎల్.. కర్నాటక హైకోర్టు ఎదుట ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం తమ ఆస్తులు, షేర్ల విలువ రూ.12,400 కోట్లపైనేనని, కాబట్టి కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన రూ.6,000 కోట్ల రుణాలను, దానిపై వడ్డీసహా అన్ని బకాయిలను ఇట్టే తీర్చేయగలమని చెప్పింది. కాగా, ఈ కేసు తదుపరి విచారణను చీఫ్ జస్టిస్ దినేశ్ మహేశ్వరి నేతృత్వంలోని డివిజన్ బెంచ్ ఏప్రిల్ 2కు వాయిదా వేసింది.



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో బయోకాన్ సీఎండీ కిరణ్ మజుందార్ షా చేతుల మీదుగా బిరాక్ యంగ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్, రిసెర్చ్ అవార్డును అందుకుంటున్న నీమోకేర్ సీఈవో ప్రత్యూష

చాయ్‌గురు నుంచి 'రోజెల్లా టీ'

■ సచివాలయంలో ఉత్పత్తిని ఆవిష్కరించిన మంత్రి పోచారం



శుక్రవారం హైదరాబాద్‌లో రోజెల్లా టీని ఆవిష్కరిస్తున్న మంత్రి పోచారం, గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నిత్యజీవితంలో ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం ప్రజలు కోరుకునే చాయ్‌లో వినూత్న అనుభూతిని అందించేందుకుగాను నేచురల్ ఫార్మసీ కొత్త ఉత్పత్తి తీసుకురావడం సంతోషకరమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చాయ్‌గురు బ్రాండ్ నుంచి 'రోజెల్లా టీ'ని రైతు సమన్వయ సమితి కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా సుఖేందర్ రెడ్డితో కలిసి శుక్రవారం మార్కెట్లోకి విడుదల చేశారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రవాస భారతీయుడు రామన్ మదాల ఈ టీ పొడిని ఉత్పత్తి చేశారు. ఈ రోజెల్లా టీ పొడిని పుంటికూర జాతికి చెందిన హైబిస్కస్ పుష్పాలు, ఎండబెట్టిన అల్లం, పిప్పళ్లతో తయారు చేసినట్లు రామన్ చెప్పారు. ఈ టీ తాగడం వల్ల శరీరానికి విటమిన్ సీ, యాంటీ ఆక్సిడెంట్లు సంవృద్ధిగా లభిస్తాయని చెప్పారు. దీనిని వేడినీళ్ళు, చల్లటి నీళ్లు, సోడాతో సేవించవచ్చని చెప్పారు.



ఇంటికి చేరిన రమేశ్‌తో జాగృతి నాయకులు

గల్ఫ్ బాధితుడికి జాగృతి అండ

ఎంపీ కవిత చొరవతో స్వగ్రామానికి..

పెద్దపల్లి ప్రతినిధి, నమస్తే తెలంగాణ: తెలంగాణ జాగృతి అండతో గల్ఫ్ బాధితుడు స్వగ్రామానికి చేరాడు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లికి చెందిన గంగాధర్ రమేశ్ కొన్నేండ్ల క్రితం అప్పు చేసి సౌదీ వెళ్లాడు. అక్కడ కంపెనీలో పనిలేక బయటికొచ్చాడు. అక్కడే ఏదో పనిచేస్తుండగా, పోలీసులు పట్టుకొని జైల్లో పెట్టారు. బాధిత కుటుంబ సభ్యులు జాగృతి పెద్దపల్లి నాయకుడు సంగ్రామ్‌సింగ్‌ను ఆశ్రయించారు. ఆయన జాగృతి రాష్ట్ర నాయకుడు నవీన్‌చారి ద్వారా ఎంపీ కవిత దృష్టికి తీసుకెళ్లారు. ఆమె వెంటనే సౌదీ ఎంబసీతో మాట్లాడారు. విమాన టికెట్‌తోపాటు ఇతరత్రా సహకరించగా రమేశ్ నాలుగు రోజుల్లోనే స్వగ్రామానికి చేరాడు. అన్ని విధాలా సహకరించిన ఎంపీ కవితకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

'అన్న'గా ఆదుకుంటా

మీ కుటుంబానికి అండగా ఉంటా: దేవయ్య కుటుంబానికి మంత్రి కేటీఆర్ పరామర్శ

గంభీరావుపేట: 'సొంత అన్నలా ఆదుకుంటా.. అధైర్య పడొద్దు' అని ఇటీవల హత్యకు గురైన టీఆర్ఎస్ నాయకుడు బీనవేని దేవయ్య కుటుంబానికి రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కే తారకరామారావు భరోసా ఇచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లి ఎంపీటీసీ సభ్యురాలు బీనవేని చంద్రకళ భర్త దేవయ్య బుధవారం సాయంత్రం హత్యకు గురైన విషయం తెలిసిందే. మంత్రి కేటీఆర్ పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్‌తో కలిసి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. 'నాకు దిక్కెవరు ఉన్నారు..?, ఎంత కిరాతకంగా నా భర్తను చంపారు' అంటూ దేవయ్య భార్య చంద్రకళ కొడుకులతో కలిసి రోదించగా.. మంత్రి కేటీఆర్ వారిని ఓదార్చారు. 'దేవయ్య హత్యకు గురవడం దురదృష్టకర ఘటన.. మీరు ధైర్యంగా ఉండాలి.. అన్నలా మీ కుటుంబాన్ని ఆదుకుంటా'నంటూ భరోసా ఇచ్చారు. దేవయ్య ఇద్దరు కొడుకులు అన్వేష్, ప్రఫుల్ విద్యా బాధ్యతలు తానే తీసుకుంటున్నట్టు మంత్రి ప్రకటించారు. పార్టీకి ఆయన చేసిన సేవలను మంత్రి గుర్తుచేసుకున్నారు. ఈ కేసును డీఎస్పీ స్థాయి అధికారులతో విచారణ చేపడుతున్నామన్నారు. మంత్రి వెంట జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, ఎంపీపీలు కమ్మరి గంగసాయవ్వ, అక్కరాజు శ్రీనివాస్, జెడ్పీటీసీలు తోట ఆగయ్య, జనగామ శరత్‌రావు తదితరులు ఉన్నారు.



దేవయ్య కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మంత్రి కేటీఆర్



పేదల వైద్యానికి ఆర్థిక సాయం

హైదరాబాద్: తీవ్ర అనారోగ్యంతో దవాఖానలో చేరి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న మాస్టర్ శక్తి స్వరూప్ తల్లిదండ్రులకు డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.7 లక్షలు మంజూరు చేయిస్తూ శుక్రవారం ఎల్‌ఓసీ అందజేశారు. అదేవిధంగా జనగామ, మహబూబాబాద్, హైదరాబాద్ జిల్లాలకు చెందిన పలువురికి కూడా సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన ఆర్థిక సాయాన్ని అందజేశారు.



బ్రిడ్జిపై ట్రాక్‌ను ఏర్పాటు చేస్తున్న రైల్వే సిబ్బంది

నాలుగు గంటల్లోనే ఆర్‌యూబీ నిర్మాణం

మాసాయిపేట వద్ద వంతెన నిర్మాణంలో రికార్డు

వెల్దుర్తి: సాధారణంగా బ్రిడ్జి నిర్మించాలంటే నెలలు పడుతాయి. కానీ మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మాసాయిపేట రైల్వేక్రాసింగ్ వద్ద కేవలం నాలుగు గంటల్లోనే రోడ్డు అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ)ని పూర్తి చేసి రికార్డు సృష్టించారు రైల్వే ఉన్నతాధికారులు, ఇంజినీర్లు. మాసాయిపేట వద్ద 2014లో పట్టాలు దాటుతున్న స్కూల్‌బస్సును ప్యాసింజర్ రైలు ఢీకొని 18మంది చిన్నారులు మృతిచెందగా, ఘటనపై తీవ్రంగా స్పందించిన మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అండర్ బ్రిడ్జికి పూనుకున్నారు. కేంద్రానికి, రైల్వేశాఖ చెప్పినా నిధులు ఇవ్వలేమని తేల్చి చెప్పాయి. ఎంపీ వెంటనే మంత్రి హరీశ్‌రావు సహకారంతో సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా రూ.1.69 కోట్లు మంజూరు చేశారు. శుక్రవారం 10 గంటలకు రైల్వేలైన్‌ను తొలగించి, సిమెంట్ బ్లాక్‌లను, ఫ్లాట్‌ఫాంలను నిర్మించారు. ఆ వెంటనే రైల్వే లైన్‌ను తిరిగి బిగించారు. ఈ పనులన్నీ నాలుగు గంటల్లో పూర్తి చేసి రికార్డు సృష్టించారు.



సిమెంట్ బ్లాక్‌ను అమర్చుతున్న రైల్వే సిబ్బంది

పాదపూజలో కంటతడి పెట్టిన ఎర్రబెల్లి

తొర్రూరు, నమస్తే తెలంగాణ: వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని నితిన్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన పదోతరగతి విద్యార్థుల ఆధ్యయన శిబిర ముగింపు కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు ఉద్వేగానికి లోనై కంటతడిపెట్టారు. వీఎంఎఫ్ ఆధ్వర్యంలో జన్మనిచ్చిన తల్లిదండ్రులు, విద్యాబుద్ధులు నేర్పిన గురువుల నుంచి పరీక్షలకు ముందు ఆశీస్సులు పొందేలా పాదపూజ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులతో ఆప్యాయతను పంచుకున్న ఎమ్మెల్యే ఒక్కసారిగా కంటతడిపెట్టడంతో వేదికపై ఉన్న జాయింట్ కలెక్టర్ దామోదర్‌రెడ్డితోపాటు ఇతర అతిథులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా చలించిపోయారు.



కంటతడిపెడుతున్న ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు



పూజల్లో పాల్గొన్న జూపల్లి రామేశ్వరరావు తదితరులు

వేంకటేశ్వరునికి వైభవంగా తిరువీధి ఉత్సవం

మేళ్లచెర్వు: సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులోని మైహోం ఇండస్ట్రీస్ ఆవరణలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం స్వామి వారికి తిరువీధి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సహస్ర కమలార్చన , ధ్వజారోహణం, భేరీ పూజ, దేవతాహ్వానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో పరిశ్రమ చైర్మన్ జూపల్లి రామేశ్వర్‌రావు-శ్రీకుమారి దంపతులు, మునగాల రామ్మోహన్‌రావు-అరుణ, మైహోం కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సైన్స్ ఒలింపియాడ్‌లో తెలంగాణ శ్రీచైతన్య సత్తా

ఖమ్మం ఎడ్యుకేషన్: అంతర్జాతీయ స్థాయి సైన్స్ ఒలింపియాడ్‌లో తెలంగాణ శ్రీచైతన్య విద్యార్థులు అఖిలభారత స్థాయిలో బహుమతులు సాధించారని తెలంగాణ శ్రీచైతన్య స్కూల్స్ అధినేతలు మల్లెంపాటి శ్రీధర్, శ్రీవిద్య తెలిపారు. దేశవ్యాప్తంగా 3 నుంచి పదోతరగతి విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించగా, ఇందులో తమ పాఠశాలకు చెందిన ఐదుగురు గ్రాండ్ ప్రైజ్‌గా ల్యాప్‌ట్యాప్‌లు, ఎనిమిదిమంది ట్యాబ్‌లను గెలుచుకోవటంతోపాటు ఆలిండియా మొదటి ర్యాంక్‌ను ఇద్దరు, 2వ ర్యాంక్‌ను ముగ్గురు, 3వ ర్యాంక్‌ను ముగ్గురు సాధించారన్నారు. 13 మంది విద్యార్థులు ప్రత్యేక బహుమతులను, 155 మంది ప్రోత్సాహక, 698 మంది మెడల్స్‌ను సాధించారని చెప్పారు.



వనపర్తి జిల్లా కేంద్రంలో టీఆర్ఎస్‌లో చేరిన వారితో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలానికి చెందిన వారికి కండువాలు కప్పి టీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్ రెడ్డి

టీఆర్ఎస్‌లో చేరికల పరంపర

నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్:

టీఆర్ఎస్‌లో వివిధ పార్టీల నుంచి చేరికలు కొనసాతున్నాయి. శుక్రవారం వికారాబాద్ జిల్లా తాండూరులో రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి సమక్షంలో ఉద్దండాపూర్ గ్రామానికి చెందిన 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు గులాబీ కండువా కప్పుకున్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన మోచీ సంఘం సభ్యులు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో ఆర్మూరులో, వర్ని మండలం బెర్లానాయక్ తండాకు చెందిన 110 మంది రాష్ట్ర యువ నాయకుడు పోచారం భాస్కర్‌రెడ్డి సమక్షంలో, మిషన్ భగీరథ వైస్ చైర్మన్, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లో భీమ్‌గల్ మండలం బడా భీమ్‌గల్, పల్లికొండ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు అనుచరులు 50 మంది, మాక్లూర్ మండలం లక్కాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు హన్మంత్‌రావు, వెంకటరమణ అనుచరులతో టీఆర్ఎస్‌లో చేరారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెంలో పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో వివిధ పార్టీలు, సంస్థలకు చెందిన 50మంది టీఆర్ఎస్‌లో చేరారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో సిర్పూరు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సమక్షంలో బెజ్జూరు మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు టీఆర్ఎస్‌లో చేరారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ఐదో వార్డులో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సమక్షంలో టీడీపీ, కాంగ్రెస్‌కు చెందిన పలువురు నాయకులు గులాబీ గూటికి చేరారు. పెద్దపల్లి జిల్లా మంథనిలో ఎమ్మెల్యే పుట్ట మధు సమక్షంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం బెగుళూరు గ్రామానికి చెందిన 150 మంది కాంగ్రెస్, టీడీపీ పార్టీలకు చెందిన యువకులు టీఆర్ఎస్‌లో చేరారు.



ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరిన మామిడిపల్లి మోచీ కులస్థులు

పెండ్లింట విషాదం

- ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం
- చెట్టును ఢీకొన్న ఇన్నోవా వాహనం
- పెళ్లికొడుకు సహా ఐదుగురి దుర్మరణం
- మృతులు వరంగల్ జిల్లా వర్ధన్నపేటవాసులు

కొణిజర్ల: ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పల్లిపాడు వద్ద శుక్రవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం పెళ్లింట విషాదాన్ని నింపింది. వివరాలు ఇలా.. వరంగల్ జిల్లా వర్ధన్నపేటకు చెందిన ఆచ్చి రామకృష్ణప్రసాద్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన దుర్గతో గురువారం రాత్రి తణుకులో వివాహం జరిగింది. అనంతరం కుటుంబసభ్యులతో కలిసి వర్ధన్నపేటకు ఇన్నోవాలో వస్తుండగా, వీరి వాహనం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పల్లిపాడు వద్ద చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో వరుడు ఆచ్చి రామకృష్ణప్రసాద్(37), వరుడి అక్క శేషం పద్మ(42), వరుడి చెల్లె-బావ కోమండూర్ శ్రీదేవి(34)-శరత్(38), డ్రైవర్ వడ్లకుంట వేణు(38) అక్కడికక్కడే మృతి చెందారు. వధువు దుర్గ, వరుడి అక్క కొడుకు రామన్, చెల్లెలి పిల్లలు మాహతి, రిషిత్, బావ శేషం చలపతికి తీవ్రగాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని కొత్తగూడెం ఎస్పీ కిషోర్‌ఝా, వైరా ఎమ్మెల్యే బాణోతు మదన్‌లాల్ సందర్శించారు. స్థానిక పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతులు... రామకృష్ణ , శేషు పద్మ, డ్రైవర్ వేణు(ఫైల్)



సంఘటనా స్థలంలో పడి ఉన్న మృతదేహాలు

వర్ధన్నపేటలో విషాదం..

వర్ధన్నపేట, నమస్తే తెలంగాణ: ఈ ఘటనతో వరంగల్ రూరల్ జిల్లా వర్ధన్నపేటలో విషాదం నెలకొంది. వరుడు రామకృష్ణ, అక్క పద్మ, చెల్లి-బావ శ్రీదేవి-శరత్ మృతి చెందడంతో ఆ కుటుంబం షాక్‌కు గురైంది. బంధుమిత్రుల సందడి, పచ్చని పందిళ్లతో కళకళలాడుతున్న ఆ ఇంటిని రోడ్డు ప్రమాదం తీరని విషాదాన్ని నింపింది.

రోడ్డు ప్రమాదంలో తల్లీకూతుళ్ల మృతి

చెట్టును ఢీకొట్టిన గూడ్స్ క్యారియర్

కల్వకుర్తి రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం పంజుగుల సమీపంలో శుక్రవారం గూడ్స్ క్యారియర్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టగా, తల్లీకూతుళ్లు మృతి చెందారు. కల్వకుర్తి ఎస్సై రాఘవేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లికి చెందిన వడ్డె శ్రీశైలం-కవిత దంపతులు. శుక్రవారం కవిత దంపతులు గుండూరులోని పుట్టింటికి వచ్చారు. గట్టిప్పలపల్లిలో తమ ఇంటి వద్ద నీటి గుంత కోసం ఇసుక, సిమెంట్ సామగ్రిని తీసుకొని తిరుగు ప్రయాణంలో కవిత సోదరుని వాహనం(గూడ్స్ క్యారియర్)లో గట్టిప్పలపల్లికి బయలుదేరింది. ఈ క్రమంలో పంజుగుల దాటగానే శ్రీశైలం గూడ్స్ క్యారియర్‌ను వేగంగా నడపడంతో అదుపుతప్పి చెట్టును బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వాహనం చెట్ల మధ్య ఇరుక్కుపోగా కవిత(25), రక్షిత(7నెలలు) అక్కకడిక్కడే మృతి చెందగా, అక్షితకు స్వల్పగాయాలయ్యాయి. ఎస్సై రాఘవేందర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాలను ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రమాదానికి కారకుడైన కవిత భర్త శ్రీశైలం పారిపోయాడు.



ప్రమాదంలో మృతి చెందిన కవిత, చిన్నారి రక్షిత

ఆగ్రహ జ్వాల

- కాంగ్రెస్‌పై పెల్లుబికిన నిరసనలు
- రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ దిష్టిబొమ్మల దహనాలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్‌పై కాంగ్రెస్ నాయకుల అనుచిత వ్యాఖ్యలపై శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తం కాగా, ఆయా చోట్ల ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. కరీంనగర్‌లో కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి కుంతియా, అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్, నాయకుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను ఉరితీసి, కాలబెట్టారు. అలాగే, ఉస్మానియా యూనివర్సిటీలో టీఎస్‌జేఏసీ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి పోస్టర్‌ను చెప్పులతో కొట్టి నిరసన తెలిపారు. మంత్రి ఈటలపై అనుచిత వ్యాఖ్యలపై బహిరంగ క్షమాపణ చెప్పాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగంగౌడ్ డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్, వీణవంకలో కాంగ్రెస్ నాయకుల దిష్టిబొమ్మలను దహనం చేసి, సీఎం కేసీఆర్, మంత్రి ఈటల చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. దొడ్డు బియ్యాన్ని సన్న రకాలుగా మార్చినట్టు నిరూపించాలని హుజూరాబాద్ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ సవాలు చేసింది.



కరీంనగర్‌లో కాంగ్రెస్ నాయకుల దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న నాయకులు



నల్లగొండలో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఎంబీసీ నాయకులు

సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: ఎంబీసీలకు సబ్సిడీ రుణాలు అందించే ఫైల్‌పై సీఎం కేసీఆర్ సంతకం చేయడంతో ఎంబీసీలు సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. ఖమ్మంలో ఎంబీసీ సంఘం జిల్లా అధ్యక్షురాలు షకీనా, ప్రధాన కార్యదర్శి, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు దరిపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో, ఎంబీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు కొండూరు సత్యనారాయణ, నాంపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంతోపాటు, కోదాడ పట్టణంలో సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డి చిత్రపటాలకు టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, ఎంబీసీ రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వర్లు, ఎంబీసీ నేతలు ఒంటిపులి నాగరాజు, బాణాల విజయ్, అరూరి వీరయ్య, క్షీరాభిషేకం నిర్వహించారు. ఆయాచోట్ల ఎంబీసీ నేతలు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల మాదిరిగా ఎంబీసీలకు సబ్సిడీ రుణాలు అందించే నిర్ణయం తీసుకోవడం గొప్ప విషయమన్నారు. రూ.లక్ష నుంచి 12లక్షల వరకు లబ్ధిదారులకు రుణాలు ఇచ్చేలా ప్రణాళికల రూపకల్పనకు అధికారులను ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.



సూర్యాపేటలో సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎంబీసీ నాయకులు

భైంసాలో దారుణం

గోనె సంచిలో గుర్తుతెలియని వ్యక్తి తల

కనిపించని మొండెం


భైంసా, నమస్తే తెలంగాణ: నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని బస్టాండ్‌కు కూత వేటు దూరంలో ఉన్న సాక్షి దవాఖాన ఎదుట 30 ఏండ్ల యువకుడి తల కనిపించడం స్థానికంగా కలకలం రేపింది. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చెత్తను తొలగిస్తున్న క్రమంలో గోనె సంచిని గమనించారు. అందులో చూడగా వ్యక్తి తల కనిపించడంతో భయాందోళనకు గురైన కార్మికులు వెంటనే పోలీసులకు సమాచారమందించారు. డీఎస్పీ అందె రాములు, సీఐ శ్రీనివాస్, ఎస్సైలు తిరుపతి, పున్నం చందర్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గోనె సంచిలో లభించిన తలను బయటకు తీసి పరిశీలించారు. హత్య గురైన వ్యక్తి వివరాలు తెలియకపోవడంతో స్థానిక ఏరియా దవాఖానలోని పోస్టుమార్టం గదిలో తలను భద్రపరిచారు. నిర్మల్ నుంచి డ్వాగ్ స్క్వాడ్ రప్పించి తనిఖీలు చేపట్టినా ఫలితం లేకపోయింది. హతుడి వివరాలతోపాటు హత్యకు గల కారణాలను పోలీసులు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.



సంఘటనా స్థలంలో గోనె సంచి పక్కన యువకుడి తల

బాలుడి తలలోకి దిగిన కర్ర

అశ్వాపురం రూరల్: చింతకాయలు కోస్తున్న బాలుడి తలలోకి ప్రమాదవశాత్తూ ఓ కర్ర ముక్క దిగిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం రామచంద్రాపురం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గూడూరు వీరారెడ్డి కుమారుడు మధుకర్‌రెడ్డి(10) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. సాయంత్రం తరగతులు ముగిశాక పాఠశాల ఆవరణంలోని చింతచెట్టుకు కర్రలు విసురుతూ కాయలు కోస్తున్న క్రమంలో మధుకర్‌రెడ్డి ప్రమాదవశాత్తూ కిందపడటంతో తల వెనుక భాగంలో లోతుగా కర్ర చొచ్చుకుపోయింది. వెంటనే ఆ బాలుడిని భద్రాచలం దవాఖానకు తరలించారు. వైద్యుల సలహా మేరకు హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానకు రిఫర్ చేశారు.



మధుకర్‌రెడ్డి తలలోకి దిగిన కర్ర

యువతుల సామూహిక ఆత్మహత్య

నేరడిగొండ: ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం బోందిడి గ్రామానికి చెందిన యువతులు ఆడె అర్చన(19), ఆడె అంజల(19) గురువారం పురుగుల మందు తాగగా, చికిత్స పొందుతూ మృతి చెందారు. నేరడగొండ ఎస్సై వెంకన్న వివరాల ప్రకారం.. బోందిడి గ్రామానికి చెందిన అంజల, అర్చన చిన్ననాటి ప్రాణ స్నేహితులు కాగా, ఒకేసారి వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. కాగా, ఆడె అంజలకు ఇటీవలే కుటుంబ సభ్యులు పెండ్లి నిశ్చయించగా, ఇద్దరూ మనస్తాపానికి గురయ్యారు. దీంతో వారు ఆదివారం ఇంటి నుంచి వెళ్లిపోయారు. దీంతో కుటుంబీకులు ఠాణాలో ఫిర్యాదు చేశారు. గురువారం వారు తిరిగి ఇచ్చోడ మండల కేంద్రానికి వచ్చారు. అక్కడి నుంచి సిరికొండకు వెళ్లి, అక్కడ పురుగుల మందు తాగారు. గమనించిన స్థానికులు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి అర్చన మృతి చెందగా, శుక్రవారం ఉదయం అంజల మృతి చెందింది.



అర్చన, అంజల మృతదేహాలు



ప్యుయాంగ్‌చాంగ్ వేదికగా శుక్రవారం వింటర్ పారాలింపిక్స్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దక్షిణకొరియా అధ్యక్షుడు మూన్ జేఇన్ అధికారికంగా పోటీలు మొదలైనట్లు ప్రకటించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, పటాకుల కాల్పులతో స్టేడియం హోరెత్తిపోయింది.

రజతంతో మెరిసిన అంజుమ్

ప్రపంచకప్ షూటింగ్

న్యూఢిల్లీ: ప్రపంచకప్ షూటింగ్‌లో భారత్‌కు శుక్రవారం మరో పతకం లభించింది. మెక్సికోలో జరుగుతున్న టోర్నీలో భారత షూటర్ అంజుమ్ మౌద్గిల్ 50 మీటర్ల పిస్టల్(3 పొజిషన్)లో రజతం సాధించి తద్వారా ప్రపంచకప్‌లో తొలి పతకం సాధించింది. తీవ్రమైన గాలులతో వాతావరణం ఇబ్బంది కలిగించినా 454.2 పాయింట్లు నమోదు చేసిన అంజుమ్ పతకం సాధించడం విశేషం. ఈ విభాగంలో చైనాకు చెందిన జూనియర్ ప్రపంచకప్ చాంపియన్ రుజియావో 455.4 పాయింట్లతో స్వర్ణం దక్కించుకోగా..చైనాకే చెందిన టింగ్ సున్ 442.2 పాయింట్లతో కాంస్యపతకం అందుకుంది. ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్‌లో తొలి రజతం అందుకున్న భారత్..ఓవరాల్‌గా 8 పతకాలు(3 స్వర్ణాలు, 1 రజతం, 4 కాంస్యాలతో) సాధించి పతకాల పట్టికలో తొలిస్థానంలో కొనసాగుతున్నది. చైనా ఐదు పతకాలు(2 స్వర్ణ, 2 రజత, 1 కాంస్యం)సాధించి రెండోస్థానంలో నిలిచింది. కాగా, పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో 15 ఏండ్ల అనీశ్ భన్వాలా 7వ స్థానంలో నిలిచి నిరాశపరిచాడు. తొలిరౌండ్‌లో అద్భుతంగా రాణించినా చివరి రౌండ్‌లో అతను గురితప్పడంతో ఫైనల్ ఆరుగురిలో చోటు దక్కించుకోలేకపోయాడు.



టెస్ట్‌లకు మున్రో గుడ్‌బై



వెల్లింగ్టన్: న్యూజిలాండ్ విధ్వంసక క్రికెటర్ కొలిన్ మున్రో సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. ఇకపై టెస్ట్ సెలెక్షన్ తాను అందుబాటులో ఉండనని ప్రకటించాడు. టెస్ట్‌లకు దూరమైనా వన్డే, టీ20 కెరీర్‌పై దృష్టిసారిస్తానని మున్రో అన్నాడు. సరిగ్గా ఐదేండ్ల క్రితం దక్షిణాఫ్రికాతో కేవలం ఒక టెస్ట్ ఆడిన మున్రో పరిమిత ఓవర్ల ఫార్మాట్లో మాత్రం కివీస్‌కు కీలక ఆటగానిగా ఎదిగాడు. తనదైన విధ్వంసక ఆటతీరుతో ప్రస్తుత ప్రపంచ టీ20 ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ బ్యాట్స్‌మన్‌గా కొనసాగుతున్నాడు. 'సుదీర్ఘ ఫార్మాట్ నుంచి వైదొలుగుతున్నాను. ఇక నుంచి వన్డే, టీ20లపైనే దృష్టి. వచ్చే ఏడాది జరిగే ప్రపంచకప్ లక్ష్యంగా జట్టులో కీలకమవుతాను' అని అన్నాడు.

చెన్నై ఎక్స్‌ప్రెస్

దూసుకొచ్చిన యువ పేస్ ఆల్‌రౌండర్
అవకాశాన్ని ఒడిసిపట్టుకున్న విజయ్ శంకర్



విజయ్ శంకర్

ఆల్‌రౌండర్ జట్టుకు ఆయువుపట్టులాంటి వాడు. అటు బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ రాణిస్తూ జట్టు విజయాల్లో కీలక భూమిక పోషించేవాడు. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు తాను ఉన్నానంటూ విజయతీరాలకు చేర్చేవాడు. ఆల్‌రౌండర్ అనే పదానికి అచ్చుగుద్దినట్లు సరిపోయే ఆటగాడు హర్యానా హరికేన్ కపిల్‌దేవ్. నిఖార్సైన పేస్ బౌలింగ్‌కు తోడు అద్భుతమైన బ్యాటింగ్‌తో భారత క్రికెట్‌పై చెరుగని ముద్రవేశాడు. కపిల్ లాంటి మేటి ఆల్‌రౌండర్ కోసం ఇన్నాళ్లు కండ్లు కాయేలా చూశాం. మధ్యలో కొంతమంది వచ్చినా ఆ స్థాయిని అందుకోవడంలో విఫలం కాగా, భారత క్రికెట్‌కు చుక్కానిలా హార్దిక్ పాండ్యా కనిపించాడు. ఆదిలో రాణించినా అంచనాలకు తగ్గట్లు ఆకట్టుకోవడంలో హార్దిక్ విఫలమవుతున్న వేళ తాను ఉన్నానంటూ చెన్నై ఎక్స్‌ప్రెస్ రూపంలో విజయ్ శంకర్ దూసుకొచ్చాడు. సీనియర్ల గైర్హాజరీలో అందివచ్చిన అవకాశాన్ని ఒడిసిపట్టుకుంటూ బంగ్లాతో మ్యాచ్‌లో భళా అనిపించి సరికొత్త ఆశలు చిగురింపచేశాడు.

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

జట్టుకు ఆల్‌రౌండర్ తరుగని ఆస్తి. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ ఇరుగదీసే ఆటగాడు ఉంటే ఆ జట్టుకు ఎదురుండదు. మిగతా జట్లతో పోలిస్తే..భారత జట్టుకు ఆల్‌రౌండర్ల కొరత చాన్నాళ్లుగా వేధిస్తున్న సమస్య. ప్రపంచ క్రికెట్‌లో తనకంటూ ఓ పేజీని లిఖించుకున్న కపిల్ తర్వాత ఆ స్థాయి ఆల్‌రౌండర్ టీమ్‌ఇండియాకు ఇప్పటి వరకు దొరుకలేదు. స్పిన్ ఆల్‌రౌండర్లు ఉన్నా..పదునైన పేస్‌తో ప్రత్యర్థిని పడగొట్టే పేస్ ఆల్‌రౌండర్ ఇక కష్టమే అనుకుంటున్న వేళ హార్దిక్ పాండ్యా ఆశలు రేపాడు. దేశవాళీ క్రికెట్‌లో గాకుండా ఐపీఎల్‌లో ధనాధన్ ఆటతో అనతి కాలంలోనే జాతీయజట్టు తలుపు తట్టాడు. అరంగేట్రంలో అంచనాలకు మించి రాణిస్తూ అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లోనూ అదరగొట్టి విమర్శకుల ప్రశంసలు అందుకున్నాడు. హార్దిక్ మరో కపిల్ అంటూ పొగడ్తలు దక్కించుకున్నాడు. ఎదిగే కొద్ది ఒదిగి రాణించాల్సింది పోయి వచ్చిన అవకాశాలను చేజార్చుకుంటూ జట్టుకు ఒకింత భారంగా మారిపోయాడు. ఇటీవలి దక్షిణాఫ్రికా పర్యటనలో భారత్ తరపున మూడు ఫార్మాట్లలో ఆడిన హార్దిక్ తొలి టెస్ట్ మినహాయిస్తే..మిగతా అన్నిమ్యాచ్‌ల్లో దారుణంగా విఫలమయ్యాడు. ఫలితం పాండ్యాపై విమర్శల జడివాన. ఇక పాండ్యాను తనతో పోల్చడం ఆపేయమని కపిల్ అన్నాడంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సరిగ్గా ఇదే సమయంలో చెన్నై యువ తరంగం రవిశంకర్‌కు ముక్కోణపు టోర్నీ రూపంలో అవకాశం దొరికింది. కోహ్లీ, ధోనీ, భువనేశ్వర్, బుమ్రా లాంటి కీలక ఆటగాళ్ల గైర్హాజరీలో లంకపై శంకర్ అంతర్జాతీయ క్రికెట్లోకి అరంగేట్రం చేశాడు. తొలి మ్యాచ్‌లో ఆకట్టుకోలేకపోయినా..మలి మ్యాచ్‌లో అదరగొట్టి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

దేశవాళీలో దుమ్మురేపి:

దేశవాళీ క్రికెట్‌లో విజయ్ శంకర్ దుమ్మురేపాడు. సొంత రాష్ట్రం తమిళనాడు తరపున బరిలోకి దిగిన ప్రతీ మ్యాచ్‌లో అద్భుతంగా రాణించాడు. సీనియర్లు మురళీ విజయ్, అశ్విన్, దినేశ్ కార్తీక్ అడుగుజాడల్లో నడుస్తూ నిలకడైన ఆటతీరుతో సెలెక్టర్ల దృష్టిలో పడ్డాడు. దేశవాళీ క్రికెట్ మొత్తమ్మీద ఒక సీజన్‌లో 1500 పరుగులు, 25 వికెట్లు పడగొట్టిన అతి కొద్దిమంది క్రికెటర్లలో ఒకనిగా శంకర్ నిలిచాడు. ఈ తమిళనాడు ఆటగాని శ్రమకు ఎట్టకేలకు గుర్తింపు లభించింది. గతంలో సొంతగడ్డపై శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు ఎంపికైనా తుది జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు. అయినా నిరాశ చెందకుండా లంకలో ముక్కోణపు టీ20 సిరీస్ రూపంలో వచ్చినా అవకాశాన్ని తనకు అనుకూలంగా మలుచుకున్నాడు. కెప్టెన్ రోహిత్‌శర్మ అండతో బంగ్లాదేశ్ బ్యాటింగ్‌ను కకావికలు చేస్తూ భారత్‌కు అద్భుత విజయాన్ని కట్టబెట్టాడు. పేస్‌బౌలింగ్‌కు తోడు కీలకమైన లోయర్ ఆర్డర్‌లో ధాటిగా పరుగులు కొల్లగొట్టే క్రికెటర్‌గా శంకర్ కనిపిస్తున్నాడు. 2019 ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని యువ క్రికెటర్లను పరీక్షిస్తున్న సెలెక్షన్ కమిటీకి మరో మెరుపు ఆల్‌రౌండర్ దొరికినట్లు కనిపిస్తున్నది. పాండ్యా లాగా ఎచ్చులకు పోకుండా ఈ చెన్నై తంబి అవకాశాలను అందిపుచ్చుకుంటే మనకో మేలిమి ముత్యం దొరికినట్లే.

పాండ్యాతో పోలిక వద్దు:

హార్దిక్ పాండ్యాతో తనను పోల్చవద్దని విజయ్ శంకర్ అన్నాడు. బంగ్లాపై మ్యాచ్ ముగిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ కొన్ని విషయాలు పంచుకున్నాడు. 'పాండ్యాతో పోల్చి నన్ను ఒత్తిడికి గురిచేయవద్దు. చాలా మంది క్రికెటర్లు వేరే వారితో పోల్చడాన్ని అంతగా ఇష్టపడరు. పాండ్యా కూడా నాలాగే ఆల్‌రౌండర్. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ మ్యాచ్ మ్యాచ్‌కు మెరుగవ్వాలన్నదే నా ఆలోచన. జాతీయ జట్టుకు ఆడటం ఎప్పటికీ ప్రత్యేకమే. ఈ విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్ మాకు పూర్తి స్వేచ్ఛనిచ్చింది. ఒత్తిడి ఎప్పటికీ ఉంటుంది. దాన్ని ఎంజాయ్ చేస్తే ఏం కాదు..అలాగనీ తడబాటుకు గురైతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. క్యాచ్‌లు విడిచిపెట్టడం ద్వారా తొలి వికెట్ దక్కడానికి ఆలస్యమైనా..అవన్నీ ఆటలో భాగంగానే భావించాను. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ఫీల్డింగ్ చేయడమనేది అంత సులువు కాదు. కానీ మొదటి వికెట్ ఎప్పటికైనా మరిచిపోని జ్ఞాపకమే' అని శంకర్ అన్నాడు.

పాండ్యాకు ప్రత్యామ్నాయం!

హార్దిక్ పాండ్యాకు విజయ్ శంకర్ ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నాడు. భారీ అంచనాల మధ్య ఆకట్టుకోలేకపోతున్న హార్దిక్‌కు శంకర్ పోటీగా వచ్చినట్లు ఉన్నది. ఇలాగే నిలకడైన ప్రదర్శన కొనసాగిస్తే..టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ ఆలోచనలోనూ మార్పు రావచ్చు. ప్రపంచకప్‌నకు సమయం దగ్గర పడుతున్నా సందర్భంలో ఇంగ్లండ్ పిచ్‌లపై పేస్ ఆల్‌రౌండర్ల అవశ్యకత ఎంతైనా ఉన్నది. పేస్ బౌలింగ్‌కు బాగా సహకరించే ఇంగ్లండ్‌లో రాణించాలంటే శంకర్ లాంటి ఆల్‌రౌండర్లు కచ్చితంగా కావాల్సిందే. ఇదే రీతిలో బౌలింగ్‌కు జతగా బ్యాటింగ్‌లోనూ ఆకట్టుకుంటే పాండ్యా స్థానానికి ముప్పు పొంచి ఉన్నట్లే.

బంగ్లా x శ్రీలంక

నిదహాస్ టీ20 ట్రోఫీ

కొలంబో: తొలిమ్యాచ్‌లో భారత్‌ను ఓడించిన ఉత్సాహంతో శ్రీలంక ఆత్మవిశ్వాసంతో విజయాలబాటను కొనసాగించేందుకు సిద్ధమైంది. నేడు జరిగే మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను ఢీకొట్టనుంది. కాగా, భారత్ చేతిలో ఓడిన బంగ్లాకు ఈ మ్యాచ్‌లో విజయం అత్యవసరం.

సాయంత్రం 7 గంటలకు
డీ స్పోర్ట్, డీడీ స్పోర్ట్స్‌లో
ప్రత్యక్ష ప్రసారం

భారత్‌కు ఐర్లాండ్ షాక్..

సుల్తాన్ అజ్లాన్ షా హాకీ

ఇఫో: యువకులతో కూడిన భారతజట్టుకు అనుకోని షాక్.. భారీ విజయం సాధించాల్సిన ఒత్తిడితో బరిలోకి దిగిన సర్దార్ సింగ్ సేన చివరకు ఐర్లాండ్ జట్టు చేతిలో ఓటమి పాలైంది. దీంతో సుల్తాన్ అజ్లాన్ షా హాకీ టోర్నీ ఫైనల్ ఆశలు ఆవిరయ్యాయి. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో 3-2 గోల్స్ తేడాతో బలహీన ఐర్లాండ్ జట్టు చేతిలో భారత్ తలవంచింది. ఈ మ్యాచ్‌లో విజయమే ధ్యేయంగా ఆడిన భారత్ తొలి పది నిమిషాల్లో 1-0 తోనూ 26 వ నిమిషంలో 2-1తోనూ ఆధిక్యంలో నిలిచినా విజయం మాత్రం సాధించలేకపోయింది. భారత్ తరపున రమణ్‌దీప్ సింగ్(10వ), అమిత్ రోహిదాస్(26వ) నిమిషాల్లో గోల్ సాధించారు. ఐర్లాండ్ జట్టులో షేన్ డొనోగ్యూ(24వ), సీన్ ముర్రే (36వ), లీ కోల్ (42వ) నిమిషాల్లో గోల్స్ కొట్టి జట్టుకు అతిపెద్ద విజయాన్నందించారు. మలేసియాపై 5-1 తేడాతో ఘన విజయం సాధించి ఫైనల్ ఆశలు సజీవం చేసుకున్న భారత జట్టు తాజా ఓటమితో 5,6 స్థానాలకోసం నేడు జరిగే వర్గీకరణ మ్యాచ్‌లో తలపడనుంది.

అంధుల క్రికెటర్లను బీసీసీఐ పరిధిలోకి తీసుకోవాలి

బిషన్‌సింగ్ బేడీ డిమాండ్



న్యూఢిల్లీ: అంధుల క్రికెట్ సంఘం(సీఏబీఐ)ను బీసీసీఐ పరిధిలోకి తీసుకోవాలంటూ మాజీ కెప్టెన్ బిషన్‌సింగ్ బేడీ డిమాండ్ చేశాడు. శుక్రవారం ఇండస్‌ఇండ్ బ్యాంక్ అంధుల క్రికెట్ కాన్‌క్లేవ్-2018 పేరిట ఓ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై విజయంతో ప్రపంచకప్ గెలిచిన భారత అంధుల జట్టును ఈ సందర్భంగా సన్మానించారు. ఇందులో బేడీతో పాటు సయ్యద్ కిర్మాణీ, మదన్ లాల్ పాల్గొన్నారు. బేడీ తన అనుభవాలను పంచుకున్నాడు. 'మాజీ కెప్టెన్ టైగర్ పటౌడీ అంతర్జాతీయ క్రికెట్ కెరీర్ మొత్తం ఒకే కన్నుతో ఆడాడు. టెస్ట్‌ల్లో అరంగేట్రానికి ముందు ఓ కారు ప్రమాదంలో పటౌడీ కన్ను కోల్పోయాడు. ఎవరైనా ఆయన పట్ల సానుభూతి వ్యక్తం చేస్తే దాన్ని సహించేవాడు కాదు. ఏనాడు అదొక అంగవైకల్యంగా భావించలేదు. మీరు కోట్లాది మందికి స్ఫూర్తి. సీఏబీఐని బీసీసీఐ పూర్తిగా తమ పరిధిలోకి తీసుకుని అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తుందనుకుంటున్నాను' అని బేడీ అన్నాడు.

చిక్కుల్లో భారత పేసర్ షమీ

ఏడు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు
ఐపీఎల్ ఆడేందుకూ అవకాశాలు తక్కువే!



మీడియాతో మాట్లాడుతున్న హసీన్ జహా

కోల్‌కతా: టీమ్ ఇండియా ఫాస్ట్‌బౌలర్ మహ్మద్ షమీకి అతిపెద్ద ఎదురుదెబ్బ తగిలింది. అతని భార్య హసీన్ జహా తన న్యాయవాదిలో కలిసి నగర పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్‌కు ఫిర్యాదు చేయడంతో అతనితో సహా నలుగురు కుటుంబ సభ్యులపై ఏడు సెక్షన్ల కింద జాదవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఐపీసీ 498ఏ, 323,307, 506,328,34 సెక్షన్ల ప్రకారం షమీపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును లాల్‌బజార్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన డిటెక్టివ్ విభాగంతోపాటు ఉమెన్స్ గ్రీవెన్స్‌సెల్ షమీ కేసును దర్యాప్తు చేయనున్నారు. షమీ మోసగాడని, అతనికి పలువురితో వివాహేతర సంబంధాలున్నాయని, తనపై గృహహింసకు పాల్పడడంతోపాటు చంపేందుకు ప్రయత్నించారని షమి భార్య హసీన్ జహా ఆరోపించిన సంగతి తెలిసిందే. అంతేకాదు రోజుకో ఆశ్చర్యకరమైన సంగతి బయటపెడుతూ హసీన్ జహా సంచలనం కలిగిస్తున్నది. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ అతను పాకిస్థాన్‌కు చెందిన అమ్మాయితో కూడా సంబంధ కలిగి ఉన్నాడని, 2017లో ఈ అమ్మాయితో శ్రీలంక పర్యటనకు వెళ్లేందుకు ప్రయత్నించాడని చెప్పింది. దుబాయ్‌లోని ఓ హోటల్లో ఈ అమ్మాయితో కలిసి గడిపాడని, అతనితో అప్పుడు ఫోన్‌లో జరిగిన సంభాషణ అంటూ ఆడియోటేప్‌ను హసీన్ విడుదల చేసింది. అతను ఎప్పుడూ నిజం చెప్పడని పెద్ద మోసగాడని..అతను మ్యాచ్ ఫిక్సింగ్‌కు కూడా పాల్పడే ఉంటాడని ఆరోపణలు గుప్పించింది. షమీపై నేరాలు రుజువైతే పదేళ్లు అంతకంటే ఎక్కువే అతనికి శిక్ష పడే అవకాశం ఉంది. ఈ విషయంలో హసీన్ ఆరోపణలు అన్నీ అబద్ధాలే అంటూ మహ్మద్ షమీ ట్విట్టర్ వేదికగా ఖండించాడు. కుటుంబసభ్యులతో కలిసి నా సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పాడు. మరోవైపు షమీని ఆడించాలా వద్దా అనే విషయంలో బీసీసీఐ సలహా తీసుకుంటామని ఢిల్లీ డేర్‌డెవిల్స్ ఫ్రాంచైజీ వర్గాలు తెలిపాయి.

కపిల్ బాసట: కాగా, షమీ ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు ఆరోపించిన హసీన్‌ను.. క్రికెట్ దిగ్గజం కపిల్ తప్పుబట్టాడు. ఇన్నేండ్లుగా కలిసి ఉన్న సమయంలో ఫిక్సింగ్ విషయం వెల్లడించకుండా ఇంత ఆలస్యంగా స్పందించడం ఏమిటని ప్రశ్నించాడు. నాకు తెలిసి షమీ చాలా మంచివాడని, దర్యాప్తులో అతను తప్పు చేసినట్లు తేలితే షమీ చేసిన తప్పులను ఎవరూ ఆమోదించరని అన్నాడు.

సిరీస్ విజేత భారత్

3-1 గోల్స్‌తో కొరియాపైనెగ్గిన భారత మహిళల జట్టు
ఐదు మ్యాచ్‌ల సిరీస్ 3-1తో కైవసం



సియోల్: ఆల్‌రౌండ్ నైపుణ్యం..అంతకు మించిన పట్టుదల..ప్రత్యర్థి మనకంటే మెరుగైన ర్యాంక్‌లో ఉన్నా భారత మహిళల హాకీజట్టు అదరగొట్టింది. పటిష్ఠమైన కొరియా అమ్మాయిలతో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో మరో మ్యాచ్ మిగిలుండగానే 3-1 తేడాతో సిరీస్ విజేతగా నిలిచింది. శుక్రవారం జరిగిన నాలుగోమ్యాచ్‌లో 3-1 గోల్స్ తేడాతో భారత మహిళ జట్టు ..కొరియా అమ్మాయిలను చిత్తు చేశారు. గుర్జిత్ కౌర్ మ్యాచ్ రెండో నిమిషంలో , దీపిక 14వ నిమిషంలో గోల్ కొట్టగా.. మ్యాచ్ 47వ నిమిషంలో భారత ఫార్వర్డ్ పూనమ్ రాణి అద్భుత ఫీల్డ్‌గోల్‌తో విజయాన్ని ఖాయం చేసింది. మ్యాచ్ ఆఖరి క్వార్టర్‌లో దక్షిణ కొరియా అమ్మాయి మి హైయున్ పార్క్ ఏకైక గోల్ కొట్టింది. ఆసియా చాంపియన్‌షిప్‌లో విజయంతో ఊపు మీదున్న మన అమ్మాయిల జట్టు అదే ఊపులో కొరియాను కూడా చిత్తు చేసి కామన్వెల్త్ గేమ్స్‌కు ముందు ఆత్మవిశ్వాసం కూడగట్టుకుంది.

ఆరంభంలోనే..


మూడో మ్యాచ్ ఓటమితో భారత అమ్మాయిలు ఈ మ్యాచ్‌లో కొరియా జట్టుకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. ఆరంభం నుంచే వేగంగా ఆడుతూ కొరియా డిఫెన్స్‌పై ఒత్తిడి తీసుకువచ్చారు. మ్యాచ్ రెండో నిమిషంలోనే భారత్‌కు తొలి పెనాల్టీకార్నర్ లభించింది. ఆరంభంలోనే లభించిన సువర్ణావకాశాన్ని గుర్జిత్ కౌర్ గోల్‌గా మలిచి భారత్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించింది. అద్భుత వేగంతో కౌర్ కొట్టిన షాట్ కొరియా గోల్ కీపర్ హైబిన్ జంగ్‌ను బోల్తా కొట్టిస్తూ గోల్‌పోస్ట్‌లోకి దూసుకెళ్లింది. దీంతో కొరియా అమ్మాయిలు తీవ్ర ఒత్తిడిలో పడ్డారు. మరోవైపు భారత్ దూకుడుగా ఆడుతూ కొరియా రక్షణపంక్తికి కఠిన పరీక్షలు పెట్టింది. దీంతో మ్యాచ్ 14వ నిమిషంలో భారత్‌కు మరో పెనాల్టీ కార్నర్ లభించింది. ఈసారి దీపిక పెనాల్టీకార్నర్‌ను తీసుకుని గురితప్పకుండా గోల్‌పోస్టులోకి పంపడంతో భారత్‌కు 2-0 ఆధిక్యం దక్కింది. తొలి క్వార్టర్‌లో లభించిన ఆధిక్యాన్ని భారత మరో రెండు క్వార్టర్ల పాటు కొనసాగించింది. మూడో క్వార్టర్‌లో భారత ఫార్వర్డ్ పూనం రాణి అద్భుత ఫీల్డ్‌గోల్‌తో భారత్‌కు 3-0 ఆధిక్యాన్ని అందించింది. మ్యాచ్ మరో మూడు నిమిషాల్లో ముగుస్తుందనగా కొరియా తరపున పార్క్ ఏకైక గోల్ కొట్టింది. దీంతో 3-1 స్కోరుతో మ్యాచ్‌తోపాటు 3-1 తేడాతో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను భారత అమ్మాయిలు సొంతం చేసుకున్నారు. ఈ రెండు జట్ల మధ్య ఆఖరి మ్యాచ్ ఆదివారం జరుగుతుంది.



టీసీఏ ఆధ్వర్యంలో వచ్చే జూన్ నుంచి జరిగే క్రికెట్ సీజన్ ఏర్పాట్లను వివరిస్తున్న తెలంగాణ క్రికెట్ అసోసియేషన్(టీసీఏ) కార్యదర్శి గురువారెడ్డి. హెచ్‌సీఏ తరహాలో కాకుండా పూర్తి పారదర్శకంగా టోర్నీలు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో వెల్లడి.

ఆస్ట్రేలియా 243 ఆలౌట్

పోర్ట్ ఎలిజబెత్: ఆస్ట్రేలియాతో రెండో టెస్ట్‌లో దక్షిణాఫ్రికా స్పీడ్‌స్టర్ కగిసో రబాడ(5/96) విజృంభించాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్‌ను పదునైన స్వింగ్‌తో పడగొట్టాడు. పిచ్‌పై తేమను సద్వినియోగం చేసుకుంటూ వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టాడు. దీంతో తొలి వికెట్‌కు 98 పరుగులతో శుభారంభం అందుకున్న ఆసీస్ వెంటవెంటనే వికెట్లు చేజార్చుకుని 170 పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ వార్నర్(63) అర్ధసెంచరీ మినహా ఎవరూ రాణించలేకపోయారు. మిచెల్ మార్ష్(4), కమ్మిన్స్(0)ను వరుస బంతుల్లో రబాడ పెవిలియన్ పంపాడు. స్వల్ప స్కోరుకే పరిమితమవుతుందనుకున్న ఆసీస్‌ను ఆఖర్లో లియాన్(17), హాజిల్‌వుడ్(10)తో కలిసి టిమ్ పెయిన్(36) కీలక పరుగులు జోడించాడు. ఎంగ్డీ(3/51), ఫిలాండర్(2/25) రాణించారు. తర్వాత తొలి ఇన్నింగ్స్‌కు దిగిన దక్షిణాఫ్రికా మర్క్రామ్(11) వికెట్ కోల్పోయి 39 పరుగులు చేసింది. ఎల్గర్(11), రబాడ(17) క్రీజులో ఉన్నారు. కమ్మిన్స్(1/9)కు ఏకైక వికెట్ దక్కింది.


Reliance
NOW OPEN AT: EAST MARREDPALLY, BESIDE GEETHA NURSING HOME
Reliance digital
PERSONALISING TECHNOLOGY
SHOP ANY ELECTRONICS AT MY JIO STORE
Jio DIGITAL LIFE
ఇప్పుడు ప్రతీ ఇంట్లో ఏసి
కొనండి ఏసిని కేవలం
₹1 చెల్లించి
మరియు పొందండి క్యాష్‌బ్యాక్
₹2500 వరకు
ఇఎంఐల ద్వారా*
ఉచిత డెలివరి మరియు ఇన్‌స్టలేషన్*
5 YEARS WARRANTY
VOLTAS 1.5 t INVERTER AC 183V EYA
• 100% Copper • Green Gas
• 3 in 1 Anti Bacterial Filter
₹37990/-
8 EMIs of ₹3166/-*
LLOYD 1.5 t INVERTER AC LS18I3D
• Hidden LED Display
• Easy Night Mode • Super Dust Filter
₹37990/-
8 EMIs of ₹3166/-*
PANASONIC 1.5 t FIXED SPEED AC CS-QN18UKY
• Copper Condensor • 2 Stage Air Purifier
• PM2.5 Filter • R-32 Green Gas
₹37990/-
8 EMIs of ₹3166/-*
DAIKIN 1.5 t INVERTER AC FTKH50S
• Power chill • Quiet IDU
• R32 Green Gas
₹39990/-
8 EMIs of ₹3333/-*
5 YEARS WARRANTY
RECONNECT 1.5 t INVERTER AC XS-183B80
• I favor
• Stabilizer free operation
EXCLUSIVE
₹31490/-*
8 EMIs of ₹2624/-*
LG 1.5 t INVERTER AC JSQ18APXD2
• Digital Display
• 100% Copper with Ocean Black Protection
• Cools at 52 Degree Celsius
• 1 Year Product and 10 Yrs Compressor warranty
EXCLUSIVE
₹41990/-
8 EMIs of ₹3499/-*
HITACHI 1.5 t INVERTER AC RSD317HBEA
• Wide Angle Deflector
• Filter Clean Indicator • Soft Dry
₹41990/-
8 EMIs of ₹3499/-*
SAMSUNG 1.5 t INVERTER AC AR18NV3HRTR
• Worlds First 8 Pole Digital Inverter
• Starflower Pattern
• Single User Mode • Digital Display
EXCLUSIVE
₹44400/-
8 EMIs of ₹3700/-*
STAY COOL WITH WIDE RANGE OF AIR COOLERS
STARTING FROM ₹4999/-*
BLUE STAR Carrier DAIKIN Electrolux Godrej Haier HITACHI LG GENERAL Panasonic RECONNECT SAMSUNG VOLTAS Whirlpool
Reliance resQ
ఎక్స్‌టెండెడ్ వారంటీ
బ్రాండ్‌లకు సర్వీసింగ్ మరియు మరమ్మతులు
ఇంటికి ప్రొఫెషనల్స్ వచ్చి ఇన్‌స్టలేషన్ చేస్తారు
5% క్యాష్‌బ్యాక్
HDFC BANK We understand your world
FIND YOUR NEAREST STORE AT WWW.RELIANCEDIGITAL.IN
VISIT US AT: VANASTHALIPURAM • VIKRAMPURI NEXT TO VAC'S BAKERY • HASTINAPURAM • MALAKPET • INORBIT MALL • SHIVAM ROAD • KACHIGUDA • KOTHAPET • ATTAPUR • ROAD NO 12 BANJARA HILLS • SWAGATH GRAND BUILDING SUCHITRA • HEMA DURGA MALL UPPAL • SD ROAD BESIDE BASERAA HOTEL SECUNDRABAD • KUKATPALLY • HIMAYAT NAGAR • MADINAGUDA • NSL BESIDE BSNL OFFICE, KPHB PHASE 5 • ASRAO NAGAR • NACHARAM • GACHIBOWLI • TOWLICHOWKI • NAGOLE • RAMANTHAPUR • BEGUMPET OPPOSITE SHOPPERS STOP


తెలుగు సంవత్సరాది ఉగాది షాపింగ్‌ను సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో చేస్తే
సంవత్సరమంతా సంతోషమే! ఏడాదంతా ఆనందమే!
పిల్లలు మెచ్చే సరికొత్త వెరైటీలు విస్తృతశ్రేణిలో
అతి తక్కువ ధరలకే అద్భుతమైన ఆఫర్లతో బ్రాండెడ్ మెన్స్ వేర్
సంతోషాలు రెట్టింపు చేయడానికి సరికొత్త డిజైన్లతో మెన్స్ ఎత్నిక్ వేర్
తేనెలూరే తీయదనం మనసుల ను మంత్రముగ్ధం చేసే వస్త్ర-వస్త్ర వైభవం
ఆనందాల సందడులను మీ ఇంటికి తెచ్చే
పెళ్లి పట్టు చీరలు
సరికొత్త డిజైన్లలో కంచి, ఆరణి, ధర్మవరం, ఉప్పాడ పెళ్లిపట్టు చీరలు
విళంబి ఉగాది వేడుకలు
SOUTH INDIA shopping mall
BAJAJ FINSERV
Hyderabad | Secunderabad


ఉగాది ఉత్సవాలు
షడ్రుచుల సమ్మేళనం ఉగాది
సకల వస్త్రాల సంగమం
R.S. బ్రదర్స్
లక్షలాది పెళ్లిళ్లకు సాంప్రదాయ పట్టుచీరలనందించిన ఏకైక సంస్థ R.S.బ్రదర్స్
అదే నాణ్యత...అదే నమ్మకం...
అవే తక్కువ ధరలు
సుమాంజలి ₹950 ₹695
కామాక్షి ₹3850 ₹2695
కంచి ₹17450 ₹8995
మీనాక్షి పట్టు ₹4450 ₹2995
కావేరి ₹3450 ₹2150
కళాంజలి ₹6850 ₹4295
కోవై పట్టు ₹2250 ₹1595
టిష్యు పట్టు ₹1995 ₹1250
హై ఫ్యాషన్ డిజైనర్ శారీస్, డ్రెస్‌మెటీరియల్స్, బ్రాండెడ్ మెన్స్ వేర్, ఎత్నిక్ వేర్, మరియు ప్రముఖ మిల్లుల సూటింగ్స్ & షర్టింగ్స్, సరికొత్త వెరైటీలలో కిడ్స్ వేర్
BAJAJ FINSERV బజాజ్ EMI కార్డ్ అనుమతించబడును
R.S. Brothers
Retail India Pvt. Ltd.
Hyderabad | Secunderabad